
'ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరి గొంతు వినడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉండాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 18
సంచిక: 75

శుక్రవారం 6-6-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



బుమ్రా ఆడే మూడు టెస్టులేవి?
ఇంగ్లండ్‌తో బుమ్రా ఆడే 3 మ్యాచ్‌లపై నిర్ణయం తీసుకోలేదన్న గంభీర్ -17లో



వెండి వెలుగు
కేజీ ధర రూ. 1,04,100...
కొత్త రికార్డు పలికిన వెండి -17లో



ఉద్యోగులకు 2 డీఏలు

తక్షణమే ఒకటి చెల్లింపు.. 6 నెలల తర్వాత రెండో డీఏ

- మళ్లీ జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో మెడికల్ ఇన్వాలిడేషన్ కమిటీలు
- ఉద్యోగులకు వైద్య సదుపాయం కోసం ట్రస్ట్
- ప్రతి నెలా రూ. 700 కోట్ల మేర ఉద్యోగుల పెండింగ్ బిల్లుల చెల్లింపు
- సచివాలయంలో 12.5 శాతం నాన్ సెక్రటేరియట్ సర్వీసెస్ కోటా
- అంగన్‌వాడీల పదవీవిరమణ ప్రయోజనం రూ. 2 లక్షలకు పెంపు
- ఎన్నికల్లో బదిలీ అయిన ఉద్యోగులు తిరిగి సొంత స్థానాలకు బదిలీ
- హామ్ విధానంలో రాష్ట్రంలోని అన్ని రోడ్ల అభివృద్ధి
- కేంద్ర, రాష్ట్రాల భాగస్వామ్యంతో మెట్రో రైలు విస్తరణ
- సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గ భేటీలో కీలక నిర్ణయాలు
- వివరాలు వెల్లడించిన డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు పొన్నం, పొంగులేటి


గురువారం జరిగిన కేబినెట్ సమావేశం వివరాలను వెల్లడిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క. చిత్రంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 2 డీఏలు (కరువు భత్యం) చెల్లించాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. 2023 జనవరి 1 నుంచి బకాయి ఉన్న డీఏలలో ఒక డీఏను తక్షణమే చెల్లించాలని నిర్ణయించింది. నాటి నుంచి ఇప్పటివరకు చెల్లించాల్సిన డీఏ బకాయిలను 28 వాయిదాల్లో చెల్లించనుంది. ఇక మరో డీఏను 6 నెలల తర్వాత చెల్లించనుంది. వచ్చే ఏప్రిల్‌లో దీనిపై ప్రకటన చేయనుంది. ఉద్యోగులకు 5 పెండింగ్ డీఏలను ప్రభుత్వం చెల్లించాల్సి ఉండగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ప్రస్తుతానికి రెండు డీఏలపైనే కేబినెట్ నిర్ణయం తీసుకుంది. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన గురువారం సచివాలయంలో సమావేశమైన మంత్రివర్గం ఈ మేరకు పలు అంశాలపై చర్చించి కీలక నిర్ణయాలు తీసుకుంది. సాయంత్రం 4:30 నుంచి రాత్రి 9:30 గంటల వరకు జరిగిన ఈ సమావేశంలో ఉద్యోగులకు సంబంధించిన అపరిష్కృత సమస్యలపై విస్తృతంగా చర్చించి సానుకూల నిర్ణయాలు తీసుకుంది. ఉద్యోగుల సమస్యలపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘానికి నేతృత్వం వహించిన ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క.. మంత్రివర్గ సమావేశం అనంతరం మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌తో కలిసి సచివాలయంలో విలేకరులకు వివరాలను వెల్లడించారు.

ఉద్యోగుల సమస్యలపై సుదీర్ఘ చర్చ..

ఉద్యోగ సంఘాలతో జరిపిన చర్చల వివరాలను డిప్యూటీ సీఎం భట్టి కేబినెట్‌కు నివేదించారు. ఉద్యోగుల డిమాండ్లపై మిగతా 3వ పేజీలో ▶

హైదరాబాద్‌లో రఫేల్ ఫ్యూజిలేజ్‌ల తయారీ

అత్యాధునిక యుద్ధ విమానాల కీలక భాగాల ఉత్పత్తి

డసో ఏవియేషన్, టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్ మధ్య ఒప్పందం



- 2028 నాటికి తొలి ఫ్యూజిలేజ్ ఉత్పత్తికి చర్యలు
- ప్రత్యేక యూనిట్ ఏర్పాటు చేయనున్న టాటా సంస్థ
- ఫ్రాన్స్‌కు వెలుపల తొలిసారి రఫేల్ ఫ్యూజిలేజ్‌ల తయారీ

సాక్షి, హైదరాబాద్

ఫ్రాన్స్‌కు చెందిన అత్యాధునిక రఫేల్ యుద్ధ విమానాల ఫ్యూజిలేజ్‌లు హైదరాబాద్‌లో తయారు కానున్నాయి. ఇందుకోసం రఫేల్ యుద్ధ విమానాల తయారీ సంస్థ డసో ఏవియేషన్‌తో టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ గురువారం ఒప్పందం కుదుర్చుకుంది. భారత్‌తోపాటు అంతర్జాతీయ మార్కెట్ల కోసం ఫ్యూజిలేజ్‌ను తయారు చేసేందుకు టాటా సంస్థ హైదరాబాద్‌లో ప్రత్యేక యూనిట్‌ను ఏర్పాటు చేయనుంది. ఫ్రాన్స్ వెలుపల తొలిసారి రఫేల్ యుద్ధ విమానాల ఫ్యూజిలేజ్‌లు హైదరాబాద్‌లోనే తయారు కానుండటం విశేషం. రెక్కలు, తోక మినహా విమానంలోని ఇతర భాగాన్ని ఫ్యూజిలేజ్ అంటారు. ఇందులో ప్రయాణికులు, సరుకులు, ఇతర పరికరాల రవాణా కోసం ఏర్పాట్లు ఉంటాయి. ఈ ఒప్పందంతో భారత వైమానిక తయారీ రంగం సామర్థ్యం మరింత మిగతా 2వ పేజీలో ▶

న్యూస్‌రీల్

స్వయం సమృద్ధ భారత్ నిర్మాణమే లక్ష్యం



బడుగు బలహీన వర్గాల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ఎన్డీయే ప్రభుత్వం ముందుకెళ్తోందని ప్రధాని మోదీ చెప్పారు. స్వయం సమృద్ధ భారత్ నిర్మాణానికి కట్టుబడి ఉన్నామన్నారు.

- వివరాలు 6లో ▶

వారికి నో ఎంట్రీ!



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈసారి 12 దేశాలపై కొరడా ఝుళిపించారు. అఫ్గానిస్తాన్, మయన్మార్, చాద్, కాంగో, ఈక్వటోరియల్ గినియా, ఎరిత్రియా, హైతీ, ఇరాన్, లిబియా, సోమాలియా, సూడాన్, యెమెన్ పౌరులు అమెరికాలోకి ప్రవేశించకుండా నిషేధిస్తున్నట్లు ప్రకటించారు.

- వివరాలు 6లో ▶

దేశ సేవ నేరమా?



దేశ ప్రయోజనాల కోసం పని చేయడం నేరమా? అని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, ఎంపీ శశి థరూర్ ప్రశ్నించారు. దేశానికి సేవ చేయడం పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లుగా భావించేవారు ఆత్మవిమర్శ చేసుకోవాలని పరోక్షంగా కాంగ్రెస్ నాయకత్వానికి చురక అంటించారు.

- వివరాలు 6లో ▶

ఆర్‌సీబీ ప్రతినిధుల్ని అరెస్ట్ చేయండి



డీజీపీకి కర్ణాటక సీఎం సిద్ధరామయ్య ఆదేశం

- కర్ణాటక క్రికెట్ సంఘం, ఈవెంట్ మేనేజ్‌మెంట్‌ల మెడకు ఉచ్చు
- బెంగళూరు పోలీస్ కమిషనర్ సహా ఐదుగురు పోలీసులపై వేటు
- విచారణకు ఏకసభ్య జ్యుడీషియల్ కమిషన్‌ను నియమించిన ప్రభుత్వం
- ఘటనపై పూర్తిస్థాయి నివేదిక కోరిన కర్ణాటక హైకోర్టు
- మృతుల కుటుంబానికి రూ.10 లక్షల చొప్పున పరిహారమిస్తామన్న ఆర్‌సీబీ

17 లో

లక్ష్యానికి మించి..

- రికార్డు స్థాయిలో యాసంగి ధాన్యం కొనుగోళ్లు
- 70.13 లక్షల టన్నులకుగాను 71.39 లక్షల టన్నుల ధాన్యం సేకరించిన రాష్ట్ర ప్రభుత్వం
- ఇంకా కొనుగోలు కేంద్రాల్లో లక్షకుపైగా టన్నుల ధాన్యం

18 లో

మావోయిస్టు సుధాకర్ ఎన్‌కౌంటర్

మరో పెద్ద నేతను కోల్పోయిన మావోయిస్టు పార్టీ



- పార్టీ కేంద్ర కమిటీసభ్యుడిగా కొనసాగుతున్న సుధాకర్
- ఛత్తీస్‌గఢ్ ఇంద్రావతి అటవీ ప్రాంతంలో ఎదురుకాల్పుల్లో మృతి
- 2004లో ఉమ్మడి ఏపీ ప్రభుత్వంతో శాంతి చర్చలకు వచ్చిన సుధాకర్

- వివరాలు 5లో



నిన్న రణరంగం.. నేడు నిశ్శబ్దం

భయం గుప్పిట్లో పెద్ద ధన్వాడ

- 12 మంది రైతుల అరెస్ట్.. 14 రోజుల రిమాండ్
- ఘటనపై జాతీయ మానవ హక్కుల కమిషన్‌లో ఫిర్యాదు
- ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు ఒప్పుకునేది లేదన్న రైతులు

- వివరాలు 7లో

NECC National Egg Co-ordination Committee
Venkob Chicken
Suggested Today's Eggs & Broiler Chicken Hyderabad Zone Rates
12 Eggs Retail Rate ₹ 74
Ex Farm Live Bird 110 kg
Dressed with Skin 191 kg
Retail Live Bird 132 kg
Skin Less 218 kg
Issued in the interest of consumers


ఇదండీ సంగతి




ఎల్‌ఆర్‌ఎస్ ఇప్పట్లో తేలేనా?

వచ్చిన దరఖాస్తులు 26 లక్షలు... అందులో అర్హమైనవి 20 లక్షలు

- ఇప్పటి వరకు డబ్బు చెల్లించినవారు 5.77 లక్షల మంది మాత్రమే
- అందులో 1.77 లక్షలకు క్రమబద్ధీకరణ పత్రాలు ఇచ్చిన అధికారులు
- డబ్బు చెల్లించని వారికి మరోసారి గడువు పెంచే యోచనలో ప్రభుత్వం



సాక్షి, హైదరాబాద్: అనధికార లేఅవుట్‌లలో ప్లాట్ల క్రమబద్ధీకరణ (ఎల్‌ఆర్‌ఎస్) వ్యవహారం ఇప్పట్లో తేలేలా లేదు. లక్షలాది మంది తమ ప్లాట్లు అనధికార లేఅవుట్‌లలో ఉన్నాయని తెలిసినా, క్రమబద్ధీకరణకు ముందుకు రావడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎల్‌ఆర్‌ఎస్ కింద గత ప్రభుత్వ హయాంలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, క్రమబద్ధీకరించాలని నిర్ణయించింది. 2020 నాటికి దరఖాస్తు చేసుకున్న వారికి అవకాశం కల్పించింది. దాదాపు మూడు నెలలుగా ఈ క్రమబద్ధీకరణ ప్రక్రియ కొనసాగుతోంది. క్రమబద్ధీకరణకు యోగ్యమైనవిగా అధికారులు నిర్ణయించిన వాటిలో మిగతా 2వ పేజీలో ▶



మంత్రి సురేఖకు స్వల్ప అస్వస్థత

సీఎం రేవంత్ పరామర్శ

సాక్షి, హైదరాబాద్: దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ విరామం లేకుండా విస్తృత కార్యక్రమాల్లో పాల్గొనడంతో గురువారం తెలంగాణ సచివాలయంలో స్వల్ప అస్వస్థతకు గురయ్యారని మంత్రి కార్యాలయం తెలిపింది. కొద్ది రోజులుగా వరంగల్ ఈస్ట్ నియోజకవర్గంలో విస్తృతంగా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా.. గురువారం హైదరాబాద్ పీసీబీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మంత్రి హాజరయ్యారు. అనంతరం సచివాలయంలో జరిగే కేబినెట్ సమావేశంలో పాల్గొనేందుకు అధికారుల నుంచి సమాచారం సేకరిస్తున్న నేపథ్యంలో.. సకాలంలో ఆహారం తీసుకోలేకపోయారు. ఈ నేపథ్యంలోనే మంత్రి కొండా సురేఖ సచివాలయంలో స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. ఆమెను పరీక్షించిన వైద్యులు ఆందోళన అక్కర్లేదని స్పష్టం చేశారు. మంత్రికి అక్కడే ప్రథమ చికిత్స అందించి, విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. సీఎం రేవంత్‌రెడ్డి.. మంత్రి సురేఖను పరామర్శించారు. ఒకటి, రెండు రోజులు విశ్రాంతి తీసుకుంటే సరిపోతుందని వైద్యులు సీఎంకు చెప్పారు. ఆరోగ్యంపై జాగ్రత్త తీసుకోవాలని, ఇంటికి వెళ్లి విశ్రాంతి తీసుకోవాలని సురేఖకు సీఎం సూచించారు. తన ఆరోగ్యంపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వాకబు చేసిన వారందరికీ మంత్రి ధన్యవాదాలు తెలిపారు.

నేడు హైదరాబాద్‌కు కేటీఆర్

- గత నెల 27న విదేశీ పర్యటనకు వెళ్లిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్



సాక్షి, హైదరాబాద్: గత నెల 27న విదేశీ పర్యటనకు వెళ్లిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. శుక్రవారం హైదరాబాద్‌కు చేరుకోనున్నారు. 'ఫార్ములా–ఈ'రేస్‌కు సంబంధించి మే 28న విచారణకు రావాల్సిందిగా కేటీఆర్‌కు ఏసీబీ నోటీసులు ఇవ్వగా, తాను విదేశీ పర్యటన అనంతరం హాజరవుతానంటూ ఆయన లేఖ రాసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ నెల మూడో వారంలో కేటీఆర్ ఏసీబీ విచారణకు హాజరయ్యే అవకాశమున్నట్లు తెలిసింది. కాగా, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అస్వస్థతకు గురైన నేపథ్యంలో కేటీఆర్ తన అమెరికా పర్యటనను కుదించుకున్నారు. ఆయన భారత కాలమానం ప్రకారం శుక్రవారం ఉదయం బయల్దేరతారు. గోపీనాథ్ కుటుంబసభ్యులతో పాటు హైదరాబాద్‌లోని ఏఐజీ ఆసుపత్రి వైద్యులతో కేటీఆర్ ఫోన్‌లో మాట్లాడారు.

ఎల్ఆర్ఎస్ ఇప్పట్లో తేలేనా?

▶ మొదటి పేజీ తరువాయి

ఇప్పటివరకు కనీసం 25 శాతం ప్లాట్ల దరఖాస్తులకు క్రమబద్ధీకరణ ఫీజులు చెల్లించకపోవడం గమనార్హం. 2020లో మొత్తం 25,67 లక్షల దరఖాస్తులు ప్రభుత్వానికి అందాయి. అందులో 20,11 లక్షల దరఖాస్తులు ప్లాట్ల క్రమబద్ధీకరణకు అర్హత ఉన్నవిగా తేల్చిన అధికారులు.. ఆ మేరకు సంబంధిత ప్లాట్ల యజమానులకు సమాచారం ఇచ్చారు. మీరు ప్రభుత్వం నిర్ణయించిన మేరకు ఫీజులు చెల్లిస్తే.. ఈ ప్లాట్లను క్రమబద్ధీకరిస్తామని స్పష్టం చేశారు. తద్వారా కనీసం రూ.పదివేల కోట్లకు పైగా ఆదాయం సమకూరుతుందని భావించింది. అయితే ప్రజల నుంచి స్పందన అంతంత మాత్రంగానే వచ్చింది. ఫీజు చెల్లింపు గడువును మూడు సార్లు పొడిగించినా ఆశించిన స్థాయిలో స్పందన రాలేదు. అయితే రాష్ట్ర ప్రభుత్వం పెట్టిన 2020 కటాఫ్ ఏడాది తర్వాత ప్లాట్ల రెగ్యులరైజేషన్ కోసం తాజాగా ఈ ప్రక్రియ ప్రారంభించిన తర్వాత మరో 46,255 దరఖాస్తులు కొత్తగా వచ్చాయి. వీటిపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. క్రమబద్ధీకరణకు యోగ్యమైన 20.11 లక్షల దరఖాస్తుల్లో ఫీజులు చెల్లించిన వారు కేవలం 5,77 లక్షలు మాత్రమే ఉన్నారు. మిగిలిన 15 లక్షలకు పైగా దరఖాస్తు చేసుకున్నవారు ఫీజుల రూపంలో డబ్బులు చెల్లించడానికి ముందుకు రావడం లేదు.



డబ్బు చెల్లించిన తర్వాత..

జరిమానా రూపంలో డబ్బు చెల్లించిన 5.77 లక్షలలో ఇప్పటి వరకు క్రమబద్ధీకరణ చేసినవి 1,77,435 వరకు ఉన్నాయి. ఫీజులు చెల్లించి, మిగిలిన పత్రాలు సరిగా జతచేయని వారి నుంచి అవసరమైన పత్రాల కోసం అధికారులు వారికి మళ్లీ సమాచారం ఇస్తున్నారు. క్షేత్రస్థాయిలో తనిఖీలు కూడా చేపడుతున్నారు. అనధికార లేఅవుట్‌లు, ప్లాట్లు అధికంగా ఉన్న జిల్లాలు, అక్కడ నుంచి వచ్చిన దరఖాస్తులు, చెల్లించిన ఫీజులు చూస్తే.. హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న జిల్లాల్లోనే అత్యధికంగా అనధికార లేఅవుట్‌లు ఉన్నట్టు స్పష్టం అవుతోంది. ఇప్పటి వరకు ఫీజుల రూపంలో ప్రజలు చెల్లించిన మొత్తాల్లో రంగారెడ్డి జిల్లా మొదటిస్థానంలో, రెండోస్థానం మేడ్చల్, మూడోస్థానంలో హెచ్ఎండీఏ నాలుగో స్థానంలో జీహెచ్ఎంసీ, ఐదోస్థానంలో వరంగల్ అర్బన్, ఆ తర్వాత స్థానంలో సంగారెడ్డి, ఖమ్మం జిల్లాలు ఉన్నాయి. పురపాలక శాఖలోని అధికారుల పాత్ర లేకుండా వేల లేఅవుట్‌లు, ప్లాట్లు రావడం సాధ్యం కాదన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది. అత్యల్పంగా ఆదాయం సమకూరిన జిల్లా ములుగు అయితే..అత్యధిక ఆదాయం వచ్చిన జిల్లా రంగారెడ్డి.

జిల్లాల వారీగా ఎల్ఆర్ఎస్ వివరాలు 'సాక్షి ప్లస్'(ఈ పేపర్)లో

మరోసారి పొడిగింపు..

ప్రజలకు తమ ప్లాట్లను క్రమబద్ధీకరణ చేయించుకోవడానికి మరోసారి అవకాశం ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు సమాచారం. ఈ మేరకు పురపాలక శాఖ అధికారులు ప్రభుత్వానికి ఫైల్ పంపినట్టు చెబుతున్నారు. గతవారంలో పురపాలక శాఖ కార్యదర్శి ఇలంబర్తి, సీఎంఓలో పురపాలక వ్యవహారాలు చూసే మాణిక్‌రాజ్‌లు లేని కారణంగా పొడిగింపు ఉత్తర్వులు రాలేదని సమాచారం. ఒకటి రెండు రోజుల్లో పొడిగింపునకు సంబంధించిన ఉత్తర్వులు వెలువడనున్నట్టు తెలిసింది.

నేడు పీసీ ఘోష్ కమిషన్ ముందుకు ఈటల

- కాళేశ్వరం బరాజ్‌ల నిర్మాణంలో పాత్రపై ప్రశ్నించే అవకాశం
- పార్టీ మారడంతో ఈటల వాంగ్మూలంపై సర్వత్రా ఆసక్తి
- 9న హరీశ్‌రావు, 11న కేసీఆర్‌ను విచారించనున్న కమిషన్



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులోని బరాజ్‌ల నిర్మాణంలో అవకతవకలపై విచారణ నిర్వహిస్తున్న జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ కమిషన్ శుక్రవారం ఉదయం 11 గంటలకు రాష్ట్ర మాజీ ఆర్థిక శాఖ మంత్రి, ప్రస్తుత బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్‌ను ప్రశ్నించనుంది. ఏడాది కాలంగా విచారణ జరుపుతున్న కమిషన్ ఎదుట ఓ ముఖ్య నేత హాజరై వాంగ్మూలం ఇవ్వనుండడంతో ప్రాధాన్యత సంతరించుకుంది. తొలి దఫా బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఆర్థిక శాఖ మంత్రిగా ఈటల రాజేందర్ పనిచేసినప్పుడే కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన కీలక నిర్ణయాలు జరిగాయి. బరాజ్‌ల నిర్మాణం సైతం అప్పుడే ప్రారంభమై పూర్తయ్యింది. ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు స్థానంలో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించాలని తీసుకున్న నిర్ణయంతో పాటు ప్యాకేజీలవారీగా కాళేశ్వరం ప్రాజెక్టు పనులకు ఆర్థిక అనుమతులు, ఆ తర్వాత పనుల అంచనాల సవరణకు అనుమతి, రుణ సమీకరణ కోసం కాళేశ్వరం ఇరిగేషన్ ప్రాజెక్టు కార్పొరేషన్ లిమిటెడ్ (కేఐపీసీఎల్) స్థాపనకు అనుమతుల జారీలో నాడు ఆర్థిక శాఖ కీలకంగా వ్యవహరించింది. ఈ నిర్ణయాల్లో ఈటల రాజేందర్ పాత్రపై ఆయన్ను కమిషన్ ప్రశ్నించే అవకాశం ఉంది. ప్రాజెక్టు నిర్మాణానికి అప్పట్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన పలు కమిటీలకు ఈటల నేతృత్వం వహించగా, మరికొన్ని కమిటీల్లో ఆయన సభ్యుడిగా ఉన్నట్టు గుర్తించింది. ఈ వ్యవహారాల్లో ఆయ న పాత్రపై కమిషన్ ప్రశ్నించనుంది. కమిషన్ ఎదుట ఈటల ఇవ్వనున్న వాంగ్మూలం కీలకంగా మారే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా, కమిషన్ ఈ నెల 9న మాజీ నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌ను, 11న మాజీ సీఎం కేసీఆర్‌ను క్రాస్ ఎగ్జామినేషన్‌కు హాజరు కావాలని కోరింది. వారికి ఇప్పటికే సమన్లు పంపించింది. వాస్తవానికి ఈ నెల 5నే కేసీఆర్‌ను ప్రశ్నించేందుకు కమిషన్ సమన్లు పంపగా, ఆయన అనారోగ్య కారణాలు చూపి మరి కొంత సమయం కోరారు. దీంతో 11వ తేదీన రావాలని కోరింది.

కర్ణాటకకు చెడ్డపేరు వచ్చింది

- పిల్లలు చనిపోవడం బాధాకరం
- ఆ రాష్ట్ర డిప్యూటీ సీఎం డీకే శివకుమార్



విలేకరులతో మాట్లాడుతున్న డీకే శివకుమార్

బనశంకరి: 'వందేళ్లు జీవించాల్సిన పిల్లలు బెంగళూరు చిన్నస్వామి స్టేడియం వద్ద తొక్కిసలాటలో బలికావడాన్ని తట్టుకోలేకపోతున్నా. ఈ ఘటనతో బెంగళూరు, కర్ణాటక రాష్ట్రానికి చెడ్డపేరు వచ్చింది'అని డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ అన్నారు. 14–15 ఏళ్ల వయసున్న పిల్లలు చనిపోవడం కళ్లారా చూశానని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం సదాశివనగరలోని తన నివాసం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. చిన్నస్వామి స్టేడియం తొక్కిసలాట ఘటనను తీవ్రంగా పరిగణించి, దర్యాప్తు చేపట్టి లోపాలను సరిదిద్దుకుంటామని చెప్పారు. ఆర్‌సీబీ జట్టు బెంగళూరుకు వస్తుందని మీడియాకు సమాచారం ఇచ్చారు. ప్రభుత్వం ముందు మరో ప్రత్యామ్నాయం లేదని, భారీ సంఖ్యలో క్రికెట్ అభిమానులు, యువత చేరడంతో పరిస్థితి అదుపుతప్పిందని ఆయన తెలిపారు. 'ఓ బాలుని శవానికి పోస్టుమార్టం చేయరాదని తల్లిదండ్రులు వేడుకున్నారు. కానీ ఇందుకు చట్టం ఒప్పుకోదు'అని చెప్పారు. బీజేపీ నేతల ఆరోపణలకు సమాధానం చెప్పాల్సిన అవసరం లేదని, బీజేపీ, జేడీఎస్ నాయకులు శవాలపై రాజకీయం చేస్తారని డీకే ఆరోపించారు. తొక్కిసలాటకు డీకే బాధ్యుడని కేంద్రమంత్రి హెచ్‌డీ కుమారస్వామి విమర్శించారని చెప్పగా, ఆయనకు తరువాత సమాధానం ఇస్తానని తెలిపారు.



'మహబూబ్‌నగర్' సమీక్షలో మాట్లాడుతున్న మహేశ్‌కుమార్‌గౌడ్. చిత్రంలో మీనాక్షి, వేం నరేందర్‌రెడ్డి

బీఆర్ఎస్ ఎమ్మెల్యేతో ఏం పని?

- నాగర్‌కర్నూలు ఎంపీ మల్లు రవిపై మాజీ ఎమ్మెల్యే సంపత్ ఫిర్యాదు
- 'నాగర్‌కర్నూలు' సమీక్షలో పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ దృష్టికి..
- ఐఏఎస్, ఐపీఎస్‌లు పట్టించుకోవడం లేదన్న మహబూబ్‌నగర్ నేతలు

సాక్షి, హైదరాబాద్: అలంపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే విజయుడును నాగర్‌కర్నూలు ఎంపీ మల్లు రవిని ఇంటికి పిలిపించుకొని మాట్లాడాల్సిన అవసరం ఏంటని మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేతో కలిసి ఎంపీ తిరుగుతున్నారంటూ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌కు ఫిర్యాదు చేసినట్టు సమాచారం. గురువారం నాగర్‌కర్నూలు, మహబూబ్‌నగర్, వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గాల సమావేశం గాంధీభవన్‌లో జరిగింది. పార్టీ నిర్మాణం, ప్రభుత్వ పథకాల ప్రచారంపై విశ్లేషణ వంటి అంశాలపై చర్చించారు. అయితే స్థానిక అంశాలపైనే మూడు నియోజకవర్గాల నాయకులు మాట్లాడినట్టు తెలిసింది.

- ➤ నాగర్‌కర్నూల్ సమావేశంలో ఎంపీ మల్లు రవిని లక్ష్యంగా చేసుకొని మాజీ ఎమ్మెల్యే సంపత్, ఆయన వర్గం నాయకులు మీనాక్షి నటరాజన్‌కు ఫిర్యాదు చేశారు. పదేళ్లు కష్టపడిన మమ్మల్ని పక్కన బెట్టి ఇతరులకు ప్రియార్టీ ఇస్తారా అని సంపత్ వర్గం మల్లు రవిపై ఫిర్యాదు చేసినట్టు సమాచారం.
- ➤ మహబూబ్‌గర్ పార్లమెంట్ సమావేశంలో ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులపై ఫిర్యాదు చేశారు. అధికార పార్టీ ప్రతినిధులుగా తాము చెప్పే విషయాలు అధికారులు వినడం లేదని మీనాక్షికి చెప్పినట్టు సమాచారం.
- ➤ వరంగల్ పార్లమెంటు సమావేశంలో స్థానిక అంశాలను ఇన్‌చార్జ్ దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిసింది.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి: మీనాక్షి నటరాజన్

కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్లాలని రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ మూడు నియోజకవర్గాల నాయకులకు దిశానిర్దేశం చేశారు. గాంధీభవన్‌లో మూడు నియోజకవర్గాలకు విడివిడిగా జరిగిన సమావేశాల్లో ఆమె మాట్లా డుతూ పథకాల ప్రభావం క్షేత్రస్థాయిలో స్పష్టంగా కనిపిస్తుందని, ప్రజల్లో ఉన్న విశ్వాసాన్ని రాబోయే ఎన్నికల్లో అనుకూలంగా మలచుకోవాలని సూచించారు.

టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ సీనియర్లు, జూనియర్లు సమన్వయంతో ముందుకెళ్లాలన్నారు. సమావేశాల్లో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, మూడు నియోజకవర్గాల ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. శుక్రవారం కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ సమావేశం జరగనుంది.

హైదరాబాద్‌లో రఫేల్ ఫ్యూజిలేజ్‌ల తయారీ

▶ మొదటి పేజీ తరువాయి

బలోపేతం కానుంది. హైదరాబాద్ యూనిట్‌లో ఫ్యూజిలేజ్‌లోని ముందు, వెనుక, పక్క భాగాలు తయారవుతాయి.

2028 నాటికి తొలి ఫ్యూజిలేజ్ ఉత్పత్తి

ఒప్పందం మేరకు 2028 ఆర్థిక సంవత్సరం నాటికి రఫేల్ యుద్ధ విమానం తొలి ఫ్యూజిలేజ్ హైదరాబాద్ యూనిట్ నుంచి బయటకు వస్తుంది. ఇక్కడ ప్రతి నెలా రెండు ఫ్యూజిలేజ్‌లను తయారుచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. 'రఫేల్ ఫ్యూజిలేజ్‌లు తొలిసారి ఫ్రాన్స్ బయట ఉత్పత్తి కానున్నాయి. భారత్‌లో మా సప్లై చైన్‌ను బలోపేతం చేయడంలో ఈ ఒప్పందాన్ని కీలకమైనదిగా భావిస్తున్నాం'అని డసాల్ట్ ఏవియేషన్ చైర్మన్, సీఈఓ ఎరిక్ ట్రాపియర్ తెలిపారు. 'డసాల్ట్ ఏవియేషన్‌తో ఒప్పందం భారతదేశ ఏరోస్పేస్ రంగం ప్రయాణంలో ముఖ్యమైన ముందడుగు. ఈ ఒప్పందం ఆధునిక, దృఢమైన ఏరోస్పేస్ తయారీ పర్యావరణ వ్యవస్థ స్థాపనలో గొప్ప పురోగతికి ప్రతిబింబంగా నిలు స్తుంది'అని టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్ సుకరణ్ సింగ్ అన్నారు.






బడిబాట పట్టేనా!

నేటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా బడిబాట

- ప్రభుత్వ స్కూళ్లలో అడ్మిషన్లు పెంచటమే లక్ష్యం
- సర్కారీ స్కూళ్లపై విశ్వాసం పెంచేలా కార్యక్రమాలు
- సర్కారు బడుల్లో ఏటా తగ్గుతున్న ప్రవేశాలు
- దశాబ్దకాలంలో 24 లక్షల నుంచి 16 లక్షలకు తగ్గుదల
- స్కూళ్లలో విద్యా ప్రమాణాలు పడిపోవటమే కారణమనే విమర్శలు





సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థుల ప్రవేశాలు పెంచేందుకు విద్యాశాఖ రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం నుంచి ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభిస్తోంది. ఈ నెల 19 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను అన్ని జిల్లాలకు పంపింది. అన్ని స్థాయిల అధికారులు, ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలను ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం చేయాలని సూచించింది. ప్రభుత్వ టీచర్లలో బోధనా సామర్థ్యం పెంచేందుకు ఈసారి శిక్షణ కూడా ఇచ్చారు.

బడిబాట షెడ్యూల్ ఇదీ..

- **6వ తేదీ:** స్థానిక ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులను భాగస్వామ్యం చేస్తూ గ్రామసభలు నిర్వహించాలి.
- **7వ తేదీ:** టీచర్లు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి బడి ఈడు పిల్లలను గుర్తించాలి.
- **8, 9, 10 తేదీల్లో:** అంగన్‌వాడీ కేంద్రాల సందర్శన. డ్రాపౌట్ పిల్లలను గుర్తించి బడిలో చేర్పించడంతోపాటు ప్రత్యేక అవసరాలున్న పిల్లలను గుర్తించి, అందుబాటులో ఉన్న భవిత కేంద్రాల్లో చేర్పించాలి.
- **11వ తేదీ:** అప్పటివరకు నిర్వహించిన కార్యక్రమాలపై సమీక్ష.
- **12వ తేదీ:** అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన పనులను ప్రజాప్రతినిధులతో ప్రారంభించాలి. అదే రోజు విద్యార్థులకు పాఠ్య, నోటు పుస్తకాలు, యూనిఫామ్స్ అందించాలి.
- **13వ తేదీ:** ప్రజాప్రతినిధులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు, తల్లిదండ్రులు, గ్రామస్తులను ఆహ్వానించి వారి సమక్షంలో సామూహిక అక్షరాభ్యాసం, బాలసభ నిర్వహించాలి.
- **16వ తేదీ:** ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్), లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రామ్ (లిప్) దినోత్సవం నిర్వహించాలి. అన్ని తరగతి గదుల్లో సబ్జెక్టులవారీగా అభ్యసన సామర్థ్యాలకు సంబంధించిన పోస్టర్లను ప్రదర్శించాలి. పిల్లలు రూపొందించిన వివిధ చార్టులతో గదులను అలంకరించాలి. చదవడం, గణిత అంశాలపై ఎఫ్ఎల్ఎన్ క్విజ్ పోటీలు నిర్వహించాలి. 17వ తేదీ: ఇంటిగ్రేటెడ్ విద్య. బాలిక విద్యా దినోత్సవం నిర్వహించాలి. బాల్య వివాహాలు, చిన్నారులపై వేధింపులకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించాలి.
- **18వ తేదీ:** తల్లిదండ్రులను, గ్రామస్తులను ఆహ్వానించి తరగతి గదుల డిజిటలైజేషన్, ఇతర అధునిక సౌకర్యాలను చూపించాలి. మొక్కల పెంపకం ప్రాధాన్యాన్ని విద్యార్థులకు వివరించాలి.
- **19వ తేదీ:** బడిబాట ముగింపు సందర్భంగా విద్యార్థులకు క్రీడల పోటీలు నిర్వహించాలి.

తగ్గుతున్న ప్రవేశాలు

ప్రభుత్వ స్కూళ్లలో గత పదేళ్లలో విద్యార్థుల ప్రవేశాలు 32 శాతం తగ్గాయి. 2014–15లో 24.85 లక్షల మంది ప్రభుత్వ స్కూళ్లలో చేరితే, 2024–25లో ఈ సంఖ్య 16.68 లక్షలకు తగ్గింది. అదే కాలంలో ప్రైవేటు స్కూళ్లలో ప్రవేశాలు 31.17 లక్షల నుంచి 36.73 లక్షలకు పెరిగింది. ప్రభుత్వ స్కూళ్లలో విద్యా ప్రమాణాలు పడిపోవడం కూడా ప్రవేశాలు తగ్గటానికి కారణంగా భావిస్తున్నారు. కాగా, బడిబాటపై చాలామంది టీచర్లు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. తూతూమంత్రంగానే పాల్గొనేందుకు ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తోంది.

క్లుప్తంగా...

కుటుంబ వ్యవహారంలా అందాల పోటీలు

ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్



సాక్షి, హైదరాబాద్: అందాల పోటీలను సీఎం రేవంత్‌రెడ్డి కుటుంబ వ్యవహారంలా మార్చారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ విమర్శించారు. ఈ అందాల పోటీలు భారతీయ సంస్కృతిని కించపరిచేలా జరిగాయన్నారు. మిస్ ఇంగ్లండ్ మెల్లా మెగీ అందాల పోటీల నుంచి అర్ధాంతరంగా అవమానకర పరిస్థితుల నుంచి వైదొలగడం రాష్ట్ర ప్రతిష్టను మంట గలిపిందని మండిపడ్డారు. పార్టీ నాయకులు కురువ విజయ్ కుమార్‌తో కలిసి గురువారం తెలంగాణ భవన్‌లో దాసోజు శ్రవణ్ మీడియాతో మాట్లాడారు. ఈ తరహా ఘటనలు దేశంలో ఎక్కడ జరిగినా ఎఫ్ఐఆర్ నమోదు చేసేవారని, ఇంత పెద్ద ఘటన జరిగినా ప్రభుత్వ పెద్దలు తేలు కుట్టిన దొంగల్లా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. మిస్ ఇంగ్లండ్ ఆరోపణలపై మానవ హక్కుల సంఘం, మహిళా కమిషన్ స్వచ్ఛందంగా ఎందుకు స్పందించలేదని దాసోజు ప్రశ్నించారు. కాంగ్రెస్, బీజేపీ మధ్య బలమైన బంధం ఉన్నందునే కేంద్రమంత్రి బండి సంజయ్ ఈ ఘటనపై స్పందించడం లేదన్నారు. మిస్ ఇంగ్లండ్ చేసిన ఆరోపణలపై ఎలాంటి విచారణ జరగలేదని మంత్రి జూపల్లి చేసిన వ్యాఖ్యల వెనుక మర్మమేంటో చెప్పాలని డిమాండ్ చేశారు.

సీఐడీ అదనపు డీజీపీగా చారుసిన్హా బాధ్యతలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర నేర పరిశోధన విభాగం (సీఐడీ) అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్(ఏడీజీపీ)గా 1996 బ్యాచ్ ఐపీఎస్ అధికారిణి చారు సిన్హా గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఏడేళ్ల కేంద్ర బాధ్యతల తర్వాత చారుసిన్హా తెలంగాణకు తిరిగి వచ్చారు. కేంద్ర రిజర్వ్ పోలీస్ ఫోర్స్(సీఆర్‌పీఎఫ్)లో ఆమె కీలక హోదాలో సేవలందించారు. ఆ సమయంలో బిహార్, జమ్మూకశ్మీర్ లాంటి ప్రాంతాల్లో విధులు నిర్వర్తించారు. బిహార్, జమ్మూకశ్మీర్, దక్షిణ రంగాల్లోని సీఆర్‌పీఎఫ్‌లోని 4 విభాగాలకు నాయకత్వం వహించిన తొలి ఐపీఎస్ అధికారి చారుసిన్హా కావడం గమనార్హం. మహిళా భద్రత, షీ టీమ్స్, భరోసా కేంద్రాలకు ఆమె పూర్తి అదనపు డీజీపీగా కొనసాగనున్నారు.

పాఠశాలల్లో కనీస సౌకర్యాలు కల్పించాలి

బీజేపీ శాసనమండలి పక్ష నేత ఏవీఎన్ రెడ్డి



సాక్షి, హైదరాబాద్: విద్యార్థులకు సకాలంలో పుస్తకాలు, యూనిఫాం అందించాలని, పాఠశాలల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాన్ని బీజేపీ శాసన మండలి పక్ష నేత ఏవీఎన్ రెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని 75 శాతం ప్రభుత్వ పాఠశాలల్లో కనీస వసతులు, 39 శాతం పాఠశాలల్లో ప్రహరీలు, 23 శాతం స్కూళ్లలో తరగతి గదులు లేవని గురువారం ఒక ప్రకటనలో ఆయన వివరించారు. త్వరితగతిన చర్యలు చేపట్టి విద్యార్థులు ఇబ్బందులకు గురికాకుండా చూడాలని, ఆరోగ్యకరమైన వాతావరణంలో విద్యనందించాలని కోరారు.

9 నుంచి తిరుమలలో జ్యేష్టాభిషేకం



తిరుమల: ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు తిరుమలలోని శ్రీవారి ఆలయంలో సాలకట్ల జ్యేష్టాభిషేకం జరుగనుంది. ఏటా జ్యేష్ఠమాసంలో మూడురోజుల పాటు తిరుమల శ్రీవారికి ఈ అభిషేకం నిర్వహిస్తారు. సంపంగి ప్రదక్షిణ ప్రాకారంలోని కల్యాణ మండపంలో నిర్వహించే ఈ క్రతువును "అభిద్యేయక అభిషేకం" అని కూడా పిలుస్తారు. మొదటి రోజు శ్రీ మలయప్పస్వామివారికి ఉన్న బంగారు కవచాన్ని తీసి వజ్ర కవచం అలంకరిస్తారు. రెండో రోజు ముత్యాల కవచం, మూడోరోజు తిరుమంజనాదులు పూర్తిచేసి, బంగారు కవచాన్ని పునః సమర్పిస్తారు. ఈ బంగారు కవచాన్ని మళ్లీ వచ్చే ఏడాది జ్యేష్టాభిషేకం సమయంలోనే తీస్తారు. అంతవరకు ఏడాది పొడవునా శ్రీవారు బంగారు కవచంతోనే వివిధ ఉత్సవాల్లో పాల్గొంటారు.

40 శాతం వైకల్యమున్నా మెజారిటీ కేటగిరీల్లో అర్హత

దివ్యాంగులకు పరికరాల పంపిణీకి విధివిధానాలు ఖరారు!

- గత ఉత్తర్వులను సవరిస్తూ తాజాగా మార్గదర్శకాలు విడుదల
- సీఎం రేవంత్‌రెడ్డికి టీవీసీసీ కృతజ్ఞతలు



ఉత్తర్వుల కాపీలను చూపిస్తున్న టీవీసీసీ చైర్మన్ ముత్తినేని వీరయ్య

సాక్షి, హైదరాబాద్: దివ్యాంగుల సంక్షేమంలో భాగంగా తెలంగాణ వికలాంగుల కోఆపరేటివ్ కార్పొరేషన్ (టీవీసీసీ) ద్వారా పంపిణీ చేసే పరికరాలకు సంబంధించి విధివిధానాలు ఖరారయ్యాయి. ఈ పరికరాల పంపిణీలో గత ప్రభుత్వం నిబంధనలు జారీ చేసినప్పటికీ... క్షేత్రస్థాయి నుంచి వచ్చిన వినతులు, సలహాలు, సూచనలకు అనుగుణంగా టీవీసీసీ పాలకమండలి నిర్ణయం తీసుకుని రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించింది. ఈ నేపథ్యంలో టీవీసీసీ ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వం ఆమోదిస్తూ ఈ మేరకు తాజాగా మార్గదర్శకాలు జారీ చేసింది. రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు, వికలాంగుల సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్ జీవో 89 జారీ చేశారు. ఈ నేపథ్యంలో గురువారం టీవీసీసీ చైర్మన్ ముత్తినేని వీరయ్య ఉత్తర్వుల కాపీలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మలక్‌పేటలోని టీవీసీసీ రాష్ట్ర కార్యాలయంలో గురువారం మీడియాతో మాట్లాడారు. వినతులను పరిగణించి పెద్ద సంఖ్యలో దివ్యాంగులకు లబ్ధి జరిగే విధంగా మార్పులు చేస్తూ చర్యలు తీసుకున్నందుకు సీఎం రేవంత్ రెడ్డికి ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. బెంచ్‌మార్క్ డిజేబిలిటీ ఉన్న ప్రతి దివ్యాంగుడికి తాజా నిబంధనలు వర్తిస్తాయని, గతంలో 80% వైకల్యం ఉన్న వాళ్లకు మాత్రమే అర్హత కల్పించగా... ప్రస్తుత ప్రజాప్రభుత్వం కుదించిందన్నారు. దేశంలోని ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇంతటి ఉదార నిర్ణయం తీసుకోలేదని వీరయ్య వ్యాఖ్యానించారు.

40 శాతం వైకల్యం ఉంటే...

తెలంగాణ వికలాంగుల సహకార సంస్థ ద్వారా మూడు చక్రాల మోటరైజ్డ్ వాహనాలు, వృత్తివిద్యా కోర్సులు చదువుతున్న దివ్యాంగ విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు, విద్యార్థి నేస్తం కార్యక్రమం ద్వారా ట్యాబ్‌లు, లూయిస్ బ్రెయిలె అండ్ హెలెన్ కిల్లర్ గిఫ్ట్‌గా 5జీ స్మార్ట్ ఫోన్లు, లెప్రసి బాధిత దివ్యాంగులకు మైక్రో సెల్యూలార్ రబ్బర్ (ఎంసీఆర్), అంధ విద్యార్థులకు బ్రెయిలీ కిట్లు, కుర్చీకే పరిమితమైన దివ్యాంగులకు ఇన్నోవేటివ్ బ్యాటరీ వీల్ చైర్స్, స్వయం ఉపాధి కింద వ్యాపారం చేసుకునే దివ్యాంగులకు బ్యాటరీ వెహికల్స్ అందిస్తున్నారు. వీటిలో మెజార్టీ కేటగిరీల్లో కేవలం 40 శాతం వైకల్యం ఉన్నా అర్హత సాధిస్తారని టీవీసీసీ చైర్మన్ ముత్తినేని వీరయ్య తెలిపారు.

డీఏలపై మోసగించిన ప్రభుత్వం

బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు కరువు భత్యం మంజూరులో కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. ఎన్నికల సమయంలో పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను.. అధికారంలోకి వచ్చిన వెంటనే చెల్లిస్తామని మేనిఫెస్టోలో పెట్టి.. ఇప్పుడు చావుకబురు చల్లగా చెప్పారని మండిపడ్డారు. మంత్రివర్గ నిర్ణయంపై ఎక్స్ వేదికగా ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐదు డీఏలు చెల్లించాల్సి ఉంటే.. ఇప్పుడు రెండు ప్రకటించి.. ఒక్క డీఏ నిధులను మాత్రమే ఇస్తామని ప్రకటించడం, రెండో డీఏను ఆరు నెలల తరువాత చెల్లిస్తామనడం శోచనీయమని ఆక్షేపించారు. అధికారంలోకి వచ్చిన 6 నెలల్లో వేతన సవరణ చేస్తామని మభ్య పెట్టి, 18 నెలలు గడుస్తున్నా పీఆర్సీ ఊసే లేదని ఆరోపించారు. త్వరలోనే కేంద్రం మరో డీఏను ప్రకటిస్తుందని ఆయన గుర్తు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన ఉద్యోగుల ఆరోగ్య పథకం జీవోను ఇప్పుడు అమలు చేస్తామని చెప్పడం విడ్డూరమని, ఉద్యోగుల పదవీ విరమణ ప్రయోజనాల ప్రస్తావన ఏదీ లేదని విమర్శించారు. మహిళా సంఘాలకు ఇదివరకే ఇచ్చిన చెక్కులపై మళ్లీ కేబినెట్ నిర్ణయం హాస్యాస్పదమని హరీశ్ ఎద్దేవా చేశారు.

మహిళా సంక్షేమానికి సలహా కమిటీ!

బాలికల రక్షణ కోసం ప్రత్యేకంగా స్నేహ కమిటీలు: మంత్రి సీతక్క

గురువారం ముగిసిన రెండ్రోజుల మేధోమథన సదస్సు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మహిళల సంక్షేమం కోసం నిపుణులతో కూడిన కమిటీని ఏర్పాటు చేయాల ని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ఆదేశించారు. మహిళల సంక్షేమం కోసం తీసుకోవాల్సిన చర్యలకు సంబంధించి సలహాలు, సూచనలు ఈ కమిటీ చేయాల్సి ఉంటుందన్నారు. రాష్ట్రంలో మహిళల హక్కులకోసం కృషి చేస్తున్న నిపుణులను గుర్తించి ఈ కమిటీలో నియమించాలన్నారు. అదేవిధంగా బాలికల రక్షణ కోసం స్నేహ కమిటీలను ఏర్పాటు చేయాలని, ఈ కమిటీ స్వీయ రక్షణ బృందాలుగా పనిచేస్తాయని చెప్పారు. గురువారం రాజేంద్రనగర్‌లోని తెలంగాణ గ్రామీణాభివృద్ధి సంస్థ ఆడిటోరియంలో జరుగుతున్న మేధోమథన సదస్సు ముగింపు కార్యక్రమంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. బాలబాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ అవగాహన కల్పించాలని, మహిళలు, బాలికల భద్రత కోసం పనిచేసే స్వచ్ఛంద సంస్థలను గుర్తించి అంగన్‌వాడీలతో అనుసంధానం చేస్తామని మంత్రి చెప్పారు. త్వరలో మహిళల హక్కుల మీద పనిచేసే స్వచ్ఛంద సంస్థలతో సమావేశం నిర్వహించి మహిళా భద్రత కోసం విధానాలను రూపొందిస్తామన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు బాల్య వివాహ నిరోధక చట్టం నిబంధనలను అడాప్ట్ చేసుకోకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ఈ ఏడాదిలో రాష్ట్రవ్యాప్తంగా వెయ్యి అంగన్‌వాడీ కేంద్రాలకు కొత్త భవనాలు నిర్మిస్తామన్నారు. నారాయణపేట జిల్లాలో బాలికా మండలి సదస్సులు క్షేత్రస్థాయిలో నిర్వహిస్తూ.. కిశోర బాలికలకు ఆరోగ్యం, స్వీయ రక్షణపై అవగాహన కల్పిస్తున్నారని, బాలసదనాలు, పరిరక్షణ క్షేత్రాలలో ఉన్న పిల్లలకు ఆరోగ్య సేవల కోసం యూనివర్సల్ హెల్త్ కార్డ్స్ ఇస్తున్నారని తెలిపారు. ఈ విధానాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఉద్యోగులకు 2 డీఏలు

▶ మొదటి పేజీ తరువాయి

మే 6న ప్రభుత్వం ఏర్పాటు చేసిన అధికారుల కమిటీ తమ నివేదికను సమర్పించింది. ఉద్యోగుల 57 డిమాండ్లను పరిశీలించిన మంత్రివర్గం .. అధికారుల కమిటీ నివేదిక ప్రకారం కొన్ని అంశాలను ఆమోదించి మిగిలిన వాటిని పరిశీలనకు స్వీకరించింది. ఉద్యోగులకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులను ఇకపై ప్రతి నెలా క్రమపద్ధతిలో చెల్లించాలని నిర్ణయించింది. ప్రతి నెలా రూ. 700 కోట్లకు తగ్గకుండా బిల్లులు చెల్లించనుంది. ఉద్యోగుల హెల్త్ కార్డులకు సంబంధించి మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకుంది. ఉద్యోగ సంఘాల అభ్యర్థన మేరకు హెల్త్ కేర్ ట్రస్ట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ప్రతి ఉద్యోగి నుంచి నెలకు రూ. 500 వసూలు చేయడంతోపాటు సమాన మొత్తాన్ని ప్రభుత్వ వాటాగా ట్రస్ట్‌కు చెల్లించనుంది. ట్రస్ట్ చైర్మన్‌గా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వ్యవహరించనుండగా ఇతర అధికారులు, ఉద్యోగుల ప్రతినిధులు సభ్యులుగా ఉండనున్నారు. ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తినా ట్రస్ట్ ద్వారా వైద్య సదుపాయం కల్పించనున్నారు. ఉద్యోగులకు పదోన్నతులు కల్పించడానికి ఏటా సెప్టెంబర్‌లో శాఖాపరమైన పదోన్నతుల కమిటీ (డీపీసీ) సమావేశం నిర్వహించాలని కేబినెట్ నిర్ణయించింది. ఇక జిల్లా, రాష్ట్ర స్థాయిలో మెడికల్ ఇన్‌వ్యాలిడేషన్ కమిటీ ఏర్పాటు చేయాలన్న మరో కీలక డిమాండ్‌ను మంత్రివర్గం ఆమోదించింది. జాయింట్ స్టేట్ కౌన్సిల్, అసోసియేషన్లను గుర్తించేందుకు ఒప్పుకుంది. జీవో 317లో ఇంకా కొన్ని కేటగిరీలను చేర్చాలని నిర్ణయం తీసుకుంది. సచివాలయంలో ప్రస్తుతం పూర్తిగా సెక్రటేరియట్ సర్వీసెస్ ఉద్యోగులే పనిచేస్తుండగా ఇకపై 12.5 శాతం నాన్ సెక్రటేరియట్ సర్వీసెస్ కోటాను అమలు చేయాలనే మరో డిమాండ్‌ను మంత్రివర్గం ఆమోదించింది. పదవీవిరమణ పొందిన ఉద్యోగులను మళ్లీ నియమించరాదనే మరో డిమాండ్‌ను మంత్రివర్గం ఆమోదించింది. గ్రామ కార్యదర్శి పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలని నిర్ణయించింది. ఎన్నికల సందర్భంగా ఇతర జిల్లాలకు బదిలీ అయిన ఉద్యోగులను సొంత జిల్లాలకు తిరిగి పంపించేందుకు అంగీకరించింది. జిల్లా పరిషత్‌లో పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాల పూర్తితోపాటు నర్సింగ్ డైరెక్టరేట్ ఏర్పాటు డిమాండ్లకు సైతం సమ్మతి తెలిపింది. అంగన్‌వాడీల పదవీవిరమణ ప్రయోజనాలను రూ. 2 లక్షలకు పెంచింది. ఉద్యోగుల అద్దె వాహనాల పెండింగ్ బిల్లుల చెల్లింపుతోపాటు వాహనాల అద్దెల పెంపునకు ఆమోదం తెలిపింది.

మరికొన్ని నిర్ణయాలు

- భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఏర్పాటు చేసిన ఎర్త్ సైన్స్ యూనివర్సిటీకి మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ పేరు పెట్టాలని నిర్ణయించింది.
- స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ)కు రూ. 10 లక్షల ప్రమాద బీమా పథకాన్ని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అమల్లోకి తెచ్చింది. బీమా కంపెనీలకు చెల్లించాల్సిన ప్రీమియం భారం కాకుండా ప్రభుత్వమే నేరుగా బాధితులకు రూ. 10 లక్షలు చెల్లించాలని నిర్ణయించింది. ఇప్పటివరకు 385 మంది మరణించగా రూ. 38.5 కోట్ల చెల్లింపులకు మంత్రివర్గం ఆమోదించింది.
- హైబ్రీడ్ యాన్యూటీ మోడ్ (హామ్) కింద రాష్ట్రంలోని అన్ని (పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ) రోడ్లను అభివృద్ధి చేయాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. తొలి దశ కింద 7,947 కి.మీ. పంచాయతీరాజ్, 5,190 కి.మీ. ఆర్ అండ్ బీ రోడ్లు కలిపి మొత్తం 13,137 కి.మీ. రోడ్లను అభివృద్ధి చేయనుంది. పంచాయతీరాజ్ రోడ్లకు రూ. 16,780 కోట్లు, ఆర్ అండ్ బీ రోడ్లకు రూ. 16,414 కోట్లు ప్రభుత్వం ఖర్చు పెట్టనుంది. వచ్చే రెండున్నరేళ్లలో రోడ్ల నిర్మాణం పూర్తి చేయనుండగా 15 ఏళ్లపాటు నిర్వహణ బాధ్యతలను ఏజెన్సీలకే ప్రభుత్వం అప్పగించనుంది. పార్లమెంట్ స్థానాన్ని ఒక యూనిట్‌గా లేదా ఉమ్మడి జిల్లాలవారీగా ఒక్కో జిల్లాను ఒక్కో ప్యాకేజీగా విభజించి రోడ్ల అభివృద్ధి చేయాలని నిర్ణయం.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో రూ. 19,579 కోట్లతో అంచనాలతో హైదరాబాద్ మెట్రో రైలు రెండో దశ విస్తరణ చేపట్టాలని మంత్రివర్గం నిర్ణయించింది. కారిడార్–1లో భాగంగా శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి ఫ్యూచర్ సిటీ వరకు 39.6 కి.మీ., కారిడార్–2లో భాగంగా జూబ్లీ బస్‌స్టేషన్ నుంచి మేడ్చల్ వరకు 24.5 కి.మీ., కారిడార్–3లో భాగంగా జూబ్లీ బస్‌స్టేషన్ నుంచి శామీర్‌పేట్ వరకు 22 కి.మీ. కలిపి మొత్తం 86.1 కి.మీ. కారిడార్‌ను నిర్మించనుంది. ఈ మేరకు కేంద్రానికి ప్రతిపాదనలు పంపాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఎంపీ ఈటల రాజేందర్ ఈ విషయంలో కేంద్రాన్ని ఒప్పించాలని మంత్రి పొంగులేటి కోరారు.
- రాష్ట్రంలో సన్న ధాన్యం పండించే రైతులకు ప్రోత్సాహాన్ని కొనసాగించాలని.. ప్రజలకు మేలు చేసే కార్యక్రమాలకు గ్రీన్ చానల్‌లో చెల్లింపులు జరపాలని నిర్ణయించింది.
- ములుగు జిల్లా ఇంచర్ల గ్రామంలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు 12 ఎకరాల కేటాయింపును మంత్రివర్గం ఆమోదించింది.

ప్రభుత్వ నిర్ణయాలు హర్షణీయం


ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన పలు పెండింగ్ సమస్యలను రాష్ట్ర కేబినెట్ పరిష్కరించడంపై తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డికి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఇతర ప్రభుత్వ పెద్దలకు లచ్చిరెడ్డి ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన త్రిసభ్య కమిటీకి తాము ఇచ్చిన ప్రతి అంశంపై రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందన్నారు. ఉద్యోగులకు రెండు డీఏలను ఇచ్చేందుకు ప్రభుత్వం అంగీకారం తెలిపిందని.. ఒక డీఏను తక్షణమే మరో డీఏను 6 నెలల్లో ఇవ్వనుందన్నారు. అలాగే ఎన్నికలప్పుడు బదిలీ అయిన ఉద్యోగులు తిరిగి సొంత జిల్లాలకు వెళ్లే అవకాశం కల్పించిందన్నారు. ఉద్యోగుల పెండింగ్ బిల్లుల కోసం ప్రతి నెలా రూ. 700 కోట్లు తగ్గకుండా క్లియర్ చేసేందుకు అంగీకారం తెలిపిందని చెప్పారు. ఉద్యోగులకు మెరుగైన ఆరోగ్య పథకాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం ట్రస్ట్ ఏర్పాటు చేయబోతోందని పేర్కొన్నారు.

మంత్రివర్గ నిర్ణయాలపై ఉద్యోగ జేఏసీ హర్షం

నేటి సమావేశం వాయిదా

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాలపై తెలంగాణ ఉద్యోగ జేఏసీ హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు శుక్రవారం నిర్వహించాల్సిన జేఏసీ విస్తృతస్థాయి సమావేశాన్ని తాత్కాలికంగా వాయిదా వేసింది. ఈనెల 9న చేపట్టాలని భావించిన నిరసన కార్యక్రమాన్ని కూడా రద్దు చేసినట్లు ఉద్యోగ జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరు శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు.





కనీ విని ఎరుగని 80% వరకు
భారీ తగ్గింపు అమ్మకం
ఫ్యాక్టరీ నుండి నేరుగా బ్రాండెడ్ దుస్తులు మరియు షూస్ హైదరాబాద్ తాజ్ డెక్కన్ నందు చారిత్రాత్మక అమ్మకం కేవలం 4 రోజులు పాటు మాత్రమే
... 2024 ... 80% వరకు తగ్గింపుతో కేవలం 4 రోజుల పాటు ... హోటల్ తాజ్ డెక్కన్, రోడ్ నెం.1, ... బంజారా హిల్స్, హైదరాబాద్ నందు అమ్మకం కేవలం 4 రోజులు మాత్రమే - తేది.06, 07, 08 & 09 జూన్, 2025 సమయం ఉ॥ 10 గంటల నుండి రా॥ 10 గంటల వరకు, ప్రవేశం & పార్కింగ్ ఉచితం.
Advertisement

అల్లాహ్ మీ హృదయంలో ఏ మంచి సంకల్పాన్ని చూసినా,
మీ నుండి స్వీకరించిన దాని కన్నా మేలైన దానినే మీకు తిరిగి ప్రసాదిస్తాడు.
– ఇస్లాం ధర్మం

సాక్షి
శుక్రవారం, 6 జూన్ 2025

ప్రాణాంతక నిర్లక్ష్యం

హద్దులెరుగని అభిమానం, నిర్వాహకుల అంతులేని నిర్లక్ష్యం, తన బాధ్యతేమిటో పూర్తిగా మరిచిన ప్రభుత్వం... వెరసి బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో బుధవారం సాయంత్రం 11 నిండు ప్రాణాలు బలయ్యాయి. మరో 50 మంది గాయాలపాలై ఆస్పత్రుల్లో చికిత్స తీసుకుంటుండగా, అందులో అయిదుగురి స్థితి ఆందోళనకరంగా ఉన్నదంటున్నారు. దుర్మరణం పాలైన వారిలో ఎక్కువమంది టీనేజ్ వయస్కులు. ఎంతో భవిష్యత్తుగల యువత ప్రాణాలు ఇలా హఠాత్తుగా కడతేరిపోవటం వారి తల్లిదండ్రులకూ, తోబుట్టువులకూ మాత్రమే కాదు... సమాజం మొత్తానికి తీవ్ర దుఃఖం కలిగించే అంశం. ఒక కథనం ప్రకారం ఈ కార్యక్రమానికి రాయల్ చాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ), కర్ణాటక స్టేట్ క్రికెట్ అసోసియేషన్ (కేఎస్‌సీఏ), డీఎన్ఏ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థల్లో ఏ ఒక్కరూ అనుమతి తీసుకోలేదు! ఇంతకన్నా దారుణం ఉంటుందా? ఇప్పుడు సిటీ పోలీసు కమిషనర్‌నూ, డెప్యూటీ కమిషనర్‌నూ సస్పెండ్ చేశామంటున్నారు. మంచిదే. ఇతరుల మాటేమిటి? సెలబ్రిటీలు వచ్చినప్పుడూ, రాజకీయ సభలప్పుడూ, మతసంబంధ ఉత్సవాల సందర్భాల్లో భారీయెత్తున జనం గుమిగూడటం... తొక్కిసలాటలు, మరణాలు రివాజుగా మారాయి. కానీ ప్రభుత్వాలు, పోలీసులు నేర్చుకున్నదేమీ ఉండటం లేదని ఇవి పునరావృతం అవుతున్న తీరు చూస్తే తెలుస్తుంది. ఈ ఏడాది జనవరి మొదట్లోనే తిరుపతిలో టీటీడీ నిర్వాకం కారణంగా తొక్కిసలాటకు ఆరుగురు బలయ్యారు. ఆ నెలాఖరులో ప్రయాగ్‌రాజ్‌లో కుంభమేళా వద్ద ఇలాంటి దుర్ఘటనలోనే 30 మంది చనిపోయారు. ఆ మరుసటి నెలలో న్యూఢిల్లీ రైల్వే స్టేషన్‌లో తొక్కిసలాట వల్ల 18 మంది కన్నుమూశారు. ఎన్ని ప్రాణాలు పోతే ప్రభుత్వాలు మేల్కొంటాయి?

సామాజిక మాధ్యమాల ప్రభావమేమిటో అందరికీ తెలుసు. వాటిల్లో ఆ కార్యక్రమం గురించి ఆర్‌బీసీయే విస్తృత ప్రచారం చేసింది. తామున్నచోటికి అభిమాన ఆటగాళ్లు రాబోతున్నారని యువత ఉవ్విళ్లూరటం అసాధారణమేమీ కాదు. మన దేశంలో క్రికెట్‌కు మరే క్రీడకూ లేనంత ఆకర్షణ ఉంది. విరాట్ కోహ్లీ వస్తున్నాడంటే అది మరిన్ని వందల రెట్లు పెరుగుతుంది. ఇవి చాలవా పకడ్బందీ ముందస్తు ఏర్పాట్లు చేసుకోవటానికి? నిజానికి బెంగళూరు, దాని శివారు ప్రాంతాల్లో మంగళవారం రాత్రి నుంచే అభిమానుల కోలాహలం మొదలైందని, బుధవారం ఉదయం నుంచి అది క్రమేపీ పెరుగుతూ పోయిందని మీడియా కథనాలు చెబుతున్నాయి. ఇదంతా గమనించాక సాయంత్రం కార్యక్రమానికి అభిమానులు పోటెత్తుతారన్న అంచనా వుండొద్దా? బుధవారం వీధులన్నీ కిక్కిరిసిన వైనం గమనించి క్రికెటర్ల ర్యాలీని రద్దుచేసి కూడా 35,000 మందికి మాత్రమే సరిపడే స్టేడియంలో వేడుకలు సజావుగా ముగుస్తాయని ఎలా అనుకోగలిగారు? అందులోనూ ఈ కార్యక్రమానికి టిక్కెట్ విక్రయాలు, రిజిస్ట్రేషన్ ప్రక్రియ లేవు. మొత్తానికి స్టేడియంకు వెళ్తే తమ అభిమాన క్రికెటర్లనూ, వారు గెల్చుకున్న కప్పునూ స్వయంగా చూడొచ్చన్న సందేశం ప్రచారమైంది. పర్యవసానంగా నియంత్రణకు అందని రీతిలో లక్షల సంఖ్యలో అభిమానులు గుమిగూడారు.

కార్యక్రమం కోసం 5,000 మంది పోలీసులను మోహరించామని, అయినా ఈ విషాదం చోటు చేసుకున్నదని కంటతడి పెడుతూ కర్ణాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ చెప్పారు. పోలీసులు తమ శాయశక్తులా విధులు నిర్వర్తించారని, దాదాపు మూడు లక్షలమంది రావటంతో విఫలమయ్యామని ఆయన వివరించారు. కానీ ఆ తర్వాత కొన్ని గంటలకే భద్రతా ఏర్పాట్ల కోసం 1,000 మంది పోలీసుల్ని రంగంలోకి దించామని ప్రభుత్వ న్యాయవాది రాష్ట్ర హైకోర్టులో చెప్పారు. ఇది ప్రభుత్వ యంత్రాంగంలో నెలకొన్న అయోమయాన్ని సూచిస్తోంది. అసలు ఆ వేయి మందైనా ఉన్నారా అనే సంశయాన్ని కలగజేస్తోంది. ప్రత్యక్ష సాక్షులైతే పోలీసుల సంఖ్య మొదటి నుంచీ తక్కువేనంటున్నారు. ఇంతమంది గుమిగూడే సందర్భాల్లో జాతీయ విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థ (ఎన్‌డీఎంఏ) సలహా తీసుకోవాలి. కానీ అదీ జరిగినట్టు లేదు. అసలు ఎవరు ఏ గేటువైపు వెళ్లాలో, ఎవరెక్కడ కూర్చోవాలో సూచించే బోర్డులు లేవు. మహిళలు, పిల్లల కోసమైనా విడిగా ప్రవేశద్వారం ఉండాలని నిర్వాహకులకు తోచలేదు. అభిమానుల్ని క్యూలో నియంత్రించేవారూ లేరు, పకడ్బందీ బ్యారికేడ్లూ లేవు. ఉన్న కొన్ని బ్యారికేడ్లూ తొక్కిసలాటలో ధ్వంసమయ్యాయి.

ఇన్ని లోపాలు పెట్టుకుని ఊహించని స్థాయిలో జనం వచ్చిపడటంవల్లే ఇదంతా జరిగిందని చెబితే సరిపోతుందా? అసలు ఫైనల్ మ్యాచ్ జరిగిన 24 గంటలలోపే క్రికెటర్లకు నగరంలో సన్మానం చేయాలన్న తొందరెందుకు? అందుకోసం ఒకటి రెండు రోజుల వ్యవధి తీసుకుంటే జరిగే నష్టమేమిటి? జనం వేలంవెర్రిగా అభిమానించే క్రికెటర్లు వస్తున్నప్పుడూ, వారికి సన్మాన కార్యక్రమం నిర్వహించాలనుకున్నప్పుడూ తగిన ప్రణాళికలు సిద్ధం చేసుకోవాల్సిన అవసరం వుంటుందన్న అంచనా లేకపోవటం సహించరానిది. అప్పుడెప్పుడో ఆఫ్రికా దేశాల్లోనూ, వర్తమానంలో పాలస్తీనాలోనూ రోజుల తరబడి పస్తులుండి అనుకోకుండా ఆహార పదార్థాలతో వచ్చిన వ్యాన్ కోసం జనం ఎగబడి తొక్కిసలాటలు చోటుచేసుకున్న ఉదంతాలున్నాయి. ప్రాణాలు నిలుపుకోవాలన్న వారి తాపత్రయాన్ని అర్థం చేసుకోవచ్చు. కానీ వెర్రి అభిమానం కోసమో, విశ్వాసాల కోసమో ఎగబడటం, ప్రాణాలు కోల్పోవటం, ప్రభుత్వాలు తమ బాధ్యతేమీ లేదన్నట్టు ప్రవర్తించటం, మళ్లీ మరో విషాదం చోటుచేసుకునేవరకూ అంతా సవ్యంగా వున్నట్టు నటించటం ఎంతకాలం? కనీసం ఈ ఉదంతమైనా దేశంలో అందరి కళ్లూ తెరిపించాలి. ఇలాంటివి జరగనీయరాదని సంకల్పించాలి.

దాచటం దేశభక్తిని చాటడమా?

విశ్లేషణ



టంకశాల అశోక్

దేశభక్తి ఎంత అవసరమో, స్వప్రయోజనాల కోసం ఆ భావనను మితిమీరిన స్థాయికి తీసుకెళ్లి చూడటం అంత అనర్థదాయకం. ‘ఆపరేషన్ సిందూర్’ క్రియాశీలకంగా మే 10న ముగిసిన 20 రోజులకు 31వ తేదీన ఈ విషయం బాగా స్పష్టమైంది. ఆ రోజున భారతదేశపు త్రివిధ దళాధిపతి, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సి.డి.ఎస్.) జనరల్ అనిల్ చౌహాన్ సింగపూర్‌లో ‘బ్లూమ్‌బర్గ్’ టీవీకి ఇంటర్వ్యూ ఇస్తూ, ‘ఆపరేషన్ సిందూర్’లో భారత వైమానిక దళం యుద్ధ విమానాలు కూలిన మాట నిజమేనని ఎట్టకేలకు అంగీకరించారు. దానితో ఒక్కసారిగా దేశవ్యాప్తంగా సుడిగాలిలా చర్చ చెలరేగింది.



‘ఆపరేషన్ సిందూర్’ విజయం వెనుక ఉన్న వ్యూహకర్తలు

రఫేల్ కూలిందనగానే కలకలం

యుద్ధాలు జరిగినపుడు రెండు వైపులా నష్టాలు ఏదో ఒక మేర వాటిల్లటం సహజం. అమెరికా వంటి అత్యంత శక్తిమంతమైన దేశం సైతం చిన్న చిన్న దేశాల చేతిలో నష్టపోయిన ఉదంతాలు అనేకం ఉన్నాయి. కానీ కేంద్ర ప్రభుత్వం మాత్రం మన యుద్ధ విమానాల నష్టాల వార్తలు ప్రపంచమంతటా వ్యాపించిపోయినా, అలాంటిదేమీ జరగలేదంటూనే వచ్చింది. పైగా, పహల్‌గామ్ దురంతం, ఆపరేషన్ సిందూర్‌ల దరిమిలా దేశంలో పెల్లుబికిన దేశభక్తి రాజకీయ ప్రయోజనంగా మారుతుండగా, దాన్ని అంతులేని విధంగా పొందేందుకు రకరకాల ప్రయత్నాలు జరిగాయి. యుద్ధ విమానాల నష్టాలను దాచిపెట్టటం వాటిలో ఒకటి.

మే 6–7 తేదీల మధ్య ‘ఆపరేషన్’ మొదలై పాకిస్తాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై భారత వైమానిక దాడులు విజయవంతంగా జరిగాయి. ఆ వెంటనే పాకిస్తాన్ సైన్యం తాము ఆ దాడి సమయంలో భారత్‌కు చెందిన 5 విమానాలను (మర్నాడు ఆరుకు పెంచారు) కూల్చివేశామని ప్రకటించింది. వాటిలో భారత్‌కు ఫ్రాన్స్ సరఫరా చేసిన రఫేల్ విమానాలు మూడు, రష్యా నుంచి వచ్చిన మిగ్‌లు రెండు, మరొకటి ఉన్నాయని పాకిస్తాన్ కనీస వివరాలు కూడా ఇచ్చింది. ఆ వార్త ప్రపంచం అంతటా సంచలనంగా మారింది. అందుకు కారణం మిగ్‌ల కన్నా ఎక్కువగా రఫేల్ విమానాలు కూలిపోవటం! రఫేల్ విమానాలకు ఉన్న పేరు, మనం వాటిని ఖరీదు చేసినప్పుడు వర్ణించిన వాటి శక్తి సామర్థ్యాల గురించి తెలిసిందే. అందువల్ల, మరీ ముఖ్యంగా పాక్ వైమానిక బలం సాధారణమైనదనే అభిప్రాయం మనలో ఉన్నందున, పాకిస్తాన్ ప్రకటన నమ్మశక్యం కానిదయింది. గమనించవలసిందేమంటే, ఆ ప్రకటనకు భారత సైన్యం అవునని గానీ, కాదని గానీ స్పందించకపోవటం.

‘వ్యూహాత్మక పొరపాటు’గా ఒప్పుకోలు

మరొకవైపు ప్రపంచ వార్తా సంస్థలు విచారణలు మొదలుపెట్టి భారత్ విమానాలు కూలిన మాట నిజమని ధ్రువీకరించాయి. మొదటైతే ఒక రఫేల్ విమానం కూలిన మాట వాస్తవమేనని స్వయంగా రఫేల్ ఉత్పత్తిదారైన ఫ్రెంచ్ దస్సాల్ట్ కంపెనీ తెలియజేసింది. ఆ వెంటనే అమెరికన్ ఇంటెలిజెన్స్ ధ్రువీకరించింది. ఇంతకూ రఫేల్‌ను కూల్చగలిగిన పాకిస్తాన్ యుద్ధ విమానాలు, క్షిపణులు ఏవి అనే విచారణను పాశ్చాత్య మీడియా సంస్థలు, నిఘా సంస్థలు జరిపినప్పుడు, అవి చైనా నుంచి పాకిస్తాన్ కొనుగోలు చేసిన జె–35 విమానాలని తేలింది. దానితో అందరూ ఉలిక్కిపడ్డారు. ఎందుకంటే చైనా స్వయంగా గత 40 ఏళ్లుగా ఎవరితోనూ వైమానిక యుద్ధాలు చేయలేదు. వారు ఆ విమానాలను విక్రయించిన మరే దేశమూ యుద్ధం చేయలేదు. కనుక వారి ఆయుధాల శక్తి ప్రపంచానికి డాక్యుమెంట్లలో చదవటం తప్ప ప్రత్యక్షంగా తెలియదు. ఆ శక్తి ఏమిటో ఇపుడు ప్రదర్శితం కావడంతో జె–35ను ఉత్పత్తి చేసిన చెంగ్‌దూ కంపెనీ స్టాక్స్ 48 గంటలలో 40 శాతం పెరగగా, దస్సాల్ట్ స్టాక్స్ 10 శాతానికి పైగా పడిపోయాయి. జె–35 కొనుగోలుకు వేర్వేరు దేశాల నుంచి ఆసక్తి వ్యక్తం అయింది. అయితే స్వయంగా ఆ కంపెనీ గానీ, చైనా గానీ ఎటువంటి వ్యాఖ్యలూ చేయలేదు. ‘ఆపరేషన్ సిందూర్’ మే 10న ఆగే నాటికి ఇదీ పరిస్థితి.

వైమానిక నష్టాల గురించి విదేశాలలో ఎన్నెన్ని కథనాలు వెలువడుతున్నా, ఆ నష్టాలు తాము చేసినట్లు పాకిస్తాన్ పదే పదే ప్రకటిస్తున్నా, భారత ప్రభుత్వం మౌనం వహించింది. మే 11న భారత త్రివిధ దళాధిపతులు మీడియా సమావేశం నిర్వహించారు. ఒక విలేఖరి ప్రశ్నకు సమాధానంగా ఎయిర్ ఆపరేషన్స్ డైరెక్టర్ జనరల్ అయిన ఎయిర్ మార్షల్ ఎ.కె. భారతి – ‘‘యుద్ధంలో నష్టాలు సర్వసాధారణం. యుద్ధం ఇంకా సాగుతున్నందున నేను ఆ వివరాల్లోకి వెళ్లబోను’’ అన్నారు. అదే ప్రశ్నను విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీకి వేయగా, ‘‘ఆ విషయాలు నాకు తెలియవు. కచ్చితమైన వివరాలను తగిన సమయంలో వెల్లడిస్తాము’’ అని జవాబిచ్చారు. ఆ మాటల అంతరార్థం తెలిసిపోతున్నా ప్రభుత్వం మాత్రం ఆ విషయం మాట్లాడేందుకు నిరాకరిస్తూనే పోయింది. ఆ 11వ తేదీ నుంచి 31 వరకు 20 రోజుల పాటు నష్టాల వివరాలు ప్రపంచానికంతా తెలిశాయి. సింగపూర్‌లో అయినా జనరల్ చౌహాన్, విమానాలు కూలాయన్నారు గాని ఎన్ని కూలాయో పేర్కొనలేదు. ఇక సైన్యాధికారులు 11న గాని, 31న గాని, మనం లక్ష్యాలను ఛేదించామా లేదా, దాడి సమయంలో జరిగిన వ్యూహాత్మక పొరపాటును గ్రహించి దిద్దుబాటు చేసుకున్నామా లేదా అనేవే ప్రధానమని అంటూ దాటవేయబూనారు. ప్రభుత్వ విధానం అది గనుక వారినేమీ అనలేము.

◆ యుద్ధాలు జరిగినపుడు రెండు వైపులా నష్టాలు వాటిల్లటం సహజం. అమెరికా లాంటి అత్యంత శక్తిమంతమైన దేశం సైతం చిన్న దేశాల చేతిలో నష్టపోయిన ఉదంతాలు ఉన్నాయి. కానీ భారత ప్రభుత్వం మాత్రం మన యుద్ధ విమానాలు కూలిన వార్తలు ప్రపంచమంతటా వ్యాపించినా, అలాంటిదేమీ జరగలేదన్నట్లుగానే ఉండిపోయింది. రాజకీయ ప్రయోజనాల కోసం దాచేందుకు ప్రయత్నించింది. అంతిమంగా చూడవలసింది... పైచేయి సాధించి లక్ష్యాలను ఆ మేరకు నెరవేర్చుకున్నామా లేదా అనేది మాత్రమే!

దేశభక్తిని ప్రేరేపించే ప్రయత్నాలు!

ఏ యుద్ధంలోనూ ఏ దేశం కూడా సమగ్రమైన వివరాలు వెల్లడించదు. అందులో రక్షణపరమైన అంశాలు కొన్ని ఇమిడి ఉంటాయి గనుక! కానీ, ప్రస్తుత సందర్భంలో పలు వివరాలు వెల్లడై సంచలనంగా మారుతున్నపుడు, మనం వాస్తవాలను అనవసరంగా దాచిపెడుతున్నామనే అభిప్రాయం ఏర్పడుతూ ప్రతిష్ఠకు భంగం వాటిల్లుతున్నప్పుడు, వాస్తవాలు ఏమిటని ప్రతిపక్షాలు పలుమార్లు ప్రశ్నిస్తున్నప్పుడు, పార్లమెంటరీ కమిటీలో ప్రస్తావించి ప్రత్యేక పార్లమెంట్ సమావేశం ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నప్పుడు ఇది సాధారణ పరిస్థితుల వంటిది కాబోదు. కేంద్ర ప్రభుత్వం ఈ వాస్తవాలను గుర్తించి అందుకు తగినట్లు వ్యవహరించటానికి బదులు, వాస్తవాలు ప్రజలకు తెలిస్తే వారిలో దేశభక్తి తగ్గుతుందనీ, అది తగ్గితే రాజకీయ ప్రయోజనాలకు నష్టం వాటిల్లుతుందనీ అన్నట్లుగా ఉండిపోయింది.

ఇది చాలదన్నట్లు సింధూ నదీ జలాల ఒప్పందం, పీఓకేలను మోదీ ప్రభుత్వం బలంగా ముందుకు తెచ్చింది. ఈ లక్ష్యాలు నెరవేరటం ఆచరణలో ఎంత సాధ్యమన్నది అలా ఉంచి, పనిలో పనిగా వాటి పేరిట కూడా దేశభక్తిని స్థాయి పెంచి రాజకీయంగా లబ్ధి పొందాలన్న యోచన మాత్రం ప్రస్తుత ప్రభుత్వంలో స్పష్టంగా కనిపిస్తున్నది. ఉగ్రవాదాన్ని, దాని ప్రోత్సాహకులను దెబ్బతీయాలనటం వరకు నిర్వివాదమైన విషయం. ఇటువంటి సందర్భాలలో ప్రజల దేశభక్తి అత్యంత సహజం. అదేవిధంగా యుద్ధాలు జరిగినపుడు ఏదో ఒక మేరకు రెండు వైపులా నష్టాలు అనివార్యం. అంతిమంగా చూడ వలసింది పైచేయి సాధించి లక్ష్యాలను ఆ మేరకు నెరవేర్చుకున్నామా లేదా అనేది మాత్రమే. ‘క్రికెట్ మ్యాచ్‌లో పోయిన వికెట్లు ముఖ్యం కాదు, తుది ఫలితం ముఖ్యం’ అంటూ ఆఖరికి జనరల్ చౌహాన్ వెల్లడించిందీ అదే! విషయాన్నంతా రాజకీయ స్వప్రయోజనాల కోసం వినియోగించదలుచుకొని, రకరకాల పద్ధతులలో వాస్త వాలను దాచేందుకు ప్రభుత్వం మితిమీరి వ్యవహరించటం సరి కాదు. ‘అతి సర్వత్ర వర్జయేత్’ అనే హితవు భారతీయ సంస్కృతిలో ఊరకనే రాలేదు.

వ్యాసకర్త సీనియర్ సంపాదకుడు

సోషల్ మీడియా

ముందే ఉండాలి



మీరు మీ కంపెనీని నేటి ‘ఏఐ’ మీద నిర్మిస్తే ఈ పోటీ పరుగులో మీరు ఓడిపోతారు. పోటీలో గెలిచి తీరాలంటే రేపటి ఏఐ పైన ఈ రోజే మీరు కంపెనీని నిర్మించటం ప్రారంభించాలి. ఇక పరుగెప్పుడు మొదలైనా మీరు సిద్ధంగా ఉంటారు.

– పెడ్రో డొమింగోస్, కంప్యూటర్ సైన్స్ ప్రొఫెసర్

రంగు పులమొద్దు!



పోలీసులు ముస్లింలకు వ్యతిరేకంగా వ్యవహరించటం లేదనీ, హిందువులను మాత్రమే లక్ష్యంగా చేసుకుంటున్నారనీ ఒక అపోహ ఉంది. అది నిజం కాదు. చట్టం దృష్టిలో అందరూ సమానమే. తప్పు చేసిన వారెవరైనా తమ మతం కారణంగా తప్పించుకోలేరు.

– జి. పరమేశ్వర, కర్ణాటక హోంమంత్రి

ఇండియన్ గ్రాండ్‌పా



అప్పటికే నిద్ర కళ్లతో ఉన్న పిల్లలు తెల్లటి గెడ్డం, తెల్లటి జుట్టు ఉన్న ఒక భారతీయుడిని చూసిన వెంటనే తమ తాతగారి ఖాతాలో వేసుకున్నారు. ఇండియాతో నాకు ఆత్మీయ అనుబంధం కూడా అటువంటిదే! అక్కడ నా కుటుంబ సభ్యులు ఉన్నారు. (భారత ప్రధాని మోదీని తమ పిల్లలు కళ్లు నులుముకుంటూ చూస్తూ ఆయన్ని గ్రాండ్‌పా అనటంపై అమెరికన్ పౌరులు అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ.)

– ఉషా వాన్స్, యూఎస్ సెకండ్ లేడీ

డేటా భాండాగారం



డేటా సేకరణ, డేటా వినియోగంలో ఇండియా ప్రత్యేక ఆధిపత్యాన్ని కలిగి ఉన్నందున డేటా భాండాగారంతో ఇండియా ప్రపంచాన్ని శాసించే రోజులు రానున్నాయి.

– క్లాడ్ స్మాడ్జా, వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ మాజీ ఎండీ

కంటికి రెప్పలు



మాకు వస్తున్న హెచ్చరికలు తీవ్రంగా, ఏమాత్రం ఊహించలేనివిగా ఉంటున్నాయి. ప్రచ్ఛన్న యుద్ధం తర్వాత కూడా పరిస్థితి ఇంతలా లేదు. మా సాయుధ దళాల పురుషులు, మహిళలు మమ్మల్ని సురక్షితంగా ఉంచటం కోసం నిరంతరం శ్రమిస్తున్నారు.

– జాన్ హీలే, బ్రిటన్ రక్షణ మంత్రి

ఇన్ బాక్స్

దీపధారి పత్రం

తెలంగాణ సాంస్కృతిక రంగ వైతాళికుడు, ప్రఖ్యాత సినీ దర్శకులు బి. నర్సింగరావు తెలంగాణ మలిదశ ఉద్యమంలోనూ, రాష్ట్ర ఆవిర్భావం తర్వాత కూడా తెలంగాణ కళా స్వప్నాన్ని సాకారం చేయడానికి నడుం బిగించిన కళామూర్తి. వారు ఎంతో శ్రమించి తెలంగాణ కోసం ఒక సమగ్రమైన సాంస్కృతిక పాలసీని రూపొందించటం పట్ల నేను ఎంతో సంతోషిస్తున్నాను.

బి. నర్సింగరావు తయారు చేసిన విధాన పత్రం తెలంగాణ సాంస్కృతిక జానపద కళారంగ వికాసానికి ఎంతో దోహదం చేస్తుంది. సమైక్య రాష్ట్రంలో సుమారు 50 సంవత్సరాల పాటు ఉనికిని కోల్పోయిన జానపద, నాటక, సంగీత కళారంగాలు తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడా గడిచిన పదేళ్లలో తగినంతగా పునరుజ్జీవనం వైపు పయనించలేదు. ఈ పరిస్థితుల్లో తెలంగాణ సాంస్కృతిక విధానం ఎట్లుండాలో చెబుతూ ఈ పత్రం రూపొందించారు. దృశ్య కళల, ప్రదర్శన కళలకు ఈ డాక్యుమెంట్ ఒక దీపధారిగా నిలుస్తుంది.

తెలంగాణ పరంగా ఒక ప్రత్యేకమైన అస్తిత్వం కలిగిన నాటక రంగం, జానపద చిత్రకళ, సంగీతం, వీటితోపాటు ప్రధాన స్రవంతిలో కనిపించే సినిమా రంగం మొదలైన వాటికి ఈ విధాన పత్రంలో చోటు దక్కింది. ఇవి యథాతథంగా అమలులోకి తేగలిగితే తెలంగాణ సాంస్కృతిక రంగ రూపురేఖలే మారిపోతాయి. సమున్నతమైన ఈ కల్చరల్ పాలసీని అమలు చేయడంతోపాటు అన్ని అకాడమీలను పునరుద్ధరించడం ఎంతో అవసరం. ఈ విధాన పత్రాన్ని తెలంగాణ ప్రభుత్వం అమలు చేయగలిగితే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీర్తి ప్రతిష్ఠలు మరింత పెరుగుతాయి.

– విజయ్ కుమార్ జీ । నాటక ప్రయోక్త

అధికారం ఉంటే... అన్నీ క్లోజ్!

అభిప్రాయం



ఎన్. వేణుగోపాల్

‘‘ఫలానా కేసులో ఆరోపణలు వాస్తవం కాదని దర్యాప్తులో తేలింది, కనుక కేసు మూసివేయడానికి గౌరవ న్యాయమూర్తుల వారు అనుమతించ విజ్ఞప్తి’’ అని ప్రతి రోజూ దేశంలో ఎక్కడో ఒక న్యాయస్థానంలో ప్రాసిక్యూషన్ (పోలీసులు) క్లోజర్ రిపోర్టులు ఇస్తూనే ఉంటారు. న్యాయ మూర్తులు ఆ కేసులోని కక్షిదారులను పిలిచి, విచారించి గానీ; పిలవకుండానే, విచారించకుండానే గానీ ప్రాసిక్యూషన్ అభ్యర్థనను అంగీకరిస్తుంటారు. చట్టబద్ధంగానే, పాత భారత శిక్షా స్మృతి సెక్షన్ 173 (కొత్త భారతీయ నాగరిక్ సురక్షా సంహిత సెక్షన్ 189) ప్రకారం ఈ క్లోజర్ రిపోర్ట్ ప్రక్రియ సాగుతుంది. ఆ ప్రత్యేకమైన కేసును పోలీసులు నడపదలచుకోలేదని, విచారణ జరిగి, నిందితుల నేరం రుజువై, శిక్షలు పడేదాకా, అంటే తార్కిక ముగింపు దాకా తీసుకుపోదలచుకోలేదని, తొలి అడుగులోనే దాన్ని మూసివేయదలచుకున్నారని మాత్రమే ఈ ప్రక్రియ తెలియ జేస్తుంది గాని, దాని అర్థం నేరం జరగలేదనో, నిందితులు నిర్దోషులనో కాదు.

వందలాదో, వేలాదో అటువంటి క్లోజర్ రిపోర్టులు, అనుమతులు ఎక్కడా చర్చ లేకుండానే ముగిసిపోతుంటాయి. కానీ పోలీసులు 2023 జూన్‌లో దాఖలు చేసిన అటువంటి ఒక క్లోజర్ రిపోర్టు గురించి ఆలోచించవలసి ఉంది. ఢిల్లీలో పాటి యాలా హౌస్ న్యాయస్థానంలో అదనపు సెషన్స్ జడ్జి గోమతి మనోచా గత మంగళవారం ఆ క్లోజర్ రిపోర్టును ఆమోదించారు. అంటే నిందితుడి మీద కేసు పోయింది.

ఆ నిందితుడి పేరు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్. ప్రస్తుతం బీజేపీ తరఫున లోక్‌సభ సభ్యుడు. 1974 నుంచి 2007 మధ్య 38 క్రిమినల్ కేసులలో నిందితుడు అయి కూడా బీజేపీ తరఫున ఐదుసార్లు, సమాజ్ వాదీ పార్టీ తరఫున ఒకసారి లోక్‌సభ సభ్యుడు అయ్యాడంటే బ్రిజ్ భూషణ్ ఎంత శక్తిమంతుడో ఊహించవచ్చు.

అధికార రాజకీయ పార్టీ నాయకుడుగా ఆయన 2012 నుంచి 2023 వరకూ భారత మల్లయుద్ధ సమాఖ్య అధ్యక్షుడిగా కూడా ఉన్నాడు. ‘‘మల్ల యోధులంటే దృఢంగా ఉండేవాళ్లు కదా, వాళ్లను అదుపులో ఉంచడానికి వాళ్లకంటే దృఢమైన నన్ను నియమించారు’’ అన్నాడు. మహిళా మల్ల యోధుల ఆందోళన తర్వాత 2023లో పదవి కోల్పోయినప్ప టికీ, పదవిలో ఉన్న పదకొండేళ్లలో మహిళా క్రీడాకారులతో అనుచితంగా, అసభ్యంగా ప్రవర్తించిన ఫిర్యాదులు, లైంగిక వేధింపులకు గురిచేసిన ఫిర్యాదులు ఎన్నో వచ్చాయి. దేశానికి అనేక పతకాలు సంపాదించిపెట్టిన మల్లయోధులు వినేశ్ ఫోగట్, సాక్షీ మాలిక్, అంశు మాలిక్, బజరంగ్ పునియా తదితరులు తమ మీద బ్రిజ్ భూషణ్ లైంగిక వేధింపుల గురించి 2023 జనవరిలో మరొకసారి ప్రపంచం దృష్టికి తెచ్చారు. అనేక రకాల లైంగిక వేధింపుల



◆ నిందితులు ఎంత శక్తిమంతులైతే క్లోజర్ రిపోర్టుకు అంత అవకాశం ఉంటుంది. ఎటువంటి సాక్ష్యాధారాలూ లేకుండా ఎందరో నిందితులు ఏళ్ల తరబడి జైళ్లలో మగ్గిపోతుంటే, అధికార ప్రాబల్యం ఉన్నవారేమో కేసుల నుంచి ఇలా తప్పించుకుంటున్నారు.

ఘటనలు కనీసం 15 ఉన్నాయని ఈ నిరసన ప్రదర్శనల సందర్భంగా బయటపడింది.

ప్రభుత్వం ఆయన మీద కనీసం విచారణ జరపకుండా, కేసు కూడా పెట్టకుండా, పదవి నుంచి తొలగించకుండా ఉన్న సమయంలో మల్లయోధులు, క్రీడాకారులు ఢిల్లీలో జంతర్ మంతర్‌లో నిరసన ప్రదర్శనలు ప్రారంభించారు. సుప్రీం కోర్టు కూడా జోక్యం చేసుకున్నాక ఢిల్లీ పోలీసులు రెండు కేసులు పెట్టారు. ఒకటి – ఆసియన్ ఛాంపియన్‌షిప్ అండర్ 17 పోటీలో పాల్గొంటున్న ఒక మైనర్ బాలికపై బ్రిజ్ భూషణ్ జరిపిన లైంగిక వేధింపులకు సంబంధించిన కేసు. అది ‘పోక్సో’ అనే కఠినమైన చట్టం కింద నమోదైంది. రెండవది – ఆరుగురు సీనియర్ మల్లయోధ మహిళల మీద లైంగిక వేధింపులకు సంబంధించినది.

వీటిలో మైనర్ బాలిక తరఫున తండ్రి చేసిన ఫిర్యాదును వెనక్కి తీసుకుంటూ జూన్ 7న కోర్టు ముందు ఒక అఫిడవిట్ సమర్పించగా, పోలీసులు వెంటనే జూన్ 15న కేసు క్లోజర్ రిపోర్టు న్యాయస్థానానికి సమర్పించారు. అంటే కేసు నమోదు చేయడానికి నెలలు తీసుకున్నారు గాని, కేసు మూసివేయడానికి మాత్రం ఆగమేఘాల మీద కదిలారు. ఫిర్యాదీనే స్వయంగా ఫిర్యాదు ఉపసంహరించుకున్నాడు గనుక, ఫిర్యాదును సమర్థించే అనుబంధ సాక్ష్యాధారాలు దొరకలేదు గనుక, ఈ కేసును మూసివేయడానికి అనుమతించమని క్లోజర్ రిపోర్టు కోరింది.

అధికారమూ, డబ్బూ ఉన్నవారు నిందితులుగా ఉన్న కేసుల క్లోజర్ రిపోర్టులలో చాలా మతలబులు ఉంటాయి. ఫిర్యాదీలను బెదిరించడం, ప్రలోభాలు చూపడం, కేసు నడిపితే ఏమి వస్తుంది అని నిరుత్సాహపరచడం, సాక్షులను బెదిరించడం లాంటివి చేసి దర్యాప్తు సమయంలోనే సాక్ష్యాధారాలు దొరకలేదని క్లోజర్ రిపోర్టు తయారు చేయడానికి ప్రయత్నిస్తారు. నిందితులు ఎంత శక్తిమంతులైతే క్లోజర్ రిపోర్టుకు అంత అవకాశం ఉంటుంది. దేశంలో ఎటువంటి నేరం లేకుండా, సాక్ష్యాధారాలు లేకుండా ఎన్నో కేసుల్లో ఎందరో నిందితులు ఏళ్ల తరబడి జైళ్లలో మగ్గిపోతుంటే, సంపన్నులు, శక్తిమంతులు, అధికార ప్రాబల్యం ఉన్నవారు కేసుల నుంచి ఇలా తప్పించు కుంటున్నారు.

అందుకే ఈ కేసు క్లోజర్ రిపోర్టును న్యాయస్థానం ఆమోదించిందనే వార్త వెలువడగానే మరొక కేసులో ఫిర్యాదీ అయిన వినేశ్ ఫోగట్ ట్విట్టర్ (ఎక్స్) మీద ఒక ఆలోచనా స్ఫోరకమైన కవిత రాసింది:

‘సైనిక పటాలమూ నీదే, సర్దారూ నీవాడే
అబద్ధాన్ని నిజమని రాయించగలవు నువ్వు,
పత్రికలూ నీవే కదా!
మేం దాని మీద ఫిర్యాదు చేయాలంటే
ఎక్కడ చేయగలం?
సర్కారూ నీదే, పాలకుడూ నీ వాడే!!’

వ్యాసకర్త ‘వీక్షణం’ ఎడిటర్

తిరిగి రా, స్వామీ!

‘లోక హితం కోసం నేను శ్రీరాముడిగా మానవ అవతారంలో జన్మిస్తాను. లోక కంటకుడయిన రావణాసురుడిని వధిస్తాను. ఆ తరవాత పదకొండు వేల సంవత్సరాలు భూలోకంలోనే ఉండి రాజ్యం చేస్తాను’ అని శ్రీహరి బ్రహ్మాది దేవతలకు వాగ్దానం చేయటం రామాయణం బాలకాండ ఆరంభంలో కనిపిస్తుంది. అలా మానవ



జ్యోతిర్మయం

రూపంలో జన్మనెత్తిన తరువాత, శ్రీరాముడు ‘నేను భగవదవతారాన్ని!’ అని ఎక్కడా చెప్పలేదు. తనను తాను మానవమాత్రుడిగానే భావించుకొని, ధర్మమూర్తిలా జీవించాడు.

దేవతల కిచ్చిన వాగ్దానం ప్రకారం లంకేశ్వరుడిని వధించాడు. పదకొండు వేల సంవత్సరాలు ధర్మబద్ధంగా రామరాజ్యాన్ని సాగించాడు. ఆయన భూలోకంలో ఉన్నంత కాలం భూమి మీది ప్రజలు చల్లగా, సుఖంగా ఉన్నారు. కానీ హరి తమకు దూరమవడంతో, దేవతలకు మాత్రం ఆ కాలమంతా క్షణమొక యుగంగా గడిచింది.

అనుకొన్న పదకొండు వేల సంవత్సరాల అవధి పూర్తి కాగానే, బ్రహ్మదేవుడు కాలపురుషుడిని తన దూతగా శ్రీరాముడి దగ్గరకు పంపాడు. ఆయన సందేశం ఇది: ‘దేవా! నువ్వు వైకుంఠానికి తిరిగి రావలసిన సమయం వచ్చిందని సవినయంగా గుర్తు చేస్తున్నాను. అయినా మరికొంత కాలం భూలోకంలో ఉండాలని నీకు అనిపిస్తే అలాగే చేయి. లేక ముందు అనుకొన్న ప్రకారం తిరిగి వస్తావా, దేవతలందరూ నీ రాకతో మరింత నిశ్చింతగా జీవించ గలుగుతారు. నిర్ణయం నీది!’

మానవావతారంలో ఉన్న మాధవుడు ‘నేను ఇన్నాళ్ళుగా ఇక్కడ ఉన్నది త్రిలోక క్షేమ కారణమయిన పని మీద! అది పూర్తయింది. కాబట్టి నా వశవర్తులుగా నడుచుకొనే దేవతా గణానికి, ఎప్పటిలాగే అన్ని విషయాలలోనూ అండగా ఉండటం నా కర్తవ్యం. త్వరలోనే నేను తిరిగి వస్తున్నాను’ అని సమాధానం పంపాడు. తరవాత కొద్ది కాలానికే రామావతారం చాలించి, పరంధామానికి తిరిగి వెళ్ళాడు. రామావతార సమాప్తి గురించిన ఆసక్తికరమైన వృత్తాంతం రామాయణం ఉత్తర కాండలో కనిపిస్తుంది.

–ఎం. మారుతి శాస్త్రి

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, **తిథి:** శు.ఏకాదశి తె.4.54 వరకు (తెల్లవారితే శనివారం), తదుపరి ద్వాదశి, **నక్షత్రం:** హస్త ఉ.7.41 వరకు, తదుపరి చిత్త, **వర్జ్యం:** సా.4.30 నుండి 6.16 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.07 నుండి 8.59 వరకు, తదుపరి ప.12.26 నుండి 1.18 వరకు, **అమృత ఘడియలు:** రా.3.03 నుండి 4.51 వరకు, స్మార్త ఏకాదశి; **రాహుకాలం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **యమగండం:** ప.3.00 నుండి 4.30 వరకు, **సూర్యోదయం:** 5.28, **సూర్యాస్తమయం:** 6.28.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 425 9899



నేడు యాదాద్రి జిల్లాకు సీఎం రేవంత్‌రెడ్డి

- ఆలేరు నియోజకవర్గంలో రూ.1,500 కోట్ల పనులకు శంకుస్థాపన

సాక్షి, యాదాద్రి: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లాలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఆలేరు నియోజకవర్గం తుర్కపల్లి మండలం తిర్మలాపురం గ్రామంలో జరిగే సీఎం సభకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. నియోజకవర్గంలో ముఖ్యమంత్రి సుమారు రూ.1,500 కోట్ల విలువ చేసే వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. అలాగే ఆలేరు, జనగామ, తుంగతుర్తి నియోజకవర్గాలకు సాగునీరందించే గంధమల్ల రిజర్వాయర్ పనులకు సీఎం శంకుస్థాపన చేస్తారు. యాదగిరిగుట్టలో నిర్మించే యాదాద్రి మెడికల్ కళాశాల, వేద పాఠశాల, తుర్కపల్లి మండలం రాంపూర్ తండా వద్ద నిర్మించే యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాల, మోటకొండూరు మండలం కేంద్రంలో ప్రభుత్వ భవనాల నిర్మాణానికి, పలు గ్రామాల్లో రోడ్లు, వాగులపై వంతెనల నిర్మాణానికి సీఎం శంకుస్థాపన చేస్తారు. కాగా, అన్ని అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాలను ఆయన తిర్మలాపూర్ వద్దనే ఆవిష్కరించనున్నారు. అనంతం అక్కడే బహిరంగ సభలో సీఎం ప్రసంగిస్తారు. యాదగిరిగుట్ట ఆలయ అభివృద్ధి పనులకు, గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో మౌలిక సదుపాయాలకు సీఎం నిధులు ప్రకటించే అవకాశం ఉందని ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య చెప్పారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్లు, రేషన్‌కార్డులు, మహిళా సంఘాలకు బ్యాంకు రుణాల వంటి పథకాల ప్రొసీడింగ్స్‌ను లబ్ధిదారులకు అందజేస్తారు. ముఖ్యమంత్రితో పాటు మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ఈ కార్యక్రమంలో పాల్గొంటారు.

మావోయిస్టు సుధాకర్ ఎన్‌కౌంటర్

మరో పెద్ద నేతను కోల్పోయిన మావోయిస్టు పార్టీ

సాక్షి ప్రతినిధి, ఏలూరు/ చర్ల: మావోయిస్టులకు మరో భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో ఉన్న ఇంద్రావతి నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో గురువారం ఉదయం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు, విప్లవ రాజకీయ పాఠశాల ఇన్‌చార్జ్ తెంటు లక్ష్మీ నరసింహాచలం (67) మరణించాడు. ఆయనకు గౌతమ్ అలియాస్ సుధాకర్ అలియాస్ ఆనంద్ అలియాస్ చంటి అలియాస్ రామరాజు అలియాస్ బాలకృష్ణ అలియాస్ అరవింద్ అనే పేర్లు కూడా ఉన్నాయి. సుధాకర్ పేరుతో పార్టీలో ఆయన సుప్రసిద్ధుడు. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్‌లో మరణించి నెల తిరక్క ముందే మరో కీలక నేతను కోల్పోవటంతో ఆ పార్టీకి కోలుకోలేని దెబ్బ తగిలినట్టయ్యింది.


సుధాకర్ మృతదేహం


శాంతి చర్చల సమయంలో ఆర్కేతో సుధాకర్ (ఫైల్)

కీలక నేతలున్నారన్న సమాచారంతో..: ఇంద్రావతి అటవీ ప్రాంతంలో సుధాకర్‌తోపాటు పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు బండి ప్రకాష్, దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు పాపారావు, మరికొంతమంది కీలక నేతలు ఉన్నారన్న సమాచారంతో ఎస్టీఎఫ్, డీఆర్‌జీ, కోబ్రా విభాగాల ప్రత్యేక పోలీసు బలగాలు బుధవారం సాయంత్రం నుంచి పెద్ద ఎత్తున కూంబింగ్ చేపట్టాయి. గురువారం ఉదయం మావోయిస్టులు తారసపడటంతో ఎదురు కాల్పులు చోటుచేసుకున్నాయని, అనంతరం ఆ ప్రాంతంలో గాలించగా సుధాకర్ మృతదేహం లభించిందని బస్తర్ రేంజ్ ఐజీ సుందర్ రాజ్ తెలిపారు. ఘటనా ప్రాంతం నుంచి ఏకే 47 తుపాకీ, మందుగుండు సామగ్రి, విప్లవ సాహిత్యం, ఇతర వస్తువులు బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. సుధాకర్‌పై రూ.40 లక్షల రివార్డు ఉంది.


ఏపీలోని సత్యవోలులో సుధాకర్ ఇల్లు

శాంతి చర్చల్లో పాల్గొన్న సుధాకర్

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2004లో నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో నక్సలైట్లతో జరిగిన శాంతి చర్చల్లో సుధాకర్ పాల్గొన్నాడు. ఆయన స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు జిల్లా పెదపాడు మండలం సత్యవోలు. సుధాకర్ తండ్రి రామకృష్ణుడు, తల్లి సరస్వతి. వీరికి సుధాకర్ 6వ సంతానం. సత్యవోలులో సుధాకర్ సోదరుడు తెంటు ఆనందరావు నివసిస్తున్నారు. సుధాకర్ మృతితో స్వగ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. ఆయన చింతలపూడి మండలం ప్రగడవరంలో 10వ తరగతి, ఏలూరు సీఆర్ రెడ్డి కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేశారు. విజయవాడలోని ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాలలో 1972లో చదువుతున్నప్పుడే మావోయిస్టు సిద్ధాంతాలకు ఆకర్షితుడై అడవి బాట పట్టారు. చివరిసారిగా 1983లో తన తండ్రి అనారోగ్యానికి గురైతే చూడ్డానికి వచ్చినపుడు సుధాకర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. జైలు నుంచి విడుదలై మళ్లీ అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఆయన ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శిగా పని చేస్తున్న సమయంలో 2013లో కేంద్ర కమిటీలో స్థానం దక్కింది. అనంతరం పార్టీ పబ్లికేషన్ విభాగానికి నాయకత్వం వహించాడు. సుధాకర్ 43 ఏళ్ల పాటు మావోయిస్టు పార్టీలో పనిచేశారు. 2024–25 సంవత్సరంలో ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్లలో మొత్తం 403 మంది మావోయిస్టులు మృతి చెందారని సుందర్ రాజ్ వెల్లడించారు.

ఎల్లాపూర్ రైతు భూసమస్యపై విచారణ

- ఇరు కుటుంబాలతో మాట్లాడిన అదనపు కలెక్టర్


వివరాలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్

ఖానాపూర్: నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం పాత ఎల్లాపూర్ గ్రామంలో బుధవారం భూభారతి రెవెన్యూ సదస్సులో రైతు ఆందోళనపై జిల్లా అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్ గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో విచారణ చేపట్టారు. వృద్ధ రైతు అల్లెపు వెంకటితో పాటు వివాదానికి సంబంధించిన ఇద్దరినీ పిలిపించి భూసమస్య పూర్వాపరాలు తెలుసుకున్నారు. అంతకుముందు ఘటనపై బుధవారం రాత్రి నిర్మల్ ఆర్డీవో రత్నకల్యాణి పాత ఎల్లాపూర్‌లోని రైతు కుటుంబం వద్దకు వెళ్లి సమస్యకు గల కారణాలు తెలుసుకోవడంతోపాటు భూమి దస్త్రాల జిరాక్స్ ప్రతులను అదనపు కలెక్టర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ఆర్డీవోతోపాటు తహసీల్దార్ సుజాత సమక్షంలో భూసమస్య ఉన్న ఇద్దరితో మాట్లాడినట్లు తెలిపారు. త్వరలో సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని వెల్లడించారు. విచారణ వివరాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు.

వేములవాడ గోశాలకు అదనంగా 50 ఎకరాలు

- మర్రిపల్లిలో భూమిని గుర్తించిన సిరిసిల్ల కలెక్టర్
- అదనపు సదుపాయాలతో ఆధునిక ఏర్పాట్లు
- కోడెల ఆరోగ్యంపై స్వయంగా గోశాలలో రోజూ కలెక్టర్ తనిఖీలు


గోశాలలో కోడెల ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: తిప్పాపూర్ గోశాలలో కోడెల మరణఘోషను ఆపేందుకు ఎట్టకేలకు ప్రభుత్వం నడుం బిగించింది. సీఎం ఆదేశాలతో కోడెల కోసం అదనపు గోశాలను నిర్మించేందుకు ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపడుతోంది. వేములవాడ పట్టణానికి సమీపంలో మర్రిపల్లి గ్రామంలో ప్రస్తుతం 30 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించింది. ఈ భూములను గురువారం కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా స్వయంగా పరిశీలించారు. అయితే, సీఎం రేవంత్ మొత్తం 50 ఎకరాల్లో గోశాలను నిర్మించాలని సూచించిన నేపథ్యంలో 30 ఎకరాలకు పక్కనే ఉన్న మరో 20 ఎకరాల భూమిని కూడా సేకరించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. అక్కడ అదనపు సదుపాయాలతో కోడెలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు చేయనున్నారు. భక్తులు రాజన్నకు సమర్పించిన కోడెలు, దూడల మృత్యుఘోషతో అప్రమత్తమైన సర్కారు వాటి బాగోగులు చూడాలని, కోడెల మరణాలు వెంటనే తగ్గించాలని ఆదేశించడంతో కలెక్టర్ రంగంలోకి దిగి ప్రతీరోజూ తిప్పాపూర్‌లోని గోశాలను సందర్శిస్తున్నారు. ఈ సందర్భంగా వెటర్నరీ అధికారులు పలు విషయాలను కలెక్టర్‌కు నివేదిక రూపంలో ఇచ్చారు.

నివేదికలో ఏముందంటే..?

రాజన్న ఆలయానికి భక్తులు కానుకగా ఇచ్చే కోడెలలో ఆరోగ్యం, ఎదుగుదల లోపిస్తున్నాయి. కోడెల్లో మరీ పాలు కూడా మరవని 6 నెలలలోపు చిన్న దూడలు, రేపోమాపో చనిపోయే ముసలి కోడెలు ఉంటున్నాయి. ప్రస్తుత గోశాలలో 300 కోడెలు మాత్రమే ఉండగలవు. కానీ, 1,300 వరకు కోడెలు ఇరుకుగా బతుకుతున్నాయి. ఆహారం కొరతతో తొక్కిసలాట జరగడం, మదమెక్కిన కోడెలు చిన్న దూడలు, ముసలి కోడెలపై దాడి చేస్తున్నాయి. దీంతో అవి గాయాలతో మరణిస్తున్నాయి.

ఆలయ ఈవో, సిబ్బందిపై ఏసీబీ నివేదిక..

ఓ వైపు కోడెల వరుస మరణాలతో అప్రతిష్ట మూటగట్టుకుంటున్న ఆలయ సిబ్బందిపై మరో పిడుగుపడింది. అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) ఆలయంలో పలు విభాగాల్లో అక్రమాలు జరుగుతున్నాయని నిగ్గు తేల్చడం చర్చనీయాంశంగా మారింది. లడ్డూ ప్రసాదంతో సహా.. ఆలయంలో జరుగుతున్న పలు అక్రమాలలో ఆలయ ఈవో సహా మరో ఆరుగురి పాత్ర ఉందని నిర్ధారించిన ఏసీబీ వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సిఫారసు చేసినట్లు సమాచారం. ఈవో వినోద్‌రెడ్డి, రికార్డ్ అసిస్టెంట్ ఎస్.సునీల్, టి.అజయ్, లడ్డూ కౌంటర్ ఇన్‌చార్జి బి.లక్ష్మారెడ్డి, సూపరింటెండెంట్ గుండి నరసింహామూర్తి, వారి నర్సయ్య జూనియర్ అసిస్టెంట్ ఏలేటి నరేందర్‌లపై చర్యలు తీసుకోవాలని ఏసీబీ సిఫారసు చేసింది. దీంతో డిపార్ట్‌మెంట్ ఎంక్వైరీ నిర్వహించి, తగిన చర్యలు తీసుకోవాలని దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ దేవాదాయ శాఖ డైరెక్టర్‌ను ఆదేశించారు.

మత విద్వేషాలపై దేశవ్యాప్తంగా శాంతియాత్రలు

- సీపీఎం కేంద్ర కమిటీ సమావేశాల్లో నిర్ణయం
- హాజరైన తెలంగాణ, ఏపీ కార్యదర్శులు


ఎంఏ బేబీ

సాక్షి, న్యూఢిల్లీ: మత విద్వేషాలకు వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా శాంతి ర్యాలీలు నిర్వహించాలని సీపీఎం నిర్ణయించింది. తమిళనాడులోని మదురైలో మహాసభల అనంతరం.. తొలిసారి ఢిల్లీలోని ఆ పార్టీ ప్రధాన కార్యాలయం సుర్జీత్‌సింగ్ భవన్‌లో.. సీపీఎం కేంద్ర కమిటీ సమావేశమైంది. సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ అధ్యక్షతన మూడు రోజులుగా నిర్వహిస్తున్న కేంద్ర కమిటీ సమావేశాలు గురువారం ముగిశాయి. సీపీఎం ఏపీ కార్యదర్శి శ్రీనివాసరావు, తెలంగాణ కార్యదర్శి జాన్ వెస్లీ సహా.. కేంద్రకమిటీ సభ్యులు ఈ సమావేశాలకు హాజరయ్యారు. ఈ నెల 10వ తేదీ నుంచి 20 వరకు 10 రోజుల పాటు.. మత విద్వేషాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా శాంతి యాత్రలు చేపట్టాలని, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై కూడా క్షేత్రస్థాయి ఆందోళనలు ఉధృతం చేయాలని సీపీఎం నిర్ణయించింది. సమావేశంలో సీపీఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ మాట్లాడుతూ.. గద్వాల జిల్లా ధన్వాడలో రైతుల అరెస్టును ఖండించారు. వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ధన్వాడలో ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటుతో కాలుష్యం పెరుగుతుందనే రైతులు భూములు ఇచ్చేందుకు నిరాకరిస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. 60 మంది రైతులపై కేసులు నమోదు చేసి.. 12 మందిని రిమాండ్‌కు పంపించడాన్ని తమ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని చెప్పారు. నిర్మల్ జిల్లాలో రైతుపై పోలీసు అధికారి దాడి చేయడం అవమానకరమని మండిపడ్డారు. ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేసి నక్సలైట్లతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. ఏపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌లో పని గంటలను 8 గంటల నుంచి 12 గంటలకు పెంచుతూ రాష్ట్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాన్ని ఖండించారు. ముస్లింలు వెళ్లిపోవాలనే విధంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కూడా మాట్లాడుతున్నారని, ఏపీలో మత విద్వేషాలు రెచ్చగొట్టాలని చూస్తున్నారని ఆరోపించారు.

డీఈఈ సెట్‌లో అభినవ్ స్టేట్ ఫస్ట్



చేర్యాల(సిద్దిపేట): డీఈఈ సెట్–2025 ఫలితాల్లో సిద్దిపేట జిల్లా చేర్యాలకు చెందిన పసునూరి అభినవ్‌రెడ్డి ఇంగ్లిష్ మీడియంలో స్టేట్‌ఫస్ట్ ర్యాంకు సాధించాడు. మండల పరిధిలోని వేచరేణికి చెందిన కరెడ్ల మమత కుమారుడు పసునూరి అభినవ్‌రెడ్డి.. ఇటీవల జరిగిన డీఈఈ సెట్‌లో.. 100 మార్కులకు 87 మార్కులతో మొదటి ర్యాంకు పొందాడు. ముస్త్యాల మోడల్ స్కూల్‌లో పదో తరగతి చదివిన అభినవ్ 10 జీపీఏ, ఇంటర్‌లో 1000 మార్కులకు 967 మార్కులు తెచ్చుకున్నాడు.

2026లో కులగణనను పూర్తి చేయాలి


- కేంద్రానికి జాజుల డిమాండ్


మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్ గౌడ్. చిత్రంలో చిరంజీవులు

హిమాయత్‌నగర్ (హైదరాబాద్): దేశవ్యాప్తంగా జనగణనతో పాటే కులగణన చేస్తామని ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం.. 2027లో ప్రక్రియ మొదలు పెడతామని చెప్పడాన్ని బీసీలు ఒప్పుకోరని, దీనిని వెంటనే ఉపసంహరించుకోవాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం చైర్మన్ టి.చిరంజీవులు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఈ విషయంలో పునరాలోచన చేసి ఈ ఏడాదే బీసీ కుటుంబాలను గుర్తించి 2026లో కులగణనను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. గురువారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో బీసీ కుల సంఘాల జేఏసీ కన్వీనర్ బాలగోని బాలరాజు గౌడ్ అధ్యక్షతన జరిగిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. 2027లో కులగణన చేస్తే ఇప్పుడే కేంద్రం ఎందుకు ప్రకటించిందని ప్రశ్నించారు. 2025లోనే విధి విధానాలను రూపొందించి కులగణన ప్రక్రియను ప్రారంభించాలని వారు డిమాండ్ చేశారు. కులగణనపై కేంద్రం అనుసరించాల్సిన విధివిధానాలు, ప్రశ్నావళి, కులాల సామాజిక స్థితిగతులపై పూర్తిగా అధ్యయనం చేసి కేంద్ర ప్రభుత్వానికి బీసీ సమాజం తరఫున ఒక నివేదిక ఇవ్వడానికి జూన్ రెండో వారంలో హైదరాబాద్‌లో బీసీ మేధావులతో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. జూలై మొదటి వారంలో ఢిల్లీలో కులగణనపై అఖిలపక్ష, రాజకీయ పార్టీల, ఓబీసీ సంఘాలతో సమావేశం ఏర్పాటు చేస్తామని వారు తెలిపారు.

కుక్కల దాడి

- 15 మందికి గాయాలు


గాయపడ్డ చిన్నారి

కరీంనగర్ రూరల్: కరీంనగర్ శివారులోని గుంటూరుపల్లిలో గురువారం రాత్రి పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. దొరికిన వారిని దొరికినట్లు కరవడంతో గ్రామంలో 15 మందికి తీవ్ర గాయాలయ్యాయి. పిచ్చికుక్క దాడిలో గాయపడిన వారిలో తాటి ప్రమీల, పాశం సతీశ్, గాదె రిషీ, మహమ్మద్ అక్రమ్ తదితరులు ఉన్నారు. గాయపడ్డ వారిలో పిల్లలు, మహిళలు కూడా ఉన్నారు. పిచ్చికుక్క.. పెంపుడు జంతువులు, పాడి పశువులనూ కరిచిందని గ్రామస్తులు తెలిపారు. కుక్కల బెడదపై ఎన్నిసార్లు ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా ఫలితం లేదని స్థానికులు అబ్దుల్ రహీం, మహమ్మద్ సమీర్, వైజయంతి తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు.

తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర నీటి సరఫరా & మురుగునీటి పారుదల మండలి
చీఫ్ జనరల్ మేనేజర్ (Engg) కార్యాలయం, ట్రాన్స్‌మిషన్ సర్కిల్, ఖైరతాబాద్, హైదరాబాద్-500004, తెలంగాణ.
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

ఇ-టెండరు నం. & తేదీ	పని పేరు	ఖర్చు (సుమారు)	బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేదీ
EP No. 38 / CGM(E) / TC / T3 / TD No.IV / 2025-26, Dtd: 05.06 2025.	i) TD-IV, కంట్రోల్ రూమ్ పరిధిలో ముర్మూర్ మరియు బొమ్మకల్ వద్ద 6.6KV/3MW రా పంపింగ్ స్టేషన్ 220/6.6KV సబ్ స్టేషన్ కొరకు వివిధ మ్యాండేటరీ E&M మేజర్ స్పేర్స్ కాంపోనెంట్స్ యొక్క సరఫరా మరియు డెలివరీ.	రూ. 188.52 లక్షలు	06-06-2025న మ.1.00 గం.కు

టెండరుదారులు సమాచారమును ప్రధానంగా ZIP ఫార్మాట్‌లో మాత్రమే అప్‌లోడ్ చేయాల్సిందిగా కోరబడుచున్నారు. తదుపరి వివరాలను www.eprocurement.gov.inలో చూడవచ్చు.
సం/- చీఫ్ జనరల్ మేనేజర్ (Engg), ట్రాన్స్‌మిషన్ సర్కిల్, ఖైరతాబాద్, హైదరాబాద్-04, తెలంగాణ.

జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ, సిద్దిపేట
ఆర్.సి.నెం.: A7/154/2025 టెండర్ ప్రకటన తేది:05.06.2025
జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ, సిద్దిపేట గారి ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లా యందు ఉన్న 32 వసతి గృహాల విద్యార్థులు/ విద్యార్థినులకు 2025–26 విద్యా సంవత్సరానికి క్రిందివాటికి టెండర్లు కోరడమైనది:

Sl. No.	Particulars of Tender	Cost of Tender Form (Rs.)	Cost of tender form and EMD to be remitted in shape of DD drawn in favour of
1	Food provisions/kirana items in Siddipet Cluster	2500	District SC Development officer, Siddipet
2	Catering services in each of the College Hostel	2500	
3	Sanitation services in each of the College Hostel	2500	
4	Security services in each of the College Hostel	2500	
5	Hostels Materials	2500	

గమనిక: జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి, సిద్దిపేట జిల్లా పేరున SBI, సిద్దిపేట శాఖ నందు చెల్లుబాటు అయ్యే విధంగా డి.డి. చెల్లించి ఫారమును కార్యాలయ పనివేళల్లో తేది: 06.06.2025 నుండి 12.06.2025 సా.5.00 గం.వరకు పొందవచ్చును. టెండర్ బాక్స్‌ను జిల్లా కార్యాలయంలో 12.06.2025 మ.3.00 గం.లోపు టెండర్ బాక్స్‌లో వేయవలెను. తేది:16.06.2025 ఉ.11.00 గంటలకు. అదనపు కలెక్టర్/చైర్మన్ సమక్షంలో టెండర్ బాక్స్ తెరవబడును. టెండర్ తేది మార్పుటకు లేదా రద్దు చేయుటకు అదనపు కలెక్టర్ గారికి పూర్తి అధికారం కలదు. తదుపరి వివరాలకై సంప్రదించవలసిన నెంబర్: 7032297733
సం/- చైర్మన్ జిల్లా కొనుగోలు కమిటీ కొరకు అదనపు కలెక్టర్ (SCDD), సిద్దిపేట
DIPR RO No.3190-PP/CL/Advt/1/2025-26, Dt: 05.06.2025

राष्ट्रीय डिज़ाइन संस्थान
నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్
అహ్మదాబాద్, గాంధీనగర్, బెంగళూరు
DPIIT, వాణిజ్యం మరియు పరిశ్రమల మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం పరిధిలోని చట్టబద్ధ సంస్థ.
పాల్డీ, అహ్మదాబాద్ – 380 007.
ఫోన్: 079-26629 500/600,
వెబ్‌సైట్: www.nid.edu

ఫ్యాకల్టీ ఉద్యోగాల కొరకు NID, అహ్మదాబాద్ దరఖాస్తులు కోరుతోంది

వాణిజ్యం మరియు పరిశ్రమల మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం పరిధిలోని 'జాతీయ ప్రాముఖ్యత కలిగిన సంస్థ' అయిన, దాని మూడు క్యాంపస్‌ల నుండి అహ్మదాబాద్, గాంధీనగర్ మరియు బెంగళూరులో బ్యాచిలర్స్, మాస్టర్స్ మరియు డాక్టోరల్ డిగ్రీలు అందిస్తున్న **నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ (NID), అహ్మదాబాద్** దాని ఫ్యాకల్టీ బృందంలో చేరేందుకు క్రియేటివ్ అండ్ కాంపిటెంట్ డిజైన్ ప్రొఫెషనల్స్ మరియు ఎడ్యుకేటర్స్‌ను ఆహ్వానిస్తోంది.

ఈ ఇన్‌స్టిట్యూట్‌లో ఐదు ఫ్యాకల్టీ స్ట్రీమ్స్ క్రింద వివిధ విభాగాల కొరకు **సీనియర్ ఫ్యాకల్టీ, అసోసియేట్ సీనియర్ ఫ్యాకల్టీ మరియు ఫ్యాకల్టీ** ఉద్యోగాల కోసం ఆన్‌లైన్ దరఖాస్తులు ఇప్పుడే ప్రారంభమైనవి.

దరఖాస్తు ప్రక్రియ మరియు విధానాలకు సంబంధించి సవివర సమాచారం కొరకు **www.nid.edu**లో **"Careers@NID"** ను సందర్శించండి.

ఆసక్తి గల అభ్యర్థులు వెబ్‌సైట్‌లో తెలిపిన నిర్ణీత తేదీలోగా నిర్దిష్ట ఫారంను ఉపయోగిస్తూ www.nid.edu ద్వారా మాత్రమే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయవలెను. పై రిక్రూట్‌మెంట్స్‌కు ఏదైనా అనుబంధం, సవరణ, తేదీల పొడిగింపు మొ॥వి పై వెబ్‌సైట్‌లో మాత్రమే ప్రకటించబడతాయి.

ఆన్‌లైన్ దరఖాస్తు దాఖలుకు చివరి తేదీ :
17 జూన్ 2025 (సా. 05.00 గం. IST వరకు)

CBC 05216/12/0001/2526

దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ
ఆపరేషన్: బంజారాహిల్స్ సర్కిల్
టెండరు ప్రకటన నం.02/2025-26 (ప్రతికా ప్రకటన): దిగువ పనుల కొరకు TGSPDCL టెండర్లు జారీ చేయుటకు అర్హత కలిగిన మరియు అనుభవం గల వివిధ కాంట్రాక్టర్ల నుండి సీల్డ్ బిడ్లు కోరబడుచున్నవి. 1) (Extn2) SR నగర్‌లో M/s రూప మరియు ఇతరులకు 100 KVA DTR స్థాపన, 2) (Extn2) బోరబండలో 11kv ఫీడర్‌పై ఇంటర్‌లింకింగ్ స్థాపన, 3) CBD గ్రీన్‌ల్యాండ్స్‌లో లోపాల గల UG కేబుల్ రీప్లేస్‌మెంట్, 4) బోరబండలో పెండింగ్ వృద్ధి నిమిత్తం 63KVA DTR స్థాపన, 5) గ్రీన్‌ల్యాండ్స్‌లో అదనపు 100 KVA DTR స్థాపన, 6&7) CBD గ్రీన్‌ల్యాండ్స్‌లో లైవ్ AB స్విచ్‌ల రీప్లేస్‌మెంట్, 8&9) CBD బేగంపేట్‌లో UG కేబుల్‌లో లోపాలు గల AB కేబుల్ రీప్లేస్‌మెంట్, 10) గ్రీన్‌ల్యాండ్స్‌లో HT Cat-III పరిధిలో HT సరఫరా విస్తరణ, 11) CBD బేగంపేట్‌లో లోపాలు గల UG కేబుల్ రీప్లేస్‌మెంట్, 12) CBD, బంజారా హిల్స్ కార్యాలయంలో పారదర్శక పార్టిషన్ వాల్ యొక్క నిర్మాణం, 13, 14, 15, 16, 17&18) బంజారా హిల్స్ సర్కిల్ & వెస్ట్ జోన్‌లోని వివిధ కార్యాలయాల హౌస్ కీపింగ్ మరియు మెయింటెనెన్స్ పనులు, 19) యూసుఫ్‌గూడలో టాయిలెట్ బ్లాక్, స్టోర్ రూమ్ కొరకు RCM రూఫ్, ఇతర సివిల్ పనుల ఏర్పాటు, 20) ఫిల్మ్‌నగర్‌లో శ్రీ అశోక్ కుమార్ పైడి 63KVA DTR స్థాపన, 21) CBD కొండాపూర్‌లో 33KV ప్రస్తుతం గల 1 నం.M+6 టవర్ కాంగ్రెస్ పనులు, 22) CBD కొండాపూర్‌లో కమాండ్ ఏరియా లోడ్స్ ప్రైవేటీకరణ. తదుపరి వివరాల కొరకు www.tgsouthernpower.org చూడండి.
DIPR Ro No.3152-PP/CL/Advt/1/2025-26, Dt05.06.2025 సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్, ఆపరేషన్ బంజారాహిల్స్ సర్కిల్

నగరపాలక సంస్థ కార్యాలయము, మీర్‌పేట్ :: రంగారెడ్డి జిల్లా
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు
నెం. ఇ1/ఎమ్.ఎమ్.సి./టెండరు నోటీసు నం. 04/2025-26 తేది : 05.06.2025
మీర్‌పేట్ నగరపాలక సంస్థ యందు సాధారణ నిధుల నుండి ఈ క్రింది తెలిపిన ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం ద్వారా టెండర్లు పిలువడమైనది. 1) పనుల సంఖ్య : (02), 2) పనుల విలువ : రూ. 165.00 లక్షలు, 3) బిడ్స్ డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది : 06.06.2025 సా. 05.00 గం.లకు, 4) బిడ్స్ డౌన్‌లోడింగ్ సమర్పించుటకు చివరి తేది : 13.06.2025 సా. 05.00 గం.లకు, 5) ప్రైస్ బిడ్ తెరుచు తేది మరియు సమయం : 13.06.2025 సా. 05.01 గం.లకు. మిగతా వివరాలకు కార్యాలయ పనివేళలయందు ఫోన్ నెం. 8555870616, 7331147292నకు సంప్రదించగలరు.
సం/- కమిషనర్, నగరపాలక సంస్థ, మీర్‌పేట్
DIPR RO No. 3176-PP/CL/ADVT/1/2025-26, Dt. : 05.06.2025

తెలంగాణ ప్రభుత్వం
జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీర్ కార్యాలయం, PIU డివిజన్, సంగారెడ్డి
టెండరు నోటీసు
టెండరు నోటీసు నం. 02/T1/DPRESRD/2025-26-(32 to 44) తేది : 03.06.2025
మొత్తం (13) పనులలో : CC రోడ్లు వేయడం, మురికి కాలువలు సివిల్ పనులు, DMFT, CRR మరియు జిల్లా పరిషత్ ఇతర పథకముల నుండి దిగువ సంతకందారుచే టెండర్లు కోరబడుచున్నవి. మొత్తం అంచనా వ్యయం : రూ. 80.97 లక్షలు. పాల్గొనేందుకు అప్లికేషన్ ముగింపు తేది : 12.06.2025 నాడు మరియు టెండరు షెడ్యూల్సును 17.06.2025 నుండి పొంది, తేది : 18.06.2025 నాడు టెండర్లలో పాల్గొనవచ్చును. ఇతర వివరాలను DPRE PIU, సంగారెడ్డి గారి ద్వారా పొందవచ్చును. ఇ-మెయిల్ ఐడి : ee.pr.srd@gmail.com, ఆఫీస్ ల్యాండ్ లైన్ నంబరు : 08455-272890.
సం/- జిల్లా పంచాయతీరాజ్ PIU విభాగం, సంగారెడ్డి
DIPR RO No. 3171-PP/CL/ADVT/1/2025-26, Dt. : 05.06.2025

సూపరింటెండింగ్ ఇంజనీర్ కార్యాలయం
తెలంగాణ రాష్ట్ర విద్య మరియు సంక్షేమ మౌలికసదుపాయాల అభివృద్ధి సంస్థ : హైదరాబాద్
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన
టెండరు ప్రకటన నం. SE/TGEWIDC/HYD/NIT/195 to 210/2025-26, తేది:04.06.2025
స్టేషన్ ఘన్‌పూర్ వద్ద ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మాణం (610.54 లక్షలు), వరంగల్ జిల్లాలో TSWR/JC, GPS, GHS నిర్మాణం (15 పనులు) (రూ.10.50 నుండి 100.00 లక్షలు) మరియు OU, హైదరాబాద్ వద్ద ఫర్నిచర్ సరఫరా (130.00 లక్షలు) కొరకు అర్హతగల కాంట్రాక్టర్ల అందరి నుండి టెండర్లు కోరబడుచున్నవి. 1వ, 2వ, 3వ, 4వ మరియు 5వ పిలుపులు: ఆన్‌లైన్‌లో బిడ్ దాఖలుకు చివరి తేది మరియు సమయం: 18.06.2025న సా.4.00 గం. వరకు. పూర్తి వివరాల కోసం https://tender.telangana.gov.inను చూడండి లేదా స్వయంగా సంప్రదించండి: సూపరింటెండింగ్ ఇంజనీర్ కార్యాలయం, TGEWIDC, 3వ బ్లాక్, 4వ అంతస్తు, రాజీవ్ విద్యా మిషన్ బిల్డింగ్, SCERT కాంపౌండ్, ఇ-సేవ ఎదురుగా, ఎల్బీ స్టేడియం, హైదరాబాద్, ఫోన్ నం.29565991.
సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, TGEWIDC, హైదరాబాద్
DIPR RO No.3206-PP/CL/Advt/1/2025-26, Dt. 05.06.2025

తెలంగాణ ప్రభుత్వం
సూపరింటెండింగ్ ఇంజనీర్ కార్యాలయం, (R&B) సర్కిల్, సంగారెడ్డి
టెండరు నోటీసు
e-NIT No.5/SE(R&B)SRD/TS/2025-26 తేది : 03.06.2025
పనుల సంఖ్య: 8 పనులు. పనుల పేరు: 1) వికారాబాద్ జిల్లాలో 3 పనులు (6వ పిలుపు), 2) సంగారెడ్డి జిల్లాలో 3 పనులు (5వ పిలుపు), 3) వికారాబాద్ జిల్లాలో 2 పనులు ప్రీ సర్వే మరియు DPR తయారీ పనులు. మొత్తం అంచనా వ్యయం: రూ. 11.80 కోట్లు. టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడ్ మరియు బిడ్ డాక్యుమెంట్ల దాఖలు తేది: 09.06.2025న రా. 8.00 గం. నుండి 17.06.2025న మ. 3.30 గం.వరకు. సాంకేతిక బిడ్ తెరుచు తేది:17.06.2025న సా. 4.00 గం.కు. ధర బిడ్ తెరుచు తేది: 19.06.2025న సా. 4.00 గం.కు. సంప్రదించాల్సిన నంబరు: 8121127730. టెండరు డాక్యుమెంట్లు 09.06.2025న రా. 8.00 గం. నుండి 17.06.2025న మ. 3.30గం. మధ్య ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్‌లో లభిస్తాయి. వివరాలను www.tender.telangana.gov.inకు లాగిన్ చేయుట ద్వారా చూడవచ్చును.
సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, (R&B) సర్కిల్, సంగారెడ్డి
DIPR RO No. 3209-PP/CL/ADVT/1/2025-26, Dt. : 05.06.2025

అనుబంధం - I
తెలంగాణ ప్రభుత్వం
ఆర్థిక శాఖ
31 సంవత్సరాల తెలంగాణ ప్రభుత్వ స్టాక్ (సెక్యూరిటీస్) 2056 వేలం

మొత్తం	:	రూ. 1000.00 కోట్లు
జారీ ధర	:	ప్రతి రూ.10,000.00 లకు రూ.10,000.00
కాలపరిమితి	:	31 సంవత్సరాలు
రుణ దరఖాస్తు స్వీకరణ వ్యవధి	:	మొత్తం అందిన వెంటనే నోటీసు లేకుండా 10.06.2025న వ్యాపార వేళల తరువాత తక్షణమే ముగుస్తుంది.

పైన తెలిపిన రుణానికి తెలంగాణ ప్రభుత్వం సబ్‌స్క్రిప్షన్లను అభ్యర్థిస్తోంది. పూర్తి వివరాలను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, హైదరాబాద్ మరియు ముంబై నుండి ప్రభుత్వ వ్యాపార వేళలలో పొందవచ్చును.
సందీప్ కుమార్ సుల్తానియా
ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఆర్థిక శాఖ
DIPR RO No.31-DP/CL/Advt/1/2025-26, Dt.05.06.2025

సాక్షి ఉద్యోగ అవకాశాలు

PRATHIBHA DEGREE COLLEGE FOR WOMEN
College Code : 12112 (Affiliated to O.U)
Opp.BJP Office, Metro Pillar No.814, KUKATPALLY, HYD-72.
WANTED LECTURERS
• COMPUTER SCIENCE • SANSKRIT • ENGLISH • HINDI • PHYSICS • COMMERCE • TELUGU • MATHS
Contact : 9618254567
Send your resume with in one week
Email: prathibhadegreecolleges@gmail.com

R. B. V. R. R. WOMEN'S COLLEGE
Narayanaguda, Hyderabad – 500027
(An Autonomous College, Affiliated to Osmania University Re-Accredited by NAAC with 'A' Grade)
Estd.1954
RECRUITMENT OF FACULTY POSITIONS
Applications are invited from eligible candidates in the following posts and subjects :
PROFESSOR: Food & Nutrition / Business Management / Chemistry / Computer Science / Data Science.
ASSOCIATE PROFESSOR: Botany / Food & Nutrition / Business Management / Chemistry / Computer Science / Data Science / English / Microbiology / Medical Lab Technology / Statistics.
ASSISTANT PROFESSOR: Food & Nutrition / Business Management / Chemistry / Commerce / Data Science / English / Medical Lab Technology / Sanskrit / Physical Education / Statistics.
Visit the college website www.rbvrrwomenscollege.ac.in. for Application form, and the details of number of posts, qualifications, eligibility criteria, selection process and salary. Filled-in application along with a fee of Rs.500/- (Rupees Five hundred only), to be paid through QR code, should reach through mail to "rbvrrwcoffice@gmail.com" on or before 18-06-2025.
Sd/-
Secretary-cum-Correspondent



సముద్రాలకు ఎండదెబ్బ

2024లో అర డిగ్రీ పెరుగుదల ● పెరిగిపోతున్న సముద్రమట్టం ● ప్రమాద ఘంటికలే: ఐరాస

'ఎండ దెబ్బ'కు మహాసముద్రాలు అతలాకుతలమై పోతున్నాయి. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, ఫిలిప్పీన్స్, ఇండొనేసియాలతో కూడిన వాయవ్య పసిఫిక్ ప్రాంత సముద్ర జలాల్లో 2024లో రికార్డు స్థాయిలో ఏకంగా అర డిగ్రీ సెంటీగ్రేడ్ మేరకు అధిక ఉష్ణోగ్రత నమోదైంది. దాంతో పసిఫిక్ మహాసముద్ర జలాలు ఏకంగా 4 కోట్ల చదరపు కి.మీ. మేరకు కనీవిని ఎరుగని రీతిలో వేడెక్కిపోయాయి. ఆ పరిధిలోని జీవజాలాన్ని కూడా ఈ పరిణామం తీవ్రంగా ప్రభావితం చేసింది. అరుదైన కోరల్ రీఫ్స్ వంటివాటి ఉనికే ప్రమాదంలో పడింది. అంతేగాక ఇండొనేసియాలోని న్యూ గినియా దీవుల్లో ఉన్న ఆ ప్రాంతపు ఏకైక గ్లేసియర్ ఏడాదిలోనే సగం మేరకు కరిగిపోయింది. ఎండలు ఇలాగే పెరిగిపోతే మరో ఏడాదికల్లా అది పూర్తిగా మాయం కావడం ఖాయమని ఐరాస వాతావరణ విభాగమైన ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యూఎంఓ) జోస్యం చెప్పింది. ముఖ్యంగా ఆస్ట్రేలియా, ఫిలిప్పీన్స్‌ల్లో గతేడాది ఎండలు సరికొత్త రికార్డులు సృష్టించాయని గురువారం విడుదల చేసిన వార్షిక నివేదికలో వెల్లడించింది. ''ప్రపంచమైన ఎండల నడుమ వాయవ్య పసిఫిక్ ప్రాంత దేశమైన ఫిలిప్పీన్స్‌పై గత అక్టోబర్, నవంబర్ నెలల్లో లెక్కలేనన్ని తుపాన్లు విరుచుకుపడ్డాయి! ఈ విపరిణామాలన్నింటికీ వాతావరణ మార్పులే ప్రధాన కారణం'' అంటూ వాపోయింది. మొత్తంగా సముద్ర ఉపరితల ఉష్ణోగ్రత కూడా 2024లో రికార్డు స్థాయిలో పెరిగిపోయిందని అధ్యయనకర్తల్లో ఒకరైన బ్లెయిర్ ట్రెవిన్ వివరించారు. ''మొత్తం పసిఫిక్ మహాసముద్ర ఉష్ణోగ్రతను చూసుకున్నా 2022 తర్వాత రెండో అత్యధిక పెరుగుదలను నమోదు చేసింది! అక్కడి సముద్రమట్టాలు ప్రపంచ సగటుతో పోలిస్తే శరవేగంగా పెరిగిపోతున్నాయి. ఇవన్నీ చాలా ప్రమాదకర పరిణామాలే. ఎందుకంటే వాయవ్య పసిఫిక్ ప్రాంత జనాభాలో ఏకంగా సగానికి పైగా తీరానికి కేవలం అర కిలోమీటర్ దూరంలోనే నివసిస్తున్నారు'' అని హెచ్చరించారు. సముద్రమట్టాల పెరుగుదల వేగం ఇలాగే కొనసాగితే వారంతా అతి త్వరలో నిర్వాసితులుగా మారి పొట్ట చేత పట్టుకుని వలస పోవడం తప్ప మరో మార్గం ఉండదని అధ్యయన బృంద సభ్యుడు థియా తుర్కింగ్టన్ అభిప్రాయపడ్డారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

ఈశాన్యాన భగభగలు

తగ్గిపోతున్న అటవీ విస్తీర్ణం ● కార్చిచ్చు, పోడు, ప్రాజెక్టులే కారణం ● అధ్యయనంలో వెల్లడి

ఈశాన్య భారతంలో పచ్చదనానికి మారుపేరైన అరుణాచల్‌ప్రదేశ్, మణిపూర్‌లో అటవీ విస్తీర్ణం శరవేగంగా తగ్గిపోతోంది. కార్చిచ్చులను సకాలంలో గుర్తించి అదుపు చేయకపోవడం, విచ్చలవిడి పోడు వ్యవసాయం, గంజాయి వంటివాటి అక్రమ సాగు, రోడ్లు, రైల్వే తదితర మౌలిక అభివృద్ధి ప్రాజెక్టుల కోసం భారీగా భూ సేకరణ తదితరాలు ఇందుకు కారణమని ప్రముఖ భూ పరిశీలన, విశ్లేషణ సంస్థ సుహోరా టెక్నాలజీస్ అధ్యయనం వెల్లడించింది. రెండు రాష్ట్రాలకు సంబంధించి గత నాలుగేళ్ల ఉపగ్రహ డేటాను లోతుగా విశ్లేషించిన మీదట ప్రమాదకర అంశాలు వెలుగులోకి వచ్చినట్టు తెలిపింది. ముఖ్యంగా దట్టమైన అడవుల లోపలి, మారుమూల ప్రాంతాల్లో రేగే కార్చిచ్చులు పెను నష్టానికి కారణమవుతున్నాయి. అరుణాచల్‌లోని నందిపార్ ప్రాంతంలో గత ఏప్రిల్ 24న రేగిన భారీ కార్చిచ్చు భారీ నష్టం మిగిల్చింది. ఒక్క రోజులోనే ఏకంగా 10 వేల ఎకరాలకు పైగా అటవీ ప్రాంతం బుగ్గిగా మారింది. ప్లానెట్‌స్కోప్ ఉపగ్రహ చిత్రాల సాయంతో జరిపిన విశ్లేషణ ద్వారా సుహోరా ఈ మేరకు వెల్లడించింది. ఇలాంటి కార్చిచ్చులను ఉపగ్రహ డేటా సాయంతో ఆదిలోనే గుర్తించి అదుపు చేయవచ్చని పేర్కొంది. ఇక జీవవైవిధ్యానికి మారుపేరైన మణిపూర్‌లో 2001 నుంచే అటవీ విస్తీర్ణంలో భారీ తగ్గుదల నమోదవుతూ వస్తోంది! రాష్ట్రంలో గత నాలుగేళ్లలో 21,100 హెక్టార్ల అటవీ భూమి మాయమైనట్టు గ్లోబల్ ఫారెస్ట్ వాచ్ పేర్కొంది. ఇందులో ఏకంగా 17,800 హెక్టార్ల అటవీ భూమిని ఒక్క 2024లోనే కోల్పోయిందని వెల్లడించింది. ఫలితంగా 91 కోట్ల మెట్రిక్ టన్నుల అదనపు కార్బన్ డయాక్సైడ్ వాతావరణంలోకి విడుదలైనట్టు పేర్కొంది. కార్చిచ్చుకు తోడు పోడు, గంజాయి వంటివాటి అక్రమ సాగు, జనం వంట చెరుకుపై ఆధారపడుతుండటం, రోడ్లు, రైల్వే వంటి మౌలిక ప్రాజెక్టులు ఇందుకు కారణమని అధ్యయనం తేల్చింది. పచ్చదనపు తొడుగు లేకపోవడంతో కొన్నేళ్లుగా కొండచరియలు విరిగిపడే ప్రమాదం పెరగడమే గాక వర్షపాత ధోరణులు కూడా బాగా మారిపోయినట్టు వివరించింది. తక్షణం దిద్దుబాటు చర్యలు తీసుకోని పక్షంలో ఈశాన్య భారతంలో పెను పర్యావరణ సంక్షోభం తప్పదని హెచ్చరించింది.

- సాక్షి, నేషనల్ డెస్క్

పేద ఖైదీలకు సాయపడండి

రాష్ట్రాలను కోరిన కేంద్ర హోంశాఖ

సాక్షి, న్యూఢిల్లీ: ఆర్థిక ఇబ్బందుల కారణంగా బెయిల్ పొందలేని, జైలు నుంచి విడుదల కాలేని పేద ఖైదీలకు ఉపశమనం కలిగించేందుకు ఉద్దేశించిన నిధులను రాష్ట్రాలు వినియోగించకపోవడంపై కేంద్ర హోం శాఖ ఆందోళన వ్యక్తం చేసింది. 2023 మేలో కేంద్రం ప్రారంభించిన 'పేద ఖైదీలకు మద్దతు'పథకానికి అర్హులైన ఖైదీలను గుర్తించడంలో రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపకపోవడాన్ని తప్పుపట్టింది. ఇప్పటికైనా జరిమానాలు, బెయిల్ పూచీకత్తు చెల్లించలేని కారణంగా కటకటాల్లోనే మగ్గుతున్న పేద ఖైదీలకు తోడ్పడాలని ఈ నెల 3న రాష్ట్రాలకు లేఖ రాసింది. 'పేద ఖైదీలకు మద్దతు'పథకంలో భాగంగా రాష్ట్రాలు జిల్లాకొకటి చొప్పున కమిటీని ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. పథకం అమలుకు నేషనల్ క్రైం రికార్డ్స్ బ్యూరో (ఎన్సీఆర్బీ) కేంద్ర నోడల్ ఏజెన్సీగా పనిచేస్తుంది. ఈ సంస్థకు కేంద్రం ఏటా రూ.20 కోట్లు కేటాయిస్తుంది. జిల్లా సాధికార కమిటీ కేసును క్లియర్ చేస్తే ఖైదీకి రూ.25 వేల వరకు లభిస్తుంది. ఇంతకంటే ఎక్కువ మొత్తం ఉంటే, దానిని రాష్ట్ర స్థాయి పర్యవేక్షణ కమిటీ నిర్ణయిస్తుంది. ఈ పథకాన్ని సరైన రీతిలో అమలు చేసి పేద ఖైదీలకు విముక్తి కల్పించడం ద్వారా వారిని జన జీవన స్రవంతిలో కలిసేందుకు సాయపడాలని కోరింది. అయితే, అవినీతి నిరోధక, మనీలాండరింగ్, డ్రగ్స్, ఉపా తదితర చట్టాల పరిధిలోకి వచ్చే నేరాలకు పాల్పడిన వారికి ఈ ప్రయోజనం వర్తించదని హోం శాఖ స్పష్టం చేసింది.

స్వయం సమృద్ధ భారతే లక్ష్యం

ఎన్డీయే పథకాలతో పేదల జీవితాల్లో పెనుమార్పులు ● ప్రధాని మోదీ స్పష్టీకరణ

న్యూఢిల్లీ: దేశంలో బడుగు బలహీన వర్గాల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా జాతీయ ప్రజాస్వామ్య కూటమి(ఎన్డీయే) ప్రభుత్వం ముందుకెళ్తోందని ప్రధాని నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. స్వయం సమృద్ధ, సమీకృత భారత్ నిర్మాణానికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. ఆత్మగౌరవంతో జీవించే అవకాశం ప్రతి పౌరుడికీ లభించాలన్నదే తమ ఆశయమని వివరించారు. ఎన్డీయే ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు పేదల జీవితాల్లో పెనుమార్పు తీసుకొచ్చాయని హర్షం వ్యక్తం చేశారు. ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ పదవీ కాలం ఈ నెల 9వ తేదీ నాటికి 11 ఏళ్లు పూర్తి కానుంది. మూడో టర్మ్‌లో తొలి ఏడాది పదవీ కాలాన్ని పూర్తి చేసుకోబోతున్నారు. ఈ నేపథ్యంలో ఆయన గురువారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. ''పీఎం ఆవాస్ యోజన, పీఎం ఉజ్వల్ యోజన, జన్‌ధన్ యోజన, ఆయుష్మాన్ భారత్ వంటి పథకాలతో ప్రజలకు పక్కా నివాస గృహాలు, వంట గ్యాస్, బ్యాంకింగ్, ఆరోగ్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. ప్రత్యక్ష నగదు బదిలీ(డీబీటీ)తో చివరి లబ్ధిదారుడికి సైతం మేలు జరుగుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు మెరుగయ్యాయి. ఇప్పటిదాకా ప్రభుత్వం చేపట్టిన చర్యలతో 25 కోట్ల మందికిపైగా ప్రజలు పేదరికం నుంచి బయటపడ్డారు. గత 11 ఏళ్లలో మా ప్రభుత్వం సాధించిన విజయాలు ప్రజలకు తెలియజేస్తాం. నేరుగా వారి వద్దకే వెళ్తాం'' అని ప్రధాని మోదీ వెల్లడించారు.

మన భూగోళాన్ని కాపాడుకుందాం...

మనం నివసిస్తున్న ఈ భూగోళాన్ని కాపాడుకొనేందుకు ప్రయత్నాలు మరింత వేగవంతం చేయాలని ప్రధాని మోదీ ప్రజలకు పిలుపునిచ్చారు. భూమిని రక్షించుకొనే విషయంలో అన్ని రకాల సవాళ్లను ఉమ్మడిగా ఎదుర్కోవాలని చెప్పారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా 'ఎక్స్'లో పోస్టుచేశారు. పర్యావరణ పరిరక్షణ కోసం క్షేత్రస్థాయిలో కృషి చేస్తున్న వారికి అభినందనలు తెలియజేశారు. ప్రపంచ దేశాలన్నీ స్వప్రయోజనాలు పక్కనపెట్టి పర్యావరణ పరిరక్షణ కోసం కలసాలని సూచించారు. ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయడమే ఈ ఏడాది ప్రపంచ పర్యావరణ దినోత్సవ నినాదమని గుర్తుచేశారు. ప్లాస్టిక్ కాలుష్య నివారణ కోసం తమ ప్రభుత్వం గత ఐదేళ్లుగా నిర్విరామంగా కృషి చేస్తోందని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ప్రజల్లో పర్యావరణ స్పృహ క్రమంగా పెరుగుతోందని, లక్షలాది మంది నిత్య జీవితంలో 'రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్' విధానం పాటిస్తున్నారని చెప్పారు.



సిందూర్ మొక్కను నాటి నీళ్లు పోస్తున్న ప్రధాని మోదీ

సిందూర్ మొక్క నాటిన ప్రధాని

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ గురువారం ఢిల్లీలో లోక్ కల్యాణ్ మార్గ్‌లోని తన అధికారిక నివాసంలో సిందూర్ మొక్క నాటారు. బంగ్లాదేశ్‌కు విముక్తి కల్పించడానికి 1971లో పాకిస్తాన్‌పై జరిగిన యుద్ధంలో అపూర్వమైన ధైర్యసాహసాలు ప్రదర్శించిన మహిళలు ఆయనకు ఈ మొక్క బహూకరించారు. ఇటీవల భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు గుర్తుగా మోదీ సిందూర్ మొక్కను స్వహస్తాలతో నాటారు. సిందూర్ మొక్క మన దేశ మహిళల శక్తి, శౌర్యం, స్ఫూర్తికి బలమైన ప్రతీకగా నిలుస్తుందని పేర్కొంటూ 'ఎక్స్'లో పోస్టు చేశారు. సిందూర్ మొక్క నాటే గొప్ప అవకాశం లభించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఇటీవల గుజరాత్‌లోని కచ్‌లో పర్యటించినప్పుడు మహిళలు తనకు ఈ మొక్కను బహూకరించారని, 1971లో పాకిస్తాన్‌పై భారత్ సాగించిన యుద్ధంలో వారంతా అసాధారణ పరాక్రమం, దేశభక్తిని ప్రదర్శించారని ప్రశంసించారు. సిందూర్ మొక్క నాటిన వీడియోలు, ఫొటోలను మోదీ షేర్ చేశారు.

శర్మిష్ఠ పనోలీకి హైకోర్టు బెయిల్

కోల్‌కతా: సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ శర్మిష్ఠ పనోలీ(22)కి కోల్‌కతా హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. మతపరమైన కామెంట్లు చేసినట్లు నమోదైన ఫిర్యాదు మేరకు కలకత్తా పోలీసులు గతవారం హరియాణాలోని గురుగ్రామ్‌లో ఉండగా అరెస్ట్ చేశారు. లా స్టూడెంట్ అయిన శర్మిష్ఠ ఆపరేషన్ సిందూర్‌పై బాలీవుడ్‌లోని ఓ వర్గం నటులు మౌనంగా ఉన్నారంటూ మే 7న చేసిన వివాదాస్పద వ్యాఖ్యల వీడియో ఆన్‌లైన్‌లో వైరలయ్యింది. తీవ్రమైన కామెంట్లు రావడంతో మరునాడే మే 8న వీడియోను తొలగించి, క్షమాపణ చెప్పింది. బెదిరింపులు రావడంతో కుటుంబంతో సహా వేరే చోటుకు మకాం మార్చింది. అయినప్పటికీ, ఆమె తన వీడియో ద్వారా మత విద్వేషాలను ప్రేరేపించిందంటూ పోలీసులు కేసు నమోదు చేశారు. అరెస్ట్ వారెంట్ కూడా జారీ అయ్యింది. దీంతో మే 30వ తేదీన గురుగ్రామ్‌లో అరెస్ట్ చేసిన పోలీసులు కోల్‌కతాకు తరలించారు. బెయిల్ కోసం ఆమె పెట్టుకున్న అభ్యర్థనపై జస్టిస్ రాజా బసు చౌదరి సారథ్యంలోని ధర్మాసనం మంగళవారం ఇరుపక్షాల వాదనలు వింది. గురువారం తీర్పు విడుదల చేసింది. రూ.10 వేల పూచీకత్తుతో శర్మిష్ఠ పనోలీకి మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. అనుమతి లేనిదే దేశం విడిచి వెళ్లరాదని, కేసు విచారణలో అధికారులకు సహకరించాలని ఆమెను ఆదేశించింది. అదేవిధంగా, పనోలీకి తగు భద్రత కల్పించాలని పోలీసులకు ఉత్తర్వులు జారీ చేశారు.

దేశ సేవ నేరమా?



- నాపై విమర్శలు చేసేవారు ఆత్మపరిశీలన చేసుకోవాలి
- పార్టీ మారే ఉద్దేశం నాకు లేదు
- కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ స్పష్టీకరణ

వాషింగ్టన్: దేశ ప్రయోజనాల కోసం పని చేయడం నేరమా? అని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, ఎంపీ శశిథరూర్ ప్రశ్నించారు. దేశానికి సేవ చేయడం పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లుగా భావించేవారు ఆత్మవిమర్శ చేసుకోవాలని పరోక్షంగా కాంగ్రెస్ నాయకత్వానికి చురక అంటించారు. వారిని వారు ప్రశ్నించుకుంటే అసలు నిజం ఏమిటో తెలుస్తుందన్నారు. కాంగ్రెస్‌కు రాజీనామా చేసే ఉద్దేశం లేదని స్పష్టంచేశారు. ఆపరేషన్ సిందూర్‌పై కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన అఖిల పక్ష బృందానికి నేతృత్వం వహిస్తున్న శశిథరూర్ ప్రస్తుతం అమెరికాలో పర్యటిస్తున్నారు. తాజాగా ఓ వార్తా సంస్థకు ఇంటర్వ్యూ ఇచ్చారు. మోదీ ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్నానంటూ తనపై కొందరు కాంగ్రెస్ నాయకులు చేస్తున్న విమర్శలపై స్పందించారు. దేశానికి సేవ చేస్తున్నప్పుడు ఇలాంటి చిల్లర మల్లర విమర్శలు, ఆరోపణలు పట్టించుకోవాల్సిన అవసరం లేదని తేల్చిచెప్పారు. తాను బీజేపీలో చేరబోతున్నానంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. ప్రజలు తనను పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నుకున్నారని, ఎంపీగా పదవీ కాలం మరో నాలుగేళ్లు ఉందని, ఇలాంటి సమయంలో పార్టీ మార్పు ప్రశ్న ఎందుకు చర్చకు వస్తోందో తనకు అర్థం కావడం లేదన్నారు. పార్టీ మారాల్సిన అవసరం ఎంతమాత్రం లేదని తేల్చిచెప్పారు.

ట్రంప్ వ్యాఖ్యలు 'చిన్న విషయం'

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎదుట ప్రధాని నరేంద్ర మోదీ లొంగిపోయారని, అందుకే పాకిస్తాన్‌పై యుద్ధం హఠాత్తుగా ఆపేశారని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీపై చేసిన ఆరోపణల పట్ల శశిథరూర్ స్పందించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజకీయ పార్టీలు పరస్పరం ఆరోపణలు చేసుకోవడం సహజమేనని కొట్టిపారేశారు. అయినా తాము ఇక్కడికి రాజకీయ కార్యక్రమం కోసం రాలేదని, ఐక్య భారత్ ప్రతినిధులుగా వచ్చామని చెప్పారు. భిన్నత్వంలో ఏకత్వం కలిగిన మన దేశ సందేశానికి ప్రపంచ దేశాలకు చేరవేస్తున్నామని ఉద్ఘాటించారు. అఖిలపక్ష బృందంలో వేర్వేరు పార్టీల నేతలు సభ్యులుగా ఉన్నారని గుర్తుచేశారు. ఇది కూడా భిన్నత్వంలో ఏకత్వానికి సంకేతమని వివరించారు. మన మధ్య రాజకీయ విభేదాలు ఏవైనా ఉంటే అవి దేశ సరిహద్దుల్లోనే ఆగిపోవాలని, సరిహద్దు దాటితే మనమంతా భారతీయులమేనని గతంలో ఒక సందర్భంలో తాను చెప్పినట్లు గుర్తుచేశారు. భారత్-పాకిస్తాన్ మధ్య అణు యుద్ధాన్ని ఆపేశానంటూ ట్రంప్ పదేపదే చెబుతుండడంపై ప్రశ్నించగా, ''ట్రంప్ వ్యాఖ్యలు, వాటిపై రాహుల్ విమర్శలు నిజానికి చిన్న విషయాలు'' అంటూ థరూర్ ఆసక్తికరంగా స్పందించారు. ''అమెరికా అధ్యక్షునిగా ట్రంప్‌పై భారత్‌కు ఎంతో గౌరవముంది. ఇలాంటి ఉదంతంతో ద్వైపాక్షిక సంబంధాలు సంక్లిష్టం కావడం భారత్‌కు ఇష్టం లేదు. ఒక్కటి మాత్రం సుస్పష్టం. మధ్యవర్తిత్వం కోసం ఎవరినో ప్రాధేయపడాల్సిన అవసరం భారత్‌కు లేదు. పాక్ దాడి చేస్తే గట్టిగా బదులిస్తామని, ఆపేస్తే తామూ ఆపేస్తామని భారత్ మొదట్లోనే చెప్పింది. అలాంటప్పుడు పాక్‌పై దాడులు ఆపాలని మాకు ఇంకెవరో చెప్పే సందర్భమే తలెత్తదు'' అని కుండబద్దలు కొట్టారు. ఆపరేషన్ సిందూర్‌ను తట్టుకోలేక పాకే అమెరికా శరణుజొచ్చిందేమో. లేదంటే కాల్పుల విరమణ కోసం అమెరికాయే పాక్‌పై ఒత్తిడి చేసి ఉండొచ్చు'' అన్నారు.

వారికి నో ఎంట్రీ!

- 12 దేశాల పౌరులకు అమెరికా తలుపులు మూసివేత
- యూదులపై విదేశీయుని దాడి నేపథ్యంలో ట్రంప్ నిర్ణయం
- మరో ఏడు దేశాలపైనా కఠిన ఆంక్షలు

వాషింగ్టన్: సంచలన నిర్ణయాలకు మారుపేరుగా మారిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈసారి 12 దేశాలపై కొరడా ఝళిపించారు. అఫ్గానిస్తాన్, మయన్మార్, చాద్, కాంగో, ఈక్వటోరియల్ గినియా, ఎరిత్రియా, హైతీ, ఇరాన్, లిబియా, సోమాలియా, సూడాన్, యెమెన్ పౌరులు అమెరికాలోకి ప్రవేశించకుండా నిషేధిస్తున్నట్టు గురువారం ప్రకటించారు. ఇది ఆదివారం అర్ధరాత్రి నుంచి అమల్లోకి వస్తుందని పేర్కొన్నారు. ఈ మేరకు ఉత్తర్వులపై సంతకం చేశారు. ఆ 12 దేశాల్లో 40 కోట్లకు పైగా జనాభా ఉండటం విశేషం. వాటితో పాటు బురుండీ, క్యూబా, లావోస్, సియెరా లియోన్, టోగో, తుర్క్‌మెనిస్తాన్, వెనెజువెలాపై ఆంక్షలను మరింత కఠినతరం చేస్తున్నట్టు ట్రంప్ పేర్కొన్నారు. బి-1, బి-2, ఎఫ్, ఎం, జే తదితర కేటగిరీలకు చెందిన ఇమిగ్రెంట్, నాన్ ఇమిగ్రెంట్ వీసాల జారీని పరిమితం చేయడం వంటివి ఇందులో ఉన్నాయి. అమెరికాలో కొలరాడోలో యూదులపై జరిగిన దాడిని ట్రంప్ ప్రస్తావించారు. ఆ నేపథ్యంలోనే పలు దేశాలపై నిషేధ చర్యలకు దిగినట్టు సంకేతాలిచ్చారు. అయితే దాడికి దిగింది ఈజిప్ట్ దేశస్తుడు కాగా నిషేధిత జాబితాలో ఆ దేశం మాత్రం లేకపోవడం విశేషం. ట్రంప్ తొలి హయాంలో నిషేధం ఎదుర్కొన్న ఉత్తరకొరియా, సిరియా పేర్లు కూడా రెండు జాబితాల్లోనూ లేవు! పర్యాటక, వాణిజ్య, విద్యార్థి వీసాల మాటున అమెరికాకు వచ్చి వీసా గడువు ముగిసినా అక్కడే తిష్ట వేస్తున్న దేశాలపైనే ట్రంప్ నిషేధం విధించినట్టు తెలుస్తోంది. ''ఆ 12 దేశాల్లో 8 దేశాలతో మరీ సమస్యగా ఉంది. వాటి పౌరుల్లో అత్యధికులు వీసా కాలపరిమితి ముగిసినా అమెరికా వీడటం లేదు'' అని ట్రంప్ ఆక్షేపించారు. హోంల్యాండ్ సెక్యూరిటీ వార్షిక నివేదికలను ఉదాహరించారు. నిషేధంపై పునరాలోచించాలని ఆయా దేశాలు ట్రంప్‌కు విజ్ఞప్తి చేయగా వెనెజువెలా మాత్రం వెటకారంగా స్పందించింది. ''రోజూ కాల్పుల మోత మోగే అమెరికాలో మా పౌరులకు భద్రత కరువైంది. అమెరికాలో ఉండటం చాలా రిస్క్'' అని చెప్పుకొచ్చింది.



హార్వర్డ్‌పై 'వీసా నిషేధం'

హార్వర్డ్ యూనివర్సిటీతో ట్రంప్ జగడం పరాకాష్ఠకు చేరుతోంది. అందులో ప్రవేశాలు పొందే విదేశీ విద్యార్థులకు వీసాల జారీని నిషేధిస్తూ ట్రంప్ తాజాగా నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ఉత్తర్వులపై బుధవారం రాత్రి సంతకం చేశారు. ''విదేశీ విద్యార్థులు, పరిశోధకులకు హార్వర్డ్ సరైన ఎంపిక కాదన్నది నా తీర్పు. వారు హార్వర్డ్‌లో చేరేందుకు అనుమతించడం జాతీయ భద్రతకు ముప్పుగా పరిణమించవచ్చు'' అని వాటిలో పేర్కొన్నారు. అమెరికా ప్రయోజనాల పరిరక్షణకు పాటుపడతామని హామీ ఇచ్చే విద్యార్థులను మాత్రం అనుమతిస్తామంటూ వెసులుబాటు కల్పించినట్లు తెలుస్తోంది. హార్వర్డ్‌లో విదేశీ విద్యార్థుల చేరికపై హోంలాండ్ సెక్యూరిటీ నిషేధాన్ని బోస్టన్ ఫెడరల్ కోర్ట్ గత వారం కొట్టేయడం తెలిసిందే. ఈ నేపథ్యంలో అమెరికా ప్రయోజనాలకు ముప్పు కాగల విదేశీయుల ప్రవేశాన్ని నిషేధించేందుకు అధ్యక్షునికి సంక్రమించిన ప్రత్యేకాధికారాలను ఉపయోగించుకుని ట్రంప్ తాజా ఉత్తర్వులు జారీ చేశారు.

తృణమూల్ ఎంపీ మొయిత్రా, బీజేడీ నేత మిశ్రా

రహస్య వివాహం



న్యూఢిల్లీ/కోల్‌కతా: తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) ఎంపీ మహువా మొయిత్రా (50) సుప్రీంకోర్టు సీనియర్ లాయర్, బిజూ జనతాదళ్ నేత పినాకి మిశ్రా(65)ను రహస్యంగా వివాహమాడారు. వీరిద్దరూ మే 30వ తేదీన జర్మనీలో జరిగిన ఓ ప్రైవేట్ కార్యక్రమంలో ఒక్కటైనట్లు సమాచారం. ఇందుకు సంబంధించిన ఒక ఫొటోను టీఎంసీకే చెందిన ఎంపీ సయోనీ ఘోష్ బుధవారం 'ఎక్స్'లో మరో ఎంపీ జూన్ లియాకు షేర్ చేస్తూ.. నూతన జంటకు శుభాకాంక్షలు తెలపడంతో పుకార్లకు రెక్కలొచ్చాయి. ఇప్పుడీ ఫొటో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. వివాహం వ్యవహారంపై మొయిత్రా గానీ, మిశ్రా గానీ అధికారికంగా ఎటువంటి ప్రకటనా చేయలేదు. ఈ విషయం తమకు తెలియదని కొందరు టీఎంసీ ఎంపీలు సైతం పేర్కొనడం గమనార్హం. మీడియా ఫోన్ కాల్స్‌కు మొయిత్రా స్పందించడం లేదు. కాగా, ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్ అయిన మొయిత్రా 2019లో రాజకీయ ప్రవేశం చేశారు. బెంగాల్‌లోని కృష్ణనగర్ స్థానం నుంచి రెండో విడత ఎంపీగా ప్రస్తుతం కొనసాగుతున్నారు. డెన్మార్క్‌కు చెందిన ఫైనాన్షియర్ లార్స్ బ్రోర్సన్‌తో ఈమెకు మొదటగా వివాహమైంది. అదేవిధంగా, బిజూ జనతాదళ్ సీనియర్ నేత అయిన పినాకి మిశ్రా సుప్రీంకోర్టు లాయర్. ఈయన పూరీ స్థానం నుంచి నాలుగు పర్యాయాలు ఎంపీగా పనిచేశారు. 1984లో ఈయన సంగీతా మిశ్రాను వివాహమాడారు. ఇద్దరు సంతానం కలిగాక విడిపోయారు.

ఫీజుల కోసం హింసిస్తారా?

- స్కూల్లోకి కాలు కూడా పెట్టనివ్వరా?
- బౌన్సర్లను పెట్టి మరీ అడ్డుకుంటారా?
- ప్రైవేట్ స్కూల్‌పై ఢిల్లీ హైకోర్టు ధ్వజం

న్యూఢిల్లీ: మంచి మార్కులొచ్చే విద్యార్థులను ఉచిత బోధన పేరుతో గద్దల్లా తన్నుకుపోయే ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలు ఫీజు సరిగా కట్టకపోతే కనీసం గేటు దాటి లోపలికి కూడా రానివ్వడం లేదంటూ ఢిల్లీ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. ఫీజు సవ్యంగా కట్టలేదన్న అక్కసుతో విద్యార్థులను బౌన్సర్లతో అడ్డుకోవడంపై మండిపడింది. విద్యాలయాల్లో ఇలాంటి పెడ ధోరణులను ఉపేక్షించే ప్రసక్తే లేదని జస్టిస్ సచిన్ దత్తా ధర్మాసనం స్పష్టం చేసింది. ''ఫీజు వివాదాన్ని సాకుగా చూపి విద్యార్థులను స్కూల్లోకి అనుమతించకపోవడం, అందరి ఎదుటా అవహేళన చేయడం క్షమార్హం కాదు. విద్యాలయాల్లో ఇలాంటి సంస్కృతి కొనసాగేందుకు వీల్లేదు. ఫీజు కట్టాలని బౌన్సర్లను పెట్టి మరీ బెదిరించడం విద్యార్థులను తీవ్రస్థాయిలో వేధించడమే. ఇది చిన్నారుల మానసిక ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది. ఇది వారి ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయడమే'' అని పేర్కొంది. ఫీజులు సరిగా చెల్లించలేదని దేశ రాజధానిలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ 31 మంది విద్యార్థులను బౌన్సర్లను పెట్టి అడ్డుకుంటోందని, బెదిరిస్తోందని నమోదైన కేసును ధర్మాసనం గురువారం విచారించింది. ఫీజు కట్టలేదని విద్యార్థుల పేర్లను రికార్డుల నుంచి తొలగించి డిబార్ చేసిన యాజమాన్యం కోర్టు ఆగ్రహం నేపథ్యంలో వారిని తిరిగి చేర్చుకుంటామని విన్నవించింది. ఇకపై విద్యార్థులను తొలగించాలంటే నిబంధనల ప్రకారం తొలుత తల్లిదండ్రులకు ముందస్తు సమాచారమిచ్చి ఫీజు చెల్లింపుపై వారి వాదన విన్పించేందుకు అవకాశం ఇవ్వాల్సిందేనని కోర్టు ఆదేశించింది. 2025-26 విద్యా సంవత్సరానికి పెంచిన ఫీజులో సగం చెల్లించాలని తల్లిదండ్రులకు సూచించింది.

న్యాయ బంధం బలోపేతం

- పరస్పర సహకారంతో భారత్, యూకేలకు లబ్ధి
- లండన్ సదస్సులో సీజేఐ జస్టిస్ బి.ఆర్.గవాయ్

లండన్: భారత్, యునైటెడ్ కింగ్‌డమ్(యూకే) మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం(ఎఫ్‌టీఏ)తో రెండు దేశాల నడుమ న్యాయ బంధం సైతం మరింత బలోపేతం అవుతుందని భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్ చెప్పారు. ఉమ్మడి న్యాయ సూత్రాల ఆధారంగా ఇరు దేశాలు ఘనమైన న్యాయ చరిత్రను పంచుకుంటున్నాయని వివరించారు. గురువారం యూకే రాజధాని లండన్‌లో ఇండో-యూకే వాణిజ్య వివాదాల మధ్యవర్తిత్వంపై జరిగిన అంతర్జాతీయ సదస్సులో జస్టిస్ గవాయ్ ప్రసంగించారు. న్యాయ రంగంలో పరస్పర సహకారం ద్వారా భారత్, యూకేలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. 2018 జూలైలో ఇండియా-యూకే మధ్య కుదిరిన అవగాహనా ఒప్పందాన్ని ప్రస్తావించారు. దీనివల్ల ఇరు దేశాల నడుమ చట్ట, న్యాయ బంధం మరింత పెరిగిందని తెలిపారు. వివాదాల పరిష్కారం, శిక్షణతోపాటు న్యాయ సేవల్లో రెండు దేశాలు కలిసి పని చేయడానికి ఈ ఒప్పందం దోహదపడుతోందని జస్టిస్ గవాయ్ వివరించారు. ఈ కార్యక్రమంలో భారత న్యాయ శాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ సైతం ప్రసంగించారు. సింగపూర్, లండన్ తరహాలో భారత్ సైతం మేజర్ ఇంటర్నేషనల్ ఆర్బిట్రేషన్ హబ్‌గా మారుతోందని చెప్పారు. మరోవైపు 'బ్రిటిష్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంటర్నేషనల్ అండ్ కంపేరేటివ్ లా'లో జరిగిన మరో కార్యక్రమంలోనూ జస్టిస్ గవాయ్ మాట్లాడారు. న్యాయ వ్యవస్థలో టెక్నాలజీకి అధిక ప్రాధాన్యం ఇవ్వడం సరైంది కాదన్నారు. దీనివల్ల న్యాయ వ్యవస్థపై ప్రజల విశ్వాసం తగ్గిపోతుందని పేర్కొన్నారు. కక్షిదారులకు న్యాయం చేకూర్చడానికి టెక్నాలజీని తగిన రీతిలో వాడుకోవాలి తప్ప దానికే పెద్దపీట వేయొద్దని సూచించారు. పూర్తిగా సాంకేతిక పరిజ్ఞానమే న్యాయ వ్యవస్థను ముందుకు నడిపించే పరిస్థితి రాకూడదని పేర్కొన్నారు.

180 మీటర్ల రైడ్‌కు ఓలా!

రద్దీ ట్రాఫిక్‌లో త్రిచక్ర వాహనాలు, కార్లు రయ్‌మని దూసుకుపోవడం కష్టం. ఈ ట్రాఫిక్ కష్టాలను ద్విచక్ర వాహనాలు అంటే బైక్‌లు సులువుగా తగ్గిస్తాయి. ఇదే బాధతో ఒక కస్టమర్ సైతం తన బైక్‌ను బుక్ చేసుకుని ఉంటారని భావించిన ఒక ఓలా రైడర్‌కు ఊహించని ఘటన ఎదురైంది. నవ్వు తెప్పించే ఆ ఘటన వివరాలను ఆ రైడర్ తన ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ 'రోహిత్ వ్లోగ్‌స్టర్'లో పొందుపరిచారు. ఒక టీనేజీ అమ్మాయి బుక్ చేసిన ఆ రైడ్ తాలూకు పూర్తి వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్‌చేయగా కొన్ని గంటల్లోనే 20 లక్షల మంది చూశారు. ఈ వీడియో చూశాక నెటిజన్లు ఆపకుండా కామెంట్లు పెట్టడం మొదలెట్టారు.

ఇంతకీ ఆ వీడియోలో ఏముంది?

పట్టపగలు నిర్మానుష్యంగా ఉన్న వీధిలో ఒక టీనేజర్ నుంచి ఓలా బైక్ రైడ్ బుక్ అవడంతో సంబంధిత అబ్బాయి వెంటనే లొకేషన్‌కు చేరుకున్నాడు. ట్రాఫిక్ ఏమీ లేకున్నా అమ్మాయి బైక్ ఎందుకు బుక్‌చేసుకుందా అని ఒకింత అనుమానంగా చూశాడు. అమ్మాయిని బైక్ మీద ఎక్కించుకోవడానికి ముందుగా గమ్యస్థానాన్ని యాప్‌లో సరిచూశాడు. ఇక్కడి నుంచి గమ్యస్థానం కేవలం 180 మీటర్లదూరంలో ఉండటం చూసి అవాక్కయ్యాడు. ఇంత తక్కువ దూరానికి బైక్ అవసరమా? అని నేరుగా అడిగేశాడు. '' దూరం తక్కువే. కానీ కుక్కలే ఎక్కువ'' అని అమ్మాయి చెప్పిన సమాధానంతో పక్కున నవ్వేశాడు. వీధి శునకాల సమస్యకు అమ్మాయి కనుక్కున్న పరిష్కారం చూసి మెచ్చుకున్నాడు. వెంటనే అమ్మాయిని బైక్ మీద ఎక్కించుకుని గమ్యస్థానంలో దింపాడు. అంత తక్కువ దూరానికి కేవలం రూ.19 బిల్లు అయ్యింది. ఆ బిల్లు చెల్లించేసి అమ్మాయి చకచకా వెళ్లిపోవడం చూసి అవాక్కవడం అబ్బాయి వంతయింది. '' 180 మీటర్లకు కూడా బైక్ బుక్ చేయొచ్చని నాకూ ఇప్పుడే అర్థమైంది. రైడ్ స్టార్ట్ చేసి అమ్మాయిని కారణం అడిగి, ఆమె నుంచి సమాధానం పూర్తిగా వినేలోపే స్టాప్ వచ్చేసింది'' అని రైడర్ ఒక పోస్ట్‌లో పేర్కొన్నాడు. సంబంధిత వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. కొందరు నెటిజన్లు స్ట్రీట్ డాగ్‌కు డాగేశ్ అనే పేరు పెట్టి.. 'డాగేశ్ ఉన్నాడంటే ఎవరైనా ఆ మాత్రం భయపడాల్సిందే' అని వ్యాఖ్యానించారు. డాగేశ్ అంటే మజాకానా!! అని మరొకరు స్పందించారు.

- సాక్షి, నేషనల్ డెస్క్



మాలో ఒకరికి మంత్రి పదవి ఇవ్వండి

- మల్లికార్జున ఖర్గేకు టీ కాంగ్రెస్ మాదిగ ఎమ్మెల్యేల విజ్ఞప్తి



ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిసిన కాంగ్రెస్ మాదిగ ఎమ్మెల్యేలు

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో మాదిగ సామాజికవర్గానికి చోటు కల్పించాలనే డిమాండ్‌తో మరోసారి తెలంగాణ కాంగ్రెస్ మాదిగ ఎమ్మెల్యేలు హస్తినకు చేరుకున్నారు. ఆరుగురు ఎమ్మెల్యేల్లో ఎవరైనా ఒకరికి మంత్రివర్గంలో స్థానం కల్పించాలని కోరారు. ఈ మేరకు గురువారం అడ్లూరి లక్ష్మణ్, మందుల సామేల్, కాలే యాదయ్య, కవ్వంపల్లి సత్యనారాయణలు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిశారు. అనంతరం కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) కేసీ వేణుగోపాల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఇదే అంశంపై లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీకి లేఖ రాశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ మంత్రివర్గంలో తప్పనిసరిగా తమకు స్థానం కల్పించాలని పార్టీ పెద్దలను కోరామని, వారు సానుకూలంగా స్పందించారని తెలిపారు.

జీపీవో పోస్టులు భర్తీ చేయాలి

విద్యార్థి నిరుద్యోగ జేఏసీ వినతి

సాక్షి, హైదరాబాద్: ఖాళీగా ఉన్న 7404 గ్రామ పాలనాధికారి (జీపీవో) ఉద్యోగాలను జాబ్ కేలెండర్ ద్వారా భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని విద్యార్థి నిరుద్యోగ జేఏసీ కోరింది. ఈ మేరకు గురువారం సచివాలయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి.. తెలంగాణ విద్యార్థి నిరుద్యోగ జేఏసీ చైర్మన్ కోటూరి మానవతారాయ్, ఓయూ, అశోక్ నగర్ నిరుద్యోగ అభ్యర్థులు నేతలు వినతిపత్రం అందజేశారు.

నిన్న రణరంగం.. నేడు నిశ్శబ్దం

భయం గుప్పిట్లో పెద్ద ధన్వాడ

- 12 మంది రైతుల అరెస్ట్.. 14 రోజుల రిమాండ్
- ఘటనపై జాతీయ మానవ హక్కుల కమిషన్‌లో ఫిర్యాదు



నిర్మానుష్యంగా మారిన పెద్ద ధన్వాడ గ్రామం (ఇన్‌సెట్‌లో) రైతులను గద్వాల జిల్లా కోర్టు నుంచి మహబూబ్‌నగర్‌కు వాహనంలో తరలిస్తున్న దృశ్యం

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: ఇథనాల్ కంపెనీ ఏర్పాటును వ్యతిరేకిస్తూ రైతులు చేపట్టిన ఆందోళనలు.. పోలీసుల నిర్బంధం.. ఇరు వర్గాల తోపులాటలతో అట్టుడికిన జోగుళాంబ గద్వాల జిల్లా రాజోలి మండలం పెద్ద ధన్వాడలో తాజాగా నిశ్శబ్దం అలుముకుంది. బుధవారం చేపట్టిన ఆందోళన ఉద్రిక్తంగా మారిన నేపథ్యంలో పోలీసులు గ్రామంలో నిఘా కట్టుదిట్టం చేశారు. ఆందోళనకారులపై డేగకన్ను వేసిన పోలీసులు పెద్ద ధన్వాడతో పాటు పరిసర గ్రామాల్లో మఫ్టీలో సంచరిస్తూ స్థానికుల కదలికలను గమనిస్తున్నారు. దీంతో ఎప్పుడు, ఏం జరుగుతుందోననే భయం ఆయా గ్రామప్రజల్లో నెలకొనగా.. ఇళ్లకే పరిమితమయ్యారు. దీంతో ఫ్యాక్టరీ పరిసరాలు, గ్రామాల్లోని వీధులు నిర్మానుష్యంగా మారాయి.

12 మందికి రిమాండ్..

పెద్ద ధన్వాడ శివారులో పచ్చని పొలాల మధ్య గాయత్రి ఇండస్ట్రీస్ రెన్యూవబుల్ ఫ్యూయల్స్ అండ్ అలైడ్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో ఏర్పాటు చేస్తున్న ఇథనాల్ కంపెనీతో వాయు, జల కాలుష్యం బారిన పడతామని.. ఫ్యాక్టరీకి అనుమతులు రద్దు చేయాలంటూ బుధవారం ఆందోళనకు దిగిన రైతులను పోలీసులు రాత్రి వరకూ జల్లెడ పట్టారు. ఆందోళనలో చురుగ్గా పాల్గొన్న 41 మందిని గుర్తించి.. ఆ రాత్రే 12 మందిని అరెస్టు చేసి మానవపాడు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. గురువారం ఉదయం ఆ రైతులను గద్వాల జిల్లా కోర్టులో హాజరుపరచగా.. వారికి కోర్టు 14 రోజుల పాటు రిమాండ్ విధించింది. కాగా.. మిగిలిన 29 మంది ఆందోళనకారుల కోసం పోలీసులు గాలిస్తున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా ఈ వ్యవహారానికి సంబంధించి పోలీసులు 'జనంసాక్షి' పత్రిక ఎడిటర్ రహమాన్‌తోపాటు నాగర్‌కర్నూల్ జిల్లా సబ్ జైలర్ నాగరాజుపై కూడా కేసులు నమోదు చేయడం చర్చనీయాంశంగా మారింది. దాడుల సమయంలో వారు ఘటనా స్థలంలో లేరని.. అయినా వీరి పేరు చేర్చారంటూ సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. మరో పక్క పెద్ద ధన్వాడ ఘటనకు సంబంధించి న్యాయవాది రామారావు ఇమ్మానేని గురువారం జాతీయ మానవ హక్కుల కమిషన్‌లో పిటిషన్ దాఖలు చేశారు.

10 గ్రామాలపై మఫ్టీలో నిఘా..

ఇథనాల్ కంపెనీ ఏర్పాటును వ్యతిరేకిస్తున్న 10 గ్రామాలపై పోలీసులు ప్రత్యేక నజర్ వేశారు. పెద్ద ధన్వాడ, చిన్న ధన్వాడ, నససనూరు, మాన్‌దొడ్డి గ్రామాల్లో నిఘా కట్టుదిట్టం చేశారు. వీటితో పాటు పచ్చర్ల, తుమ్మిళ్ల, పెద్ద తాండ్రపాడుతోపాటు వడ్డేపల్లి మండలం తనగల, అయిజ మండలంలో తాండ్రపాడు, వేణిసోంపురంపైనా నిఘా పెట్టినట్లు తెలుస్తోంది. ఆయా గ్రామాల్లో గ్రామస్తులు, రైతుల కదలికలను తెలుసుకునేందుకు పోలీసులు మఫ్టీలో సంచరిస్తున్నట్లు సమాచారం. మరోవైపు పెద్ద ధన్వాడ ఘటనకు సంబంధించి ప్రభుత్వానికి, పోలీసులకు వ్యతిరేకంగా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టిన వారినీ పోలీసులు ఉపేక్షించడం లేదు. వ్యతిరేక పోస్టులు పెట్టిన పలువురికి ఫోన్లు చేసి.. పిలిపించుకుని హెచ్చరించినట్లు తెలిసింది. ఈ క్రమంలో ఆయా గ్రామాల ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయి.

ఫ్యాక్టరీ ఏర్పాటుకు ఒప్పుకునేది లేదు..

'మా పచ్చని పొలాలతో పాటు ఆరోగ్యాన్ని దెబ్బతీసే కాలుష్య కారక ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటును ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించేది లేదు' అని రైతులు ముక్తకంఠంతో స్పష్టం చేశారు. గురువారం పెద్ద ధన్వాడలోని రైతు వేదిక వద్ద పలువురు గ్రామస్తులు, రైతులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పోలీసుల తీరును ఖండించారు. 41 మంది రైతులపై అక్రమంగా కేసులు పెట్టారని మండిపడ్డారు. కంపెనీ యాజమాన్యం, బౌన్సర్లు దాడికి దిగినా.. వారిపై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం అన్యాయమని ధ్వజమెత్తారు. సీఎం రేవంత్‌రెడ్డి తమ జిల్లా వాసి అయి ఉండి.. పోలీసులు తమను ఇబ్బంది పెడుతున్నా స్పందించకపోవడం శోచనీయమని విచారం వ్యక్తం చేశారు. 41 మంది రైతులపై పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్ కాపీని ప్రదర్శించారు. నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ తరహాలో ఇక్కడ కూడా ఇథనాల్ ఫ్యాక్టరీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

నిధుల సమీకరణపై దృష్టి పెట్టండి

- ఉన్నతాధికారులకు డిప్యూటీ సీఎం భట్టి ఆదేశం



భేటీలో మాట్లాడుతున్న భట్టి. చిత్రంలో జూపల్లి

సాక్షి, హైదరాబాద్: నిధుల సమీకరణపై అధికారులు తీవ్రంగా దృష్టి పెట్టాలని, ఖజానాకు వచ్చే ఆదాయంలో లోపాలను అరికట్టాలని, ప్రభుత్వానికి తక్షణమే ఆదాయం పెరిగేలా చూడాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. నిధుల సమీకరణకు సంబంధించి గురువారం సచివాలయంలో భట్టి అధ్యక్షతన మంత్రివర్గ ఉపసంఘం సమావేశమైంది. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు, వాటి ప్రగతిని వచ్చేవారం సమావేశంలో అంశాల వారీగా సమీక్షిస్తామని భట్టి తెలిపారు. నిధుల సమీకరణకు సంబంధించి వివిధ శాఖల ఉన్నతాధికారులు చెప్పిన అంశాలు, వాటి పురోగతిని నిరంతరం పరిశీలించడానికి ఆర్థిక శాఖలో ప్రత్యేక అధికారిని నియమించాలని ఆయన ఆదేశించారు. మంత్రి జూపల్లి కృష్ణారావు, ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, రహదారులు, భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ఎక్సైజ్, వాణిజ్యపన్నుల శాఖ ముఖ్యకార్యదర్శి రిజ్వీ, రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శి నవీన్ మిత్తల్, గనుల శాఖ ముఖ్యకార్యదర్శి శ్రీధర్, కమిషనర్లు హరిత, హరికిరణ్, విష్ణువర్ధన్, సురేంద్రమోహన్, బుద్ధ ప్రకాష్ జ్యోతి, ఇలంబర్తి, ఆర్. వి. కర్ణన్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

పేదలను కొట్టి పెద్దలకు భూములు

- పెద్ద ధన్వాడలో రైతులపై కేసులు, అరెస్టులు దుర్మార్గం
- బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు మండిపాటు



సాక్షి, హైదరాబాద్: బీద రైతుల కడుపుకొట్టి వారి భూములను బడా పారిశ్రామికవేత్తలకు కారుచౌకగా కట్టబెట్టడం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అలవాటుగా మారిందని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. తనకు నచ్చిన బడాబాబుల కోసం 2013 భూసేకరణ చట్టాన్ని తుంగలో తొక్కుతూ భూములను బలవంతంగా సేకరించే బాధ్యతను సీఎం భుజాన వేసుకున్నారని ఆరోపించారు. దీంతో రైతులపై తరచూ ప్రైవేటు వ్యక్తులు, పోలీసులు దాడులు చేస్తున్నారని మండిపడ్డారు. జోగుళాంబ గద్వాల జిల్లా పెద్ద ధన్వాడలో ఇథనాల్ ఫ్యాక్టరీకి చెందిన బౌన్సర్లు, పోలీసులు రైతులపై విచక్షణారహితంగా దాడి చేయడం అమానుషమని 'ఎక్స్'లో గురువారం పోస్టు పెట్టారు. పాలమూరు బిడ్డనని పదేపదే చెప్పుకునే సీఎం.. తన సొంత జిల్లాలో ఘటన జరిగినా స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. పోలీసులు పెద్ద ధన్వాడతోపాటు మొత్తం 12 గ్రామాల రైతులపై దాడి చేసి, 40 మందిపై కేసులు నమోదుచేశారని, 12 మందిని రిమాండ్‌కు పంపారని తెలిపారు. రైతులపై దాడి చేయించిన ఇథనాల్ ఫ్యాక్టరీ యజమాని, బౌన్సర్లపై కేసులు ఎందుకు పెట్టలేదో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. పెద్ద ధన్వాడ తరహా ఘటనలు ఏడాదిగా రాష్ట్రంలో అనేకచోట్ల జరుగుతున్నాయని విమర్శించారు. పెద్ద ధన్వాడ ఘటనలో అరెస్టు చేసిన 12 మంది రైతులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

కేసీఆర్ దార్శనికతకు నిదర్శనం హరితహారం

మాజీ సీఎం కేసీఆర్ ముందుచూపుతోనే తెలంగాణలో పచ్చదనం 24 శాతం నుంచి 31 శాతానికి పెరిగిందని హరీశ్‌రావు అన్నారు.

కర్నూలు - IV ట్రాన్స్‌మిషన్ లిమిటెడ్

(పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ యొక్క పూర్తిగా స్వంతమైన సబ్సిడరీ)

బహిరంగ ప్రకటన

కర్నూలు - IV ట్రాన్స్‌మిషన్ లిమిటెడ్ (పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ యొక్క పూర్తిగా స్వంతమైన సబ్సిడరీ), నమోదిత కార్యాలయం, B-9, కుతబ్ ఇన్‌స్టిట్యూషనల్ ఏరియా, కట్వారియా సరాయ్, న్యూ ఢిల్లీ-110016 వారు ప్రభుత్వం ద్వారా నెలకొల్పిన లేదా నిర్వహిస్తున్న లేదా నెలకొల్పబోయే లేదా నిర్వహించబోయే టెలిగ్రాఫ్ ఉద్దేశం కొరకు టెలిగ్రాఫ్ లైన్లు మరియు స్తంభాలు వేయుటకు సంబంధించి ఇండియన్ టెలిగ్రాఫిక్ యాక్ట్, 1885 క్రింద టెలిగ్రాఫ్ అథారిటీ పొందియున్న పనుల యొక్క తగిన సమన్వయం కోసం అవసరమైన టెలిఫోనిక్/టెలిగ్రాఫిక్ కమ్యూనికేషన్ల ఉద్దేశం కొరకు లేదా విద్యుత్ ప్రసారం కొరకు ఎలక్ట్రికల్ లైన్స్ లేదా ఎలక్ట్రికల్ ప్లాంట్ ఏర్పాటుకు ఎలక్ట్రిసిటీ యాక్ట్, 2003లోని సెక్షన్ 164లోని అన్ని అధికారాలు సంక్రమింపచేయవలసిందిగా భారత ప్రభుత్వానికి దరఖాస్తు చేయుటకు ఉద్దేశిస్తున్నది/ దరఖాస్తు చేసినది మరియు దిగువ ట్రాన్స్‌మిషన్ లైన్ల కొరకు సర్వే, నిర్మాణం, స్థాపన, తనిఖీ, ఎరక్షన్ మరియు ఇతర పనులకు అనుసరిస్తూ పనిచేయించుట, ఆపరేషన్, నిర్వహణ మరియు ఇతర పనులను చేపడుతుంది.

స్కీమ్ పేరు: కర్నూలు - IV REZ - యొక్క ఇంటిగ్రేషన్ కొరకు ట్రాన్స్‌మిషన్ సిస్టమ్ – ఫేజ్ –I (4.5 GW కొరకు)

స్కీమ్ క్రింద కవర్ అయ్యే పనులు: కర్నూలు - IV ట్రాన్స్‌మిషన్ లిమిటెడ్

క్ర. సం.	ట్రాన్స్‌మిషన్ స్కీమ్ పరిధి	సామర్థ్యం/లైన్ పొడవు కి.మీ. లో
1	400kV స్థాయి వద్ద ఒక్కొక్కటి 4500 MVA యొక్క రెండు (2) సెక్షన్స్ ఏర్పాటుతో కర్నూలు-IV PS వద్ద 2X330 MVAr (765kV) బస్ రియాక్టర్లతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్నూలు సమీపాన 4X1500 MVA, 765/400kV మరియు 4X500 MVA, 400/200kV కర్నూలు-IV పూలింగ్ స్టేషన్ స్థాపన.	765/400 kV,1500 MVA, ICTs-4 నం.లు(12x500 MVA), 765 kV ICT బేలు - 4 నం.లు, 400 kV ICT బేలు - 4 నం.లు, 400/220 kV, 500 MVA, ICTs - 4 నం.లు, 400 kV ICT బేలు - 4 నం.లు, 220 kV ICT బేలు - 4 నం.లు, 765 kV లైన్ బేలు - 4 నం.లు, (కర్నూలు- IV - బీదర్ మరియు కర్నూలు- IV - కర్నూలు-III 765 kV D/C లైన్స్ యొక్క టర్మినేషన్ కొరకు కర్నూలు - IV PS వద్ద), 765 kV, 330 MVAr బస్ రియాక్టర్- 2 నం.లు, 765 kV బస్ రియాక్టర్ బేలు- 2 నం.లు, 220 kV లైన్ బేలు - 6 నం.లు, 220 kV బస్ సెక్షనలైజర్ :1 set 220 kV బస్ కప్లర్ (BC) బే - 2 నం.లు, 220 kV ట్రాన్స్‌ఫర్ బస్ కప్లర్ (TBC) బే - 2 నం.లు, 1x500MVA, 765/400Kv, 1 ఫేజ్ స్పేర్ ICT, 1x110MVAr, 765kV, 1 ఫేజ్ స్పేర్ రియాక్టర్, భవిష్యత్ స్పేస్ ఏర్పాట్లు: 765/400kV, 1500MVA, ICTs -2 నం.లు, 765kV ICT బేలు - 2 నం.లు, 400kV ICT బేలు - 2 నం.లు, 400/220kV, 500MVA, ICTs -14 నం.లు, 400kV ICT బేలు - 14 నం.లు, 220kV ICT బేలు - 14 నం.లు, 765kV లైన్ బేలు - 8 నం.లు, (SLR కొరకు ఏర్పాటుతో), 400kV లైన్ బేలు-12 నం.లు, (SLR కొరకు ఏర్పాటుతో), 220kV లైన్ బేలు-20 నం.లు, 220kV బస్ సెక్షనలైజర్ : 2 Sets, 220kV బస్ కప్లర్ (BC) బే -2 నం.లు, 220kV ట్రాన్స్‌ఫర్ బస్ కప్లర్ (TBC) బే -2 నం.లు, 400kV బస్ సెక్షనలైజర్ : 1 సెట్.
2	రెండు సర్క్యూట్స్ పై రెండు ఎండ్స్ వద్ద 330 MVAr SLR (కన్వర్టబుల్)తో కర్నూలు-IV - బీదర్ 765 kV D/C లైన్	350 kM, 765 kV లైన్ బేలు - 2 నం.లు (బీదర్ PS వద్ద), 765 kV, 330 MVAr SLR, కర్నూలు - IV PS వద్ద – 2 నం.లు., (6x110 MVAr లైన్ రియాక్టర్), 765 kV, 330 MVAr SLR, బీదర్ PS వద్ద – 2 నం.లు., (1 స్విచబుల్ స్పేర్ యూనిట్‌తో సహా 7x110 MVAr)
3	రెండు సర్క్యూట్స్ పై కర్నూలు-IV వద్ద 240 MVAr SLR (కన్వర్టబుల్)తో కర్నూలు-IV నుండి కర్నూలు -III PS 765 kV D/C లైన్	150 kM, 765 kV లైన్ బేలు - 2 నం.లు (కర్నూలు - III PS వద్ద), 765 kV, 240 MVAr SLR, కర్నూలు - IV PS వద్ద – 2 నం.లు., (1 స్విచబుల్ స్పేర్ యూనిట్‌తో సహా 7x80 MVAr)
4	2x125 MVAr MSRతో పాటు కర్నూలు-IV PS వద్ద ± 300 MVAr STATCOM	400 kV బే - 1 నం.
5	C' Peta వద్ద 1x1500 MVA, 765/400 kV ICT (3వ) స్థాయి పెంపుదల	765/400 kV, 1500 MVA, ICT- 1 నం., 765kV ICT- బేలు–1నం., 400kV ICT బేలు–1నం.
6	C' Peta వద్ద విజయవాడ-నెల్లూరు 400 kV D/C లైన్ యొక్క LILO	40kM 400 kV లైన్ బేలు - 4 నం.లు (C' Peta వద్ద విజయవాడ – నెల్లూరు 400 kV D/C లైన్ యొక్క LILO టర్మినేషన్ కొరకు C' Peta వద్ద)

ఈ స్కీమ్ పరిధిలోని ట్రాన్స్‌మిషన్ లైన్లు కర్నాటక, తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని దిగువ గ్రామాలు, పట్టణాలు మరియు నగరాల ద్వారా, మీదుగా, చుట్టూ మరియు మధ్య నుండి వెళ్తాయి.

(A) 765 KV బీదర్ నుండి కర్నూలు–IV D/C TL:

క్ర.సం.	గ్రామాల పేరు	తహశీల్/ మండలం	జిల్లా
1	కుబర్‌వాడి, హండికెర, చెమ్మిగావ్, రూప్లా నాయక్ తండా, భోపాల్‌గఢ్, బెల్కోని, భవాని బిజల్‌గావ్, ముథోల్ తండా, ముథోల్ బుజుర్గ్, ముథోల్ ఖుర్ద్, తోర్నా, కోరేకల్, హాలహళ్లి, నిదోడ, బెరడ్ తండా, కద్వాడ్ తండా, బెరడ్, కాసింపూర్, బైరాన్‌హళ్లి, బావుల్లి	బెరడ్	బీదర్
2	మాలేగావ్ తండా, మాలేగావ్	మాలేగావ్	బీదర్
3	సాంగ్నాల్, కరక్యాల్, తప్పల్, చందూరి, బెడకొండ, లక్ష్మీనగర్, హిప్పల్‌గావ్, కుప్లి, మూరల్, కోటగియల్, చెర్కేవాడి, సంగోల్గి తండా, శంషేర్ నగర్, సంగోల్గి, సిల్వాడ్, బావ్గి, బావ్గి కెరె, మందకనల్లి తండా, సిర్సి, కద్వాడ్, బాగ్‌దల్, బాగ్‌దల్ రిజర్వ్‌డ్ ఫారెస్ట్, నిద్వంచ, షేకాపూర్, బాపూర్, మొగ్దాల్, మార్కుంద, పత్రపల్లి, సిందోల్, రాజోగిర్, బంగూర్, కమలాపూర్, మొదక్‌నల్లి, కద్వాడ్, బెనకనల్లి, పతేర్పల్లి, కాసింపూర్	బీదర్	బీదర్
4	కొర్యాల్, దోనెగావ్ (ఎం), బలాద్ (కె), హల్‌హళ్లి	కమలానగర	బీదర్
5	లింగదహళ్లి	బసవకళ్యాణ్	బీదర్
6	ఖీమ్రా, కున్నూర్, కున్నూర్ హల్లా, బీరి బుజుర్గ్, నగరాల్, నిట్టూరు బుజుర్గ్, తరనల్లి, బీరి బుజుర్గ్, బదా తండా, బీరి ఖుర్ద్, వల్సాంగ్, హంప్తా, కెరూర్, బాలూర్, బాలూర్ తండా, జైనాపూర్, అహ్మదాబాద్, తేగంపూర్, కోసాం, హాలే హిప్పర్గ, హల్బర్గా, హల్బర్గా ఆర్ఎస్, కోసాం ఆర్ఎఫ్, ధన్నూర, ధన్నూర తండా, మలాసాపూర్, ధన్నూర ఆర్ఎఫ్, ఖానాపూర్, ఖానాపూర్ రిజర్వ్‌డ్ ఫారెస్ట్, దాదేద తండా, ధన్నూర తండా, రుద్నూర్, రుద్నూర్ తండా, జాంతి, కానాజి, నిర్ణనల్లి, నిర్ణనల్లి తండా, బైలహళ్లి, అనదుర్వాడి, అనదుర్ తండా, హాలహళ్లి, హాలహళ్లి తండా, బీరి(కె), బీరి, తెల్గావ్, మెల్కుంద, మల్కాపూర్, కోటగిర	భాల్కి	బీదర్
7	మన్నా ఎఖెళ్లి, మింఖెరా, ఖీమల్‌ఖేడ్	చిట్టగుప్ప	బీదర్
8	దంగర్గావ్	కమలాపూర్	కలబురగి
9	మార్డి, ఖంజమల్‌పురా, ధనసిరి, గోపన్‌పల్లి, అసద్‌గంజ్, గోపన్‌పల్లి ఆర్ఎఫ్, జప్తిపల్లి, ముగ్దంపల్లి, మన్నాపూర్, ఉప్పర్‌పల్లి తండా, పర్వతాపూర్, సజ్జరం తండా, మల్కాపూర్	మొగుడంపల్లి	సంగారెడ్డి
10	చిరాగ్‌పల్లి, రాయిపల్లి, మద్గల్ తండా, గోవింద్‌పూర్, హర్చి నాయక్ తండా, ఏలమ్మ చెరువు, గిడిగడ్డ తండా, తీగలమడుగు తండా, అనిగుంట ఆర్ఎఫ్, అనిగుంట, షేకాపూర్ ఆర్ఎఫ్, యెరన్న రిజర్వాయర్, మల్చల్మ, మల్చల్మ ఆర్ఎఫ్, హోతి (డి), ప్రైకపూర్, అనెగుంట.	జహీరాబాద్	సంగారెడ్డి
11	గొట్టార్‌పల్లి, పర్సపల్లి ఆర్ఎఫ్, పర్సపల్లి, బాదంపేట్, బాదంపేట్ ఆర్ఎఫ్, పీచరగి తండా, గోటిగార్‌పల్లి ఆర్ఎఫ్, సయ్యదా చెరువు, సజ్జాపూర్, బిలాల్‌పూర్, గొట్టార్‌పల్లి తండా, సిద్దాపూర్, సిద్దాపూర్ తండా, మన్యార్‌పల్లి	కోహీర్	సంగారెడ్డి
12	వెంకటాపూర్, భువనప్పూర్, శివరాంపూర్ ఆర్ఎఫ్, శివరాంపూర్, లచ్చసాగర్, శివారెడ్డిపల్లి, మఖ్దంపూర్, కుంచవరం, పోచవరం	చించోలి	కలబురగి
13	కల్కోడ ఆర్ఎఫ్, బుచ్చన్‌పల్లి, దమస్తాపూర్, షాపూర్, కల్కోడ, పైడిగుమ్మల్, కుద్గుంట.	మర్పల్లి	వికారాబాద్
14	యాచారం, సురాల్లాపూర్, బొప్పనవరం, తుర్మామడి, తుర్మామడి ఆర్ఎఫ్, బస్వాపూర్, బండమీదిపల్లి, బంట్వారం, ఈదుల్‌పల్లి, మద్వాపురం, ఈదులపల్లి తండా, రొంపల్లి ఆర్ఎఫ్, రొంపల్లి, మంగరాస్‌పల్లి, నల్పుతాపూర్, గోపాల్‌పూర్, సుల్తాన్‌పూర్, నాగారం, పొమ్మాపూర్, మద్వాపూర్	బంట్వారం	వికారాబాద్
15	ఇందోల్ ఆర్ఎఫ్, ఇందోల్, ఓగులాపురం, కొత్తపల్లి, వాగులాపూర్	కోట్‌పల్లి	వికారాబాద్
16	తింసాన్‌పల్లి, పెద్దమూల్ తండా, పెద్దమూల్, మారేపల్లి, జనగాం, బుధారం, గాజీపూర్, బందపల్లి, లింగంపల్లి, మంబాపూర్, దుగ్గాపూర్, కొండాపూర్, రేగుండి, కాదనహళ్లి, లంబాడి తండా, కనపల్లి, రుక్మాపూర్, రుక్మాపూర్ ఆర్ఎస్, ఖానాపూర్, నాగుల్పల్లె, అల్లాపూర్, ఖాన్పూర్, కందనెల్లి, రేగొండి	పెద్దేముల్	వికారాబాద్
17	నెర్లపల్లి, కమ్లాపూర్ ఆర్ఎఫ్, రాగాపూర్, విశ్వనాథ్‌పూర్, కమ్లాపూర్, అన్నసాగర్, ముసీర్‌పేట్, ఏలాల్, బాగలపల్లె, సంగం ఖుర్ద్, నాగసముందర్, హలీపూర్, కిష్టాపూర్, గోరెపల్లి, దేవనూరు, దేవనూరు తండా, దేవుల తండా, కోకట్, అన్నసాగర్	యాలాల	వికారాబాద్
18	కంజాపురం, తాండూరు, బంకూర్, బిజ్వారం	తాండూర్	వికారాబాద్
19	మంతపురం, దూబచెర్ల, జాన్సంపల్లె, బొమ్రాస్‌పేట్, కొత్తూరు తండా, ఎనిమి తండా, లింగనాయక్ తండా, వడిచెర్ల, మడిమడుగు తండా, తిర్మలాపూర్ రిజర్వ్‌డ్ ఫారెస్ట్, కొత్తూరు, లక్ష్మా నాయక్ తండా, దేవలా నాయక్ తండా, బోటోనే తండా, గంగా నాయక్ తండా, తుంకిమిట్ల, రేగడ్ మల్‌వారం, గిర్కేభాయ్ తండా, మూదుమామిళ్ల తండా, రేగడ్ మెయిల్‌వరం ఆర్ఎఫ్, నాగిరెడ్డిపల్లె, నరసనాయక్ తండా, పూర్యాప్ తండా, బోటోనే తండి, లింగంపల్లె, సందార్‌పూర్, బాపన్‌చెరు తండా, అనంతపూర్, ఎరుపుమళ్ళ తండా, చౌదరిపల్లె, బోడబంద తండా, డిప్లానాయక్ తండా, ఎనికి తండా, బాపల్లె తండా, దుప్పర్ల, బుబ్రాస్‌పేట్, వడిచెర్ల, కొత్తూరు, తుంకుమెట్ల, రేగడమైల్వార్.	బొమ్రాస్ పేట	వికారాబాద్
20	అంసాన్‌పల్లి, చిల్మల్ మైల్వారం, సత్తారగుండ తండా, బొల్లిభాయ్ తండా, గౌరారం, చెట్టుపల్లి తండా, బనిగడ్డ తండా, గౌరారం ఆర్ఎఫ్, దుదియాల్ ఆర్ఎఫ్, అక్కచెరువు తండా, అనంతసాగరం తండా, పలుగు తండా, లగచెర్ల తండా, పులిచెర్ల తండా, ఎర్లపల్లి, ఎర్లపల్లి తండా, బురుజు తండా, లగచెర్ల, రోటిబంద తండా, దుదియాల్, హకీంపేట్, లగచెర్ల ఆర్ఎఫ్, అలీఖాన్‌పల్లి, గౌరారం	దుద్యాల	వికారాబాద్
21	సర్దాఖాన్‌పేట్, తోగాపూర్, రాంపూర్, నాచారం, చంద్రవంచ, లోటీపూర్, కొత్తపల్లె, ముంగిమళ్ల, మహేశ్వరం, కోస్గి, ముక్తిపాడు, ముక్తిపాడు, మాసాయిపల్లి, చెన్నారం, బోళ్యాన్‌పల్లి, కదంపల్లి, బిజ్జారం, మీర్జాపూర్, హనుమాన్‌పల్లి, భక్తిమళ్ల, బాలభద్రాయపల్లి, ముష్రిఫా, కొత్తపల్లి	కోస్గి	నారాయణపేట్
22	నందిపాడు, లక్ష్మాయపల్లి, పల్లెర్ల, పర్సాపూర్, హన్మానాయక్ తండా, జాజరావుపల్లి, చింతల్దిన్నె, నాగిరెడ్డిపల్లి, దేనియానాయక్ తండా, నాగంపల్లి, దోరేపల్లి, దోరేపల్లి తండా, మద్దూరు, భీంపూర్, ఎర్రగుట్ట తండా, నిడ్జింత, చెన్నారం, రాళ్లబాయి, అప్పారెడ్డిపల్లి, రేణివట్ల, అచ్చంపల్లి, పెదిరిపాడు, చంద్రారెడ్డిపల్లి, మోనాపురం, బనన్నపల్లి, జాదవరావుపల్లె, చెన్రెడ్డిపల్లి, మోమినాపూర్	మద్దూర్	నారాయణపేట్
23	బండకొండ, నెమిల్లపల్లి, అభంగాపూర్, బొమ్మన్‌పాడు, వట్టుగుండ్ల, శాసనపల్లి, కొత్తపల్లి, సిరస్‌పల్లి, బసిరెడ్డిపల్లి, అప్పారెడ్డిపల్లి, అమ్మిరెడ్డిపల్లి, సింగారం, జాజాపూర్, అప్పక్‌పల్లి, గురులపల్లి, తిమ్మిడిపల్లి తండా, వల్లంపల్లి, చిన్న జాత్రం, అప్పిరెడ్డిపల్లె, కావరాంపల్లె	నారాయణపేట్	నారాయణపేట్
24	కంసాన్‌పల్లి	దామరగిద్ద	నారాయణపేట్
25	తిపురాస్పల్లి, బాపురం, నిడుగుర్తి, పెద్ద జాత్రం, లక్ష్మంపల్లి, ఉట్కూరు, మఖ్దంపూర్, ఏర్గట్పల్లి, పెద్ద పొర్ల, చిన్న పొర్ల, మల్లేపల్లి, కొల్లూరు	ఉట్కూర్	నారాయణపేట్
26	నాగిరెడ్డిపల్లి, మల్లేపల్లి, యదవెల్లి, మాధవరం, సోమేశ్వరబండ, లింగంపల్లె, ఉప్పరిపల్లి, గోలపల్లి, సంగంబండ, మక్తల్, గుర్లపల్లి, వానాయకుంట, దాసరిపల్లి, తిరుమలాపూర్, చందాపూర్	మక్తల్	నారాయణపేట్
27	వద్దువాటు, ఓబలాపూర్, మాగనూరు, అమ్మపల్లి, పెగడబండ, సత్యవరం, పుంజనూరు	మాగనూర్	నారాయణపేట్
28	కొల్పూరు, ముదుమల్	ముద్మల్	నారాయణపేట్
29	కొరట్కుంద, కొర్విహళ్లి, మామడొడ్డి, ఇబ్రహీందొడ్డి, యారగుంట్, వడ్లపల్లి, సంగమకుంట, అప్పందొడ్డి, రాయిలదొడ్డి, మద్యనదొడ్డి, కొత్తదొడ్డి, నాగందొడ్డి, గన్నూరు, చంద్రబండ, కదగందొడ్డి, కట్లత్కూరు, వద్వట్టి, సింగనోడి, బావిదొడ్డి, గౌన్‌నగర్, కురుబ్‌దొడ్డి, బాపురం, బాపూర్ తండా, దేవనపల్లి, రాజల్‌బండ, అయాజ్‌పూర్, మసిదొడ్డి, తుంటాపూర్, లింగంఖాన్‌దొడ్డి, మేదిగల్దిన్ని, ఇదప్నూర్, హంచినాల్, గంధల్, బుద్దిన్ని, గుంద్రవెల్లి	రాయచూర్	రాయచూర్
30	బిజనగెరె, మొర్చిదొడ్డి, మల్లాపూర్, జంబలదిన్ని, యెరగేర, గుంజెహళ్లి కెరె, పోచల్దిన్ని, గుంజెహళ్లి	ఎర్గెర	రాయచూర్
31	బళ్లాపూర్, చిక్కమంచల్, గురురాజనగర్, హోస్రా తుంగభద్ర	గిల్లెసుగూర్	రాయచూర్
32	చెట్నపల్లి, మంత్రాలయం, సూగూరు, కల్లదేవకుంట, బూదూరు, చిలకలదోన, తిమ్మాపురం, హోగరూరు, మంచాల, సుంకేశ్వరి	మంత్రాలయం	కర్నూలు
33	హలహర్వి, విరూపాపురం	హలహర్వి	కర్నూలు
34	కంబాలదిన్నె, జలవాడి, కంబదహాలు, బాపురం, హిస్సారముర్వాని, దొడ్డిమాకల, పెద్దకడబూరు, గంగనహాలు, రంగాపురం, తారాపురం	పెద్దకడబూర్	కర్నూలు
35	బనవాసి, మలకాపురం, కోటేకల్లు, కోటేకల్లు ఆర్ఎఫ్, దేవిబెట్ట	ఎమ్మిగనూర్	కర్నూలు
36	బసాపురం, కాపాటి, నాగలాపురం, అరకల్లు, బైచిగేరి, సాంబిగల్లు, నెట్టేకల్లు, ఆదోని, దిబ్బనకల్లు, గోనబావి, సదాపురం, హోన్నూరు, విరూపాపురం, ధనపురం, నగరూరు, నారాయణపురం, ఛాయాగి, సలకలకొండ, హవ్వనూరు	ఆదోని	కర్నూలు
37	మూసనహళ్లి, కటరికి, కమ్మరచేడు, మణికుర్తి, మరకట్టు	ఆలూరు	కర్నూలు
38	చిన్నహోతూరు	అస్పారి	కర్నూలు

(B) 765 KV కర్నూలు–III నుండి కర్నూలు–IV D/C TL:

క్ర.సం.	గ్రామాల పేరు	తహశీల్/ మండలం	జిల్లా
1	పెద్ద కుంట, నందిపాడు, తిమ్మనాయనిపేట, బోయలతాడిపత్రి, తోళ్లమడుగు, ఇటిక్యాల, కోరుమానిపల్లె, చింతలపపల్లి, నత్రియం చెన్నంపల్లె, అబ్బుల్లాపురం, మదనంతపురం, అంకిరెడ్డిపల్లె, బందార్లపల్లె, తుమ్మలపెంట, ముచ్చల కొండ, రాఘవరాజుపల్లె, కనకద్రిపల్లె, కల్వటల.	కొలిమిగుండ్ల	నంద్యాల
2	బోయవాండ్లపల్లి, నల్లమేకలపల్లి, జక్కసానికుంట్ల, రాచవాండ్లపల్లి, పాయసాంబ్రంగారెడ్డిపల్లి, రాంపురం, మామిళ్లపల్లి, టేకులకొండ ఆర్ఎఫ్, పోటేదొడ్డి	ప్యాపిలి	నంద్యాల
3	గద్దరగుట్టపల్లె, తలమిట్టపల్లె, బుగ్గ, గోనువారిపల్లె, కావేరిసముద్రం, భోగసముద్రం, అయ్యవారిపల్లె, వెంకటంపల్లి, కొత్తూరు, బ్రాహ్మణపల్లె, తిమ్మపల్లి.	తాడిపత్రి	అనంతపురం
4	చింతమానుపల్లి, నిట్టూరు, కొత్తపల్లి, చిక్కేపల్లి, కమలపాడు, తిప్పారెడ్డిపల్లి, తిమ్మంపల్లి, కొట్టాలపల్లి, వేములపాడు, యాడికి, తూట్రాళ్లపల్లి, రామరాజుపల్లి, కుర్మాజీపేట, టి.కొత్తపల్లి, కొత్తపల్లి, పెద్దపేట, పిన్నాపురం, రాయలచెరువు, యాడికి ఆర్ఎఫ్, చిన్నాపేట, చెందాన, పచ్చరుమేకలపల్లి, కేశవనయ్యపేట, లక్షుంపల్లి, శ్రీరంగాపురం, దయ్యాలమడుగు	యాడికి	అనంతపురం
5	చిన్న గాజులపల్లి, పెద్దగాజులపల్లి, జక్కలచెరువు, గొందిపల్లి, తొండపాడు, పెద్దొడ్డి రిజర్వు ఫారెస్ట్, పొదదొడ్డి, కరాడికొండ, ఊబచెర్ల, బాచుపల్లి, ధర్మాపురం, బసినేపల్లి, ఊటకల్లు, బేటపల్లి, ఓటకల్లు, శంకరబండ	గుత్తి	అనంతపురం
6	చీమలవాగుపల్లి, ధర్మాపురం, చిక్కేపల్లె	పెద్దవప్పూర్	అనంతపురం
7	ఎనికయ్య కొండా	పెద్దవడుగూర్	అనంతపురం
8	బసినేపల్లి, కొట్టాలు, మదనంతపురం, ఖాజీపురం, జాంబపల్లి, పెరవలి, హంప, కంచరదిన్నె, కంచరదిన్నె ఆలయం, బొమ్మనపల్లి, మద్దికెర, మద్దికెర అగ్రహారం, ఎడవల్లి, దొనపాడు, బురుజుల, వెంకటాపురం	మద్దికెర(ఈస్ట్)	కర్నూలు
9	హోసూరు, పుత్సకాయలమడ, రామచంద్రపురం	పత్తికొండ	కర్నూలు
10	బాట తండా, కడమగుంట్ల, చెరువు తండా, ఉప్పర్లపల్లి, సూర్య తండా, బొల్లవానిపల్లి, ఎర్రగుడి, జప్ల తండా, జొన్నగిరి, పగదరాయి, చిన్న జొన్నగిరి, రామాపురం, రతన, తుగ్గలి, తుగ్గలి ఆర్ఎఫ్, మామల్లకుంట, గిరిగట్ల, అమీంబాదు, చెన్నంపల్లి, కొత్తపల్లి, హుస్సేనపురం, ఎర్రగుడి రిజర్వ్‌డ్ ఫారెస్ట్, గుండాల తండా, లక్ష్మి తండా, మిద్దె తండా, లంబాడి తండా	తుగ్గలి	కర్నూలు
11	జోహరపురం, చిన్నహోటూరు	అస్పారి	కర్నూలు
12	మాదిగ కొట్టాల, తిక్కన కొట్టాల, మొలగవల్లి ఆర్ఎస్, మొలగవల్లి, పెద్దహోటూరు, మరకట్టు, అంగసకల్లు, తుంబలబీడు, హాలేబీడు, మణికుర్తి, కాటరికి, కమ్మరచేడు, మూసనహళ్లి	ఆలూరు	కర్నూలు

(C) C' Peta వద్ద 400 KV విజయవాడ – నెల్లూరు 400 KV D/C లైన్ యొక్క LILO:

క్ర.సం.	గ్రామాల పేరు	తహశీల్/ మండలం	జిల్లా
1	ముత్తనపల్లి, మునుమాక ఆర్ఎస్, ఇంద్రగిరి, విప్పర్లపల్లి, మునుమాక, వడ్లముడివారిపాలెం, అన్నవరం, పరగటిచెర్ల, సంతగుడిపాడు, కర్లకుంట, రామిరెడ్డిపాలెం, తుంగపాడు, రొంపిచెర్ల, కొనకంచివారిపాలెం, చిట్టిపోతువారిపాలెం, అలవాల, ముత్తనపల్లి, సుబ్బయ్యపాలెం, తరుమేళ్ళ, రైతునగర్, అన్నవరప్పాడు, విరావట్నం, సంతమాగులూరు	రొంపిచర్ల	పల్నాడు
2	కట్టుబడివారిపాలెం, కొండకవూరు, అమీన్సాహిబ్‌పాలెం, గోనెపూడి, చింతలపాలెం, బసికాపురం, పెద్ద తురకపాలెం, ఎల్లమంద, చిన్న తురకపాలెం, గురవాయపాలెం, అచ్చమ్మపాలెం, తురకపాలెం, పెట్లూరివారిపాలెం, ఉప్పలపాదు, కాకాని, ఉప్పలపాడు, అరవపల్లి, లింగంగుంట్ల, వీకుర్తి, అల్లూరివారిపాలెం, అన్నవరం, పాలపాదు	నర్సారావుపేట	పల్నాడు
3	సంతమాగులూరు ఆర్ఎస్, కామేపల్లి, పుట్టవారిపాలెం, లక్ష్మీపురం, మిన్నికల్లు, పత్తేపురం, నెహ్రూనగర్ కాలనీ, బండివారిపాలెం, పమిడిమర్రి, తంగేడుమల్లి, చవటపాలెం, సజ్జాపురం, మాదిగపాలెం, కొప్పారం, గురిజేపల్లి	సంతమాగులూరు	బాపట్ల
4	కొప్పరపాలెం, కోటవారిపాలెం, సోమవరప్పాదు	బల్లికురవ	బాపట్ల

రూట్ అలైన్‌మెంట్ కాపీ క్రింది సంతకందారు కార్యాలయంలో లభిస్తుంది. ప్రతిపాదిత ప్రసార వ్యవస్థపై పరిశీలన/అభ్యర్థనలను ఈ నోటీసు ప్రచురణ తేదీ నుండి రెండు నెలలలోగా అనగా 03.08.2025లోగా వ్రాతపూర్వకంగా దిగువ సంతకందారు కార్యాలయానికి దాఖలు చేయవలసిందిగా సాధారణ ప్రజలకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది. తదుపరి వివరాలు మరియు స్పష్టీకరణల కోసం సంప్రదించండి: ప్రాజెక్ట్ ఇన్-ఛార్జ్/సంప్రదింపు వ్యక్తి : A C శంకరయ్య, హోదా: చీఫ్ జనరల్ మేనేజర్ మరియు ప్రాజెక్ట్ ఇన్-ఛార్జ్, కర్నూలు - IV ట్రాన్స్‌మిషన్ లిమిటెడ్ మొబైల్ నం.: 9440908930, ఇ-మెయిల్ ID :acsankaraiah@powergrid.in, కార్యాలయ చిరునామా: పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్, #6-6-8/32 & 395E, కవాడిగూడ మెయిన్ రోడ్, సికింద్రాబాద్ – 500080, తెలంగాణ రాష్ట్రం.

కర్నూలు - IV ట్రాన్స్‌మిషన్ లిమిటెడ్

(పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ యొక్క పూర్తిగా స్వంతమైన సబ్సిడరీ)

కార్పొరేట్ కార్యాలయం: "సౌదామిని", ప్లాట్ నం.2, సెక్టార్-29, గురుగ్రామ్-122001 (హర్యానా), ఫోన్: 0124-257100-719

నమోదిత కార్యాలయం: B-9, కుతబ్ ఇన్‌స్టిట్యూషనల్ ఏరియా, కట్వారియా సరాయ్, న్యూ ఢిల్లీ-110016. ఫోన్: 011-26560112, 26560121

ఒక మహారత్న PSU

SR-I/PR/Advt-03/Public Notice-03/2025-26/OTS

జమ్మూ మరియు కాశ్మీర్
పురోగతిలో నూతన శకం



సుమారు రూ. 44,000 కోట్లు
విలువగల రైల్వే ప్రాజెక్టుల బహుమతులు

ప్రారంభోత్సవం

చీనాబ్ బ్రిడ్జి
(ప్రపంచంలోనే ఎత్తైన రైల్ ఆర్చ్ బ్రిడ్జి)

- 359 మీటర్లు ఎత్తు, 1315 మీటర్ల పొడవు మరియు 467 మీటర్ల ఆర్చ్ స్పాన్
- జమ్మూ కాశ్మీర్‌లోని రియాసి జిల్లాలో కౌరి మరియు బక్కల్ ప్రాంతాలను బ్రిడ్జి కలుపుతుంది.

అంజీ బ్రిడ్జి
(భారతదేశంలో మొదటి కేబుల్ స్టేయ్డ్ రైల్ బ్రిడ్జి)

- 725 మీటర్ల పొడవు, 290 మీటర్ల మెయిన్ స్పాన్
- జమ్మూ కాశ్మీర్‌లోని కాట్రా మరియు రియాసి జిల్లాలను బ్రిడ్జి కలుపుతుంది.
- 193 మీటర్ల ఎత్తు గల ఒక సింగిల్ భారీ పైలాన్‌కు 96 కేబుల్స్ జత చేయబడినవి.

జాతికి అంకితం

ఉధంపూర్-శ్రీనగర్-బారాముల్లా
రైల్ లింక్ ప్రాజెక్ట్ (USBRL)

- భారతదేశంలోని మిగతా ప్రాంతంతో జమ్మూ కాశ్మీర్‌ను కలిపే అడ్వాన్స్‌డ్ అన్ని - వాతావరణాలలో ఉండే రైల్ కనెక్టివిటీ
- టి-50 (భారతదేశంలో అతి పొడవైన ఆపరేషనల్ టన్నెల్)తో సహా 36 టన్నెల్స్‌తో మొత్తం పొడవు 272 కి.మీ. మరియు 943 వంతెనలు

జెండా ఊపి ప్రారంభోత్సవం

2 వందే భారత్ ట్రైన్లు
శ్రీ మాతా వైష్ణోదేవి కాట్రా - శ్రీనగర్
& శ్రీనగర్ - శ్రీ మాతా వైష్ణోదేవి కాట్రా

- శ్రీనగర్‌కు మొదటి సెమీ-హై-స్పీడ్ ట్రైన్
- పర్యాటకం మరియు ప్రాంతీయ అనుసంధానానికి ఊతం
- కాట్రా నుండి శ్రీనగర్‌కు ప్రయాణం సుమారు 3 గంటలలోనే సాధ్యమవుతుంది

ప్రారంభకులు
శ్రీ నరేంద్ర మోదీ
ప్రధాన మంత్రి

విశిష్ట అతిథులు

నితిన్ జైరామ్ గడ్కరీ
కేంద్ర రోడ్డు రవాణా మరియు రహదారుల శాఖ మంత్రి

అశ్వినీ వైష్ణవ్
కేంద్ర రైల్వే, సమాచార మరియు ప్రసార, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ మంత్రి

డా. జితేంద్ర సింగ్
కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ మరియు ఎర్త్ సైన్సెస్ సహాయ మంత్రి (స్వతంత్ర హోదా) మరియు ప్రధాన మంత్రి కార్యాలయం, సిబ్బంది, ప్రజా సమస్యలు మరియు పెన్షన్, అణుశక్తి, అంతరిక్ష శాఖ సహాయ మంత్రి

వి. సోమన్న
కేంద్ర రైల్వే మరియు జలశక్తి శాఖ సహాయ మంత్రి

రవ్‌నీత్ సింగ్
కేంద్ర రైల్వే మరియు ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి

మనోజ్ సిన్హా
జమ్మూ కాశ్మీర్ కేంద్ర పాలిత ప్రాంత లెఫ్టినెంట్ గవర్నర్ మరియు చైర్మన్, శ్రీ మాతా వైష్ణో దేవీ ష్రైన్ బోర్డ్, జమ్మూ కాశ్మీర్

ఒమర్ అబ్దుల్లా
ముఖ్యమంత్రి జమ్మూ కాశ్మీర్ కేంద్రపాలిత ప్రాంతం

సురీందర్ కుమార్ చౌదరి
ఉప ముఖ్యమంత్రి జమ్మూ కాశ్మీర్ కేంద్ర పాలిత ప్రాంతం

జుగల్ కిశోర్
ఎంపీ (లోక్‌సభ), జమ్మూ

ఆగా సయ్యద్ రుహుల్లా మెహ్ది
ఎంపీ (లోక్‌సభ), శ్రీనగర్

గులామ్ అలీ
ఎంపీ, రాజ్యసభ

శుక్రవారం, 06 జూన్, 2025 | ఉ. 11.00 గం. | శ్రీ మాతా వైష్ణో దేవి ష్రైన్ బోర్డ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ కాట్రా (స్టేడియం)

భారతీయ రైల్వే

డి.డి. న్యూస్‌లో ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించండి | www.indianrailways.gov.in | మమ్మల్ని అనుసరించండి /RailMinIndia



అధికారులకు మాత్రమే కనబడదు!
వీధుల్లో ఏర్పాటు చేసే వారాంతపు సంతలు, ప్రతి మార్కెట్‌లోనూ నిషేధిత ప్లాస్టిక్ విచ్చలవిడిగా వినియోగిస్తున్నా అధికారుల కంటికి కనిపించడం లేదు. -12లో



వాహ్.. క్యా 'బాత్'హై..
ఐస్ బాత్ థెరపీ నగరంలోని ఆరోగ్య, ఫిట్‌నెస్ ప్రియులకు నూతన ట్రెండ్‌గా మారింది. ఈ థెరపీతో ఆరోగ్య ప్రయోజనాలున్నాయని నిపుణులు చెబుతున్నారు. - సిటీప్లస్‌లో



వాతావరణం
నగరంలో శుక్రవారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్ఠంగా 35, కనిష్ఠంగా 25 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది.

తార్నాక జంక్షన్ క్లోజ్

నేటి నుంచి పాత పద్ధతిలోనే..



సాక్షి ఎఫెక్ట్..

సాక్షి, సిటీబ్యూరో: నగర ట్రాఫిక్ విభాగం అధికారులు ప్రయోగాత్మకంగా తెరిచిన తార్నాక జంక్షన్‌ను ఇక మూసివేయనున్నారు. అక్కడి వాస్తవ పరిస్థితులతో పాటు ఇతర కారణాల నేపథ్యంలో ప్రస్తుతం ఆ చౌరస్తా అటు పోలీసులు, ఇటు వాహనచోదకులకు చుక్కలు చూపిస్తోంది. బుధవారం 'జంక్షన్‌లో 'జామ్'జాటం' శీర్షికన 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనాన్ని పరిగణనలోకి తీసుకున్న ట్రాఫిక్ చీఫ్ డి.జోయల్ డెవిస్ గురువారం ఆ ప్రాంతానికి వెళ్లారు. క్షేత్రస్థాయిలో అనేక అంశాలను అధ్యయనం చేశారు. దీంతో పాటు వివిధ మార్గాల్లో అధ్యయనం చేసిన అధికారులు శుక్రవారం నుంచి తార్నాక జంక్షన్‌ను మూసేయాలని, పాత పద్ధతిలోనే వాహనాల రాకపోకలు పునరుద్ధరించాలని నిర్ణయించారు.

చేప ప్రసాదం పంపిణీకి సిద్ధమవుతున్న ఎగ్జిబిషన్ గ్రౌండ్





ఏసీపీ ప్రవీణ్‌కుమార్

అబిడ్స్: ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ప్రసాద పంపిణీకి అన్ని శాఖల వారీగా ఏర్పాట్లు వేగిరమయ్యాయి. ఈ నెల 8న ఉదయం నుంచి 9వ తేదీ ఉదయం వరకు చేప ప్రసాదం పంపిణీ చేయనున్నారు. పోలీస్, జీహెచ్ఎంసీ, ఆర్అండ్‌బీ, వాటర్ బోర్డు, విద్యుత్, రెవెన్యూ, రవాణా, మత్స్య తదితర ప్రభుత్వ శాఖలతో అధికారులు సమన్వయ సమావేశాలు నిర్వహించి చేప ప్రసాదం పంపిణీకి భారీ ఎత్తున సన్నాహాలు చేస్తున్నారు. ఆర్అండ్‌బీ ఆధ్వర్యంలో బారికేడ్లు, షెడ్ల నిర్మాణాలు దాదాపు పూర్తి కావస్తున్నాయి.

భారీ బందోబస్తు: ఏసీపీ ప్రవీణ్ కుమార్
ఈ సందర్భంగా 800 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు అబిడ్స్ డివిజన్ ఏసీపీ పి.ప్రవీణ్‌కుమార్ వెల్లడించారు. ఎగ్జిబిషన్ గ్రౌండ్ పరిసరాల్లో సీసీ కెమెరాలతో నిఘా చేడతామన్నారు. అబిడ్స్, బేగంబజార్ పోలీస్‌స్టేషన్ల సిబ్బందితో పాటు సెంట్రల్‌జోన్ సిబ్బంది, ఇతర అదనపు పోలీసు బలగాలతో బందోబస్తు చేపట్టనున్నట్లు ఆయన వివరించారు. స్వచ్ఛంద సంస్థల వలంటీర్ల సహాయం కూడా తీసుకుంటామన్నారు. వాటర్ బోర్డు ఆధ్వర్యంలో దాదాపు 5 లక్షల వాటర్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచనున్నట్లు జీఎం జాన్ షరీఫ్ తెలిపారు.

నాలాల కబ్జాలను పరిశీలించిన హైడ్రా కమిషనర్

సాక్షి, సిటీబ్యూరో: నాలాల కబ్జాలపై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ దృష్టి సారించారు. సోమవారం ప్రజావాణిలో అందిన ఫిర్యాదులపై గురువారం క్షేత్రస్థాయిలో ఆయన పరిశీలించారు. తొలుత హస్మత్‌పేట్ పికెట్ నాలా, ప్యాట్నీ సెంటర్ వద్ద హస్మత్‌పేట్, పికెట్ నాలాలు కుంచించుకుపోవడంతో మహేంద్ర హిల్స్, పికెట్, జేబీఎస్, బాలంరాయి, విమాన్‌నగర్ తదితర ప్రాంతాలు నీట మునుగుతున్నాయని స్థానికులు ఆధారాలతో చూపించారు. నాలా కబ్జాలకు గురికావడంతో వేలాది ఇళ్లు ప్రతిసారీ మునుగుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. కంటోన్మెంట్ అధికారులకు గతంలో ఫిర్యాదు చేశామని తెలిపారు. నగరంలోని నాలాలపై కిర్లోస్కర్ కమిటీ, ఓయెంట్స్ కమిటీ నివేదికలతో పాటు సర్వే ఆఫ్ ఇండియా, ఎన్ఆర్ఎస్‌సీ శాటిలైట్ చిత్రాలను పరిశీలించి చర్యలు తీసుకుంటామని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు.

చీకోటి గార్డెన్స్‌లోనూ..
ప్రకాష్‌నగర్ మెట్రోతో పాటు చీకోటి గార్డెన్స్ ప్రాంతాలు 3 సెం.మీ వర్షం కురిస్తే నీట మునుగుతున్నాయి. ఇక్కడ అర మీటర్ల వెడల్పు వరద కాల్వ కొన్ని చోట్ల 4.5 మీటర్ల మేర కబ్జా అయ్యిందని స్థానికులు హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. కొన్ని చోట్ల ఎవరికి నచ్చినట్లు వారు నాలాను డైవర్ట్ చేశారని పేర్కొన్నారు. దీంతో సమీప ప్రాంతాలు, అపార్ట్‌మెంట్లు చిన్నపాటి వర్షానికే నీట మునుగుతున్నాయన్నారు. అధికారులతో చర్చించి త్వరలోనే చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చారు.





పర్యావరణంతోనే మనుగడ!

హైదరాబాద్ సిటిజన్స్ ఫోరం ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్లాస్టిక్ కాలుష్యానికి ముగింపు పలకాలని ట్యాంక్ బండ్‌పై మానవహారం చేపట్టారు. సేవ్ హుస్సేన్ సాగర్.. సేవ్ హైదరాబాద్ అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. పర్యావరణాన్ని పరిరక్షిస్తేనే మానవ మనుగడ సాధ్యమని నినదించారు.

భూ బేరం!



టార్గెట్ రూ.5,000 కోట్లు

- ఆదాయ సముపార్జనకు హెచ్ఎండీఏ ప్రణాళికలు
- ఎలివేటెడ్ కారిడార్లు, గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు తదితర ప్రాజెక్టుల కోసం..
- మొదటి దశలో కోకాపేట్, ఇన్ముల్‌నర్వ, ఉప్పల్, తుర్కయంజాల్ ప్లాట్‌ల బిడ్డింగ్
- నాలుగు ప్రాంతాల్లో 385 ప్లాట్లు విక్రయానికి సిద్ధం
- రెండు, మూడు దశల్లో మరో 10 ప్రాంతాల్లో స్థలాల వేలం

వివిధ ప్రాంతాల్లో ఆన్‌లైన్‌బిడ్డింగ్‌కు సిద్ధంగా ఉన్న ప్లాట్లు

ఏరియా	మొత్తం ఎకరాల్లో	హెచ్ఎండీఏ ప్లాట్లు	విక్రయించినవి	ప్రస్తుతం ఉన్నవి
కోకాపేట్	533.01	20	14	5 (ఒకప్లాట్ రంగారెడ్డి కలెక్టరేట్‌కు తిరిగి ఇచ్చారు)
ఇన్ముల్‌నర్వ	92.69	327	-	-
ఉప్పల్ భగాయత్	56.39	64	23	41
తుర్కయంజాల్	9.00	34	22	12

మొత్తం హెచ్ఎండీఏ ప్లాట్లు : 1141, రైతులకు కేటాయించినవి : 696, ఇప్పటి వరకు విక్రయించినవి : 59, అమ్మకానికి సిద్ధంగా ఉన్నవి : 385

సాక్షి, సిటీబ్యూరో:

హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) మరోసారి భూ బేరానికి సన్నద్ధమవుతోంది. గతంలో వివిధ ప్రాంతాల్లో విక్రయించగా మిగిలిపోయిన స్థలాలను మరోసారి అమ్మకానికి పెట్టేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. పాత లే అవుట్‌లలో ఉన్న స్థలాలను విక్రయించడంతో పాటు కొత్త లే అవుట్‌లను సైతం సిద్ధం చేస్తున్నారు. నగరంలో చేపట్టనున్న పలు ప్రాజెక్టుల కోసం సుమారు రూ.5,000 కోట్లు ఆర్జించడమే లక్ష్యంగా హెచ్ఎండీఏ ఆన్‌లైన్ బిడ్డింగ్‌కు ప్రణాళికలను రూపొందిస్తోంది.

గతంలో భారీ స్పందన లభించిన ప్రాంతాల్లో..

- సికింద్రాబాద్ నుంచి డెయిరీఫాం వరకు, శామీర్‌పేట్ వరకు ఎలివేటెడ్ కారిడార్‌లకు ప్రతిపాదనలు రూపొందించిన సంగతి తెలిసిందే. ప్యారడైజ్ నుంచి డెయిరీఫాం వరకు టెండర్లను సైతం కేటాయించారు.శామీర్‌పేట్ రూట్‌లో ఆస్తుల సేకరణ తుది దశకు చేరింది. ఈ రెండు ప్రాజెక్టుల నిర్మాణానికి కనీసం రూ.3000 కోట్లకు పైగా ఖర్చు కానున్నట్లు అంచనా. అలాగే రావిర్యాల నుంచి ఆమన్‌గల్ వరకు నిర్మించనున్న గ్రీన్‌ఫీల్డ్ రోడ్డుకు సైతం రెండు దశల్లో రూ.2500 కోట్ల వరకు వ్యయం కానుంది.
- హైదరాబాద్ మహానగరాభివృద్ధిలో భాగంగా మెగా మాస్టర్‌ప్లాన్- 2050, సికింద్రాబాద్ స్కైవాక్, హుస్సేన్‌సాగర్ సుందరీకరణ, పార్కులు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, రహదారుల విస్తరణ వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలను దృష్టిలో ఉంచుకొని భూముల అమ్మకాల ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకోవాలని అధికారులు భావిస్తున్నారు. ఈ క్రమంలో గతంలో కొనుగోలుదార్ల నుంచి భారీ స్పందన లభించిన ప్రాంతాల్లో మిగిలిపోయిన ప్లాట్‌లను మొదట విక్రయించి ఆ తర్వాత రెండు, మూడు దశల్లో వివిధ ప్రాంతాల్లోని స్థలాలను విక్రయించనున్నారు.



మొదటి దశలో..
కోకాపేట్ నియోపొలిస్, ఇన్ముల్‌నర్వ, ఉప్పల్ భగాయత్, తుర్కయంజాల్‌లో గతంలో పెద్ద ఎత్తున స్పందన లభించింది. అప్పటి ప్రభుత్వానికి రూ.వేల కోట్ల ఆదాయం లభించింది. ఉప్పల్ భగాయత్‌లో రెండు దశల్లో ప్లాట్‌లను విక్రయించారు. కోకాపేట్‌లో ఎన్నారైలు, దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన నిర్మాణ సంస్థలు, రియల్టర్లు పెద్ద ఎత్తున పోటీ పడ్డారు. ప్రస్తుతం ఈ నాలుగు ప్రాంతాల్లో రైతుల నుంచి సేకరించిన భూములపై వారికి 60 శాతం ప్లాట్‌లను కేటాయించగా హెచ్ఎండీఏకు 40 శాతం ప్లాట్‌లు లభించాయి. వాటిలో మరో 385 ప్లాట్‌లు అమ్మకానికి సిద్ధంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు.

రెండు, మూడో దశల్లో..
మొదటి దశలో కొనుగోలుదారులు, వివిధ వర్గాల నుంచి లభించే స్పందన మేరకు ఆన్‌లైన్ బిడ్డింగ్ కొనసాగించనున్నారు. ఈ క్రమంలో బుద్వేల్, ప్రతాపసింగారం, బహదూర్‌పల్లి, హకీంపేట్, షేక్‌పేట్‌లలోని హుడాహైట్స్, కంది, కుత్బుల్లాపూర్, పెద్దకంజర్ల, ఫసల్‌వాడి తదితర ప్రాంతాల్లో లే అవుట్‌లను అభివృద్ధి చేసి ప్లాట్‌లను విక్రయించనున్నారు.

దశలవారీగా విక్రయించేందుకు హెచ్ఎండీఏ లే అవుట్‌లు..

ఏరియా	మొత్తం ఎకరాల్లో	హెచ్ఎండీఏ ప్లాట్లు	విక్రయించినవి	ప్రస్తుతం ఉన్నవి
లేమూరు	83.47	164	-	164
తొర్రూరు	117.375	885	392	493
కుర్మల్‌గూడ	16.75	145	86	59
బాచుపల్లి	27.36	206	204	2
మేడిపల్లి	53.21	208	91	117 (కొన్ని ప్లాట్లు కోర్టు కేసుల్లో ఉన్నాయి.)
మోకిల	165.37	908	189	719 (కొన్ని స్థలాల రిజిస్ట్రేషన్ పెండింగ్‌లో ఉంది.)
బుద్వేల్	182.10	17	12	4
ప్రతాప సింగారం	126.12	24	-	24
బహదూర్‌పల్లి	40.00	221	152	69
హుడా హైట్స్	12.45	37	-	37
కంది	47.14	341	-	341

ఇంకుడు గుంతలు.. కళ్లకు గంతలు!

ఓసీలు పొందే వరకే పరిమితం..

- ఆ తర్వాత పట్టించుకోని వైనం
- ఐదేళ్లలో తవ్వినవి 33 శాతమే
- 69 వేలకుగాను 23వేల ఇళ్లలోనే..
- వాటికి సైతం కొరవడిన నిర్వహణ
- బల్దియాలో భూగర్భజలాలు పెరిగేదెలా?

గత ఐదేళ్లలో జీహెచ్ఎంసీలో ఇళ్ల నిర్మాణాలు, ఇంకుడు గుంతలు ఇలా..

ఆర్థిక సంవత్సరం	భవన అనుమతులు	ఓసీలు జారీ	ఇంకుడు గుంతలు
2020-21	12,306	1,216	5,378
2021-22	17,604	1,606	3,284
2022-23	14,665	2,560	4,881
2023-24	13,491	2,683	5,218
2024-25	11,509	2,036	4,578
మొత్తం	69,575	10,001	23,239



సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీ పరిధిలో భవన (ఇళ్ల) నిర్మాణంలో భాగంగా ఇంకుడుగుంతలు తవ్వుతున్న వారే కొందరు. వారిలోనూ చాలామంది కేవలం ఓసీ (ఆక్యుపెన్సీ సర్టిఫికెట్) పొందేందుకు మాత్రం తూతూమంత్రంగా ఇంకుడుగుంతలున్నట్లు చూపుతున్నప్పటికీ, అనంతరం చాలా మంది వాటి నిర్వహణను పట్టించుకోవడం లేదు. దీంతో ఉన్న ఇంకుడు గుంతలు సైతం కాగితాల్లో తప్ప వాటితో ఎటువంటి మేలూ జరగడం లేదు. వర్షపు నీరు భూమి లోపలికి వెళ్లడం లేదు. దీనికంతటికీ కారణం అధికారుల అశ్రద్ధ, పర్యవేక్షణ లేకపోవడమే. గత ఐదేళ్లలో జీహెచ్ఎంసీ 69,575 భవన నిర్మాణాలకు అనుమతులివ్వగా, అందులో ఇంకుడు గుంతలు నిర్మించింది 23,239 భవనాల్లోనే. అంటే 33.40 శాతమే. ఓవైపు భూగర్భ జలాలు అడుగంటకుండా కాపాడేందుకు, మరోవైపు వర్షాలొచ్చినప్పుడు నాలాలు పొంగిపొర్లి రోడ్లు, కాలనీలు మునిగిపోకుండా ఉండేందుకు ప్రభుత్వం 100 చదరపు మీటర్ల కంటే ఎక్కువ స్థలంలో నిర్మించే అన్ని ఇళ్లకు ఇంకుడుగుంతల నిర్మాణాన్ని తప్పనిసరి చేసింది.

ఓసీల కోసమే..

- వాల్టా చట్టం మేరకు 200 చదరపు మీటర్ల కంటే ఎక్కువ స్థలంలో భవనాలకు ఓసీ జారీ చేసే ముందు నిబంధనల్ని కఠినంగా అమలు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. క్షేత్రస్థాయిలో తనిఖీలు చేసి, ఇంకుడుగుంత ఉంటేనే ఓసీ ఇవ్వాలని స్పష్టం చేసింది. లేని పక్షంలో ఓసీ ఇవ్వొద్దని పేర్కొంది. ఇటీవల ముగిసిన ఆర్థిక సంవత్సరం (2024-25)లో జీహెచ్ఎంసీ 11,509 భవన నిర్మాణాలకు అనుమతులు జారీ చేయగా, వాటిలో 4,578 భవన నిర్మాణదారులు మాత్రమే ఇంకుడు గుంతలు నిర్మించారు.
- వారిలో 2,036 మంది ఓసీలు పొందారు. అలా గడచిన ఐదేళ్లలో 1,0001 మంది మాత్రమే ఓసీలు పొందారు. నీటి వనరులు, భూమి, పర్యావరణ పరిరక్షణ కోసం ప్రభుత్వం వాల్టా చట్టాన్ని తెచ్చినప్పటికీ, అమలులో అటు అధికారులు, ఇటు ప్రజలు శ్రద్ధ చూపడం లేదు. 200 చదరపు మీటర్ల కంటే తక్కువ స్థలం, ఏడు మీటర్ల లోపు భవనాలకు ఓసీల అవసరం లేకుండా మినహాయింపు ఇచ్చారు. ఇతరులకు అమ్ముకోవాలనుకున్నప్పుడు, లేక బ్యాంకు రుణం అవసరమైనప్పుడు చూపించేందుకు మాత్రమే ఓసీలు తీసుకుంటున్నవారూ ఉన్నారు.

'ఔట్ సోర్సింగ్'పై వేటు

9 మంది కంప్యూటర్ ఆపరేటర్లు, 8 మంది హెల్త్ అసిస్టెంట్ల తొలగింపు

- నకిలీ బర్త్ సర్టిఫికెట్ల వ్యవహారంలో వీరి పాత్ర ఉందని..





సాక్షి, సిటీబ్యూరో: నకిలీ బర్త్ సర్టిఫికెట్ల జారీలో పాత్ర ఉందని గుర్తించిన జీహెచ్ఎంసీ 9 మంది కంప్యూటర్ ఆపరేటర్లు, 8 మంది హెల్త్ అసిస్టెంట్లపై వేటు వేసింది. విధుల నుంచి వారిని తొలగించింది. జీహెచ్ఎంసీలోని 14 సర్కిళ్ల పరిధిలో ఈ అక్రమా లు జరిగినట్లు గుర్తించి వారిని తొలగించారు. బుధవారం జీహెచ్ఎంసీ పాలక మండలి సమావేశం జరిగేంత వరకు వారిని తొలగించినట్లు వెల్లడి కాలేదు. నకిలీ బర్త్, డెత్ సర్టిఫికెట్ల బాధ్యులను గుర్తిస్తూ తగిన చర్యలు తీసుకుంటున్నామని, 9 మంది కంప్యూటర్ ఆపరేటర్లు, 8 మంది హెల్త్ అసిస్టెంట్లను విధుల నుంచి తొలగించినట్లు అధికారులు సభకు సమాధానమిచ్చారు. ఔట్‌సోర్సింగ్‌వారిపై తప్ప అధికారులపై చర్యలు తీసుకోరా? అనే సభ్యుల ప్రశ్నకు బదులిస్తూ పోలీసు కేసులు నమోదయ్యాయని, విచారణ జరుగుతోందని, దోషులుగా తేలినవారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. కొందరిపై అభియోగాలు నమోదు చేసినట్లు ఈ సందర్భంగా పేర్కొన్నారు. కాప్రా, ఉప్పల్, హయత్‌నగర్, ఎల్‌బీనగర్, గోషామహల్, ఖైరతాబాద్, ఆర్‌సీపురం-పటాన్‌చెరు, కుత్బుల్లాపూర్, గాజులరామారం సర్కిళ్లలోని కంప్యూటర్ ఆపరేటర్లను, మలక్‌పేట, సంతోష్‌నగర్, చార్మినార్, ఫలక్‌నుమా, రాజేంద్రనగర్, గోషామహల్, ఆర్‌సీపురం-పటాన్‌చెరు, కుత్బుల్లాపూర్ సర్కిళ్లలోని హెల్త్ అసిస్టెంట్లను విధుల నుంచి తొలగించారు.

అధికారుల పాత్ర లేకుండా సాధ్యమా ?
ఈ నేపథ్యంలో అధికారుల ప్రమేయం లేకుండా కేవలం ఔట్‌సోర్సింగ్‌పై పనిచేసే వారే బర్త్, డెత్ సర్టిఫికెట్లను జారీ చేశారా? అనే ప్రశ్న ప్రస్తుతం ఉత్పన్నమవుతోంది. నకిలీ సర్టిఫికెట్లకు వారిని బాధ్యులుగా పేర్కొంటూ, కేవలం వారిపైనే వేటు వేయడంతో జీహెచ్ఎంసీ తీరుపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఎంతోకాలంగా ఈ 'దందా' జరుగుతున్నా, దాదాపు రెండున్నరేళ్లక్రితమే అవకతవకలు దృష్టికి రావడంతో అప్పట్లో జారీ అయిన సర్టిఫికెట్లను రద్దు చేశామని చెబుతున్నప్పటికీ, ఇంతవరకు ఇంకా ఎందుకు నకిలీ సర్టిఫికెట్ల జారీని కట్టడి చేయలేకపోయారనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

తెలుగు టీచర్లు కావలెను!

సీబీఎస్ఈ నిబంధనతో వెతుకులాటలో పాఠశాలలు

- తెలుగులోనే బోధన నిబంధనతో భారీగా డిమాండ్
- మాతృభాషపై పట్టున్న ఉపాధ్యాయుల కొరత
- అమలుపై వ్యక్తమవుతున్న భిన్నాభిప్రాయాలు

సాక్షి, సిటీబ్యూరో: విద్యార్థులకు మాతృభాషలోనే బోధించాలన్న సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) నిర్ణయం పలు పాఠశాలలను గందరగోళానికి గురి చేస్తోంది. ఈ నిబంధన కూడా 2025-26 విద్యా సంవత్సరం నుంచే అమలులోకి రానుంది. ఇందుకోసం పాఠశాలలు పెద్ద ఎత్తున తెలుగు ఉపాధ్యాయులను నియమించాల్సి వస్తోంది. నగరంలోని పలు పాఠశాలల ప్రిన్సిపాళ్లు చెబుతున్న ప్రకారం.. 40 శాతానికి పైగా ఉపాధ్యాయులు తెలుగు తెలిసినవారు కాకపోవడం ఇప్పుడు పెద్ద సమస్యగా మారింది.

కొరతే.. సమస్య..
జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ) ప్రకారం, కొత్త నిబంధనలో భాగంగా విద్యార్థులకు రెండో తరగతి వరకు తమ మాతృభాషలో లేదా రాష్ట్ర భాషలో బోధన అందించాలి. 'ఇది అమలు చేయడంలో ప్రధాన సమస్య ఉపాధ్యాయుల కొరతే. తెలుగు బోధనకు ప్రత్యేక తరగతులు నిర్వహించాల్సి వస్తుంది లేదా సబ్జెక్ట్ అనువదించేందుకు కొత్త ఉపాధ్యాయులను నియమించాలి' అని కొంపల్లిలోని ఓ పాఠశాల డైరెక్టర్ అన్నారు. 'టాప్ స్కూళ్లలో కనాకష్టంగా 10% ఉపాధ్యాయులే తెలుగులో బోధించగలరు' అని చెప్పారాయన.

గట్టి సవాలే..
తెలుగు బోధన మీడియంగా ఉండటం గట్టి సవాలేనని హైదరాబాద్ సాహోదయ స్కూల్స్ కాంప్లెక్స్‌లో సభ్యులుగా ఉన్న పలు సీబీఎస్ఈ పాఠశాలల ప్రిన్సిపాళ్లు కూడా అంటున్నారు. రామంతాపూర్‌లోని ఓ పేరొందిన స్కూల్‌కి ప్రిన్సిపాల్ మాట్లాడుతూ 'తెలంగాణ నుంచే కాక ఇతర రాష్ట్రాల్లోనూ తరచూ ఉపాధ్యాయులు ట్రాన్స్‌ఫర్స్‌పై వస్తూ ఉంటారు. వారిలో చాలామంది ఇంగ్లిష్ మీడియంలో చదివినవారు కాబట్టి వారికి తెలుగుపై పట్టు ఉండడం లేదు' అని అన్నారు. అదే పరిస్థితి విద్యార్థులకు కూడా ఎదురవుతుందని, వారు కూడా రాష్ట్రాలతో పాటు స్కూళ్లు మారుతూ ఉంటారని.. దీంతో ఈ నిబంధన అమలు కష్టసాధ్యమని ఆయన గుర్తు చేశారు.

మేలు కూడా..
సమస్యలు ఎలా ఉన్నప్పటికీ.. ఈ నిబంధన మేలు చేస్తుందని కూడా కొందరు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా స్టేట్ సిలబస్ అమలు చేస్తున్న పలు పాఠశాలల యాజమాన్యాలకు ఇది మంచి మార్పుగా అనిపిస్తోంది 'మన దగ్గర చాలా మంది టీచర్లకు తెలుగు తెలుసు తెలుగు మీడియం వల్ల విద్యార్థులకు మెరుగైన పునాది పడుతుంది. తద్వారా ఉన్నత తరగతులలో సులభంగా విషయాలు అర్థం చేసుకుంటారు' అని రాష్ట్ర గుర్తింపు పొందిన పాఠశాలల యాజమాన్య సంఘం కార్యదర్శి శేఖర్ రావు అంటున్నారు.

ఈ విధానం మంచిదే.. కానీ..





మాతృభాషలో నేర్చుకుంటే కాన్సెప్ట్స్ బాగా అర్థమవడానికి నేర్చుకున్నది ప్రాసెస్ చేసుకోవడానికి మేధాశక్తి పెరిగేందుకు వీలుంటుంది. అది చిన్న వయసులో జరగడం చాలా ఉపయుక్తం. దీనివల్ల మనం సంస్కృతీ సంప్రదాయాలను బాగా ప్రమోట్ చేయగలుగుతాం. మాతృభాషలో నేర్చుకోవడం ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. పిల్లలు ఉపాధ్యాయులతో బాగా ఇంటరాక్ట్ కాగలుగుతారు. ఈ లాభాలున్నప్పటికీ.. ప్రస్తుతం దీనిని అమలు చేయడంలో కొన్ని సవాళ్లు ఉన్నాయి. ముఖ్యంగా టీచర్లకు శిక్షణ, అలాగే రీసోర్సెస్ సమకూర్చుకోవాలి. మరోవైపు ప్రస్తుత గ్లోబల్ మార్కెట్‌ను చూసుకుంటే ఆంగ్ల భాషా నైపుణ్యం చాలా అవసరం. ఈ నిర్ణయం అమలుతో ఆంగ్లభాష నేర్చుకోవడం ఆలస్యం కావచ్చు. ఇలాంటి కొన్ని కీలక సవాళ్లను మనం సరిగా పరిష్కరించుకోగలిగితే.. ఈ విధానం విజయవంతంగా అమలు చేయవచ్చు.

– తనూజ, ప్రిన్సిపాల్, పల్లవి మోడల్ స్కూల్

ఏసీబీ వలలో అవినీతి చేపలు!

లంచం తీసుకుంటూ పట్టుబడ్డ తూంకుంట మున్సిపల్ సిబ్బంది



ఏసీబీ అధికారులకు పట్టుబడ్డ తూంకుంట మున్సిపల్ సిబ్బంది

శామీర్‌పేట్: తూంకుంట మున్సిపల్ సిబ్బంది లంచం తీసుకుంటూ గురువారం ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. వివరాలివీ... తూంకుంట మున్సిపాలిటీలో ఇటీవల విలీనమైన శామీర్‌పేట వార్డులో విధులు నిర్వహిస్తున్న బిల్ కలెక్టర్ రాంరెడ్డి, కంప్యూటర్ ఆపరేటర్ శ్రావణ్‌లు రూ. 20 వేల లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. శామీర్‌పేట వార్డు పరిధిలో ఓ వ్యక్తి రెండు ఇళ్లను కొనుగోలు చేసి మ్యుటేషన్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. ఏడాదిన్నరగా మ్యుటేషన్ కోసం అధికారుల చుట్టూ తిరిగాడు. శామీర్‌పేట వార్డు ఆఫీసులో పని చేసే బిల్ కలెక్టర్ రాంరెడ్డి, కంప్యూటర్ ఆపరేటర్ శ్రావణ్‌లు లంచం డిమాండ్ చేశారని, దీంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించినట్లు ఏసీబీ డీఎస్పీ ఆనంద్ కుమార్ వెల్లడించారు. లంచం డబ్బులు తీసుకుంటుండగా వల పన్ని పట్టుకున్నామన్నారు. ఈ కేసులో ఎవరెవరికి సంబంధాలు ఉన్నాయనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఒక స్థలం.. డబుల్ రిజిస్ట్రేషన్..

ప్లాట్ విక్రయించి వ్యక్తి అరెస్టు



నిందితుడు అశోక్ కుమార్

దుండిగల్: ఒకే స్థలాన్ని రెండు సార్లు రిజిస్ట్రేషన్ చేసిన వ్యక్తిని దుండిగల్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల సమాచారం మేరకు... మల్లంపేట ప్రాంతానికి చెందిన జె.అశోక్ కుమార్ అలియాస్ సారా అశోక్ స్థానికంగా ఉన్న 195, 196వ సర్వే నెంబర్లలోని 9.39 గుంటల్లో గతంలో వెంచర్ వేశాడు. మౌలాలికి చెందిన అన్వర్ ఖాతూన్ అనే మహిళ బాచుపల్లికి చెందిన మోహన్‌రెడ్డి సహకారంతో 1986 సంవత్సరంలో సదరు వెంచర్‌లో ప్లాట్‌ను కొనుగోలు చేసింది. కొన్నాళ్ల వరకు ఖాతూన్‌తో పాటు ఆమె కుటుంబ సభ్యులు ప్లాట్ వద్దకు రాలేదు. ఇది గమనించిన అశోక్ సదరు ప్లాట్‌ను స్వాధీనం చేసుకునేందుకు కుట్ర పన్నాడు. అందులో భాగంగా 2004 సంవత్సరంలో అశోక్ సదరు స్థలాన్ని మోహన్‌రెడ్డి పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించాడు. 2023లో ఖాతూన్ ఆమె కుటుంబ సభ్యులు ప్లాట్ వద్దకు రావడంతో మోసం వెలుగుచూసింది. మోహన్‌రెడ్డి పేరుపై ప్లాట్‌ను మార్చినట్లు గుర్తించారు. ఈ మేరకు బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు డబుల్ రిజిస్ట్రేషన్ చేసిన అశోక్‌కుమార్‌ను నిందితుడిగా గుర్తించారు. గురువారం అశోక్‌కుమార్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో అశోక్‌కుమార్‌తో పాటు ఇతరుల పాత్ర ఏమైనా ఉందా.. ఇలాంటి దొంగ రిజిస్ట్రేషన్లు ఇంకేమైనా చేశాడా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మీ ఆప్తుల అంత్యక్రియలు, శ్రద్ధాంజలి, నిర్యాణం, వర్ధంతి, జయంతిల ప్రకటనల కోసం సంప్రదించండి.

మీ ఆప్తులకై ప్రయాణించిన ఆత్మీయుల జ్ఞాపకాలు, నివాళులు బంధుమిత్రులకు మరియు శ్రేయోభిలాషులకు సాక్షిలో ప్రకటనల ద్వారా తెలియజేసే అవకాశం.

ఈ తరహా ప్రకటనలపై డిస్కౌంట్ కూడా కలదు

Ph: 040-23256000 Ext: 6344, 9912220352

టికెట్ అడిగారని 'ట్రాక్స్'పై పగ!

రైలు నుంచి దించినందుకు విధ్వంసాలకు కుట్ర

- ఉత్తరాఖండ్‌కు చెందిన ఓ నకిలీ బాబా వ్యవహారం
- హైదరాబాద్‌తో పాటు తమిళనాడులోనూ కేసులు
- అరెస్టు చేసిన రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ అధికారులు
- వారెంట్‌పై తీసుకువెళ్లిన చెన్నై ఆర్పీఎఫ్ బృందాలు

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ పరిసర ప్రాంతాలతో పాటు తమిళనాడులోనూ రైలు పట్టాలపై రాళ్లు, రాడ్లు, కర్రలు పెట్టి రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్‌తో (ఆర్పీఎఫ్) సహా జాతీయ దర్యాప్తు సంస్థనూ (ఎన్ఐఏ) పరుగులు పెట్టించిన నకిలీ బాబా చిక్కాడు. ఇతగాడిని తెలంగాణ ఆర్పీఎఫ్ పోలీసులు అరెస్టు చేయగా... చెన్నై అధికారులు పీటీ వారెంట్‌పై అక్కడకు తరలించారు.

- ఉత్తరాఖండ్‌కు చెందిన విజయ్‌కుమార్ వృత్తిరీత్యా ఎలక్ట్రీషియన్. బతుకుతెరువు కోసం ఒడిస్సాలో స్థిరపడిన ఇతగాడు కుటుంబాన్ని వదిలేసి హఠాత్తుగా బాబా అవతారం ఎత్తాడు. తన పేరును ఓంగా మార్చుకుని దేశ సంచారం మొదలుపెట్టాడు. భిక్షాటన చేసుకుంటూ జీవించడం, కనిపించిన రైలు ఎక్కడం, నచ్చిన చోట దిగడం, ప్లాట్‌ఫామ్స్‌పై దొరికినవి తినడం ఇవే దినచర్యలుగా కొన్నేళ్లు బతికేశాడు.
- రైళ్లు, రైల్వే ప్లాట్‌ఫామ్స్‌పై ఇలాంటి బాబాలు, భిక్షాటన చేసే వాళ్లు, హిజ్రాల బెడద పెరిగిపోతున్నాయంటూ ప్రయాణికుల నుంచి రైల్వే అధికారులకు వరుస ఫిర్యాదులు అందాయి. దీంతో ప్రయాణికులను ఇబ్బంది పెడుతున్న ఇలాంటి వాళ్లను ఉపేక్షించవద్దని రైల్వే ఉన్నతాధికారులు స్పష్టమైన ఆదేశాలను జారీ చేశారు.



నిందితుడు ఓంను అరెస్టు చేసిన పోలీసు

- అప్పటి నుంచి టీసీలు, జీఆర్పీ, ఆర్పీఎఫ్ అధికారులు ఇలాంటి వాళ్లు ఎక్కడ కనిపించినా టికెట్ తనిఖీ చేయడం, లేకపోతే దింపేయడం లాంటివి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రైలులో ఒడిస్సా నుంచి హైదరాబాద్ వస్తున్న ఓం బాబాను టిక్కెట్ లేని కారణంగా టీసీ మార్గమధ్యంలో దింపేశారు. ఈ విషయంలోనే ఓం బాబా హర్ట్ అయ్యాడు. దీంతో ఏకంగా రైల్వేల పైనే కక్ష పెంచుకున్నాడు.
- నగరంలోని కాచిగూడ–బుద్వేల్ మధ్య రైలు పట్టాలపై పెద్ద కర్రలు, రాళ్లు పెట్టాడు. వీటిని గుర్తించిన గ్యాంగ్‌మెన్లు తొలగించి, ఆర్పీఎఫ్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో అప్రమత్తమైన అధికారులు నిందితుడిని పట్టుకునేందుకు మఫ్టీలో రంగంలోకి దిగడంతో పాటు గ్యాంగ్‌మెన్లను అప్రమత్తం చేశారు.
- కాటేదాన్ ప్రాంతంలో రైలు పట్టాల వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓంను గుర్తించిన ఆర్పీఎఫ్ అతడిని అదుపులోకి తీసుకుంది.
- విచారణ నేపథ్యంలో ఈ నేరాలు తానే చేసినట్లు అతడు అంగీకరించడంతో అరెస్టు చేసి జైలుకు పంపారు.
- నగరంలో ఈ పని చేసి, అరెస్టు కావడానికి మధ్యలో చెన్నై వెళ్లిన ఓం అక్కడా ఇలాంటి పనే చేశాడు. విల్లివాక్కం, అంబత్తూరు, ఆవడి, అరక్కోణంలలో రైలు పట్టాలపై వస్తువులు పెట్టడంతో ఐదు కేసులు నమోదయ్యాయి.
- ఈ ఏడాది ఏప్రిల్ 26 ఉదయం 9.30 గంటలకు ఆవడి రైల్వే యార్డ్ వద్ద సిగ్నల్ ఆపరేషన్ విఫలమైంది. రైల్వే సిబ్బంది వెంటనే ట్రాక్‌ను పరిశీలించగా ఐరన్ పెండ్రాల్ క్లిప్‌లు తొలగించినట్లు గుర్తించారు. క్లిప్‌లు, రెండు అంగుళాల ఇనుప ముక్కలను ట్రాక్‌పై ఉంచినట్లు తేల్చారు.
- మరుసటి రోజు రాత్రి 7 గంటలకు అరక్కోణం రైల్వే స్టేషన్ సమీపంలోని ఆరు పాయింట్ల వద్ద బ్యాలస్ట్, ఇనుప ముక్కలు కనిపించాయి. అదే రోజు రాత్రి 11.47 గంటలకు అంబత్తూరు రైల్వే స్టేషన్‌లో ఐదు చోట్ల బ్యాలస్ట్‌లు ఉంచినట్లు ఆర్పీఎఫ్‌కి సందేశం వచ్చింది.
- రైల్వే సిబ్బంది వెంటనే అప్రమత్తమై బ్యాలస్ట్‌ను తొలగించి, ట్రాక్‌పై రైళ్ల రాకపోకలను పునరుద్ధరించారు. ఇక్కడి అధికారుల విచారణలో ఈ విషయాలు వెలుగులోకి రావడంతో చెన్నై ఆర్పీఎఫ్ అధికారులకు సమాచారం ఇచ్చారు.
- దీంతో ఓంపై అక్కడి కోర్టు నుంచి ప్రిజనర్స్ ట్రాన్సిట్ (పీటీ) వారెంట్ తీసుకొచ్చిన అధికారులు చెన్నై తరలించారు.
- తమిళనాడులో ఇతడు చేసిన పనితో ఎన్ఐఏ కూడా ఉలిక్కిపడింది. దీని వెనుక ఉగ్రకోణం ఉందని అనుమానించి రంగంలోకి దిగింది. చివరకు ఇది ఓ దొంగ బాబా పనిగా తేలడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

నిషేధిత అల్ప్రాజోలం టాబ్లెట్ల పట్టివేత

నలుగురిని అరెస్టు చేసిన ఎక్సైజ్ అధికారులు

సాక్షి, సిటీబ్యూరో: నిషేధిత అల్ప్రాజోలం టాబ్లెట్లను ఉత్తరప్రదేశ్ కాన్పూర్ నుంచి అక్రమంగా తెప్పించి అధిక ధరలకు విక్రయిస్తున్న నలుగురిని ఎక్సైజ్ అధికారులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ. 6.48 లక్షల విలువైన 1.80 లక్షల టాబ్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అడిషనల్ కమిషనర్ సయ్యద్ యాసిన్ ఖురేషి గురువారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. కల్లును కల్తీ చేసేందుకు, ఎక్కువ మత్తు కలిగించేందుకు ఈ అల్ప్రాజోలం టాబ్లెట్లను వినియోగిస్తారు. ప్రభుత్వం వీటిని నిషేధించింది. అయినా వీటి వ్యాపారం యథేచ్ఛగా కొనసాగుతోంది. కొందరు ఎలాంటి అనుమతులు లేకుండా రూ. 4 విలువైన ఒక టాబ్లెట్‌ను రూ. 10 నుంచి రూ. 20 చొప్పున విక్రయిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. హైదరాబాద్‌కు చెందిన పువ్వాడ లక్ష్మణ్, కేతుపల్లి మునిశేఖర్, పొద్దుటూరుకు చెందిన మరో ఇద్దరిని నగరంలోని హయత్‌నగర్ వద్ద అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి 1.80 లక్షల టాబ్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ. 6.48 లక్షలు ఉంటుందని అంచనా.

నార్కొటిక్ డ్రగ్ కేసులో పరారీలో ఉన్న...

ఇద్దరు ఏపీ పోలీసుల అరెస్టు

మూసాపేట: నార్కొటిక్ డ్రగ్ కేసులో పరారీలో ఉన్న ఇద్దరు ఏపీ పోలీసులను కూకట్‌పల్లి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల సమాచారం మేరకు... కూకట్‌పల్లి జయనగర్‌లో ఈ నెల 2వ తేదీన అనుమానాస్పద కదలికలను గమనించిన పెట్రోలింగ్ పోలీసులు ఐదుగురు పెడ్లర్లను అరెస్టు చేశారు. వారి నుంచి 820 గ్రాముల ఎఫిడ్రిన్ డ్రగ్‌ను స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ కేసులో పరారీలో ఉన్న ఇద్దరు ఏపీ పోలీసులను తిరుపతిలో అరెస్టు చేసి గురువారం రిమాండ్‌కు తరలించారు. ఏ1 మూర్తి గుణశేఖర్(38) తిరుపతిలోని ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో ఏఆర్ పోలీస్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. ఏ8 పూజారి రామచందర్(50) తిరుపతిలోని ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో ఏఆర్ పోలీస్ హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. డబ్బు సులువుగా సంపాదించాలనే దురాశతో ఎఫెడ్రిన్ డ్రగ్ వ్యాపారం చేశారు. ఏ9 శ్రీనివాస్‌రెడ్డి, ఏ 10 ఈశ్వర్‌రెడ్డిలు ఇటీవల జరిపిన వ్యాపార లావాదేవీలో ఏపీ పోలీసులు మూర్తి గుణశేఖర్, పూజారి రామచంద్రలు ఏ 2కు డ్రగ్ సరఫరా చేశారు. ఏ2 ఉన్నం సురేంద్ర అతని అనుచరులు ఇప్పటికే అరెస్టు అయిన ఐదుగురు నిందితులు హైదరాబాద్‌లో డ్రగ్‌ను విక్రయించాలని నిర్ణయించారు. మే 29న తిరుపతిలో మూర్తి గుణశేఖర్ నుంచి 820 గ్రాముల డ్రగ్ ఎఫిడ్రిన్‌ను ఉన్నం సురేంద్ర తీసుకొని గుంటూరు మీదుగా హైదరాబాద్‌కు రాగా వారిని కూకట్‌పల్లి పోలీసులు జూన్ 2న అరెస్టు చేశారు. వారి అరెస్టు తెలుసుకున్న ఇద్దరు ఏపీ పోలీసులు పరారీ అయ్యారు. సాంకేతిక నిఘా, విశ్వసనీయమైన సమాచారంతో నిందితులను తిరుపతిలోని చిల్లకూరులో అరెస్టు చేసి హైదరాబాద్‌కు తీసుకొచ్చారు. మరో ముగ్గురు ఏ7 అప్పన్న, ఏ9 శ్రీనివాస్‌రెడ్డి, ఏ10 ఈశ్వర్‌రెడ్డిలు పరారీలో ఉన్నట్లు కూకట్‌పల్లి పోలీసులు వివరించారు.

'పరిశోధన గ్రంథాలయం'లో

విజిలెన్స్ తనిఖీలు

లాలాపేట: తార్నాకలోని తెలంగాణ రాష్ట్ర రాజ్యాభిలేఖ పరిశోధన గ్రంథాలయంలో గురువారం విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. హైదరాబాద్ శివారులోని మంచిరేవుల వద్ద ఉన్న కోట్ల రూపాయల విలువైన భూములకు నకిలీ ధ్రువపత్రాలను తయారు చేసి ఇచ్చారనే అభియోగాలతో అధికారులు సోదాలు చేపట్టారు. ఆ సమయంలో డైరెక్టర్ అందుబాటులో లేరు. ఇద్దరు డిప్యూటీ డైరెక్టర్లు మాత్రమే గ్రంథాలయంలో ఉన్నారు. నకిలీ పత్రాల తయారీలో ప్రమేయం ఉన్న వారి వివరాలను విజిలెన్స్ అధికారులు ఆరా తీశారు.

◆ రాజ్యాభిలేఖ పరిశోధన గ్రంథాలయ ఉద్యోగి చంద్రశేఖర్ నకిలీ భూ పత్రాలను తయారు చేస్తున్నారనే కారణంగా అతన్ని ఇటీవలే ఉద్యోగం నుంచి తొలగించి విషయం విదితమే.

ఆటోడ్రైవర్ మృతిపై ఎన్‌హెచ్‌ఆర్‌సీ సీరియస్

- రాజేంద్రనగర్ పోలీసులు చిత్రహింసలకు గురి చేసినందునే...
- పత్రికల్లో వచ్చిన కథనాల ఆధారంగా సుమోటోగా కేసు స్వీకరణ
- రెండు వారాల్లో పూర్తి నివేదిక ఇవ్వాలని డీజీపీకి నోటీసులు

సాక్షి, న్యూఢిల్లీ: పోలీసు కస్టడీలో హింసకు గురై వ్యక్తి మరణించాడనే ఆరోపణలపై జాతీయ మానవ హక్కుల సంఘం (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) సీరియస్ అయ్యింది. ఈ ఘటనపై పత్రికలు, టీవీ చానళ్లలో వచ్చిన వార్తల ఆధారంగా తాము సుమోటోగా కేసు స్వీకరించినట్లు గురువారం ఓ ప్రకటనలో తెలిపింది. ఈ సందర్భంగా తెలంగాణ డీజీపీకి ఎన్‌హెచ్‌ఆర్‌సీ నోటీసులు జారీ చేసింది. వివరాలివీ... 'హైదరాబాద్ రాజేంద్ర నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆటో డ్రైవర్(35), అతని భార్యకు మధ్య కొన్ని మనస్పర్థలు వచ్చాయి. ఈ క్రమంలో 2025 మే 13న ఆటో డ్రైవర్‌ను అతని భార్య రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లింది. దంపతులకు పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఆ తర్వాత ఆటో డ్రైవర్‌ను ఒక గదిలోకి తీసుకెళ్లారు. అక్కడ పోలీసులు అతడిని రబ్బరు బెల్టుతో తీవ్రంగా కొట్టారు. గంట తర్వాత అతడిని పోలీసులు వదిలి పెట్టారు. పోలీస్ స్టేషన్ బయటికి రాగానే వాంతులు చేసుకుంటూ కుప్పకూలిపోయాడు. అతడిని ఆస్పత్రికి తీసుకెళ్లారు. అతను మరణించారని వైద్యులు ధ్రువీకరించారు'. ఈ కథనాలను పరిగణలోకి తీసుకుని సుమోటోగా కేసును స్వీకరించినట్లు ఎన్‌హెచ్‌ఆర్‌సీ పేర్కొంది. ఈ విషయాన్ని డీజీపీకి జారీ చేసిన నోటీసుల్లోనూ స్పష్టం చేసింది. మీడియాలో వచ్చినది నిజమైతే ఇది తీవ్రమైన మానవ హక్కుల ఉల్లంఘనగా పరిగణించాల్సి ఉంటుందని ఎన్‌హెచ్‌ఆర్‌సీ స్పష్టం చేసింది. రెండు వారాల్లో సమగ్ర నివేదిక అందజేయాలని డీజీపీని ఆదేశించింది.

సిందూర్ సాహసోపేత చర్య: లక్ష్మణ్



మాట్లాడుతున్న ఎంపీ లక్ష్మణ్

సాక్షి, సిటీబ్యూరో: ఆపరేషన్ సిందూర్ ఎంతో సాహసోపేత చర్య అని ఎంపీ లక్ష్మణ్ పేర్కొన్నారు. గురువారం సాయంత్రం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ప్రధాని నరేంద్రమోదీ 11 ఏళ్ల పాలన, విజయాలు, ప్రపంచ పర్యావరణ దినోత్సవం, యోగా దివస్ అజెండాలతో బీజేపీ గోల్కొండ జిల్లా నేతలతో వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ... మోదీ దేశ పౌరుల భద్రతకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. ఉగ్రదాడులకు పాల్పడుతున్న పాకిస్తాన్‌కు తగిన గుణపాఠం చెప్పారన్నారు. 70 ఏళ్ల కాంగ్రెస్ పాలనతో పోల్చితే దేశంలో ఐఐటీలు, ఐఐఎం, ఎయిమ్స్ సంఖ్య రెట్టింపయ్యాయని, మెడికల్ సీట్లు గణనీయంగా పెరిగాయన్నారు. 52 కోట్ల మందికి ముద్ర రుణాలు ఇచ్చామన్నారు. మేకిన్ ఇండియా సత్ఫలితాలను ఇచ్చిందని తెలిపారు. పార్టీ గోల్కొండ జిల్లా అధ్యక్షుడు ఉమామహేంద్ర మాట్లాడుతూ... నాయకులు, కార్యకర్తలు కేంద్ర కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు. 21న యోగా దివస్ నిర్వహించుకుందామని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సురేఖ, ప్రేమ్ సింగ్ రాథోడ్, అట్లూరి రామకృష్ణ, ఉమా రాణి, కోలా దీపక్, తదితరులు పాల్గొన్నారు.

రసూల్‌పురా ఫ్లైఓవర్ నిర్మాణానికి...

భూసేకరణను పూర్తి చేయండి

జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్

సనత్‌నగర్: రసూల్‌పురా ఫ్లైఓవర్ నిర్మాణానికి భూసేకరణను త్వరితగతిన పూర్తి చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్ అధికారులను ఆదేశించారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పునరుద్ధరణ పనుల నేపథ్యంలో గురువారం కమిషనర్ సికింద్రాబాద్ జోన్‌లోని పలు ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న బస్టాప్‌లను పరిశీలించారు. రైల్వే సరిహద్దు నుంచి 24 మీటర్ల వరకు భూమి అవసరం ఉందని అధికారులు కమిషనర్‌కు తెలియజేశారు. బస్టాప్‌కు ప్రత్యామ్నాయ భూమిని కేటాయించి దానిని తరలించాల్సిన అవసరం ఉందని ప్రాజెక్ట్ ఎస్ఈ శ్రీనివాస్ కమిషనర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కమిషనర్.. రసూల్‌పురా వద్ద చేపట్టనున్న ఫ్లైఓవర్ నిర్మాణ స్థలాన్ని వెంటనే పరిశీలించి భూసేకరణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రైల్వేస్టేషన్ ఎదురుగా ఉన్న బస్టాప్‌ను హెచ్ఎంఆర్ఎల్ పాత గాంధీ ఆస్పత్రికి మార్చాలని నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు విజ్ఞప్తి చేశారు.

ఫెయిల్ అయ్యానని విద్యార్థిని ఆత్మహత్య

కూకట్‌పల్లి: ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షల్లో ఫెయిల్ అయ్యాననే మనస్తాపంతో విద్యార్థిని సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహ్యకు పాల్పడిన సంఘటన బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువాం జరిగింది. ఇన్‌స్పెక్టర్ నరసింహారాజు సమాచారం మేరకు... పద్మారావు నగర్‌కు చెందిన చంద్రప్రియ(16) స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. ఇటీవల వచ్చిన ఫలితాల్లో నాలుగు సబ్జెక్టుల్లో ఆమె ఫెయిల్ అయింది. దీంతో ఆమె ఆత్మహత్యకు పాల్పడింది. తండ్రి చక్రపాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మన్నె క్రిశాంక్‌కు నోటీసులు

రాజేంద్రనగర్: తమపై తప్పుడు వార్తలు రాసి తమ ప్రతిష్ట దిగదరేలా సోషల్ మీడియాలో పోస్ట్ చేశారంటూ రాష్ట్ర మైనార్టీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ సొసైటీ చైర్మన్ మొహమ్మద్ ఫయీమ్ ఖురేషి రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రాజేంద్రనగర్ పోలీసులు గురువారం స్థానికంగా ఉన్న మన్నె క్రిశాంక్ కుమార్‌కు నోటీసులు అందజేశారు. ఈ నెల 7వ తేదీన ఉదయం 10 గంటలకు రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్‌లో హాజరు కావాలంటూ అందులో పేర్కొన్నారు. ఇదే కేసులో యూట్యూబ్ చానల్ నిర్వాహకుడితో పాటు మరో వ్యక్తికి నోటీసు అందించి స్టేషన్‌లో విచారించారు.

14న మెడికల్ కళాశాలల్లో రక్తదాన శిబిరాలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

సాక్షి, సిటీబ్యూరో: ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 14వ తేదీన తెలంగాణలోని మెడికల్ కళాశాలల్లో రక్తదాన శిబిరాలు నిర్వహించనున్నామని తెలంగాణ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ మహేష్ పేర్కొన్నారు. గురువారం మెడికోస్ బ్లడ్ డోనర్స్ క్లబ్ ఏర్పాటు చేసిన ప్రత్యేక పోస్టర్‌ను మెడికల్ కౌన్సిల్ కార్యాలయంలో ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... రక్తదానం చేసేందుకు ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. వైద్య విద్యార్థులు చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మెడికల్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, సభ్యులు సన్నీ డేవిస్ తదతరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

■ Last Chance 10th. Inter Direct Degree (Dist), BA, B.Com, B.Sc, BBA, BCA, BMLT, DMLT,B.Tech,Diploma MA,M.Com,M.Sc, MBA MCA Regular/ Lateral Entry Ph: 9490577501 [H-783377]

Real Estate

FLAT FOR SALE

■ UNIQUE 3 BHK Flats For Sale at Rajendernagar, 40 Exclusive Flats with No. Common Walls. Enjoy Rooftop Swimming, 2 Spacious Guest Rooms, Gym and Lush Lawn for Functions. Common Areas Powered by Solar. All Flats 100% Vastu-Compliant. Perfect for Privacy and Luxury. For Details: 9866333026, 9052777777. Limited Opportunity! [HA-15913]

Services

BUSINESS SERVICE

■ మీ బంగారం బ్యాంకుల్లో గానీ, మార్వాడి షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా మా డబ్బు తో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్: 9100329739 [H-800533]

BUSINESS OFFER

■ ITR/Salary Slip లేకుండా 48 గంటల్లో హోమ్‌లోన్ పొందడం కష్టం కాదు. Home First మీకు సహాయం చేయడానికి, సలహాలకి కాల్ చేయండి :7406393937 [IA-465]

PERSONAL CARE

CHANGE OF NAME

■ I, Lingaiyith Chandrakala W/o K V Sravan Kumar, R/o: 4-6-93/6/1/3 Attapur, RR-48 Changed My Name As Chandrakala Panchal [SCA25004585]

■ I, MARRI SIVAIAH (old name), aged about 67 years, R/o H No: 651, 2nd cross road no. 21, HMT Swarnapuri Colony, Miyapur, Venkateswara Swamy Temple, Ameenpur, Medak, Telangana State-502032, have changed my name as SADA SIVA RAO MARRI for all future purpose [HA-15910]

■ I ALIZAR SHANTILAL SACHIN KUMAR, S/o. I SHANTILAL JAIN R/o. 6-6-8 to 32, A Block, Flat No. 506, 5th Floor Necklace Pride Kavadiguda, Secunderabad 500003 I have changed my name to SACHIN KUMAR JAIN for all future purposes. [SCA25004599]

■ I, KONALATARUN ADITYA, R/o: 12-5-55/5, Flat. No: 34, Vijayapuri Colony, Tarnaka, Secunderabad, Maredpally Mandal, Hyderabad District, Telangana, India-500017, changed my name As "KONI TARUN S/o K TIRUPATHI GANESH [SCA25004606]

OLD AGE HOME

■ వృద్ధులు, NRI'S లగ్జరీ రూమ్స్, లిఫ్ట్ @ మేడిపల్లి. దీర్ఘకాలిక మంచాన ఉన్న వారికి 24/7 మెడికల్, ఉప్పల్ & బోడుప్పల్. మీన్స్ భోజన వసతి. 7981467036, 9391039990, 6281125552 [H-783376]

Wanted

■ లేడీస్ హాస్టల్‌లో వర్క్ చేయటానికి 25–30 సం.లు వయస్సు ఉన్న లేడీ కావలెను. వసతి, భోజనం & నెల జీతం. హాస్టల్‌లో ఉండే స్టాఫ్ కావలెను. Q: M.Sc, B.Ed. DSNR. Ph: 7075239265 [HA-15912]

■ అర్జెంటుగా సెక్యూరిటీ గార్డ్స్, వాచ్‌మెన్ కావలెను. చింతలకుంట చెక్ పోస్ట్, ఎల్బీనగర్, అమీర్‌పేట, నార్సింగ్, మౌలాలి, ఆదిభట్ల. జీతము : 10K-14K. Ph: 8331837003 [HA-15914]

■ గ్రాఫిక్ డిజైనర్స్ ఫొటోషాప్ & కోరల్ డ్రాతో ఫ్లెక్స్ ప్రింటింగ్/సైన్ బోర్డ్ డిజైన్స్ చేయడంలో అనుభవంవారు కావలెను. అంబర్‌పేట. ఫోన్: 9963999123 [SCA25004506]

■ SFC ఫుడ్ జోన్ క్యాంటీన్ – బేగంపేట్ మహిళా చెఫ్‌లు (బ్రేక్‌ఫాస్ట్, లంచ్, పానీపూరీ, టీ/కాఫీ, చైనీస్) & గృహ కార్మికులు కావాలి. ✆ 95532 84315, 77020 75379 [B-508]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు

సాక్షి క్లాసిఫైడ్స్

3+2 3 ప్రకటనలకు చెల్లించండి, 2 ప్రకటనలు ఉచితంగా పొందండి

హైదరాబాద్ సిటీ ఎడిషన్‌లో 5 ప్రకటనలకు రూ. 2280/- (4 లైన్లు). ప్రతి అదనపు లైనుకు రూ. 540/-

గమనిక : జీఎస్టీ మీరు ఇచ్చే అన్ని ప్రకటనలపై 5% GST అదనం

జోన్ సెంటర్స్

దిల్‌సుఖ్‌నగర్	9912348016	రాజేంద్రనగర్	9010202372
ఎల్.బి.నగర్	9912225475	కూకట్‌పల్లి	9912225476
తార్నాక	9010202751	బాలానగర్	9951602997
సికింద్రాబాద్	9010299013	మల్కాజ్‌గిరి	9505507562
చిక్కడపల్లి	9912225453	మెహదీపట్నం	9912225468
అబిడ్స్	9705144457	చందానగర్	9912225453
అమీర్‌పేట్	9505507563	ఉప్పల్	7095250115

వివరాలకు : 6-2-249/1, సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్ - 34
Ph: 040-2325 6000, Ext : 6235 Cell : 9912225453

సూట్‌కేస్‌లో మహిళ శవం.. 24 గంటల్లో ఛేదించిన పోలీసులు

- గర్భం విషయంలో ఇద్దరి మధ్య వాగ్వాదం చివరకు హత్య
- అర్ధరాత్రి శవాన్ని ఎత్తుకుని 2 కిలోమీటర్లు నడిచి పొదల్లో పడేసిన వైనం
- పోలీసుల అదుపులో నిందితుడు

నిజాంపేట్: బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో వెలుగుచూసిన 'సూట్‌కేస్‌లో మహిళ శవం' కేసును పోలీసులు 24 గంటల్లోనే ఛేదించారు. వివరాలివీ... నేపాల్‌కు చెందిన తార బెహార(33), విజయ్‌తోఫా(30)లు నేపాల్‌లోని పక్క పక్క గ్రామాల వారు. తార బెహార్‌కు ఇదివరకే వివాహం అయ్యింది. ఇద్దరు పిల్లలు ఉన్నారు. భర్తతో విడిపోయి జీవనం సాగిస్తోంది.

◆ ఇదిలా ఉండగా తార బెహార, విజయ్ తోఫాల మధ్య పరిచయం కాస్తా వివాహేతర సంబంధానికి దారి తీసింది. ఇద్దరు ఏప్రిల్ 4న జూబ్లీహిల్స్‌లోని విజయ్ తోఫా తల్లిదండ్రుల వద్దకు వచ్చారు. అక్కడి నుంచి 45 రోజుల క్రితం బౌరంపేట్‌లోని ఇందిరమ్మ కాలనీలో ఓ ఇంటిని అద్దెకు తీసుకొని కాపురం పెట్టారు. విజయ్ తోఫా స్థానికంగా ఓ ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌లో మాస్టర్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో తార బెహార్ గర్భం దాల్చింది. గర్భం విషయంలో వారి మధ్య గొడవ జరుగుతోంది. గర్భం తీసేసుకుంటానని తార బెహార్... వద్దంటూ విజయ్ తోఫా వాదిస్తుండటంతో ఇద్దరి మధ్య విభేదాలు ప్రారంభమయ్యాయి. ఈ గొడవ మే 22న తీవ్ర స్థాయికి చేరింది. దీంతో తీవ్ర ఆగ్రహానికి గురైన విజయ్ తోఫా... తార బేహార్‌ను ఇంట్లోనే ఉరి వేసి చంపేశాడు. శవాన్ని ఓ పెద్ద సూట్‌కేసులో కుక్కి అర్ధరాత్రి ఇందిరమ్మ కాలనీకి అనుకుని ఉన్న నిర్మానుష ప్రాంతంలోకి తీసుకెళ్లి పడేశాడు. 26వ తేదీన ఇంటిని ఖాళీ చేసి జూబ్లీహిల్స్‌లోని తన కుటుంబం వద్దకు వెళ్లాడు.



మృతదేహం లభించిన ప్రాంతంలో దర్యాప్తు చేస్తున్న పోలీసులు (ఫైల్)

◆ కేసు నమోదు చేసుకున్న పోలీసులు డ్యాగ్ స్క్వాడ్‌ను రంగంలోకి దింపి గాలింపు చేపట్టారు. డాగ్‌లు ఇందిరమ్మ కాలనీ వైపు వెళ్లడంతో దర్యాప్తును ఆ దిశగా చేపట్టారు. గండిమైసమ్మ నుంచి బాచుపల్లి, మియాపూర్ నుంచి బాచుపల్లి వైపు ప్రధాన రోడ్డుపై ఉన్న అన్ని సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించారు.



మృతురాలు తార బెహార(ఫైల్)



నిందితుడు విజయ్‌తోఫా

◆ శవం పూర్తిగా కుళ్లిపోవడంతో ఎలాంటి ఆధారాలు లభించలేదు. కేవలం గాజులు, కలర్‌ఫుల్ డ్రెస్‌ల ఆధారంగా పోలీసులు మృతురాలు ఇతర రాష్ట్రానికి చెందినదిగా భావించారు. ఈ క్రమంలో ఆమె నేపాల్‌వాసిగా నిర్ధారణ అయ్యింది.

గోల్డెన్ కలర్ హ్యాండిలే ఆధారంగా...

మృతదేహాన్ని సూట్ కేసులో తీసుకురావడంతో పోలీసులు సూట్‌కేస్ దిశగా సైతం విచారణ చేపట్టారు. అక్కడ లభించిన సూట్‌కేసు ఖరీదైనది.. అందులో కొత్తగా ఉంది. హ్యాండిల్ కొత్తగా ఉండటంతో పోలీసులు ప్రగతి నగర్, మియాపూర్, నిజాంపేట్ కూకట్‌పల్లి తదితర ప్రాంతాల్లోని లెదర్ బ్యాగ్‌లు, సూట్‌కేసుల షాపుల్లో విచారణ ప్రారంభించాడు. పదిహేను రోజుల క్రితం పెద్ద సూట్ కేసులు ఎవరెవరు కొన్నారనే కోణంలో దర్యాప్తు చేపట్టారు. చివరకు బాచపల్లి చౌరస్తాలోని ఓ లెదర్ షాపులో ఈ నెల 23న విజయ్ తోఫా పెద్ద సూట్ కేసు కొన్నట్లు సీసీ ఫుటేజీ లభించింది.

ర్యాపిడోతో 'బుక్'అయ్యాడు...

సూట్‌కేస్‌ను కొన్న విజయ్ తోఫా ర్యాపిడో బైక్ బుక్ చేశాడు. ఆ ర్యాపిడో బైక్ ఆధారంగా పోలీసులు సీసీ ఫుటేజీలను పరిశీలించగా అతడు ఇందిరమ్మ కాలనీకి చేరుకున్నట్లు తెలిసింది. ర్యాపిడో నుంచి సమాచారం తీసుకుని నేరస్తుడి నెంబర్‌ను ట్రేస్ చేశారు. అప్పటికే అతని సెల్ ఫోన్ స్విచ్ఛాఫ్‌లో ఉంది. ఈ క్రమంలో సాంకేతిక అంశాలతో గంటల వ్యవధిలో కనుకుని జూబ్లీహిల్స్‌లో విజయ్ తోఫా కుటుంబం ఉందని నిర్ధారించుకున్నారు. నిఘా పెట్టి విజయ్ తోఫాను గురువారం అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు.

ఇందిరమ్మ మోడల్ కాలనీపై ఉత్కంఠ

- నాలుగు బస్తీల్లో సర్వే పూర్తి
- ఒక బస్తీని ఎంపిక చేయనున్న అధికారులు
- సాధ్యాసాధ్యాలపై అధికారుల ఆరా


సర్వే చేస్తున్న షేక్‌పేట తహసీల్దార్ అనితారెడ్డి, పీడీ విజయ్‌కుమార్

బంజారాహిల్స్: ఖైరతాబాద్ నియోజకవర్గంలోని జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలో ఇందిరమ్మ మోడల్‌కాలనీ నిర్మాణానికి శరవేగంగా సర్వే జరుగుతుంది. ఎంపిక చేసిన నాలుగు బస్తీల్లో సర్వే పూర్తయిన తర్వాత అక్కడి పరిస్థితులను అంచనా వేసి ఎలాంటి వివాదాలు లేకపోతే ఆ బస్తీని ఇందిరమ్మ మోడల్‌కాలనీ కింద ప్రకటించనున్నారు. ఈ మేరకు జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని బంజారాహిల్స్ రోడ్డునెంబర్-2 సాగర్‌సొసైటీకి ఆనుకుని ఉన్న కట్టమైసమ్మనగర్, నందగిరి హిల్స్‌ను ఆనుకుని ఉన్న గురుబ్రహ్మనగర్, ఫిలింనగర్‌లోని పటేల్‌నగర్ బస్తీ ఎదురుగా ఉన్న నవనిర్మాణ్ నగర్, జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-5లోని దుర్గాభవానీనగర్ బస్తీల్లో ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం సర్వే పూర్తి చేశారు. హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ విజయ్‌కుమార్, డిప్యూటీ ఈఈ సిద్ధార్థ, షేక్‌పేట మండల తహసీల్దార్ అనితారెడ్డి, జీహెచ్‌ఎంసీ జూబ్లీహిల్స్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ ఏసీపీ శ్రీనివాసుతో పాటు సంబంధిత అధికారులు, ఇంజనీర్లు ఈ సర్వేలో పాల్గొన్నారు.

జీ ప్లస్ 3 డిజైన్‌లో..

సర్వే పూర్తయిన బస్తీల్లో ఎలాంటి కోర్టు వివాదాలు లేకుండా నిర్మాణాలకు అనుకూలంగా ఉంటేనే వాటిని ఎంపిక చేస్తారు. ఇందిరమ్మ మోడల్‌కాలనీ ఇళ్ల నిర్మాణం జీ ప్లస్ 3 డిజైన్‌లో నిర్మిస్తారు.

- ఒక్కో ఇంటికి రూ.5 లక్షలు ఖర్చు చేస్తారు. ఒక్కో బ్లాక్‌లో 16 ఇళ్లు నిర్మిస్తారు.500 గజాల స్థలంలో ఒక బ్లాక్ నిర్మాణం జరుగుతుంది. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి బస్తీవాసులు అనుకూలంగా ఉన్నారో లేదో సర్వేలో తెలుసుకోగా ఈ నాలుగు బస్తీల ప్రజలు తమకు ఇళ్లు కావాలని అంగీకారం తెలిపారు.
- ఈ ప్రాజెక్టుకు ఎంపికైన బస్తీలో నిర్మాణాలు ప్రారంభించే ముందు అక్కడ ఉన్నవాళ్లంతా తమ ఇళ్లు ఖాళీ చేసి మరో చోటికి వెళ్లాల్సి ఉంటుంది. ఇళ్ల నిర్మాణం పూర్తయిన తర్వాత వారికి ఇళ్లను కేటాయిస్తారు.
- కట్టమైసమ్మనగర్‌లో 60 మంది, గురుబ్రహ్మనగర్‌లో 257 మంది, నవనిర్మాణ్‌నగర్‌లో 38 మంది ఉన్నట్లుగా సర్వేలో నిర్ధారించారు.ఏ బస్తీలో నిర్మాణాలకు అనుకూలంగా ఉందో అధికారులు డిజైన్లు రూపొందించి ప్రభుత్వానికి నివేదిక రూపంలో ప్రతిపాదించనున్నారు. త్వరలోనే ఈ ప్రాజెక్టు ఎక్కడ నిర్మించాలన్నదే అధికారులు ప్రకటిస్తారు.

ఆపరేషన్ కగార్ నిలిపి వేయాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్

పంజగుట్ట: అమాయకులైన ప్రజలను చంపిన టెర్రరిస్టులతో చర్చలు జరిపేందుకు సిద్ధపడ్డ కేంద్ర ప్రభుత్వం ఒక సామాజిక సమస్య పరిష్కారం కోసం ఆందోళన చేపడుతున్న మనవారితో చర్చలు జరిపేందుకు నిరాకరించడం సరికాదని ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ సాంస్కృతిక సమాఖ్య చైర్మన్ వెన్నెల గద్దర్, గద్దర్ అభిమానుల సంఘం అధ్యక్షులు సి.ఎల్.యాదగిరిల ఆధ్వర్యంలో ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివెయ్యాలని, మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని కోరుతూ రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ప్రముఖ కవి పసునూరి రవీందర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ .. వారు ఏ సమస్యలపై పోరాడుతున్నారో ఆ సమస్యలు తెలుసుకునేందుకు చర్చించి పరిష్కార మార్గాలు చూడాల్సిన ప్రభుత్వం ఆపరేషన్ కగార్‌ను ఆపం అనడం మూర్ఖత్వమన్నారు. వారు చర్చకు పిలిచినా చర్చించడం లేదంటే అక్కడ ఉన్న ఖనిజ సంపద దోచుకునేందుకు జరుగుతున్న కుట్రలు అన్న వాదం బలపడుతుందన్నారు. టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ మాట్లాడుతూ .. శాంతి చర్చలకు సిద్ధమని మావోయిస్టులు ప్రకటించినా కేంద్ర ప్రభుత్వం అమానవీయంగా మావోయిస్టులను హతమార్చడం దారుణమన్నారు. సినీ నటుడు ఆర్.నారాయణ మూర్తి మాట్లాడుతూ .. ఆకలి, దోపిడీ, పీడన ఉన్నంతకాలం ఉద్యమాలు ఉంటాయని, ఉద్యమాలు చేసే వారు కూడా మన భరత మాత బిడ్డలే అన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ దేవీప్రసాద్, సీనియర్ దళిత నాయకుడు జే.బి.రాజు, రిటైర్డ్ ఎమ్ఆర్ఓ బాలరాజు, డి.ఎమ్.వినోద్ కుమార్, సనాఉల్లాఖాన్, ప్రొఫెసర్ అన్వర్ ఖాన్, ప్రొఫెసర్ లక్ష్మణ్ పాల్గొన్నారు.

భూమిపూజ

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్-12లోని ఎన్‌బీటీనగర్ సాయిబాబా టెంపుల్ పక్కన ఉన్న రోడ్డు మార్గానికి కమాన్ నిర్మించనున్నారు. ఈ సందర్భంగా గురువారం మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ భూమిపూజ చేశారు.

వీధి దీపాలకు మరమ్మతు చేయాలి


బంజారాహిల్స్: వెలగని వీధి దీపాలకు మరమ్మతు చేయాలని ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి సూచించారు. గురువారం జోనల్ కార్యాలయంలో వీధిదీపాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. 42 గంటల్లోగా పెండింగ్‌లో ఉన్న సమస్యలన్నీ పరిష్కరించాలని ఎలక్ట్రికల్ వింగ్ ఇంజనీర్లకు సూచించారు. ఎమర్జెన్సీ ప్రాతిపదికన ఎల్ఈడీ లైట్లు వెంటనే వెలిగేలా చూడాలని ఆదేశించారు. ఖైరతాబాద్, మాసబ్‌ట్యాంక్, షేక్‌పేట ఫ్లైఓవర్లతో పాటు ఫిలింనగర్ ఫుట్‌ఓవర్ బ్రిడ్జిపై డెకరేటివ్ లైటింగ్ సిస్టంకు ప్రతిపాదనలు రూపొందించాలని, ఈ ప్రాజెక్టు వెంటనే చేపట్టాలని ఆదేశించారు.

ఆక్రమణల తొలగింపు

బంజారాహిల్స్: శ్రీనగర్‌కాలనీ-కమలాపురి కాలనీ ప్రధాన రహదారిలో రోడ్డుకు రెండు వైపులా ఫుట్‌పాత్ ఆక్రమణలు పాదచారులకు ఇబ్బందులు కలిగిస్తున్న నేపథ్యంలో గురువారం బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ చేపట్టి పెద్ద ఎత్తున ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగించారు. చిరువ్యాపారుల ఫుట్‌పాత్ ఆక్రమణలతో రోడ్డంతా కుంచించుకుపోవడంతో పాటు స్థానికంగా ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందని ఫిర్యాదులు రావడంతో పోలీసులు ఆక్రమణలను తొలగించారు.


ఆక్రమణలు తొలగిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

కనుల పండువగా స్వామివారి కల్యాణం



హిమాయత్‌నగర్ : శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడవ రోజు గురువారం ఉదయం 8.30 గంటలకు శ్రీ మలయప్పస్వామి గజ వాహనంపై దర్శనమిచ్చారు. పురాతన కాలం నుంచి దేవుడికి ఏనుగు వాహనంగా ఉంది. శ్రీ వేంకటేశ్వర స్వామి 20వ బ్రహ్మోత్సవాలలో భాగంగా శాంతి కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పురోహితులు మాట్లాడుతూ.. శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడోరోజు సాయంత్రం గరుడ వాహన సేవ జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్, కాంగ్రెస్ పార్టీ అంబర్‌పేట్ నియోజకవర్గ ఇన్‌చార్జి సి.రోహిణ్‌రెడ్డి, హిమాయత్‌నగర్ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ పాల్గొన్నారు.

'పర్యావరణ పరిరక్షణపై ప్రభుత్వాలు నిర్లక్ష్యం'


సమావేశంలో మాట్లాడుతున్న లింగంపల్లి చంద్రశేఖర్

హిమాయత్‌నగర్ : పర్యావరణ పరిరక్షణకు ప్రపంచ దేశాలు ఎంతో పాటు పడుతుంటే మన దేశంలో నిమ్మకు నీరెత్తినట్టు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని ఎన్విరాన్మెంటల్ ప్రొటెక్షన్ బయో డీజిల్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షులు లింగంపల్లి చంద్రశేఖర్ ఆరోపించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా గురువారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కోలుపుల నరసింహులుతో కలిసి ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పరంగా పర్యావరణంపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసి ప్రజలకు అర్థమయ్యే దిశలో ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ ప్రకృతిని కాపాడుకోవడానికి తమవంతు కృషి చేయాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం పెద్దపీట వేసే దిశగా నిర్ణయం తీసుకోవాలన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని ప్రకృతిమయంగా మార్చుకోవచ్చన్నారు. ఈ సమావేశంలో నర్సింహులు, చక్రధర్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

చేప ప్రసాదం పంపిణీకి సర్వం సిద్ధం

8న ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో పంపిణీ

- 7న పాతబస్తీ దూద్‌బౌలిలోని బత్తిని నివాసంలో పూజలు
- మొదట్లో చేప మందు.. ప్రస్తుతం చేప ప్రసాదంగా మార్పు

చార్మినార్: ఆస్తమా రోగులకు చేప ప్రసాదాన్ని పంపిణీ చేయడానికి బత్తిని కుటుంబసభ్యులు అంతా సిద్ధం చేస్తున్నారు. మృగశిర కార్తె సందర్భంగా ప్రతి ఏడాది మాదిరిగానే ఈసారి కూడా ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఆస్తమా రోగులకు చేప ప్రసాదాన్ని పంపిణీ చేయనున్నారు. కార్తె ప్రవేశం రోజైన జూన్ 8 నుంచి చేప ప్రసాదం పంపిణీ జరుగుతుంది. చేప ప్రసాదం తయారీలో భాగంగా ఈ నెల 7న ఉదయం 10 గంటలకు దూద్‌బౌలీలోని స్వగృహంలో సత్యనారాయణ స్వామి వ్రతం, బావి పూజా కార్యక్రమాలు ఉంటాయని బత్తిని కుటుంబసభ్యులు తెలిపారు. పూజల అనంతరం బత్తిని కుటుంబ సభ్యులందరూ కలిసి అదే రోజు రాత్రి నుంచి చేప ప్రసాదం పంపిణీ కోసం తయారీ ప్రారంభిస్తారు. 8న ఉదయం ఇంట్లోనే కుటుంబసభ్యులందరూ చేప ప్రసాదాన్ని స్వీకరించిన అనంతరం ఎగ్జిబిషన్ గ్రౌండ్‌కు తరలించి చేప ప్రసాదం పంపిణీ చేయనున్నారు.

ఇంట్లోని బావి నీరునే వినియోగిస్తాం..

ప్రతి ఏడాది దూద్‌బౌలిలోని తమ స్వగృహంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం చేప ప్రసాదాన్ని తయారు చేస్తున్నారు. ఇంటి బావిలోని నీటితోనే ఈ చేప ప్రసాదాన్ని తయారు చేయడం ఆనవాయితీగా వస్తోందన్నారు. పూర్వీకుల నుంచి ఈ బావిలోని నీటినే వాడుతున్నామన్నారు. కుటుంబ సభ్యులందరితో కలిసి సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించిన అనంతరం తమ కుటుంబ సభ్యులు ముందుగా చేప ప్రసాదాన్ని స్వీకరిస్తారన్నారు.

మూడు రకాల చేప ప్రసాదం..

చేప మందును మూడు రకాలుగా తయారు చేస్తారు. చేపతో ఇచ్చే మందు, బెల్లంతో ఇచ్చే మందు, కార్తె మందు. 2 నుంచి 3 అంగుళాల కొరమీను చేపతో ఇచ్చే ప్రసాదంలు 10 గ్రాములుంటుంది. 30 గ్రాములు కలిగిన కార్తె మందును మూడు డోసులుగా 45 రోజుల పాటు వాడాలి. 15, 30, 45 రోజుల్లో కార్తె మందును వాడాలి. చేపతో మింగడం ఇష్టం లేని వారికి బెల్లం ప్రసాదాన్ని అందజేస్తారు. నిజానికి చేపతో తీసుకునే ప్రసాదమే సత్ఫలితాలిస్తుందని చెబుతున్నారు.

రెండు గంటలకు ముందుగా..

చేప ప్రసాదం స్వీకరించే ముందు రెండు గంటల వరకు ఎలాంటి ఆహార పదార్థాలతో పాటు నీటిని కూడా స్వీకరించరాదని బత్తిని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. చేప ప్రసాదం స్వీకరించిన అనంతరం గంటన్నర వరకు కూడా ఆహారం, నీరు స్వీకరించరాదు.

నేరుగా రక్త ప్రసరణలో కలవడంతో ఫలితం..

ఔషధ గుణాలు కలిగిన ప్రసాదాన్ని చేప నోటిలో పెట్టి మింగడంతో అది కదులుతూ గొంతు ద్వారా జీర్ణాశయంలోకి వెళ్లి జీర్ణకోశాన్ని శుభ్రం చేస్తుందంటున్నారు. అంతేకాకుండా నేరుగా జీర్ణాశయంలో జీర్ణం అవుతుండడంతో చేప ప్రసాదం త్వరగా రక్త ప్రసరణలో కలిసి శ్వాసకోశ సంబంధ వ్యాధులను తగ్గిస్తుందంటున్నారు.

మొక్కల పంపిణీ


మొక్కలు పంపిణీ చేస్తున్న అధికారులు

బంజారాహిల్స్: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బంజారాహిల్స్‌లోని కాసు బ్రహ్మానందరెడ్డి జాతీయ ఉద్యానంలో వాకర్స్ అసోసియేషన్, అటవీ శాఖ అధికారులు మొక్కలు నాటారు. అటవీ శాఖ తెలంగాణ మెడిసినల్ ప్లాంట్స్ బోర్డు ఆధ్వర్యంలో వివిధ రకాల ఔషధ మొక్కలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా అటవీ శాఖ అధికారి ఎస్.రాజశేఖర్, అటవీక్షేత్ర అధికారి ఎస్.లక్ష్మీపతిరావు, ఎం.మంజుల, ఫారెస్ట్ సెక్షన్ అధికారి, రేంజ్ స్టాఫ్ పాల్గొన్నారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించుకోవడం కూడా ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలన్నారు.

నిమ్స్ మేలో శ్రీగంధపు చెట్ల నరికివేత

వెంగళరావునగర్: కేంద్ర ప్రభుత్వ శిక్షణా కేంద్రం (నిమ్స్ మే)లో గంధపు చెట్లు నరికి తీసుకెళ్లిన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం .. నిమ్స్‌మేలో లక్షలాది రూపాయల విలువ జేసే శ్రీగంధం చెట్లను పెంచుతున్నారు. గురువారం ఉదయం విధులకు వచ్చిన తోటమాలి సతీష్ వాలీబాల్ కోర్టు సమీపంలో ఆరు చెట్లు నరికి ఉన్నట్లు గుర్తించాడు. చెట్లను నరికి తీసుకెళ్లిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని అడ్మిన్ అకౌంట్ ఆఫీసర్ శ్రీనివాస్‌వర్మ ఫిర్యాదు చేశారు. నాలుగురోజుల క్రితం ఇదే సంస్థలో మూడు శ్రీగంధం చెట్లను నరికి తీసుకెళ్లినన దొంగలు, తాజాగా ఆరు చెట్లను నరికి తీసుకెళ్లడం అటు నిమ్స్‌మే అధికారులు, ఇటు పోలీసులకు సవాల్ విసిరినట్టుగా ఉంది.

అభినందనలు

బంజారాహిల్స్: తెలంగాణ వ్యాప్తంగా టీజీఎస్‌పీడీసీఎల్‌లో పనిచేస్తున్న సెక్యూరిటీగార్డుల జీతాలు పెంచినందుకు పీఎస్‌పీఈ యూనియన్ 1535 నాయకులు గురువారం సీఎండీ ముషారఫ్ ఫరూఖీని ఆయన కార్యాలయంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అయితే సెక్యూరిటీ గార్డ్‌ల జీతాల పెంపుకు విశేషంగా కృషి చేసింది యూనియన్ నాయకులేనని, వారందరినీ సీఎండీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రెసిడెంట్ కే ప్రమోద్‌కుమార్, సెక్రటరీ కే శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్ సురేష్‌రాజు, జాయింట్ సెక్రటరీ మల్లేష్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

పేరుకుపోతున్న చెత్త కుప్పలు


కమలాపురికాలనీలో చెత్త

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ డివిజన్ బంజారాహిల్స్ రోడ్డునెంబర్-2లోని కమలాపురికాలనీ, సాగర్ సొసైటీ, ఇందిరానగర్ మధ్యలో ఉన్న జీహెచ్‌ఎంసీ పార్కు గేటుతో పాటు స్థానిక రహదారులన్నీ చెత్త కుప్పలతో నిండిపోతున్నాయి. జూబ్లీహిల్స్ సర్కిల్-18 పారిశుద్ధ్య విభాగం అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంతో ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోయి దుర్గంధం, దుర్వాసనలతో ప్రజలు నరకాన్ని చవిచూస్తున్నారు. ఇక్కడ ఉన్న జీహెచ్‌ఎంసీ పార్కును పచ్చదనం పరిశుభ్రతతో తీర్చిదిద్దాల్సి ఉండగా చెత్త కుప్పలకు నిలయంగా మార్చేశారు. ప్రతిరోజూ చెత్తను తొలగించాల్సిన సిబ్బంది అటువైపు చూడడం లేదు. పేరుకుపోతున్న చెత్తను ఎప్పటికప్పుడు తరలించేలా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

10న బీసీల రాష్ట్ర స్థాయి విస్తృత సమావేశం


కాచిగూడలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న గుజ్జ సత్యం

కాచిగూడ: జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 10వ తేదీన మంగళవారం హైదరాబాద్ నగరంలో బీసీల రాష్ట్ర స్థాయి విస్తృత సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం బీసీ రిజర్వేషన్ల అమలు, దేశ వ్యాప్తంగా సమగ్ర కులగణన, భవిష్యత్ బీసీ ఉద్యమ కార్యాచరణపై చర్చించేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. గురువారం కాచిగూడలో బీసీ నేతలతో కలిసి ఆయన మాట్లాడుతూ జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.

లంబాడీలకు మంత్రివర్గంలో స్థానం కల్పించాలి


అభివాదం చేస్తున్న సమితి నూతన కార్యవర్గ సభ్యులు

పంజగుట్ట: లంబాడీ కులస్తులకు మంత్రివర్గంలో చోటు కల్పించాలనే డిమాండ్‌తో ఈ నెల 8వ తేదీన అన్ని గిరిజన సంఘాలతో కలిసి గాంధీభవన్ ముందు నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు నగార భేరి లంబాడీ హక్కుల పోరాట సమితి పేర్కొంది. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సమితి జాతీయ అధ్యక్షుడు మూడావత్ శ్రీనివాస్ నాయక్, జాతీయ సమన్వయ కర్త గణేష్ నాయక్, గిరిజన విద్యార్థి సంఘం కార్య నిర్వాహక అధ్యక్షుడు వెంకట్ బంజారా మాట్లాడుతూ .. భారతదేశంలో ఒకే భాష, ఒకే మాట, ఒకే సంస్కృతి ఉన్న లంబాడీలను కొన్ని రాష్ట్రాల్లో బీసీ, కొన్ని చోట్ల ఎస్సీ, కొన్నిచోట్ల ఓసీగా గుర్తిస్తున్నారని దేశవ్యాప్తంగా గిరిజనులను ఎస్టీ జాబితా కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి లంబాడీల పాత్ర ఎంతో కీలకమని, కాని ప్రభుత్వం ఏర్పడి 20 నెలలు అవుతున్నా గిరిజనులకు మంత్రివర్గంలో స్థానం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

నూతన కార్యవర్గం..

నగర భేరీ లంబాడీ హక్కుల పోరాట సమితి కార్యవర్గాన్ని పూర్తిగా రద్దుచేస్తూ నూతన కార్యవర్గం ప్రకటిస్తున్నట్లు శ్రీనివాస్ నాయక్ తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడిగా అజ్మీరా ఫూల్ సింగ్ నాయక్, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షునిగా భూక్యా సంతోష్ నాయక్, రాష్ట్ర ఇన్‌చార్జి రంజీత్ నాయక్, రాష్ట్ర కన్వీనర్ కాట్రావత్ రాజు నాయక్, కో కన్వీనర్ పరుషురాం నాయక్, ప్రధాన కార్యదర్శులు అజ్మీర వెంకట్, తీనా నాయక్, జలంధర్ నాయక్, సురేష్ నాయక్, బాలు నాయక్, జైపాల్ నాయక్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సుశీల బాయి, కార్య నిర్వాహక అధ్యక్షులు పున్ని బాయి. ప్రధానకార్యదర్శులు అనిత, దివి బాయిలను ఎన్నుకున్నారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న సొసైటీ సభ్యులు

ఖైరతాబాద్: బ్రేక్ త్రూ సొసైటీ ఆధ్వర్యంలో నెక్లెస్ రోడ్డు పీపుల్స్ ప్లాజాలో గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. బ్రేక్ త్రూ సొసైటీ రాష్ట్ర క్యాదర్శి శరత్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించడమే ఈ దినోత్సవ ముఖ్య లక్ష్యమన్నారు. మన స్వార్థం, లాభం కోసం ప్రకృతిని విచ్ఛిన్నం చేస్తూ అడవులను నరికి, నదులను కలుషితం చేసి, వాతావరణ మార్పులకు కారణం అవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సొసైటీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ గంగాధర్ మాట్లాడుతూ.. వాతావరణ నియమ నిబంధనలను పాటించకుండా పరిశ్రమలను నెలకొల్పడం, రియల్ ఎస్టేట్ అభివృద్ధి చేయడం లాంటి పనుల వల్ల వాతావరణ కాలుష్యం పెరిగిపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ రాష్ట్ర ఉపాధ్యక్షులు దేవర్షి గంగాజీ, సభ్యులు కృతిక, ఆశ, రిషికేష్, అన్వేష, అనిర్బన్, ధనుష్, నితీష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

మనల్ని మనం సీరియస్‌గా తీసుకోవాలి


ఫిక్కీ సభ్యులతో జై మదన్..

పంజగుట్ట: ప్రపంచం మనల్ని సీరియస్‌గా తీసుకోవాలంటే ముందు మనం సీరియస్‌గా పని చెయ్యాలని మోటివేషన్ స్పికర్ డాక్టర్ జై మదన్ అన్నారు. గురువారం సోమాజిగూడలోని హోటల్ పార్క్‌లో ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ హైదరాబాద్ చాప్టర్ ఆధ్వర్యంలో విజయాన్ని ఊహించండి వ్యక్తపరచండి, పెంపొందించండి అనే అంశంపై ప్రత్యేక సెషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జై మదన్ మాట్లాడుతూ .. ప్రతీ ఒక్కరికి ప్రధాన అవసరాలైన కూడు, గుడ్డ, ఇల్లు, విద్య, ఆరోగ్యం ఇవి తీరిన తరువాత సుఖాలకోసం ఎదురుచూస్తామని, తరువాత ఆత్మసాధన, శక్తి సాధన వైపు అడుగులు వేస్తామని వీటిని పొందేందుకు విశ్వసనీయత ఎంతో అవసరమన్నారు. ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ హైదరాబాద్ చాప్టర్ చైర్ పర్సన్ ప్రతిభా కుందా ప్రారంభోపన్యాసం చేస్తూ మన ఆలోచనలు, శక్తి, సంకల్పం ఇవన్నీ మన విజయాన్ని నిర్దేశిస్తాయని తెలిపారు.

రోడ్లను ఆక్రమించి పార్కింగ్ చేయరాదు


ట్రాలీ డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న కట్టా హరిప్రసాద్

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్-2లోని కమలాపురికాలనీ ప్రధాన రోడ్డులో జీహెచ్‌ఎంసీ పార్కు గేటు పక్కన రెండు వైపులా ఆటో ట్రాలీలు, మినీ లారీలు పార్కింగ్ చేస్తుండటంతో ఇక్కడ మల, మూత్ర విసర్జనలు జరుగుతున్నాయి. దుర్వాసనతో వాకర్స్, సందర్శకులు ఇబ్బందులు పడుతున్నారని కాలనీవాసులు ఫిర్యాదు మేరకు గురువారం వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్, బంజారాహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సాయిప్రకాష్‌గౌడ్ డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. పార్కు గేటుకు రెండు వైపులా రోడ్డును ఆక్రమించి, ఫుట్‌పాత్‌పై వాహనాల అక్రమ పార్కింగ్ చేయరాదని హెచ్చరించారు.

సైబర్ మోసం రూ.1.15 లక్షలు మాయం

బంజారాహిల్స్: సైబర్ నేరగాళ్లు కొత్త ఎత్తుగడలతో మోసాలకు పాల్పడుతున్నారు. తాజాగా బంజారాహిల్స్ రోడ్డునెంబర్-12లోని ఎమ్మెల్యే కాలనీకి చెందిన ఓ వృద్ధుడి (70)ని టార్గెట్ చేసిన సైబర్ మోసగాళ్లు విడతల వారీగా రూ.1.15 లక్షలు దోచుకున్నారు. సదరు వృద్ధుడు తన మనుమరాళ్ల దుస్తుల కోసం 'మీ షో' యాప్‌లో ఆర్డర్ చేసి రూ.19,000 బిల్లు ఆన్‌లైన్ ద్వారా చెల్లించాడు. కాసేపటి తర్వాత ఆయనకు ఫోన్ చేసిన సైబర్ నేరగాళ్లు మీరు రూ.600 బిల్లు ఎక్కువ చెల్లించారని మీరు చెల్లించిన రూ.19,000 తిరిగి మీకు పంపిస్తున్నామని అందులో రూ.600 కట్ చేసుకుని మిగతాది పంపండి అని చెప్పడంతో రూ.18,400 వారు చెప్పిన నెంబర్‌కు పంపించారు. మళ్లీ ఫోన్‌చేసి డబ్బులు రాలేదని చెప్పడంతో మళ్లీ రూ.18,400 పంపించారు. ఇలా విడతలవారీగా 1.15 లక్షలు దోచుకున్నారు. మోసపోయినట్లు గ్రహించిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం



విజేతలకు సర్టిఫికెట్లు ప్రదానం చేసిన మంత్రి కొండా సురేఖ

సనత్‌నగర్: పర్యావరణ పరిరక్షించుకుని.. భవిష్యత్ తరాలను కాపాడుకోవాల్సిన అవసరం, బాధ్యత మనందరిపై ఉందని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. యావత్ ప్రపంచానికే సవాల్‌గా మారిన ప్లాస్టిక్ మహమ్మారి నిర్మూలనకు తెలంగాణ ప్రభుత్వం, ప్రజలు సంయుక్త కృషి అవసరమని ఆమె అభిప్రాయపడ్డారు. సనత్‌నగర్‌లోని టీజీపీసీబీ కార్యాలయంలో గురువారం జరిగిన అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవ వేడుకలకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కొండా సురేఖ మాట్లాడుతూ... పర్యావరణ పరిరక్షణ కోసం కాంగ్రెస్ ప్రభుత్వం 'వన మహోత్సవం'కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపడుతోందని గుర్తుచేశారు. గతేడాది 20.2 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకుంటే 19.4 కోట్ల మొక్కలను నాటామని తెలిపారు. ఇందుకు అటవీ శాఖ అధికారులు, సిబ్బందిని తాను ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు చెప్పారు. ఈ సంవత్సరం కూడా వన మహోత్సవం భారీ స్థాయిలో చేపట్టాలని నిర్ణయించామని తెలిపారు. పర్యావరణ మెరుగు పరిచేందుకు తమ ప్రభుత్వం ఇతర శాఖలతో సమన్వయం చేసుకుంటూ ఎకో టూరిజం, పార్కుల్లో కీలక మార్పులు చేపడుతున్నామని పేర్కొన్నారు. ప్లాస్టిక్ రహిత పర్యావరణాన్ని సృష్టించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్లాస్టిక్ నివారణలో మనమే ముందుండేలా కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు పాటుపడతామని ప్రతిజ్ఞ చేశారు. పర్యావరణ స్పృహను కలిగించేలా ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. రాష్ట్ర అటవీ శాఖ ముఖ్య కార్యదర్శి నదీం, పీసీబీ సభ్య కార్యదర్శి రవి, పీసీబీ బోర్డు మెంబర్లు సత్యనారాయణరెడ్డి, విజయలక్ష్మీ జయదేవ్, పీసీబీ ఉద్యోగులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220379
9640081203

నగరంలో నేడు

- సాయంత్రం 5 గంటలకు చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో వాసా ప్రభావతి స్మారక కవితలు, కథల పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం
- ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన
- ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మాదాపూర్‌లోని శిల్పా రామంలో వేసవి సెలవుల సందర్భంగా సమ్మర్ ఆర్ట్ క్యాంప్
- ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు రాయదుర్గంలోని ఎఫ్‌డీడీఐ–హైదరాబాద్‌లో డిజైన్ ఎక్స్‌ప్లోర్ సమ్మర్ ఇన్నోవేషన్ క్యాంపు–2025
- ఉదయం 10.30 గంటలకు హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో పేపర్ ఎక్స్‌పో– 2025
- ఉదయం 11 గగంటలకు శ్రీనిధి ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సెమినార్ హాల్‌లో డ్రోన్ సెటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రారంభం

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

అధికారులకు మాత్రమే కనబడదు!

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నియంత్రణపై కొరవడిన చిత్తశుద్ధి

- ప్లాస్టిక్ భూతానికి అడ్డుకట్ట ఎలా?
- విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగంపై కానరాని తనిఖీలు



సాక్షి, సిటీబ్యూరో: సింగిల్ యూజ్ ప్లాస్టిక్.. ఇందు గలదు అందులేదనిగాదు.. ఎక్కడ చూసినా అదే.. దానిని అరికట్టడంలో అధికారులు విఫలమవుతున్నారనే విమర్శలు ఉన్నాయి. ఒక్కసారి వాడి పడేసే ప్లాస్టిక్‌ను నిషేధిస్తూ ప్రభుత్వం 2022 జూలైలో ఉత్తర్వులు జారీ చేసింది. దీనికి ప్రత్యేక టాస్క్ ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేసింది. దుకాణ సముదాయాలు, మార్కెట్లు, తయారీ పరిశ్రమల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించి నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని చట్టం చెబుతోంది. అయితే క్షేత్ర స్థాయిలో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. 2022 ప్రారంభంలో 15 నెలల్లో 8,390 దుకాణాలను తనిఖీ చేసిన అధికారులు, 1,217 ఉల్లంఘనలను గుర్తించారు. రూ.13 లక్షలకుపైగా జరిమానాలు విధించారు. గత 13 నెలల్లో కేవలం 1,288 ప్రాంతాలను మాత్రమే పరిశీలించి 207 ఉల్లంఘనలను గుర్తించి రూ.2.31 లక్షల జరిమానాతో సరిపెట్టారు. ఈ గణాంకాలే అధికారుల తనిఖీలు నామమాత్రంగా మారిపోయాయని స్పష్టం చేస్తున్నాయి. వీధుల్లో ఏర్పాటు చేసే వారంతపు సంతల నుంచి ప్రతి మార్కెట్‌లోనూ నిషేధిత ప్లాస్టిక్ విచ్చలవిడిగా వినియోగిస్తున్నా అధికారుల కంటికి కనిపించడం లేదు.

నిర్లక్ష్యపు నీడలు..

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధాన్ని ఉక్కుపాదంతో అణగదొక్కాలని ప్రభుత్వం గత ఏడాది ఫిబ్రవరిలో ఖచ్చితమైన ఆదేశాలు జారీ చేసింది. జీహెచ్ఎంసీ, పురపాలక సంఘాలు, జిల్లా అధికారులు, టాస్క్ ఫోర్స్ బృందాలు వారంలో కనీసం రెండు, మూడు దఫాలు దుకాణాలు, షాపింగ్ మాల్స్, సినిమా థియేటర్స్, పర్యాటక ప్రాంతాలు, విద్యాలయాలు, ఆసుపత్రులు, స్టాక్ పాయింట్లు, రిటైల్ వ్యాపారులు, వీధి వ్యాపారులు, కూరగాయలు, పూలు, పండ్లు, చికెన్, మటన్ మార్కెట్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని పేర్కొంది. నిబంధనలు అతిక్రమించిన వారిపై జరిమానాలు విధించడం, ప్లాస్టిక్‌ను సీజ్ చేయడంతోపాటు వ్యాపారుల లైసెన్సులను రద్దు చేయడం వంటి అధికారాలను అప్పగించింది. ఎటొచ్చీ ఆదేశాల అమలు తీరే అధ్వానంగా ఉంది.

అక్కడ అమలు భేష్..

రాష్ట్ర సచివాలయంలో ప్లాస్టిక్ సామగ్రిని పూర్తిగా నిషేధించారు. ప్రత్యామ్నాయంగా స్టీల్, గాజు బాటిల్స్, జ్యూట్ బ్యాగులు, క్లాత్ వెండింగ్ మెషీన్లు ఏర్పాటు చేశారు. క్యాంటీన్‌లో స్టీల్ పాత్రల్లో ఆహారం తీసుకెళ్లే సౌకర్యం కల్పించారు. సెక్యూరిటీ గేట్ల దగ్గరే ప్లాస్టిక్ నిరోధక నిబంధనలు అమలు చేస్తున్నారు. గ్రీన్ కియోస్క్ ద్వారా క్లాత్ బ్యాగ్స్, స్టీల్ బాటిల్స్, పాట్ ప్లాంట్స్ అందుబాటులో ఉంచారు. నగరంలోని చాలా మేరకు పేరొందిన హోటల్ యాజమాన్యాలు ప్లాస్టిక్ నిషేధాన్ని పాటిస్తున్నాయి. గాజు సీసాల్లో నీటిని, పింగాణీ ప్లేట్లలో ఆహారం సరఫరా చేస్తున్నాయి.

టాస్క్‌ఫోర్స్ బృందాలు తనిఖీలు పెంచాలి



నీటి వనరుల సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ కోసం మా వంతుగా చెరువుల్లో చెత్తను తొలగించే కార్యక్రమాలు చేపడుతున్నాం. అక్కడ వ్యర్థాలు సేకరించినప్పుడు పేపర్ ప్లేట్లు, గ్లాసులు, ప్లాస్టిక్ బాటిళ్లు, క్యారీ బ్యాగులు అధిక మొత్తంలో బయటపడుతున్నాయి. వీలైనంత వరకు ప్లాస్టిక్ వస్తువులకు దూరంగా ఉండటం మంచిది. బస్టాండ్, రైల్వే స్టేషన్, మార్కెట్ ప్రాంతాల్లో టాస్క్‌ఫోర్స్ బృందాలు తనిఖీలు పెంచాలి.

\- వినయ్, పర్యావరణ ప్రేమికుడు

సంవత్సరం	తనిఖీలు	ఉల్లంఘనలు	జరిమానాలు
అక్టోబరు 2022- డిసెంబరు 2023	8,390	1,217	రూ.13,04,217
జనవరి 2024- మార్చి 2024	907	434	రూ.6,97,001
ఏప్రిల్ 2024- మే 2025	1,288	207	రూ.2,31,300

సింగరేణిలో ప్లాస్టిక్‌పై సంపూర్ణ నిషేధం

ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో సీఎండీ బలరామ్

నాంపల్లి: ప్రపంచవ్యాప్తంగా 'ప్లాస్టిక్ కాలుష్యానికి ముగింపు పలుకుదాం' అనే నినాదం స్ఫూర్తితో సింగరేణిలోని అన్ని ఏరియాల్లో ప్లాస్టిక్ వాడకాన్ని సంపూర్ణంగా నిషేధిస్తున్నట్లు ఆ సంస్థ చైర్మన్, ఎండీ ఎన్.బలరామ్ ప్రకటించారు. ముఖ్యంగా ప్లాస్టిక్ బాటిళ్లను వినియోగించవద్దని స్పష్టం చేశారు. హైదరాబాద్ సింగరేణి భవన్ ఆవరణలో గురువారం ఆయన ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. సింగరేణి సంస్థలో ఇప్పటికే పలు పర్యావరణహిత చర్యలు చేపట్టామని తెలిపారు. సింగరేణి కార్యాలయాలు, గనులు, డిపార్ట్‌మెంట్లలో ప్లాస్టిక్ బాటిల్స్, ప్లేట్లు తదితర వస్తువులపై సంపూర్ణ నిషేధం విధిస్తున్నట్లు తెలిపారు. అధికారులు, కార్మికులు, ఉద్యోగులు ఇళ్ల వద్ద కూడా ప్లాస్టిక్ వాడకాలను తగ్గించాలని సూచించారు. పర్యావరణం పట్ల అభిమానంతో సింగరేణి వ్యాప్తంగా 19 వేల మొక్కల్ని నాటానని, దీనిని స్ఫూర్తిగా తీసుకుని సంస్థ డైరెక్టర్లు, ఇతర కార్మికులు కూడా మొక్కలు నాటడం ప్రారంభించారని అన్నారు. మూడు దశాబ్దాల క్రితం సింగరేణి ప్రాంతాల్లో ఎండాకాలం 50 డిగ్రీలకు పైబడి ఉష్ణోగ్రతలు నమోదవుతుండేవని, విస్తారంగా మొక్కలు నాటిన కారణంగా ఇప్పుడు వాతావరణ ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు పడిపోయాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కోల్ మూమెంట్) ఎస్.డి.ఎం సుభాని, జనరల్ మేనేజర్ (మార్కెటింగ్) ఎస్.వి. రాజశేఖర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



సింగరేణి భవన్ ఆవరణలో మొక్కలు నాటుతున్న బలరామ్

ప్లాస్టిక్ కాలుష్యంతో పర్యావరణ సంక్షోభం

ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో తనూజ

గచ్చిబౌలి: నీరు, నేల, గాలిలోకి ప్లాస్టిక్ ప్రవేశించి పర్యావరణ సంక్షోభం సృష్టిస్తోందని, ఆరోగ్య సమస్యగా మారిందని టీజీఎఫ్‌డీసీ ఎకో టూరిజం అసిస్టెంట్ డైరెక్టర్ తనూజ అన్నారు. గురువారం కొత్తగూడలోని బొటానికల్ గార్డెన్‌లో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పర్యావరణంపై అవగాహన, సీడ్ బాల్స్ తయారీ, బర్డ్స్ వాచ్ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి యేటా 400 మిలియన్ టన్నుల ప్లాస్టిక్ ఉత్పత్తి అవుతోందని, అందులో సగం వాడిన వెంటనే పడేయడంతో పర్యావరణానికి విఘాతం కలిగిస్తోందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్‌ను విడనాడి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. నేచుర లిస్ట్ అపరంజని ప్లాస్టిక్ కాలుష్యాన్ని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఉదయం 6 నుంచి 8 గంటల వరకు 20 మంది పక్షి ప్రేమికులు వలస పక్షులను గమనిస్తూ కెమెరాల్లో బంధించారు. డాక్టర్ వీర కిశోర్ ఆధ్వర్యంలో స్థానిక జాతుల విత్తనాలతో జేఎన్‌టీయూ విద్యార్థులు సీడ్ బాల్స్ తయారు చేశారు. బొటానికల్ గార్డెన్‌లోని ఎడారి మొక్కలు, ఔషధ మొక్కలు, వివిధ రకాల వనాలను విద్యార్థులకు చూపించారు. అనంతరం పలు మొక్కలను నాటారు. కార్యక్రమంలో టీజీఎఫ్‌డీసీ చీఫ్ జనరల్ మేనేజర్ డీవీ రెడ్డి, జనరల్ మేనేజర్లు స్కైలాబ్, కిరణ్ కుమార్, ప్లాంటేషన్ మేనేజర్ లక్ష్మారెడ్డి, డీపీఓ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బొటానికల్ గార్డెన్‌లో పర్యావరణంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఆర్టీసీ ఆస్పత్రికి ఉత్తమ పర్యావరణ అవార్డు

సాక్షి, సిటీబ్యూరో: పర్యావరణ పరిరక్షణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు టీజీఎస్ ఆర్టీసీ తార్నాక ఆస్పత్రిని ఉత్తమ పర్యావరణ పరిరక్షణ అవార్డు వరించింది. ప్రభుత్వ ఆస్పత్రుల కేటగిరీలో బయో–మెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్, ప్లాస్టిక్ వేస్ట్ తగ్గింపులో ఆస్పత్రి చేసిన కృషికి ఈ గుర్తింపు లభించింది. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సనత్‌నగర్‌లోని టీజీపీసీబీ కార్యాలయంలో ఈ అవార్డును టీజీఎస్ ఆర్టీసీ ఆస్పత్రి బృందానికి మంత్రి కొండా సురేఖ అందజేశారు. ఈ అవార్డు ఆస్పత్రిలో ఆరోగ్య సంరక్షణను మెరుగుపరచడంతోపాటు పర్యావరణ పరిరక్షణను కొనసాగించేందుకు మరింత ప్రేరణనిస్తుందని ఆ సంస్థ ఎండీ సజ్జనార్ పేర్కొన్నారు. ఆస్పత్రిలో బయో–మెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్, ప్లాస్టిక్ వేస్ట్ తగ్గింపు, ఘన వ్యర్థాల నిర్వహణను పకడ్బందీగా చేస్తున్న వైద్యులు, సిబ్బంది కృషిని ఆయన అభినందించారు.

తెలుగు మహాసభల గ్రంథాలపై ప్రత్యేక రాయితీ

నాంపల్లి: నాలుగవ ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా తెలుగు సాహితీ ప్రముఖులు, వివిధ సాహిత్యాంశాలపై ప్రత్యేకంగా ప్రచురించిన 69 లఘు గ్రంథాల అమ్మకాల్లో ప్రత్యేక రాయితీ ఇవ్వనున్నట్లు తెలుగు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య కె.హనుమంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి మహా సభల సందర్భంగా ప్రభుత్వం ప్రచురించిన 'నాలుగవ ప్రపంచ తెలుగు మహాసభలు– తిరుపతి 2012' ప్రత్యేక సంచికను 50 శాతం రాయితీతో విక్రయించేందుకు నాంపల్లి ప్రాంగణంలోని తెలుగు విశ్వవిద్యాలయం ప్రచురణల విభాగంలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

మాజీ ఎమ్మెల్సీ రంగారెడ్డి అంత్యక్రియలు పూర్తి



రంగారెడ్డి పార్థివదేహానికి నివాళులు అర్పిస్తున్న మహేష్ కుమార్‌గౌడ్

శామీర్‌పేట్: మాజీ ఎమ్మెల్సీ మాగం రంగారెడ్డికి కుటుంబసభ్యులు, అభిమానులు అశ్రునివాళి అర్పించారు. గురువారం మేడ్చల్ జిల్లా తూంకుంట మున్సిపాలిటీ పరిధిలోని అంతాయిపల్లిలో ఉన్న వ్యవసాయ క్షేత్రంలో అంత్యక్రియలు నిర్వహించారు. రంగారెడ్డి పార్థివదేహానికి టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌తోపాటు పలువురు ప్రముఖులు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ 35 ఏళ్ల పాటు ఆయనతో ఉన్న సన్నిహిత అనుబంధం ఉందని, నిజాయితీ, పార్టీ పట్ల అంకితభావం మరువలేనిదని గుర్తు చేసుకున్నారు.

హెచ్ఎండీఏ వన మహోత్సవం

4.5 కోట్ల మొక్కలు నాటేందుకు చర్యలు



సాక్షి, సిటీబ్యూరో: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా హెచ్ఎండీఏ గురువారం వనమహోత్సవం కార్యక్రమాన్ని చేపట్టింది. సంజీవయ్య పార్కు, ఔటర్ రింగ్‌రోడ్డు, తుక్కుగూడ, పడమటి కంచ, ఫారెస్ట్ బ్లాక్ తదితర ప్రాంతాల్లో హెచ్ఎండీఏ అధికారులు, సిబ్బంది పెద్ద ఎత్తున మొక్కలు నాటారు. వనమహోత్సవంలో భాగంగా ఈ ఏడాది 4.5 కోట్ల మొక్కలు నాటేందుకు చర్యలు చేపట్టినట్లు హెచ్ఎండీఏ అర్బన్ ఫారెస్ట్ డైరెక్టర్ కె. శ్రీనివాస్ తెలిపారు. జాతీయ, రాష్ట్ర రహదారులు, పార్కులు తదితర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున వన మహోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పడమటి కంచలో ఇప్పటికే సుమారు 2 లక్షల మొక్కలు నాటినట్లు ఆయన గుర్తుచేశారు. ఈ ఏడాది మరో 3 లక్షలకుపైగా మొక్కలు నాటనున్నారు. వనమహోత్సవంలో భాగంగా నేరేడు, చింత, సీమచింత, ఉసిరి, తాని, మారేడు, వెల్గ, జిట్రేగి, ఎర్రచందనం, ఎగిస, నారెప, వేప, పునుగు, సోమి, బుడ్డ దరియమి, తెల్లమద్ది, బందరు, వెదురు తదితర చెట్లను నాటనున్నారు. అన్ని వర్గాల ప్రజలు వన మహోత్సవంలో పెద్ద ఎత్తున పాల్గొని మొక్కలు నాటాలని అధికారులు కోరారు. వివిధ ప్రభుత్వ విభాగాల ద్వారా మొక్కలను ఉచితంగా పంపిణీ చేసేందుకు విస్తృత ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బుద్ధపూర్ణిమ అర్బన్ ఫారెస్ట్రీ విభాగం అడిషనల్ డైరెక్టర్ చక్రపాణి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

క్రీడా రంగానికి అత్యంత ప్రాధాన్యం

తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి

గచ్చిబౌలి: సీఎం రేవంత్‌రెడ్డి క్రీడారంగ అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి అన్నారు. గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో వేసవి శిక్షణా శిబిరాలు–2025 కార్యక్రమం గురువారం ముగిసింది. ఈ సందర్భంగా విద్యార్థులకు సర్టిఫికెట్లు, ట్రోఫీలను అందించారు. ఆయన మాట్లాడుతూ పిల్లలతోపాటు వారి తల్లిదండ్రులకు ఉచిత యోగా, జుంబాడ్యాన్స్ ఏర్పాటు చేయడంతో ప్రతిరోజు ఈ శిబిరాల్లో సందడి నెలకొందని అన్నారు. చదువుతోపాటు క్రీడలకు కూడా విద్యార్థులు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఆర్ చైర్మన్ మూలా వెంకటేష్‌గౌడ్, గచ్చిబౌలి స్టేడియం అడ్మినిస్ట్రేటర్ కె.మధు, కోచ్‌లు, క్రీడాకారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే కాలుష్య నివారణ

ట్యాంక్‌బండ్‌పై మానవహారంలో పర్యావరణవేత్త లుబ్నా సర్వత్

కవాడిగూడ: ప్రజలందరి భాగస్వామ్యంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని ప్రముఖ పర్యావరణవేత్త డాక్టర్ లుబ్నా సర్వత్ పిలుపునిచ్చారు. మానవాళి మనుగడకే కాలుష్యం ప్రశ్నార్థకంగా మారిందన్నారు. గురువారం హైదరాబాద్ సిటిజన్స్ ఫోరం ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ట్యాంక్‌బండ్‌పై ఉన్న శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహం వద్ద కాలుష్యాన్ని అరికట్టాలని, పర్యావరణాన్ని కాపాడాలని మానవహారం నిర్వహించారు. ఈ సంవత్సరం ప్రపంచ పర్యావరణ దినోత్సవ థీమ్‌గా ఐక్యరాజ్య సమితి ''ఎండింగ్స్ గ్లోబల్ ప్లాస్టిక్ పొల్యూషన్''అని పిలుపునిచ్చింది. ఈ మేరకు ఫోరం కార్యకర్తలు ఏడు అడుగుల వ్యాసం గల గ్లోబు నిర్మించి అందులో ప్లాస్టిక్ వ్యర్థాలు నింపి భూగోళం మొత్తం ప్లాస్టిక్‌తో నిండి ఉన్నదని, దీన్ని కాపాడుకోవాలనే సందేశం వచ్చేలా ప్రదర్శించారు. లుబ్నా సర్వత్ మాట్లాడుతూ హైదరాబాద్ నగరంలో ప్రతి మున్సిపల్ వార్డులో ఎన్ని చెట్లు ఉన్నాయో ప్రకటించాలని, వాటి రక్షణ, అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అన్నారు. నగరంలో చెరువులను కాపాడుకొని, పర్యావరణహిత నగరంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హెచ్‌సీఎఫ్ ప్రధాన కార్యదర్శి కె.వీరయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సామాజికవేత్త డాక్టర్ జయసూర్య, ఎం. శ్రీనివాసరావు, పి.శ్రీనివాసరావు, మల్లం రమేష్, మహమ్మద్ జావేద్,మోహన్, రాజమౌళి, గోపాల్, సంగీత, హస్మిత, లలిత, సైదులు , రమేష్ తదితరులు పాల్గొన్నారు.



ట్యాంక్‌బండ్‌పై పర్యావరణ కాలుష్యంపై అవగాహన కల్పిస్తున్న హైదరాబాద్ సిటిజన్ ఫోరం

వ్యర్థాలను నియంత్రించాలి

హైడ్రా సదస్సులో పర్యావరణవేత్తలు

సాక్షి, సిటీబ్యూరో: ప్లాస్టిక్ వ్యర్థాలను నియంత్రించాల్సిన అవసరం ఉందని, అలా కాకపోతే భవిష్యత్తులో పర్యావరణానికి పెనుముప్పు తప్పదని పర్యావరణవేత్తలు స్పష్టం చేశారు. నాలాల ద్వారా ప్లాస్టిక్ వ్యర్థాలు చెరువుల్లోకి చేరుతూ సవాల్ విసురుతున్నాయని అభిప్రాయపడ్డారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం హైడ్రా కార్యాలయంలో 'పొల్యూషన్ ఆఫ్ వాటర్ బాడీస్'అనే అంశంపై సదస్సు నిర్వహించారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ నేతృత్వంలో జరిగిన ఈ సదస్సులో పలువురు పర్యావరణవేత్తలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు మాట్లాడారు. నాలాలు, చెరువుల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు నియంత్రించడానికి ఎవరికి వారు ముందుకు రావాలని, మనం వాడే ప్లాస్టిక్ ఎక్కడకు చేరుతోందనే విషయాన్ని ప్రతి ఒక్కరూ ఆలోచించాలని సూచించారు. నాలాలు, మురుగు నీటి కాలువల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు నీటి ప్రవాహానికి అడ్డుగా మారి ముంపునకు కారణం అవుతున్నాయని పేర్కొన్నారు. ప్లాస్టిక్‌పై నిషేధం, రీ–సైక్లింగ్‌కు ఉపయుక్తంగా ఉన్న ప్లాస్టిక్ వినియోగమే దీనికి పరిష్కారమని అభిప్రాయపడ్డారు. జీహెచ్ఎంసీ పరిధిలో రోజుకు ఎనిమిది వేల టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోందని, సరైన నిర్వహణ లేకనే చెరువులు, నదులు, కుంటలు, వాగులు వ్యర్థాలతో పూడుకుపోతున్నాయని విచారం వ్యక్తం చేశారు. నగరంలో ఉత్పత్తి అవుతున్న ఈ చెత్తను వేరు చేసి ఎరువుగా, ఇంధనంగా వినియోగించడంపై దృష్టి పెట్టాలన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలను ప్రత్యామ్నాయంగా వినియోగించే వారికి రాయితీలు ఇచ్చి ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో హైడ్రా అధికారులు, స్వచ్ఛభారత్ ప్రచారకర్త ఎం.సూర్యనారాయణ, స్మరణ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి సుభాష్ రెడ్డి, జేఎన్‌టీయూ ప్రొఫెసర్ డా.హిమబిందు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి మధులిక చౌదరి తదితరులు పాల్గొన్నారు.



గాయకుడు శ్రీకాంత్‌కు బాలు–మల్లెల పురస్కారం



శ్రీకాంత్‌కు పురస్కారం అందజేస్తున్న వేణుగోపాలాచారి, పార్వతీశం తదితరులు

చిక్కడపల్లి: పద్మ విభూషణ్ డాక్టర్ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 79వ జయంతి సందర్భంగా త్యాగరాయ గానసభలో మధుర గాయకుడు తాడిమేటి శ్రీకాంత్‌కు బాలు–మల్లెల పురస్కారం ప్రదానం చేశారు. మల్లెల కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎల్ఐసీ సౌజన్యంతో గురువారం జరిగిన ఈ సభలో కేంద్ర మాజీమంత్రి డాక్టర్ సముద్రాల వేణుగోపాలాచారి, సాహితీవేత్త ఓలేటి పార్వతీశం, వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, సీహెచ్ త్రినాథరావు మాట్లాడారు. మల్లెల కల్చరల్ సంస్థ విలువలతో కూడుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తోందని సంస్థ అధ్యక్షురాలు మల్లెల వసుంధరను అభినందించారు. తొలుత సినీ సంగీత విభావరిలో సినీ నేపథ్య గాయనీ గాయకులు సుశీల, జానకి, చిత్ర, ఎస్పీ బాలు పలు చిత్రాల్లో పాడిన గీతాలను పలువురు గాయకులు ఆలపించి సభికులను అలరించారు.

'ఊట్జ్ ద ఫర్‌గాటెన్ మెటల్ క్రాఫ్ట్ ఆఫ్ దక్కన్' ఆవిష్కరణ

నాంపల్లి: డాక్టర్ శ్రీపెరంబుదురు జై కిషన్ రచించిన 'ఊట్జ్ ద ఫర్‌గాటెన్ మెటల్ క్రాఫ్ట్ ఆఫ్ దక్కన్'అనే ఆంగ్ల పుస్తకావిష్కరణ సభ బుధవారం రాత్రి నాంపల్లిలోని తెలుగు విశ్వవిద్యాలయంలో జరిగింది. జాతీయ విశ్వకర్మ ఎంప్లాయిస్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పుస్తకావిష్కరణ సభకు ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్సీలు సిరికొండ మధుసూదనాచారి, దాసోజు శ్రవణ్ హాజరయ్యారు. అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు ఎ.పద్మాచారి అధ్యక్షతన జరిగిన సభలో మధుసూదనాచారి మాట్లాడుతూ సాంస్కృతికంగా, చారిత్రకంగా ఉన్నత చరిత్ర కలిగిన తెలంగాణలో అత్యంత నాణ్యమైన ఉక్కు లోహాన్ని కూడా ఉత్పత్తి చేసేదని ఆధారాలతోసహా ఈ పుస్తకం వెల్లడించిందని అన్నారు. శ్రవణ్ మాట్లాడుతూ సమాజానికి నాగరికత నేర్పిన విశ్వ బ్రాహ్మణుల గొప్పదనాన్ని ఈ గ్రంథంలో అద్భుతంగా పేర్కొన్నారని అన్నారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేములవాడ మదన్ మోహన్, సమాచార శాఖ జాయింట్ డైరెక్టర్ కన్నెకంటి వెంకటరమణ, హైదరాబాద్ డీఆర్‌ఓ వెంకటాచారి, రాజేందర్ రెడ్డి, వి.రఘునాథ్, రఘువీర్ ప్రతాప్, పెండోట శ్రీను, తంగెళ్లపల్లి రవికుమార్, కిరణ్‌కుమార్, బుద్దారం సుధాకర్, శాంతికృష్ణ, మంజుల తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మధుసూదనాచారి

విద్యా నైపుణ్యాలను పెంపొందించాలి



సాక్షి, సిటీ బ్యూరో: విశ్వ విద్యాలయాలు, అనుబంధ సంస్థల్లో పరిశోధన, విద్యా నైపుణ్యాలను పెంపొందించాలని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి అన్నారు. మెథడిస్ట్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో కంప్యూటర్ సైన్స్, ఇంజనీరింగ్ విభాగాల్లో రెండు రోజుల ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్, రీసెంట్ అడ్వాన్స్‌మెంట్ ఇన్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ సాఫ్ట్ కంప్యూటరింగ్ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ బహుళ విభాగాల్లో పెరుగుతున్న ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ప్రాముఖ్యత, భవిష్యత్తులో దాని పాత్రను వివరించారు. కార్యక్రమంలో డా.లావణ్య, ప్రొ.శారద వరలక్ష్మి, డా.ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

'రియల్' రంగాన్ని ముందుకు తీసుకెళ్తాం

బిల్డర్స్ సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తా: శ్రీధర్‌బాబు

నాగోలు: రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి డి.శ్రీధర్ బాబు అన్నారు. గ్రేటర్ ఈస్ట్ జోన్ బిల్డర్స్ అసోసియేషన్ యువజన విభాగం ఆధ్వర్యంలో బుధవారంరాత్రి నాగోలు జూబ్లీపార్క్ హోటల్‌లో జరిగిన బిల్డర్ల సమావేశంలో మంత్రి మాట్లాడారు. దేశంలోని మెట్రో నగరాల్లో రెండేళ్ల నుంచి రియల్ ఎస్టేట్ లావాదేవీలు జరగడం లేదని అన్నారు. ప్రతిపక్షాలు, ఒక వర్గం మీడియా ప్రజల్లో భయాందోళన సృష్టిస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థిక వనరులు పెరగకుండా చూస్తున్నారని ఆరోపించారు. హైడ్రా కార్యాలయానికి రోజూ వందలాది మంది ఫిర్యాదుదారులు వస్తున్నారని, ఎక్కడా తప్పిదాలు జరగకుండా ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకుపోతోందని పేర్కొన్నారు. నగరంలో ఐటీ రంగాన్ని అన్ని విధాలా కాంగ్రెస్ ప్రభుత్వమే ప్రోత్సహించిందని అన్నారు. అన్ని సదుపాయాలతో ఫోర్త్ సిటీ నిర్మాణం జరుగుతోందని అన్నారు. ప్రపంచ స్థాయి కంపెనీలు, స్కూల్స్, డేటా సెంటర్స్, స్కిల్స్ యూనివర్సిటీ, పార్కులు, జ్యువెలరీ దుకాణాలు అక్కడ కొలువుదీరుతాయని తెలిపారు. తూర్పు ప్రాంతంలో 400 ఎకరాల్లో ప్రత్యేక పార్క్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం యోచిస్తోందన్నారు. బిల్డర్ల సమస్యలను ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, ఈస్ట్ జోన్ బిల్డర్స్ అసోసియేషన్ చైర్మన్ టి.నర్సింహారావు, అధ్యక్షుడు మారం సతీష్‌కుమార్, ప్రభాకర్‌రావు, టీఎస్ఆర్ విక్రమ్‌కుమార్, అక్షయ్ సాధు, మరం మేఘన, మిడిదొడ్డి మహేష్, సంతోష్‌రెడ్డి, వినీత తదితరులు పాల్గొన్నారు.



ఈస్ట్ జోన్ బిల్డర్స్ అసోసియేషన్ సమావేశంలో పాల్గొన్న మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే మల్‌రెడ్డి

చెట్టును తరలించి.. ట్రాఫిక్‌కు చెక్ పెట్టి..

రాంగోపాల్‌పేట్: అసలే ఇరుకైన రోడ్డు.. రోడ్డు పక్కనే భారీ వృక్షం.. అక్కడ తరచూ ట్రాఫిక్‌కు అవాంతరాలు.. గణపతి నవరాత్రులు, దసరా ఉత్సవాల సందర్భంగా భారీ విగ్రహాల తరలింపు సమయంలో ఇబ్బందులు.. ఈ నేపథ్యంలో ఉత్తర మండలం ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు ఆ భారీ వృక్షాన్ని తరలించి ఆ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించారు. గురువారం మంజు థియేటర్ ప్రాంతంలోని ఈ భారీ వృక్షాన్ని అక్కడి నుంచి మహబూబ్ కళాశాల ప్రాంగణంలోకి తరలించి దానికి మళ్లీ పునరుజ్జీవం పోశారు. కొద్దిరోజులుగా రోడ్డు పక్కనే ఉన్న భారీ వృక్షాలను తరలిస్తూ అటు పర్యావరణానికి, ఇటు ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా కృషి చేస్తున్న శంకర్‌రాజుకు పలువురు పర్యావరణ ప్రేమికులు అభినందనలు తెలుపుతున్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం రోజే మరో చెట్టుకు జీవం పోయడం ఆనందంగా ఉందని ఏసీపీ శంకర్‌రాజు చెప్పారు. వృక్షాన్ని తరలిస్తున్న ప్రాంతాన్ని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ పరిశీలించి ఏసీపీ శంకర్‌రాజును అభినందించారు.



ఏసీపీ శంకర్‌రాజుతో మాట్లాడుతున్న జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్

సాక్షి సిటీ ప్లస్
13
హైదరాబాద్, శుక్రవారం, 6, జూన్, 2025

నగరవాసం అంటేనే కొత్త కొత్త అనుభూతులు, అనుభవాలతో సహవాసం.. విశ్వవ్యాప్తంగా రాకపోకలు సాగించే మహానగరాల్లో కొత్త విశేషాలకు కొరత ఎప్పుడూ ఉండదు. అంతేకాదు కొత్త విషయాలకు నగరవాసులు ఎప్పుడూ ఆకర్షితులే.. వాటిలోని వింత అనుభవాలను చవిచూడాల ఎప్పుడూ ఉవ్విళ్లూరుతూ ఉంటారు. ఇలాంటి నయా ట్రెండ్స్‌కు తామేమీ తక్కువ కాదన్నట్లు భావిస్తుంటారు. అందుకే ఏ విషయంలోనైనా నగరవాసులు ముందుంటారు.. అలాంటి మరో కొత్త విశేషమే నగరానికి పరిచయమైంది. అదే ఐస్ బాత్. ఈ పేరిట ఇటీవలే ఓ ట్రెండ్ పరిచయమైంది.

– సాక్షి, సిటీబ్యూరో



వాహ్.. క్యా 'బాత్' హై..

నగరంలో ఆదరణ పొందుతున్న నయా 'బాత్'

- ఆరోగ్యాన్నీ, ఆనందాన్నీ ఇస్తుందంటున్న యువత
- ఐస్ స్నానానుభవాన్ని సెలబ్రిటీలూ ఆస్వాదిస్తున్న వైనం
- టబ్స్ ద్వారా కోరుకున్న చోటకే తరలివస్తున్న ఐస్ స్నానాలు
- ఫిట్నెస్ ప్రియులకూ ఉపయుక్తం అంటున్న నిపుణులు
- క్లబ్స్, కేఫ్స్‌లో ఈవెంట్స్‌లా చేస్తున్న నిర్వాహకులు

ఐస్ బాత్ థెరపీ నగరంలోని ఆరోగ్య, ఫిట్‌నెస్ ప్రియులకు నూతన ట్రెండ్‌గా మారింది. ఈ థెరపీ ద్వారా శరీరానికి మాత్రమే కాదు.. మానసికంగానూ అనేక ఆరోగ్య ప్రయోజనాలున్నాయని దీన్ని అందిస్తున్న నిపుణులు చెబుతున్నారు. సమంత, విరాట్ కోహ్లీ, విజయ్ దేవరకొండ, అనమ్ మీర్జా, విష్ణు మంచు వంటి ప్రముఖులు ఐస్ బాత్ తో వారి అనుభవాలను సోషల్ మీడియాలో పంచుకుంటున్నారు. ఇది అనేకమందిలో ఈ థెరపీ పట్ల ఆసక్తిని పెంచుతోంది. మరి కొందరు సైతం ఐస్‌బాత్‌ను ఒక ఈవెంట్‌లా నగరంలోని కేఫ్స్, క్లబ్స్.. వంటి విభిన్న ప్రదేశాల్లో నిర్వహిస్తున్నారు.



స్నాన విశేషాలివీ..

ఐస్ బాత్ అనేది చల్లటి నీటిలో, సాధారణంగా 10 నుంచి 15 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలో, 10 నుండి 15 నిమిషాల పాటు శరీరాన్ని ముంచడం. దీనినే క్రయోథెరపీ లేదా కోల్డ్–వాటర్ ఇమ్మర్షన్ టెక్నిక్/కోల్డ్ ప్లంజ్ థెరపీ అని కూడా పిలుస్తారు. ఈ ప్రక్రియ శరీరంలోని రక్తనాళాలను సంకోచింపజేస్తుంది. తద్వారా వాపు, నొప్పి తగ్గుతుంది. కొన్ని ఇబ్బందుల నుంచి శరీరం త్వరగా కోలుకోవడంలో సహాయపడుతుంది. ఈ చికిత్స విచిత్రంగా అనిపించవచ్చు, కానీ ఇది చాలా ప్రతిఫలదాయకంగా ఉంటుంది. ప్రారంభ షాక్ తర్వాత, శరీరం అలవాటుపడుతుంది.

ఆరోగ్య ప్రయోజనాలివీ..

ఈ ఐస్‌బాత్ సేవలు అందిస్తున్నవారు చెబుతున్న వివరాల ప్రకారం.. దీని ద్వారా కండరాల నొప్పి, వాపు తగ్గుతుంది. చల్లటి నీటిలో శరీరం ఉన్నప్పుడు రక్తప్రసరణ మెరుగై, ఎండార్ఫిన్లు విడుదలై, మానసిక ఒత్తిడి తగ్గుతుంది. క్రమం తప్పని ఐస్ బాత్‌తో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఇది చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. చల్లటి నీటి ప్రమేయంతో నాడీ వ్యవస్థను సక్రమం చేస్తుంది. ఇది డోపమైన్ స్థాయిలను పెంచుతుంది. అత్యంత చల్లటి నీటిలో ఒక మునక డోపమైన్ ఉత్పత్తిని 250% వరకూ పెంచుతుంది. తద్వారా సహజమైన మానసిక ఆరోగ్యాన్ని ఇస్తుంది.. ఇబ్బంది కలిగించే చలిని ఎదుర్కోవడం మెదడుని అసౌకర్యాన్ని స్వీకరించడానికి, స్థితిస్థాపన క్రమశిక్షణను పెంపొందించడానికి సహాయపడుతుంది.



ఇదో సవాలు లాంటిది..

ఐస్ బాత్ అంటే చలిని భరించడం మాత్రమే కాదు – ఇది ఒక సవాలును స్వీకరించడం, మానసిక సరిహద్దులను విస్తరించడం. గందరగోళంలో ప్రశాంతంగా ఉండటం ఎలా అనేది నేర్చుకోవడం. ఐస్ బాత్ థెరపీ అంతర్గత శక్తితో తిరిగి కనెక్ట్ అవ్వడానికి సహకరిస్తుంది.

– సిద్ధాంతి, ఐస్‌బాత్ ఈవెంట్ నిర్వాహకురాలు



వ్యక్తిగతంగా మెచ్చి.. స్వదేశానికి తెచ్చి..

'మారథాన్ రన్నర్స్, క్రీడాకారులకు కఠినమైన శిక్షణ తర్వాత అలసట దూరం కావడానికి ఈ థెరపీ ఉపయోగపడుతుంది. ఈ క్రమంలో ఇది బాగా ప్రాచుర్యం పొందింది. ఇప్పుడు విభిన్న వర్గాల వారు ఆరోగ్యం కోసం దీన్ని ఎంచుకుంటున్నారు. మార్షల్ ఆర్ట్స్‌పై ఆసక్తితో థాయిలాండ్‌లోని ఎలైట్ ఫైట్ క్లబ్‌లో సభ్యులుగా శిక్షణ పొందుతున్న సమయంలో ఈ ఐస్ బాత్ థెరపీ గురించి తెలిసింది. నగరంలో దీనిని ప్రవేశపెట్టాలని నార్సింగిలో ఓ సెంటర్‌తో పాటు మొబైల్ ఐస్ బాత్ థెరపీ అందుబాటులోకి తీసుకొచ్చాం. ప్రారంభకులకు 90 సెకన్ల నుంచి అత్యధికంగా 3 నిమిషాలు మాత్రమే సూచిస్తాం. ఆ తర్వాత వారి వారి ఇష్టం, సామర్థ్యాలను బట్టి వ్యవధి పెంచుకోవచ్చు. వ్యక్తిగతంగా 18 నిమిషాల వరకూ ఐస్ బాత్ చేయగలను.

– షేక్ అజ్గర్ సుల్తాన్, ఐస్ మ్యాన్ ఇండియా బ్రీత్ వర్కౌట్ వ్యవస్థాపకుడు



జాగ్రత్తలు తప్పనిసరి..

- ఐస్‌బాత్ ఈవెంట్‌లో పాల్గొనాలని అనుకున్నప్పుడు తప్పనిసరిగా ముందస్తు వైద్య సలహా తీసుకోవాలి.
- అధిక లేదా తక్కువ రక్తపోటు, గుండె సంబంధిత రుగ్మతలు, నాడీ సంబంధిత పరిస్థితులు, మధుమేహం లేదా వాస్కులర్, ఏవైనా ఇతర సమస్యలు ఉన్నవారికి ఇది నప్పదు.
- ఐస్ బాత్ వ్యవధి ఒక నిమిషం నుంచి 2 నిమిషాలు వరకూ సరిపోతుందని, అయితే కొన్ని సెషన్ల తర్వాత వ్యక్తులు వారి వారి శరీర తత్వాన్ని బట్టి వ్యవధిని పెంచుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.
- ప్రారంభకులకు, సంవత్సరానికి 3–4 సెషన్‌లు సరిపోతాయి. శరీరం ప్రతిస్పందనను బట్టి ఆరోగ్య లక్ష్యాల ఆధారంగా ఫ్రీక్వెన్సీని పెంచవచ్చు.
- ప్రస్తుతం సెషన్ సెటప్ ఫెసిలిటేటర్ నైపుణ్యాన్ని బట్టి రూ.2,000 నుంచి రూ.8,000 వరకూ ఉంది.

నాయకత్వం ఒక లక్షణం..

- ఇన్‌స్పైర్, ఇంపాక్ట్, ఇగ్నైట్ పుస్తకాన్ని ఆవిష్కరించిన ప్రముఖ కాస్మిక్ స్టోరీ టెల్లర్
- హోదాను బట్టి నాయకుడిగా గుర్తించరు : కురువ వెంకట రమణమూర్తి

సాక్షి, సిటీబ్యూరో: లీడర్‌షిప్ అనేది హోదా కాదు.. ఒక వ్యక్తిత్వమని, నాయకత్వాన్ని వారసత్వంలా కాకుండా మానవత్వ కోణంలో పునర్నిర్వచించారు టెడెక్స్ స్పీకర్, ప్రముఖ కాస్మిక్ స్టోరీ టెల్లర్, హోలిస్టిక్ హీలర్ కురువ వెంకట రమణమూర్తి. నాయకత్వంపై తాను రచించిన 'ఇన్‌స్పైర్, ఇంపాక్ట్, ఇగ్నైట్ – లీడర్‌షిప్ ఈజ్ ఎ స్టోరీ, నాట్ ఎ టైటిల్' అనే తాజా పుస్తకాన్ని నగరంలోని పార్క్ హయత్‌లో గురువారం ఆవిష్కరించారు. ఒక నాయకుడిని కేవలం అతడి హోదాను బట్టి ఎవరూ గుర్తుంచుకోరు. ప్రజల జీవితాలపై వాళ్లు చూపించే ప్రభావం, వాళ్లు వదిలి వెళ్లే గాథలను బట్టే గుర్తుంచుకుంటారని అన్నారు. నాయకత్వం అనేది నిజాయితీ, వారి చర్యలు, ప్రభావాల ద్వారా బయటపడుతుందని నమ్మేవాళ్ల కోసమే ఈ పుస్తకం రాశానని తెలిపారు. యువ వ్యాపారవేత్త అయినా, విద్యావేత్త అయినా, మార్పు కోసం కృషి చేసేవారైనా వారి పనులకు ఈ పుస్తకం అద్దం లాంటిదన్నారు. ఈ రచనలో లీడర్‌షిప్‌లో సంప్రదాయంగా వస్తున్న మార్పులను సవాలు చేస్తూ, బలమైన స్టోరీ టెల్లింగ్, వాస్తవ అనుభవాలతో దిశానిర్దేశం చేశారు. ఆన్‌లైన్ వేదికగా బెస్ట్ సెల్లింగ్ రైటర్‌గా తన ప్రస్తుత పుస్తకానికి అద్భుత ఆదరణ లభిస్తుందని ముఖ్య అతిథులు కొనియాడారు. ప్రముఖ సాహితీవేత్తలు, యువ రీడర్స్ పాల్గొన్నారు.



కాలుష్యభూతం.. చేద్దాం అంతం..

సాక్షి సిటీబ్యూరో: పర్యావరణాన్ని కాపాడుకోవడం, కాలుష్యభూతాన్ని అంతం చేయడంపై ప్రతి ఒక్కరూ దృష్టి పెట్టాల్సి ఉందని పర్యావరణ వేత్తలు ఉద్బోధించారు. ప్రముఖ మినరల్ వాటర్ తయారీ సంస్థ బిస్లరీ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో గురువారం నగరంలోని ఘట్‌కేసర్ తదితర ప్రాంతాల్లో పర్యావరణ దినోత్సవ కార్యక్రమాలను నిర్వహించారు. 'ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయడం' అనే థీమ్‌తో ప్లాస్టిక్ వ్యర్థాల విభజన, సేకరణ, రీసైక్లింగ్, క్లీనింగ్ డ్రైవ్, అవగాహన ర్యాలీ.. తదితర కార్యక్రమాలు చేపట్టారు. పలువురు పర్యావరణ వేత్తలు, స్వచ్ఛంద సంస్థల కార్యకర్తలు, ఘట్కేసర్‌లోని ఒమేగా పీజీ కాలేజ్ విద్యార్థులు పాల్గొన్నారు.





హెచ్ఐసీసీలో టెక్‌నోవా గ్రాడ్యుయేషన్

ర్యాంప్‌వాక్‌తో అలరించిన విద్యార్థులు, మోడల్స్

మాదాపూర్ : నిఫ్ట్ విద్యార్థులు తయారు చేసిన ఉత్పత్తులను ర్యాంప్‌వాక్ చేస్తూ ప్రదర్శించిన విద్యార్థులు, మోడల్స్ సందర్శకులను అలరించారు. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో టెక్‌నోవా గ్రాడ్యుయేషన్ ప్రాజెక్ట్ షో 2025ను గురువారం నిర్వహించారు. డిజైన్ రంగంలోని విద్యార్థులు వినూత్న రీతిలో వస్త్రాలను డిజైన్ చేసి ఆకట్టుకున్నారు. ఎంసీఆర్ హెచ్ఆర్‌డీ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ జనరల్ శాంతికుమారి, సెర్ప్ సీఈఓ దివ్య, సామాజిక సంక్షేమ అధికారి అలుగు వర్షిణి, నిఫ్ట్ డైరెక్టర్ డాక్టర్ మాలినీ తదితరులు పాల్గొన్నారు. 44 మంది ఫ్యాషన్ డిజైన్ విద్యార్థులు 27 ప్రాజెక్టులను, 17 డిజైన్ కలెక్షన్‌లను, నిట్‌వేర్ డిజైన్ 35 మంది, టెక్స్‌టైల్ డిజైన్ 32 మంది, ఫ్యాషన్ కమ్యూనికేషన్ 38 మంది, ఫ్యాషన్ అండ్ లైఫ్‌స్టైల్ యాక్సెసరీస్ డిజైన్ 34 మంది, ఫ్యాషన్ టెక్నాలజీ 26 మంది, ఫ్యాషన్ మేనేజ్‌మెంట్ స్టడీస్ 33 మంది పాల్గొని వినూత్న మోడల్స్ ప్రదర్శించారు.

---

19 నుంచి హైలైఫ్



బంజారాహిల్స్: ప్రతిష్టాత్మక హైలైఫ్ లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్ జూన్ 19వ తేదీ నుంచి హెచ్ఐసీసీ నోవాటెల్ హోటల్‌లో ప్రారంభిస్తున్నట్లు సంస్థ నిర్వాహకులు వెల్లడించారు. బంజారాహిల్స్ రోడ్ నెం.10లో ఏర్పాటు చేసిన సన్నాహక కార్యక్రమంలో సినీ నటి దివిజతో పాటు పలువురు మోడల్స్ కార్యక్రమ కరపత్రాన్ని బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించనున్న డిజైనరీ దుస్తులు, ఆభరణాలు ధరించి మోడల్స్ హొయలు పోయారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ ఎగ్జిబిషన్‌లో దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి డిజైనర్లు పాల్గొని వారి ఉత్పత్తులను ప్రదర్శిస్తారని తెలిపారు.


సన్నాహక కార్యక్రమంలో సినీ నటి దివిజ



కరపత్రాన్ని ఆవిష్కరించిన మోడల్స్

సిట్ డౌన్ ఆశిష్..

- ఈ నెల 21న ప్రదర్శించనున్న నవ్వుల షో..
- ప్రముఖ నటుడు ఆశిష్ విద్యార్థి స్టాండప్ కామెడీ



సాక్షి, సిటీబ్యూరో: విలక్షణమైన నటనతో సినిమా అభిమానులను అలరించిన ప్రముఖ సినీ నటులు ఆశిష్ విద్యార్థి మరో వేదికపై అభిమానులకు చేరువవుతున్నారు. దేశవ్యాప్తంగా 11 భాషల్లో 3 వందలకు పైగా సినిమాలు చేసిన ఆశిష్ విద్యార్థి స్టాండప్ కామెడీతో ఆకట్టుకుంటున్నారు. ఈ ప్రయాణంలో భాగంగానే నగరంలోని నవిక కేఫ్ అండ్ స్టూడియో వేదికగా ఈ నెల 21న స్టాండప్ కామెడీ ప్రదర్శన చేయనున్నారు. చిన్నారులు మొదలు పెద్దల వరకూ ఎవరైనా హాజరై నవ్వుల జల్లుల్లో మునిగిపోవడానికి ఇందులో భాగస్వామ్యం కావొచ్చని నిర్వాహకులు పేర్కొన్నారు. సిట్ డౌన్ ఆశిష్ పేరుతో హిందీ భాషలో కొనసాగే ఈ స్టాండప్ కామెడీ షోకు సంబంధించిన పాస్‌లు బుక్ మై షోలో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.

హార్స్ రైడింగ్‌లో.. ధృవ సత్తా..

- అత్యంత పిన్న వయస్కుడిగా గుర్తింపు
- వివిధ విభాగాల్లో మొత్తం ఐదు పతకాలు



సాక్షి, సిటీ బ్యూరో: హార్స్ షోలో సత్తా చాటిన అత్యంత పిన్న వయస్కుడైన ఈక్వెస్ట్రియన్ రైడర్‌గా నగరానికి చెందిన మాస్టర్ ధృవ నిలిచాడు. ఈక్వెస్ట్రియన్ అకాడమీ ఆధ్వర్యంలో శంకర్‌పల్లిలోని నాసర్ పోలో ఆవరణలో అండర్–10, 12, 14, 16, అదే విధంగా 45–125 సెంటీమీటర్ల ఓపెన్ విభాగాల్లో దాదాపు 650 మంది రైడర్లకు పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రెస్సేజ్ విభాగంతో పాటు ట్రోట్ సీహెచ్–2 వంటి విభాగాల్లో అద్భుతమైన ప్రదర్శనలు కనబరిచారు. ఈ పోటీల్లో పదేళ్ల బాలుడు మాస్టర్ ధృవ 3 బంగారు, 1 రజితం, 1 కాంస్య పతకాలతో ప్రథమ బహుమతులు సాధించాడు. ఈ సందర్భంగా ఈక్వెస్ట్రియన్ క్రీడల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించడమే తన లక్ష్యం అని చెబుతున్నాడు ధృవ. నగరంలోని ఓ ప్రైవేట్ పాఠశాలకు చెందిన ఈ విద్యార్థి ఆరేళ్ల వయసు నుంచే గుర్రపుస్వారీ చేస్తున్నానని చెప్పుకొచ్చాడు.

పడగ విప్పిన పచ్చ మాఫియా

డ్రగ్స్ డోర్ డెలివరీతో యథేచ్ఛగా దందా

అత్యాచారాలతో అట్టుడుకుతున్న ఏపీ

పేకాట క్లబ్బుల దందాతో భారీ దోపిడీ

కూటమి అండతో చెలరేగుతున్న మాఫియా

అనంతపురం జిల్లాలో బాలికపై సామూహిక అత్యాచారం

నిందితులకు పరిటాల కుటుంబం వత్తాసు

డ్రగ్స్ దందా వెనుక టీడీపీ ముఠా

అందుకే కొరియర్ సర్వీసుతో డోర్ డెలివరీ

కూటమి ఎమ్మెల్యేలదే పేకాట క్లబ్బుల దందా

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై అక్రమ కేసులతో వేధింపులు.. వైఎస్సార్ జిల్లాలో ఆత్మహత్యకు పాల్పడ్డ వైఎస్సార్‌సీపీ కార్యకర్త

చంద్రబాబు ఏడాది పాలనలో 187 అత్యాచారాలు

హత్యాచారాలు 15.. హత్యలు 380 అనుమానస్పద మృతులు 16

ఇదీ రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగ మారణహోమం

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

రూ.1 తయారీకి.. రూ.1.11 వ్యయం



తడిసి మోపెడవుతున్న కరెన్సీ ముద్రణ ఖర్చు

2024-25లో రూ.6,373 కోట్లకు చేరిక

ఏడాదిలో 25 శాతం పెరిగిన వ్యయం

చెలామణిలోకి 3,030 కోట్ల నోట్లు

ఒక రూపాయి బిళ్ల తయారవడానికి ఒక రూపాయి 11 పైసలు కావాలి. అదే 10 రూపాయల బిళ్లకైతే రూ.5.54. రూ.10 నోటు మన చేతిలోకి రావడానికి సుమారు ఒక రూపాయి ఖర్చవుతోంది. కరెన్సీ తయారవ్వాలన్నా కరెన్సీ కావాల్సిందే. ఈ ఖర్చు ఏటా భారీగా పెరిగిపోతోంది. 2024-25లో కరెన్సీ ముద్రణకు ఏకంగా రూ.6,373 కోట్లు వెచ్చించాల్సి వచ్చింది. అంతకుముందు ఏడాదితో పోలిస్తే ఇది 25 శాతం ఎక్కువ. నాలుగేళ్లలో ఖర్చు 58.8 శాతం పెరిగిపోయింది.

- సాక్షి, స్పెషల్ డెస్క్

కరెన్సీ నోట్లను కొంత మంది పర్సులోనో, జేబులోనో కుక్కిపెడతారు. పాడవుతాయన్న పట్టింపు ఉండదు. చినిగిపోయినా ఏముందిలే ఏ షాపులోనైనా తీసుకుంటారు అన్న ధీమా. లేదంటే బ్యాంకులో మార్చుకోవచ్చని తేలిగ్గా తీసుకుంటారు. మా డబ్బులు మా ఇష్టం అని కొట్టిపారేయకండి. కరెన్సీ నోటు కూడా ఖర్చు పెట్టి తయారుచేయాల్సిందే. ఎందుకంటే తయారీ, పంపిణీ వ్యయాన్ని జోడిస్తే ఆ కరెన్సీ విలువ మీకు కనిపించే అంకెను మించి ఉంటుంది.

కరెన్సీ తయారీలో వాడే సిరా, కాగితం వంటి ముడి సరుకు వ్యయాలకుతోడు సిబ్బంది వేతనాలూ పెరిగాయి. దీని ఫలితంగా ముద్రణ ఖర్చు పెరిగిందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఇటీవల తన వార్షిక నివేదికలో వెల్లడించింది. అంతేగాక నకిలీ నోట్లను చెక్ పెట్టేందుకు ఎప్పటికప్పుడు నూతన సెక్యూరిటీ ఫీచర్లను జోడించడం కూడా ఖర్చును పెంచిందని ఆర్‌బీఐ చెబుతోంది.



పెరిగిన నోట్ల సరఫరా

ఆర్‌బీఐ నివేదిక ప్రకారం.. 2020-21లో నోట్ల ముద్రణకు రూ.4,012 కోట్ల ఖర్చు అయింది. గత ఆర్థిక సంవత్సరంలో ఈ వ్యయం కాస్తా రూ.6,373 కోట్లకు చేరింది. అంటే నాలుగేళ్లలో 58.8 శాతం ఎగసిందన్నమాట. 2023-24లో కరెన్సీ ముద్రణ ఖర్చులు రూ.5,101 కోట్లు. మరో ఆసక్తికర అంశం ఏంటంటే.. నాలుగేళ్లలో దేశంలో నోట్ల సరఫరా దాదాపు 2,233 కోట్ల నుంచి 35.7 శాతం పెరిగి 3,030 కోట్లకు చేరింది. ఆర్‌బీఐకి కరెన్సీ నోట్లు నాలుగు ప్రింటింగ్ ప్రెస్‌ల నుంచి వస్తాయి. ఇందులో నాసిక్ (మహారాష్ట్ర), దేవాస్ (మధ్యప్రదేశ్) ప్రెస్‌లు భారత ప్రభుత్వానికి చెందినవి. మైసూర్ (కర్ణాటక), సల్బోని (పశ్చిమ బెంగాల్) ప్రెస్‌లు రిజర్వ్ బ్యాంక్ అనుబంధ సంస్థ అయిన భారతీయ రిజర్వ్ బ్యాంక్ నోట్ ముద్రణ్ లిమిటెడ్ యాజమాన్యంలో ఉన్నాయి.

మూడు రకాల కరెన్సీ

చెలామణిలో ఉన్న కరెన్సీలో భారత్‌లో ప్రస్తుతం బ్యాంకు నోట్లతోపాటు సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీ (సీబీడీసీ), నాణేలు ఉన్నాయి. 2024-25లో దేశంలో చెలామణిలో ఉన్న బ్యాంకు నోట్ల విలువ 6 శాతం, పరిమాణం (నోట్ల సంఖ్య) 5.6 శాతం పెరిగింది. 2023 మేలో రూ.2000 నోట్ల ఉపసంహరణ ప్రకటన వెలువడిన సంగతి తెలిసిందే. నాటి నుంచి రూ.3.56 లక్షల కోట్లలో 98.2% విలువైన నోట్లు బ్యాంకులకు తిరిగి వచ్చాయి.

రూ.500 నోట్ల హవా

గత ఆర్థిక సంవత్సరంలో విలువ పరంగా రూ.500 నోట్ల వాటా ఏకంగా 86 శాతంగా ఉంది. ఏడాదిలో వీటి విలువ స్వల్పంగా తగ్గింది. పరిమాణం పరంగా రూ.500 నోట్ల వాటా 40.9 శాతం ఉంది. చెలామణిలో ఉన్న మొత్తం నోట్లలో రూ.500 నోట్ల వాటాయే అత్యధికం. పరిమాణం పరంగా తరువాతి స్థానాన్ని రూ.10 నోట్లు కైవసం చేసుకున్నాయి. వీటి వాటా మొత్తం పరిమాణంలో 16.4 శాతం. చెలామణిలో ఉన్న నోట్లలో రూ.10, రూ.20, రూ.50 నోట్ల మొత్తం వాటా 31.7 శాతం. గత ఆర్థిక సంవత్సరం చెలామణిలో ఉన్న నాణేల విలువ 9.6 శాతం, సంఖ్య 3.6 శాతం దూసుకెళ్లింది. 2025 మార్చి 31 నాటికి చెలామణిలో ఉన్న మొత్తం నాణేల పరిమాణంలో రూ.1, రూ.2, రూ.5 నాణేల వాటా 81.6 శాతం. విలువ పరంగా ఈ నాణేల వాటా 64.2 శాతానికి చేరింది.



ఒక్కో నోటు ముద్రణకు అయ్యే ఖర్చు రూపాయల్లో	
విలువ	వ్యయం
10	0.96
100	1.77
200	2.37
500	2.29
2000	4

ఈ-రుపీ కొత్త రికార్డు

2024-25లో చెలామణిలో ఉన్న ఈ-రుపీ విలువ 334 శాతం పెరిగింది. 2025 మార్చి 31 నాటికి ఆర్‌బీఐ డిజిటల్ కరెన్సీ (సీబీడీసీ) విలువ రిటైల్ రూపంలో (చెలామణిలో) నాలుగు రెట్లు పెరిగి రూ.1,016.46 కోట్లకు చేరుకుంది. అంతక్రితం ఆర్థిక సంవత్సరంలో ఇది కేవలం రూ.234 కోట్లు. ఈ-రుపీ డిజిటల్ రూపంలో పనిచేసే నగదు. వినియోగదారులు దీన్ని నిల్వ చేయడంతోపాటు బదిలీ కూడా చేయొచ్చు. 2025 మార్చి నాటికి 17 బ్యాంకులు డిజిటల్ వాలెట్స్ ద్వారా ఈ-రుపీని అందిస్తున్నాయి. దీన్ని 60 లక్షల మంది వినియోగిస్తున్నారు.

పెరిగిన నకిలీ రూ.500 నోట్లు

2024-25లో బ్యాంకింగ్ వ్యవస్థలో నకిలీ రూ.500 నోట్ల సంఖ్య 37.3 శాతం పెరిగిందని ఆర్‌బీఐ వెల్లడించింది. రూ.5.88 కోట్ల విలువైన 1.18 లక్షల నకిలీ రూ.500 నోట్లు (కొత్త డిజైన్) కనుక్కొన్నారు. 2023-24లో రూ.4.28 కోట్ల విలువైన 85,711 నకిలీ నోట్లు గుర్తించారు. నకిలీ రూ.200 నోట్లు 13.9% పెరిగాయి. రూ.10, రూ.20, రూ.50, రూ.100, రూ.2000 నోట్లలో నకిలీవి.. గతేడాదితో పోలిస్తే వరుసగా 32.3, 14, 21.8, 23 శాతం పెరిగాయి. నకిలీ రూ.2000 నోట్ల సంఖ్య ఏడాదిలో 26,035 నుంచి 3,508 నోట్లకు చేరింది. గత ఆర్థిక సంవత్సరంలో మొత్తం నకిలీ నోట్ల సంఖ్య 2.17 లక్షలు. అంత క్రితం ఏడాది ఈ సంఖ్య 2.22 లక్షల నోట్లు.

డిపోర్టేషన్‌కు 'నై'జీరియన్లు!

తిప్పి పంపడాన్ని తప్పించుకోవడానికి కేసులు

- కావాలనే నమోదయ్యేలా చేసుకుంటున్న వైనం
- బలవంతంగా పంపినా మరో పాస్‌పోర్టుతో రాక
- కట్టడి చేయలేక తలలు పట్టుకుంటున్న పోలీసులు

సాక్షి, హైదరాబాద్: వివిధ రకాలైన వీసాలపై వచ్చి..సైబర్ నేరాలు, డ్రగ్స్ దందాతో దడ పుట్టిస్తున్న నల్లజాతీయులు పోలీసులకు చుక్కలు చూపిస్తున్నారు. దీంతో వీరిని జైలుకు పంపడం కంటే..డిపోర్టేషన్ ద్వారా తిప్పిపంపడమే ఉత్తమని పోలీసులు భావిస్తున్నారు. అయితే దీనిని కూడా తప్పించుకోవడానికి ఆ కేటుగాళ్లు కొత్త ఎత్తులు వేస్తున్నట్టు వెలుగులోకి వచ్చింది. ఇలాంటి వారిలో నైజీరియన్లే ఎక్కువగా ఉన్నట్టు పోలీసులు చెబుతున్నారు.

వివిధ రకాలైన వీసాలపై వచ్చి తిష్ట

నైజీరియా, సోమాలియా, టాంజానియా, ఐవరీ కోర్టు, మొరాకో వంటి దేశాల నుంచి అనేకమంది వివిధ రకాలైన వీసాలపై హైదరాబాద్ వస్తున్నారు. వీరిలో కొందరు వీసా, పాస్‌పోర్టుల గడువు ముగిసినా అక్రమంగా నివసిస్తున్నారు.



అనేక మంది డ్రగ్స్ దందాలు, సైబర్ నేరాలు చేస్తున్నారు. గతంలో ఇలా ఉంటూ చిక్కిన వారిపై ఫారెనర్స్ యాక్ట్, ఎన్డీపీఎస్ యాక్ట్ తదితరాల కింద కేసు నమోదు చేసేవారు. కోర్టులో దీని విచారణ పూర్తయ్యే వరకు డిపోర్టేషన్ చేయడానికి ఆస్కారం ఉండేది కాదు. ఈ మధ్య కాలంలో బెయిల్‌పై బయటకు వచ్చే ఆ విదేశీయులు జైల్లో ఏర్పడిన పరిచయాలతో మరింత రెచ్చిపోవడం ప్రారంభించారు.

పోలీసుల్ని ముప్పతిప్పలు పెడుతూ...

ఫారెనర్స్ రీజినల్ రిజిస్ట్రేషన్ ఆఫీస్ (ఎఫ్ఆర్ఆర్ఓ) సాయంతో నల్లజాతీయులను డిపోర్టేషన్ చేయడం మొదలెట్టారు. అయితే ఈ డిపోర్టేషన్‌ను తప్పించుకోవడానికి నల్లజాతీయులు కొత్త ఎత్తులు వేస్తున్నారు. తమ వివరాలు చెప్పకపోతే ఎంబసీ నుంచి క్లియరెన్స్ రాదని తెలుసుకున్నారు. దీంతో అసలు వివరాలు చెప్పకుండా డిటెన్షన్ సెంటర్‌లోనే ఉండిపోతామంటున్నారు. సాంకేతిక ఆధారాల ద్వారా పోలీసులు ఈ వివరాలు సేకరిస్తే, స్థానికంగా ఉన్న తమ అనుచరుల ద్వారా మరో కథ నడిపిస్తున్నారు. ఇక్కడే ఉంటున్న ఆ దేశీయురాలితో వివాహమైనట్టు, ఆమెను వేధిస్తున్నట్టు కేసులు పెట్టించుకుంటున్నారు. ఇలా నమోదైన కేసుల విచారణ పూర్తయ్యే వరకు వారిని డిపోర్ట్ చేయడానికి ఆస్కారం ఉండట్లేదు. ఈ వ్యవహారాలన్నింటినీ నైజీరియన్లు వ్యవస్థీకృతంగా నడిపిస్తున్నారు. ఈ వివరాలను గుర్తిస్తున్న పోలీసులు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తూ ఆ కేసుల్ని మూసేయించి డిపోర్ట్ చేస్తున్నారు.

'అవతారం'మార్చుకొని మళ్లీ అడుగు...

డిపోర్టేషన్ ద్వారా తమ దేశానికి వెళ్లిపోతున్న నైజీరియన్లు అక్కడ నుంచి ఘనా, ఐవరీకోస్ట్, సూడాన్‌లకు చేరుకుంటున్నారు. అక్కడ ఉన్న భారీ నెట్‌వర్క్ వీరికి ఆ దేశాల పౌరసత్వం, గుర్తింపులు ఇప్పిస్తోంది. వీటి ద్వారా పాస్‌పోర్ట్ పొందుతున్న నైజీరియన్లు ఆ మూడు దేశాలకు చెందిన వారుగా మళ్లీ ఇక్కడకు వస్తున్నారు. ఆపై ఈ నల్లజాతీయులు తమ గుర్తింపుల్ని దాచేస్తున్నారు. నకిలీ పేర్లు, వివరాలతో ఫోర్జరీ పాస్‌పోర్టు, వీసాలు తయారు చేసుకుంటున్నారు. పట్టుబడుతున్న వారిలో దాదాపు 70 శాతం మంది వద్ద ఇవే లభిస్తున్నాయి. ఈ కారణంగానే వీరి వివరాలు కాదు కదా అసలు పేరు తెలుసుకోవడం కూడా కష్టసాధ్యంగా మారుతోంది. వీరిని కట్టడి చేయలేక పోలీసులు తలలు పట్టుకుంటున్నారు.

నేటినుంచి రైతు మహోత్సవం

సాక్షి, హైదరాబాద్: సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్న రైతు మహోత్సవాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయశాఖ డైరెక్టర్ బి.గోపి విజ్ఞప్తి చేశారు. రైతు మహోత్సవాన్ని హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని ఉదయం 10.30 గంటలకు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభిస్తారని పేర్కొన్నారు. మూడు రోజుల పాటు జరిగే రైతు మహోత్సవంలో 150కి పైగా వ్యవసాయ, ఉద్యానవన, పశు సంవర్ధక, మత్స్య శాఖల స్టాళ్లతో పాటు బ్యాంకులు, ఎఫ్‌పీవోలు, స్టార్టప్ సంస్థలు, వ్యవసాయ అనుబంధ రంగాల స్టాళ్లను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా రైతులకు వివిధ అంశాలపై శిక్షణ తరగతులను కూడా వ్యవసాయ, ఉద్యానవన శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తామని తెలిపారు.

ముగిసిన విత్తన పంపిణీ కార్యక్రమం

35 వేల మంది రైతులకు విత్తనాల పంపిణీ: మంత్రి తుమ్మల



సాక్షి, హైదరాబాద్: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, రాష్ట్ర వ్యవసాయ శాఖ సహకారంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'గ్రామ గ్రామాన నాణ్యమైన విత్తనం'కార్యక్రమం విజవంతంగా ముగిసిందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల రెండో తేదీన ప్రారంభమైన ఈ కార్యక్రమం ద్వారా సుమారు 2,500 క్వింటాళ్ల నాణ్యమైన మూల విత్తనాలను రాష్ట్రంలోని అన్ని రెవెన్యూ గ్రామాల్లో ఎంపిక చేసిన 35 వేల మంది అభ్యుదయ రైతులకు పంపిణీ చేసినట్లు వివరించారు. ఈ విత్తనాలను అందుకున్న అభ్యుదయ రైతులు, సరైన యాజమాన్య పద్ధతులు పాటించి, వచ్చిన దిగుబడిని గ్రామంలోని ఇతర రైతులకు పంపిణీ చేయాల్సి ఉంటుందన్నారు. తద్వారా రానున్న రెండు, మూడేళ్లలో ప్రతీ గ్రామం విత్తన స్వయం సమృద్ధి సాధించగలదని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. రైతాంగానికి నాణ్యమైన విత్తనం అందించాలనే లక్ష్యంతో గత నాలుగు నెలలుగా ప్రణాళికలు సిద్ధం చేసి, వ్యవసాయ విశ్వవిద్యాలయం సహకారంతో ఈ కార్యక్రమాన్ని పూర్తిచేసినట్లు తెలిపారు. వైస్ చాన్స్‌లర్‌తో పాటు వర్సిటీ అధికారులు, శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులను మంత్రి అభినందించారు.

ఎమ్మెల్యే గోపీనాథ్‌కు తీవ్ర అస్వస్థత

ఏఐజీ ఆస్పత్రిలో చికిత్స.. మాజీ మంత్రి హరీశ్ పరామర్శ



గచ్చిబౌలి (హైదరాబాద్): జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రిలో ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. ఆయన ఆరోగ్య పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. మాజీ మంత్రి హరీశ్‌రావు ఏఐజీ ఆస్పత్రికి వెళ్లి వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్న గోపీనాథ్ ఆరోగ్య పరిస్థితిని డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. 48 గంటల పాటు అబ్జర్వేషన్‌లో ఉంచి డాక్టర్లు బులెటిన్ విడుదల చేస్తారని హరీశ్‌రావు చెప్పారు. అభిమానులు, బీఆర్‌ఎస్ కార్యకర్తలు ఆందోళన చెందవద్దని గోపీనాథ్ క్షేమంగా బయటకు వస్తారన్నారు. బోరబండకు చెందిన తన అనుచరుడు సర్దార్ ఆత్మహత్యతో గోపీనాథ్ ఒత్తిడికి లోనయ్యారని కుటుంబ సభ్యులు చెప్పినట్లు ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ వెల్లడించారు. కుడి భుజంగా ఉన్న వ్యక్తి ఆత్మహత్య చేసుకోవడం, కారణమైన వ్యక్తిపై పోలీసులు చర్యలు తీసుకోకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై అస్వస్థతకు లోనైనట్లు కుంటుంబ సభ్యులు తెలిపారన్నారు. గోపీనాథ్ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, తిరిగి క్షేమంగా వస్తారని చెప్పారు. ఏఐజీ ఆస్పత్రికి ఎమ్మెల్యే కృష్ణారావు, వివేకానంద, ముఠాగోపాల్, గూడెం మహిపాల్‌రెడ్డి, నామా నాగేశ్వర్‌రావు, మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి తదితరులు వెళ్లారు.

ఆ కమిటీలను కొనసాగించండి

సెలక్షన్, సూపర్‌వైజరీ కమిటీలపై హెచ్‌సీఏకు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: మాజీ న్యాయమూర్తులు నియమించిన సెలక్షన్ కమిటీ, సూపర్‌వైజరీ కమిటీలను కొనసాగించాలని హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ)కు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేసేందుకు సమయం కావాలని హెచ్‌సీఏ కోరడంతో తదుపరి విచారణను ఈనెల 11కు వాయిదా వేసింది. అప్పటివరకు మధ్యంతర ఉత్తర్వులు అమల్లో ఉంటాయని స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఎల్.నాగేశ్వర్‌రావు నేతృత్వంలోని సింగిల్ మ్యాన్ కమిటీ క్రికెట్ క్రీడాకారుల సెలక్షన్ కమిటీ, లీగల్ మ్యాచ్‌ల నిర్వహణ కోసం హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ నవీన్‌రావు నేతృత్వంలో నియమించిన సూపర్ వైజరీ కమిటీలను నియమించిన విషయం తెలిసిందే. హెచ్‌సీఏ వార్షిక సమావేశం నిర్వహించే వరకు ఈ కమిటీలను కొనసాగించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ జై హనుమాన్ క్లబ్ తరఫున జనరల్ సెక్రటరీ కె.లక్ష్మీనరసింహారావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. 2025-26 సంవత్సరానికి లీగ్ మ్యాచ్‌లను హెచ్‌సీఏ నిబంధనలు, సూపర్‌వైజరీ కమిటీ నివేదిక ఆధారంగా నిర్వహించేలా ఆదేశించాలని కోరారు. ఈ పిటిషన్‌పై కె.శరత్ ఇటీవల విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయ మూర్తి.. హెచ్‌సీఏకు నోటీసులు జారీ చేస్తూ, విచారణ వాయిదా వేశారు.

అమానుషం.. ఘోరం

'పరిటాల' ఇలాకాలో దారుణం

దళిత బాలికపై ఆర్నెల్లుగా అత్యాచారం

వీడియో తీసి బెదిరిస్తూ నెలల పాటు కొనసాగిన దాష్టీకం.. 14 మంది నిందితులూ టీడీపీ అల్లరి మూకలే

అభం శుభం తెలియని బాలికపై మానవ మృగాలు దారుణంగా కాటేశాయి.. స్కూలుకెళ్లే పిల్లలను సైతం వదిలి పెట్టని దారుణ రోజులు దాపురించాయి.. ఒక్కరు కాదు.. ఇద్దరు కాదు.. ఏకంగా 14 మంది వంతు లేసుకుని.. వీడియో తీసి బెదిరిస్తూ.. బ్లాక్ మెయిల్ చేస్తూ.. వారికి ఇష్టం వచ్చినప్పుడల్లా బలాత్కారం చేయడం దిగ్భ్రాంతి పరుస్తోంది.. అడిగే వారు లేరని ఏకంగా ఆరు నెలల పాటు కీచక పర్వం కొనసాగించడం విస్తుగొలుపుతోంది.. తండ్రి లేని పిల్ల.. మతి స్థిమితం లేని తల్లి.. పైగా ఎస్సీ బాలిక.. ఏం చేస్తుందిలే అన్న కండ కావరం, అధికార మదంతో ఆ బరితెగింపు ఏపీలో దౌర్భాగ్య పాలనకు అద్దం పడుతోంది.. పాపం.. ఎవరికీ చెప్పుకోలేని దయనీయ పరిస్థితి ఆ బాలికది.. ఒకవేళ ఎవరికైనా చెప్పుకోవాలనుకుని దాచుకున్న కాసింత ధైర్యాన్ని సైతం ఆ దుర్మార్గులు పదేపదే బెదిరింపులతో చంపేశారు..

సాక్షి, టాస్క్‌ఫోర్స్: అరాచకాలు, దౌర్జన్యాలు, దోపిడీలకు కేరాఫ్‌గా మారిన ఉమ్మడి అనంతపురం జిల్లా రామగిరి ప్రాంతంలో మరో దుర్మార్గం చోటుచేసుకుంది. మాజీ మంత్రి పరిటాల సునీత స్వగ్రామం వెంకటాపురానికి కూతవేటు దూరంలోని ఏడుగుర్రాలపల్లిలో ఓ దళిత బాలికపై కొందరు టీడీపీ అల్లరి మూకలు కొన్ని నెలల పాటు పదే పదే అత్యాచారం చేశారు. వీడియోలు తీసి మరీ ఒకరి తర్వాత మరొకరు అఘాయిత్యానికి పాల్పడ్డారు. బాలిక గర్భం దాల్చడంతో అసలు విషయం వెలుగు చూసింది. టీడీపీ నేతల ఒత్తిడితో ఇప్పటికే బాధిత బాలిక కుటుంబం ఊరి నుంచి ఎక్కడికో వెళ్లిపోవడం చర్చనీయాంశమైంది. పేరూరు పంచాయతీ పరిధిలోని ఏడుగుర్రాలపల్లిలో 9వ తరగతి చదువుతున్న దళిత విద్యార్థినిపై అదే గ్రామానికి చెందిన కొందరు యువకులు కన్నేశారు. ఏడాది క్రితం టీడీపీ గెలుపు సంబరాల్లో తప్పెట కొడుతూ బొలెరో నుంచి జారి కింద పడి తండ్రి మృతి చెందాడు. తల్లికి మతి స్థిమితం సరిగా లేదు. ఇలాంటి పరిస్థితిలో ఉన్న ఆ విద్యార్థినిపై తొలుత కొందరు అత్యాచారం చేశారు. దాన్ని వీడియో తీశారు. 'నీ వీడియో ఒకటి మా వద్ద ఉంది'అంటూ బెదిరిస్తూ.. మరికొందరు లొంగదీసుకున్నారు. గత ఆరు నెలలుగా ఏకంగా 14 మంది ఆ చిన్నారిని ఆటబొమ్మను చేసి ఆడుకున్నారు. నిందితులందరూ టీడీపీకి చెందిన వారే కావడంతో మాజీ మంత్రి పరిటాల సునీత, ఆమె తనయుడు శ్రీరామ్ అండదండలు ఉండాయనే ఉద్దేశంతో స్థానికులు మౌనం వహించారు. గర్భం దాల్చిన బాలిక పోలీసులను ఆశ్రయించకుండా గ్రామంలోనే దుప్పటి పంచాయితీ చేసి మూసి పెట్టాలని చూస్తున్నట్లు సమాచారం. ఎవరైనా ఫిర్యాదు చేస్తే.. ఇబ్బందులు తప్పవని టీడీపీ నేతల నుంచి బెదిరింపు కాల్స్ వెళ్లినట్లు తెలిసింది. వీడియో ఉందని బెదిరిస్తూ.. ఆర్నెల్ల కాలంలో పేరూరు పంచాయతీకి చెందిన 14 మంది యువకులు బాలికపై అఘాయిత్యానికి పాల్పడినట్లు తెలిసింది. నిందితుల్లో బడగొర్ల అభిషేక్, బూడిద రాజేష్, బాసి గిరి, బాసి కార్తీక్, బాసి రాజేంద్ర, బాసి సోనప్ప, బాసి అంజి, తలారి మురళి, రొద్దకంపల్లి మహేశ్, హరిజన సురేశ్, హరిజన హేమంత్ పేర్లు బయటపడ్డాయి. మరో ముగ్గురి పేర్లు తెలియాల్సి ఉంది. కాగా నిందితుల్లో కొందరు ఇప్పటికే గ్రామం వదిలి పరారయ్యారు.

బాధిత కుటుంబం అదృశ్యం: గురువారం మధ్యాహ్నం నుంచి అత్యాచార విషయం ఆ నోటా.. ఈ నోటా తెలియడంతో బాధిత బాలిక కుటుంబ సభ్యులను టీడీపీ నేతలు బెదిరించినట్లు తెలిసింది. సాయంత్రం నుంచి గ్రామంలో బాధిత కుటుంబ సభ్యులు కనిపించలేదు. రామగిరి సీఐ శ్రీధర్ వెళ్లి విచారణ చేయగా.. ఫిర్యాదు చేయడానికి ఎవరూ ముందుకు రాలేదు. ఆ బాలిక ఇంటికి తాళం వేసి ఉంది. బంధువుల ఇంటికి వెళ్లారా? లేక టీడీపీ నేతలే ఎక్కడైనా బంధించారా? అనేది తెలియరాలేదు.

అబార్షన్ చేయించుకోవాలని బెదిరింపు?

సదరు బాలిక అబార్షన్ చేయించుకుని.. ఎలాంటి కేసులకు వెళ్లకుండా ఉండాలని టీడీపీ నాయకులు కొందరు సూచించినట్లు తెలిసింది. ఈ క్రమంలో బాలికను ఎక్కడో టీడీపీ నాయకులే దాచి ఆస్పత్రికి తరలించి, అబార్షన్ చేయిస్తూ ఎలాంటి కేసు లేకుండా మూసేయాలని పన్నాగం పన్నినట్లు గ్రామస్తుల ద్వారా తెలిసింది. హరియాన్ చెరువుకు చెందిన రౌడీషీటర్ నాగరాజు కనుసన్నల్లో బాధిత బాలికను దాచినట్లు సమాచారం. పార్టీ కోసం ప్రాణాలు విడిచిన కుటుంబానికి అండగా నిలవాల్సిన పరిటాల కుటుంబం నిందితుల వైపు ఉందనే విషయంపై దళిత సంఘాలు తీవ్రంగా మండిపడుతున్నాయి.



ఎవరూ ఫిర్యాదు చేయలేదు

విషయం నా దృష్టికి రాగానే గురువారం మధ్యాహ్నం ఏడుగుర్రాలపల్లి గ్రామానికి వెళ్లి విచారణ చేశాం. అయితే ఎవరూ వివరాలు చెప్పేందుకు ముందుకు రావడం లేదు. బాధిత బాలిక కుటుంబం నివసిస్తోన్న ఇంటికి తాళం వేసి ఉంది. వారి బంధువుల ఇళ్లన్నీ పరిశీలిస్తున్నాం. ఫిర్యాదు వస్తే ఎవరినీ వదిలే ప్రసక్తే లేదు. వెనుక ఎవరు ఉన్నా చట్టానికి అతీతులు కారు. – శ్రీధర్, రామగిరి సీఐ

ఎస్‌హెచ్‌జీలకు రుణ వితరణ అంతంతే

- 2024-25 వార్షిక రుణ లక్ష్యం.... 3.55 లక్షల సంఘాలు
- ఈనెల 2వ తేదీ నాటికి పురోగతి 1.73 లక్షల సంఘాలు
- పలు సంఘాల రుణాలు రీషెడ్యూల్‌తో సరిపెడుతున్న బ్యాంకర్లు
- రుణ చెల్లింపులు పూర్తి చేసినా మంజూరులో తీవ్ర జాప్యం

సాక్షి, హైదరాబాద్: ఎస్‌హెచ్‌జీలకు రుణ వితరణలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఏటా భారీగా లక్ష్యాలను నిర్దేశించుకుంటున్నా, సాధన మాత్రం అంతంతమాత్రమే. 2024-25 వార్షిక సంవత్సరంలో రాష్ట్ర వ్యాప్తంగా 3,55,675 స్వయం సహాయక సంఘాలకు రూ.18,050.99 కోట్ల మేర లింకేజీ రుణాలు ఇచ్చేలా బ్యాంకులు లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాయి. బ్యాంకులు భారీ లక్ష్యంతో ముందుకెళ్లినా, లక్ష్యసాధన కేవలం 48 శాతానికే పరిమితమైంది. మార్చి 31వ తేదీతో 2024-25 వార్షిక సంవత్సరం ముగిసింది. ఈ క్రమంలో సెర్ప్ అధికారుల జూన్ 2వ తేదీ గణాంకాలను పరిశీలిస్తే... కేవలం 1,73,564 స్వయం సహాయక సంఘాలకు మాత్రమే బ్యాంకు లింకేజీ రుణాలు మంజూరు చేసినట్టు చెబుతున్నాయి.

ప్రధాన బ్యాంకులు వెనకడుగు

మహిళా సంఘాలకు రుణాల మంజూరులో ప్రధాన బ్యాంకులు సైతం వెనకడుగు వేశాయి. క్షేత్రస్థాయిలో ఒక ఎస్‌హెచ్‌జీ రుణ చెల్లింపులు పూర్తి చేస్తే... మరుసటి నెలలో కొత్తగా రుణం ఇవ్వాలి. ఈ మేరకు గ్రామీణాభివృద్ధి విభాగం చొరవ తీసుకొని రుణ వితరణ ప్రక్రియను వేగవంతం చేయాలి. కానీ 2024-25 వార్షిక సంవత్సరంలో ఎస్‌హెచ్‌జీల రుణ మంజూరులో తీవ్ర జాప్యం నెలకొంది. ప్రధాన బ్యాంకులు రుణ వితరణపై పెద్దగా దృష్టి పెట్టలేదని స్పష్టమవుతోంది.

- స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా రాష్ట్రంలో లీడ్ బ్యాంకుగా వ్యవహరిస్తోంది. ఈ బ్యాంకు ద్వారా 2024-25 వార్షిక సంవత్సరంలో 1.01 లక్షల సంఘాలకు రుణాలు ఇవ్వాలని రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ లక్ష్యాన్ని నిర్దేశించింది. కానీ వార్షిక సంవత్సరం ముగిసే నాటికి కేవలం 54 వేల సంఘాలకు మాత్రమే లింకు రుణాలు జారీ చేసింది. రాష్ట్రంలోని ప్రధాన బ్యాంకులే రుణ వితరణలో జాప్యం చేయడంతో చిన్న బ్యాంకులు సైతం పెద్దగా ఆసక్తి చూపనట్టు స్పష్టమవుతోంది.
- ఆదిలాబాద్, కరీంనగర్, ఖమ్మం, మెదక్, నల్లగొండ, నిజామాబాద్, వరంగల్ డీసీసీబీలు సైతం 14,868 సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాలు ఇవ్వాలని లక్ష్యాలను నిర్దేశించగా, కేవలం 6,111 సంఘాలకు మాత్రమే రుణాలు ఇచ్చాయి. రుణాల లక్ష్యసాధన సగానికి పరిమితం కావడంపై ఇటీవల ఎస్ఎల్‌బీసీ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. లక్ష్యసాధనలో పురోగతి ఉండాలని ఆదేశించారు. ఈ క్రమంలో పెండింగ్‌లో ఉన్న రుణ మంజూరుపై అధికారులు దృష్టి పెట్టారు.

ప్రధాన బ్యాంకుల వారీగా ఎన్ని సంఘాలకు ఇచ్చారంటే...

	ఇవ్వాల్సింది	ఇచ్చింది		ఇవ్వాల్సింది	ఇచ్చింది
టీజీబీ	58,877	27,333	ఐఓబీ	3,191	1,845
ఏపీజీవీబీ	88,330	29,195	బీఓబీ	3,913	3,131
ఎస్‌బీఐ	1,01,121	54,402	పీఎన్‌బీ	1,851	1,195
యూబీఐ	47,094	31,115	యూకో	869	378
కెనరా	20,197	10,836	బీఓఎమ్	991	0
ఇండియన్	7,159	3,104	బీఓఐ	216	54
సీబీఐ	4,541	4,438	హెచ్‌డీఎఫ్‌సీ	2,429	346

● స్కిల్


ప్రకృతి

ముత్యాల చేతిరాతకు కేరాఫ్ అడ్రస్

ఆరోజులు గుర్తున్నాయా?

హైస్కూల్ రోజుల్లో అందమైన చేతిరాత ఉన్న వారు సెలబ్రిటీ. ఈ అందమైన హ్యాండ్ రైటింగ్ సెలబ్రిటీలను తోటి విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు కూడా ఇష్టపడేవారు.

డిజిటల్ టైపింగ్ పుణ్యమా అని 'అందమైన హ్యాండ్ రైటింగ్' ప్రభ మసకబారింది.

అయితే ప్రకృతి లాంటి అమ్మాయిల వల్ల హ్యాండ్ రైటింగ్‌కు క్రేజ్ పెరిగింది.

నేపాల్‌కు చెందిన ప్రకృతి మల్ల హ్యాండ్‌రైటింగ్ ఇంటర్‌నెట్‌లో వైరల్ అయింది. ప్రపంచంలోనే అత్యంత అందమైనదిగా గుర్తింపు పొందింది. హ్యాండ్‌రైటింగ్ ప్రొఫెషనల్స్ ప్రశంసల మాట ఎలా ఉన్నా...

'ఇంత అద్భుతంగా మానవమాత్రులు రాయలేరు. ఇది కచ్చితంగా కంప్యూటర్ జనరేట్ హ్యాండ్‌రైటింగ్' అని అనుమానించిన వారు కూడా లేకపోలేదు!

అది ఉత్త అపోహ అని తేలడానికి ఎంతోకాలం పట్టలేదు. నేపాల్ ఆర్మీ ప్రకృతిని సన్మానించింది.

స్పిరిట్ ఆఫ్ ది యూనియన్ సెలబ్రేషన్స్‌ను దృష్టిలో పెట్టుకొని 'యూఏఈ'కి శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రకృతి ఉత్తరం రాసింది. ఆమె అందమైన చేతిరాతకు యూఏఈ ఎంబసీ ఫిదా అయింది.

'హ్యాండ్‌రైటింగ్ అనేది బేసిక్ స్కిల్ కంటే ఎక్కువ. ఏకాగ్రతను పెంచడంలో, ఆలోచన విధానాన్ని రూపొందించడంలో సహాయపడుతుంది' అంటున్నారు నిపుణులు.

● ఫ్యాషన్

చెవులకు జూకాలు, మెడలో హారాలు
చేతులకు గాజులు, కాళ్లకు పట్టీలు
నడుముకు వడ్డాణాలు, వేళ్లకు ఉంగరాలు
రంగులుగా, అల్లికలుగా..
సంప్రదాయ కళ, ఆధునిక శైలి కలయికతో
అభివృద్ధి చెందినవి ఎంబ్రాయిడరీ నగలు.
సిల్క్ దారాలు, అద్దాలు, పూసలు, మెరిసే రాళ్లు,
ప్యాచ్‌వర్క్‌తో రూపు కట్టిన ఈ నగలు
అందరి చూపులను ఇట్టే కట్టడి చేస్తాయి.









ఎంబ్రాయిడరీ నగలు





తేలికగా.. అందంగా!

- **లైట్ వెయిట్:** సాధారణ గోల్డ్/ సిల్వర్ జ్యూవెలరీలతో పోలిస్తే ఈ ఆభరణాలు చాలా తేలికగా ఉంటాయి. వీటిలోనూ నెక్లెస్, ఇయర్ రింగ్స్, బ్రేస్‌లెట్స్, మాంగ్ టిక్కా, రింగ్స్,... వివిధ రకాల మోడల్స్‌లో ఎంచుకోవచ్చు.
- **కస్టమైజ్:** డిజైన్, రంగులు, శైలి ఎవరికి వారు ఎలా కావాలంటే అలా మార్చుకోవడానికి వీలుంటుంది. డ్రెస్‌ని బట్టి మోడల్‌ని, కలర్స్‌ని ఎంపిక చేసుకోవచ్చు.
- **వెరైటీ ఆఫ్ డిజైన్స్:** మొఘల్, జర్దోసి, మిర్రర్ వర్క్, గుజరాతీ వర్క్... లాంటి అనేక శైలులను ఈ ఎంబ్రాయిడరీలో చూపవచ్చు.
- **పూర్తి ఎకో-ఫ్రెండ్లీ:** సహజమైన వస్తువులతో తయారవడం వల్ల పర్యావరణానికి ఏ మాత్రం హానికరం కాదు.
- **వేడుకలకి అనుకూలం:** సంప్రదాయ, ఇండో – వెస్టన్ స్టైల్ డ్రెస్‌లకి ఇది సరైన ఎంపిక.

సొంతంగా తయారీ!

ఎంబ్రాయిడరీ హూప్‌ను కొనుగోలు చేసి, మల్టీ కలర్ దారాలు, ఫ్యాబ్రిక్ గ్లూతో నచ్చిన విధంగా తయారుచేసుకోవచ్చు. పర్యావరణహితమైన ఉత్పత్తులు కావడం, రీసైక్లింగ్ చేసే సదుపాయం కూడా ఈ ఆభరణాల తయారీలో చూపించవచ్చు.

వేడుకకు తగిన ఆభరణం

ఉపయోగించే మెటీరియల్స్‌ని బట్టి ఆభరణం ఉంటుంది కాబట్టి వేడుకను బట్టి డిజైన్‌ని ఎంచుకోవచ్చు.

- సిల్వర్, జరీ దారాలతో జర్దోజి, మొఘల్ వర్క్‌ని గ్రాండ్‌గా తీర్చిదిద్దవచ్చు. ఈ ఎంబ్రాయిడరీ చేసిన ఆభరణాలను సంప్రదాయ వేడుకలలో లెహంగాలు, శారీలకు ఎంచుకోవచ్చు.
- కాథా అనే వర్క్ బెంగాలీ ఫోక్ ఎంబ్రాయిడరీ ఆర్ట్. రంగుల దారాలతో లైట్ వెయిట్ జ్యూవెలరీని రూపొందించవచ్చు. ఇవి ప్లెయిన్, ఇండోవెస్టన్ డ్రెస్సులకు, కాటన్ చీరలకు బాగా నప్పుతాయి.
- గుజరాత్ కచ్ వర్క్, రాజస్థాన్ కళా శైలిని ప్రతిబింబించేలా పూలు, అద్దాలతో చేసిన ఎంబ్రాయిడరీ ఆభరణాలు సంప్రదాయ పండుగలు, ఆర్ట్ ఎగ్జిబిషన్లు, కాలేజీ ఫంక్షన్లు.. వంటి వాటిలో స్టైల్‌గా కనిపిస్తాయి.
- లేస్ మెటీరియల్‌తోనూ రంగు దారాలతో పూలు, ఆకులు కుట్టి, ఆభరణంగా ధరించవచ్చు. ఇవి ఎక్కువగా వెస్టన్ డ్రెస్సులకు బాగా నప్పుతాయి





● స్త్రీ శక్తి

చిత్ర యాత్ర

తల్లిగా, చెల్లిగా, కూతురుగా... పలు రూపాల్లో లోకాన్ని ముందుకు నడిపించే శక్తి స్త్రీ మూర్తి. ఆ శక్తి స్వరూపాన్ని తన ఛాయాచిత్రాల్లో ఆవిష్కరించడానికి పన్నెండేళ్ల కాలాన్ని అంకితం చేస్తూ ప్రపంచ యాత్ర చేస్తున్నారు భరద్వాజ్ దయాల. 195 దేశాలకు చెందిన మహిళల ముఖకవళికల చిత్రాలను సేకరించాలనేది ఆయన లక్ష్యం...


రాజమాత శుభాంగినిరాజే





భరద్వాజ్ దయాల

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా కెరీర్ ప్రారంభించిన భరద్వాజ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో మూవీ గ్రాఫిక్స్ కంపెనీ నిర్వహిస్తున్నారు. 'జీవితం చాలా చిన్నది. ఉన్న సమయంలోనే ప్రపంచాన్ని చూసెయ్యాలి. వీలైనంత మందితో మాట్లాడాలి' అనేది భరద్వాజ్ లక్ష్యం. ఇందులో భాగంగా మహిళామణుల చిత్రాల ఆల్బమ్ రూపకల్పనకు సంకల్పించారు. ఈ డాక్యుమెంటరీలో మిలియన్ అమేజింగ్ ఉమెన్ (10లక్షల మంది అసాధారణ మహిళలు)కు చోటు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందుకోసం ప్రపంచవ్యాప్తంగా 195 దేశాలకు చెందిన మహిళల ముఖకవళికల చిత్రాలను సేకరించే పనికి శ్రీకారం చుట్టారు.

అమ్మకు ప్రేమతో...

మా అమ్మకు ఐదుగురు సంతానం. మా అందరినీ పెంచి పెద్ద చేయడంలో ఆమె చూపిన కృషి అనిర్వచనీయం. అందుకే అమ్మకు ప్రేమతో ఏదో ఒకటి చేయాలనుకున్నాను. ఆ ఆలోచనలో భాగమే మిలియన్ అమేజింగ్ ఉమెన్ ఆల్బమ్. ప్రస్తుతం నా ప్రయాణానికి అవసరమయ్యే ఖర్చంతా నేనే భరిస్తున్నాను. నా కంపెనీ తరపున ఆన్‌లైన్‌లో జాబ్ చేస్తూ వచ్చిన వేతనంతో టూర్‌ను కొనసాగిస్తున్నాను.

– భరద్వాజ్ దయాల

ఒంటరిగా... కెమెరా ఆయుధంగా

ప్రపంచంలోని మిలియన్ (10లక్షల) మహిళామణుల ముఖకవళికలపై డాక్యుమెంటరీ తీయడానికి భరద్వాజ్ 100 మిల్లీమీటర్లు, 2.8 లెన్స్ గల కెమెరాను భుజాన వేసుకొని లక్ష్యం దిశగా ముందుకు కదులుతున్నారు. 55 ఏళ్ల భరద్వాజ ఒంటరిగానే, ఎవరి సాయం లేకుండా ప్రపంచయాత్ర చేస్తున్నారు. ఒక కారును తన ప్రయాణానికి అనుగుణంగా మార్చుకున్నారు. ఏడు ఖండాలు తిరిగి. 12 ఏళ్లలోగా అంటే 2037 నాటికి ప్రాజెక్టు పూర్తి చేయాలనేది తన లక్ష్యం.

మహిళా దినోత్సవం రోజు శ్రీకారం

ప్రస్తుతం భరద్వాజ్ చేపడుతున్న మిలియన్ అమేజింగ్ మహిళ చిత్రసేకరణ ప్రాజెక్టు యాత్ర రెండోది. దీన్ని ఈ ఏడాది అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజు ప్రారంభించారు. మిలియన్ అమేజింగ్ మహిళా ఫొటోల సేకరణలో గుజరాత్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఇప్పటిదాకా 500 మంది మహిళల చిత్రాలను కెమెరాల్లో బంధించారు. ఆల్బమ్‌లో 18 ఏళ్ల నుంచి 70 ఏళ్ల మహిళల వరకు ఉన్నారు.



రాజమాతతో ప్రారంభం...



గుజరాత్ రాష్ట్రం వడోదరలోని రాజవంశానికి చెందిన రాజమాత శుభాంగిని రాజే చిత్రంతో ఈ మిలియన్ అమేజింగ్ ఉమెన్ ప్రాజెక్టు ప్రారంభమైంది. రాజమాత జీవితానికి సంబంధించి బ్లాక్ అండ్ వైట్ కాలం నాటి పరిస్థితులకు అద్దం పట్టేలా చిత్రాన్ని తీశారు. రెస్టారెంట్ నడుపుతూ, నెలకు 8 లక్షల రూపాయల ఆదాయాన్ని ఆర్జిస్తున్న గిరిజన మహిళతో పాటు పారిశుద్ధ్య కార్మికులు, గృహిణులు, విద్యార్థినులకు చోటు కల్పించారు. ప్రస్తుతం అల్లూరి సీతారామరాజు జిల్లా గిరిజన ప్రాంతాల్లో భరద్వాజ్ పర్యటన సాగుతోంది.

– కరుకోల తిరుమలరావు, సాక్షి, విజయవాడ

● అన్‌బాక్సింగ్ ట్రెండ్

లవ్ యూ... లబుబు



'బొమ్మల్లో లబుబు బొమ్మలు వేరయా!' అంటున్నారు డాల్స్ ప్రేమికులు. సామాన్యుల నుంచి అనన్య పాండేలాంటి సెలబ్రిటీల వరకు లబుబు బొమ్మలకు 'లవ్ యూ' చెబుతున్నారు.

జానపద కథల నుంచి స్ఫూర్తి పొంది హాంకాంగ్ ఆర్టిస్ట్ కసింగ్ లుంగ్ 'లబుబు'ను రూపొందించాడు. విశాలమైన నేత్రాల ఈ బొమ్మ 2019లో మార్కెట్‌లోకి వచ్చింది. బ్యాగులు, కీచైన్‌లు....మొదలైన ఎన్నో రూపాల్లో లబుబు బొమ్మలను రూపొందించారు. లబుబును 'అన్‌బాక్సింగ్ ట్రెండ్' అని పిలుస్తున్నారు. ఎందుకంటే వీటిని బ్లైండ్ బాక్సుల్లో మాత్రమే విక్రయిస్తుంటారు. అన్‌బాక్సింగ్ తరువాత మాత్రమే ఆ బొమ్మ గురించి తెలుసుకోగలుగుతాం.

'లబుబు'కు ప్రపంచవ్యాప్తంగా వస్తున్న స్పందనకు ఆ బొమ్మ సృష్టికర్త కసింగ్ లుంగ్ సంతోషిస్తున్నాడు.

'నా చిన్నప్పుడు గేమ్ కన్సోల్స్, కంప్యూటర్‌లు లేవు. పెన్నుతో రకరకాల బొమ్మలను పేపర్‌పై గీసేవాడిని. బొమ్మలు తయారుచేయాలనే ఆసక్తి చిన్న వయసులోనే ఉండేది' అంటున్నాడు కసింగ్ లుంగ్.

మేకప్ టిప్స్‌తో నం.1 స్థానం

26 ఏళ్ల మృణాల్ పంచల్‌ను దేశంలో అత్యధికమంది ఇన్‌స్టాలో ఫాలో అవుతున్నారట. కారణం? ఆమె రోజూ మేకప్ టిప్స్ చెబుతుంది. తన మీద మేకప్ అప్లయ్ చేసి క్షణాల్లో రీల్స్ తయారు చేసి ఆకట్టుకుంటుంది. ముఖాలను మార్చే ఈ కళతో తాజాగా వెలువడ్డ 'కాండిరి హురూన్ ఇండియాస్ లిస్ట్ ఆఫ్ లీడింగ్ ఉమన్ ఇన్ ఫ్లూయెన్సర్'లో అగ్రస్థానంలో నిలుచుంది.






మృణాల్ పంచల్

మనిషికి అత్యంత ఇష్టమైన వస్తువు తన ఖ్యాతికి కారణమవుతుందని మృణాల్ పంచల్ ఊహించి ఉండదు.

మనిషికి ఇష్టమైనది ఏది?

అద్దం.

అద్దంలో ముఖం చూసుకునేటప్పుడు మనిషి ఏమనుకుంటాడు?

కాస్త బాగా కనిపిస్తే బాగుండు అనుకుంటాడు.

అలంకార ప్రియులైన స్త్రీలు ఈ మాటను ఇంకా ఎక్కువగా అనుకుంటారు.

ఇక్కడే మృణాల్ పంచల్ గెలిచింది.

ఏదో కాలక్షేపంగా తాను వేసుకునే మేకప్‌ను చూపుతూ చేసిన వీడియోలు ఆమెకు భారీగా మహిళా ఫాలోయెర్స్‌ను సంపాదించి పెట్టాయి. ఇన్‌స్టాలో ఆమెకు 55 లక్షల మంది ఫాలోయెర్లు ఉన్నారు. ఆమె వీడియోలు క్షణాల్లో వైరల్‌గా మారతాయి. ఇంతకీ కంటెంట్ కేవలం మేకప్పే.

అందుకే ఆమె 'కాండిరి హురూన్ ఇండియా విమెన్ లీడర్స్ లిస్ట్ 2025'లో మొదటి స్థానంలో నిలిచింది. ఇంతకు ఎవరు ఈ మృణాల్ పంచల్.

డాక్టర్ కాబోయి...

చాలామంది సినిమా హీరోయిన్లు డాక్టరు కాబోయి యాక్టర్ అయ్యాను అంటుంటారు. మృణాల్ పంచల్ కూడా అంతే. గుజరాత్‌లో పుట్టి పెరిగిన మృణాల్ ఎం.బి.బి.ఎస్. చేసేందుకు అవసరమైన చదువు/శిక్షణ కోసం పూణె వచ్చింది. 'మా అమ్మతో శపథం చేసి మరీ వచ్చాను. అయితే నేను ఒకటి తలిస్తే మేకప్ మరొకటి తలిచింది' అంటుంది మృణాల్. చిన్నప్పుడు తల్లి నిద్ర పోతుంటే మేకప్ కిట్ తీసుకుని ఆమె ముఖానికి మేకప్ వేసి ఆశ్చర్యపరిచిన మృణాల్ స్కూల్లో చదివేప్పుడు కూడా రకరకాల పద్ధతుల్లో మేకప్ వేసుకుని కాలక్షేపం చేసేది. అయితే అందులో సహజమైన ప్రతిభ చాలామందిని ఆకర్షించింది.

చదవలేక...

అయితే పూణె వచ్చాక భాష సమస్య ఆ తర్వాత చదువు తలకు ఎక్కక పోవడంతో మృణాల్ ఒక దశలో కుదేల్ అయ్యింది. ఇక ఇంటికి పోవడం ఒక్కటే శరణ్యం అనుకుంటున్నప్పుడు టిక్‌టాక్‌లో కాలక్షేపానికి మేకప్ ట్యుటోరియల్ అంటూ ఒక వీడియో చేసింది. అది వైరల్‌గా మారింది. స్త్రీలు కింద కామెంట్లు పెట్టి ఇలాంటివే చేయండి అనసాగారు. మేకప్‌ను వేగంగా, సులువుగా, మనిషిని బట్టి, చర్మాన్ని బట్టి, కన్ను ముక్కును బట్టి, వయసును బట్టి ఎలా వేసుకోవాలో రకరకాల టిప్స్ చెబుతూ సొంతంగా ఆ మేకప్‌ను వేసుకుని చూపుతూ మృణాల్ అతి త్వరలో ఖ్యాతి గడించింది.

వెంటబడ్డ కంపెనీలు


మృణాల్ ఇన్‌ఫ్లూయెన్స్ టిక్‌టాక్ తర్వాత ఇన్‌స్టాలో పెరగడంతో బ్యూటీ సామాగ్రి అమ్మే బడాబడా కంపెనీలు ఆమెను తమ ప్రాడక్ట్స్‌ను ప్రమోట్ చేయమని కోరాయి. 'అతి త్వరగా నేను ముంబైకి మారాల్సి వచ్చింది. నేను కలలో కూడా ఊహించని పెద్ద కంపెనీలు తమ ప్రాడక్ట్స్ కోసం నన్ను అంబాసిడర్‌గా పెట్టుకున్నాయి. నా ఆదాయం కూడా విపరీతంగా పెరిగింది' అని చెప్పుకొస్తుంది మృణాల్.

సరళంగా, అట్టహాసంగా: మృణాల్ భారతీయ మహిళల మనస్థితిని బట్టి మేకప్ టిప్స్ చూపుతుంది. 'మన మహిళలు గ్లామర్‌గా మేకప్ వేసుకోవాలనుకుంటారు. కాని జంకుతారు. సరళమైన మేకప్ చూపిస్తే ఇంకొంచెం గ్లామర్ యాడ్ చేయమని కోరుతారు. రెండు విధాలుగా సంతృప్తి పరుస్తూ వారికి టిప్స్ అందిస్తుంటాను' అంటుంది మృణాల్. ఆమె చూపే టిప్స్‌లో కేశాలంకరణ, వాటి షేడ్స్, కనురెప్పలు, ముక్కును సన్నగా చూపించడం, పెదాలను అందంగా చూపించడం, ముఖంలో ఏదైనా ఒక భాగం మోతాదుకు మించి ఉన్నా, కురచగా ఉన్నా దానిని మేకప్‌లో సరి చేసి చూపించడం చాలా ప్రతిభావంతంగా చేస్తుంది. అందుకే మృణాల్‌కు యాభై లక్షల మంది ఫ్యాన్స్.

సోషల్ మీడియా వచ్చాక చాలామంది విజేతలు మనకు కనిపిస్తున్నారు. అయితే వారంతా తొలిసారిగా ఎవరూ నడవని దారిని నడిచిన వారే. మేకప్ రంగంలో ఎందరో నిష్ణాతులు ఉండగా మృణాల్ దానినో ట్యూషన్‌గా భావించడం వల్లే ఘన విజయం సాధించింది. నేడు భారతదేశంలో అత్యంత ఇన్‌ఫ్లూయెన్షల్ లీడర్‌గా నిలిచింది.

మృణాల్ నిజంగా గ్రేట్.

టాప్ 5 సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు


దీపా ఖోస్లా

కాండిరి హురూన్ ఇండియాస్ లిస్ట్ ఆఫ్ లీడింగ్ విమెన్‌లో మొదటి స్థానంలో మృణాల్ పంచల్ నిలువగా రెండో స్థానంలో దీపా ఖోస్లా ఉంది. ఈమె ఆయుర్వేదం ద్వారా చర్మ సంరక్షణను సోషల్ మీడియాలో ప్రచారం చేస్తోంది. తన వీడియోలతో ఇంగ్లిష్ భాషపై అవగాహన కల్పిస్తున్న దీక్షా కియారా మూడో స్థానంలో ఉంది. ఆశ్చర్యం ఏమిటంటే చీర కట్టు ఎంతో తెలిసిన భారతీయ వనితలకు రకరకాల కొత్త చీర కట్టులు చూపుతూ వీడియోలు చేస్తున్న డాలీ జై నాలుగో స్థానంలో ఉండగా ఆర్థిక పరమైన ఎదుగుదల గురించి, పొదుపు గురించి సూచనలు సలహాలు ఇస్తూ పాపులర్ అయిన నేహా నగర్ ఐదో స్థానంలో ఉంది. గమనించి చూస్తే ఈ ఐదుమంది భిన్న మార్గాల్లో వెళ్లి విజయం సాధించారని అర్థమవుతుంది.

బులియన్

(బంగారం 10 గ్రా.: వెండి కిలో) జూన్ 5న ముగింపు రూ.లలో

హైదరాబాద్	
బంగారం (24 క్యారెట్లు)	97,310
బంగారం (22 క్యారెట్లు)	90,290
వెండి	1,01,300
విజయవాడ	
బంగారం (24 క్యారెట్లు)	1,00,800
బంగారం (22 క్యారెట్లు)	91,300
వెండి	1,04,200
విశాఖపట్నం	
బంగారం (24 క్యారెట్లు)	95,870
బంగారం (22 క్యారెట్లు)	91,300
వెండి	1,04,250
రాజమండ్రి	
బంగారం (24 క్యారెట్లు)	1,00,800
బంగారం (22 క్యారెట్లు)	94,040
వెండి	1,04,200
ప్రొద్దుటూరు	
బంగారం (24 క్యారెట్లు)	96,800
బంగారం (22 క్యారెట్లు)	89,060
వెండి	1,00,500
చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	99,600
బంగారం (22 క్యారెట్లు)	91,300
వెండి	1,14,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

● బ్యూటిప్స్

చెమ్చాడు పెసరపిండిలో చిటికెడు పసుపు, చెమ్చాడు టొమాటో గుజ్జు, అర చెమ్చా నిమ్మరసం కలిపి పేస్టులా చేసుకోవాలి. దీన్ని కళ్ల కింద ప్యాక్‌లా వేసుకుని, అరగంట తర్వాత కడిగేసుకోవాలి. రోజూ ఇలా చేస్తే నల్లటి వలయాలు పోతాయి. బాదంపప్పు పేస్టులో నిమ్మరసం కలిపి రాసుకున్నా వలయాలు మాయమవుతాయి.

- నారింజ బెరడును నూరి మొటిమలకు రాస్తే తగ్గుతాయి.
- పెరుగులో కొంచెం నీరు కలిపి చర్మానికి రాస్తే రంగు వస్తుంది.
- ముల్లంగి రసంలో రెండు చుక్కల నిమ్మరసం, ఒకచుక్క తేనె కలిపి రాసుకుంటే ముఖం మృదువుగామారుతుంది.











గంధం పొడి, సెనగపిండి, బాదంపప్పు పేస్ట్‌లను టీ స్పూన్ చొప్పున తీసుకోవాలి. అందులో ఐదు రేకల కుంకుమ పువ్వు, గుడ్డులోని తెల్లసొన, కొన్ని పచ్చి పాలను చేర్చి కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి, మెడకు, చేతులకు పట్టించి ఆరనివ్వాలి. తర్వాత శుభ్రపరుచుకోవాలి. వారానికి మూడుసార్లు ఈ విధంగా చేస్తుంటే చర్మానికి మెరుపు వస్తుంది.



వివో ఎక్స్ 200 ఆల్ట్రా

డిస్ప్లే	: 6.82
బరువు	: 229 గ్రా.
రిజల్యూషన్	: 1440×3168 పిక్సెల్స్
రిఫ్రెష్ రేట్	: 120 హెచ్జడ్
మెమోరీ	: 256జీబి 12జీబి ర్యామ్/ 512జీబి 16జీబి ర్యామ్
ఫ్రంట్ కెమెరా	: 50 ఎంపీ
బ్యాటరీ	: 6000 ఎంఏహెచ్

● యంగ్ టాలెంట్

అక్షరమై మెరిసి...



డిజిటల్ యుగంలో చిన్నారులు పుస్తకాల కంటే సెల్ఫోన్తోనే కాలక్షేపానికి సమయం కేటాయిస్తున్నారు. కానీ మహిరమ అందుకు విరుద్ధం. సాహిత్యాన్ని అభిరుచిగా మార్చుకుంది. పదమూడు సంవత్సరాల వయసులోనే నవల రాసి శభాష్ అనిపించుకుంది **మహిరమ...**

తొమ్మిది సంవత్సరాల వయసులోనే చిన్న చిన్న పద్యాలు, పాటలు రాయడం ప్రారంభించింది మహిరమ. పదో ఏట స్నేహితులతో కలిసి చిన్న కథ రాసింది. ఆ తరువాత దీనినే నవలగా రాయాలనుకుంది. నవలగా పూర్తిరూపంలోకి రావడానికి రెండేళ్లు పట్టింది. 500 పేజీల ఈ నవల పేరు...రూబీ బ్లూ స్ట్రీమ్ అండ్ ద బాండ్ ఆఫ్ ఫైర్.



● కుటుంబ సభ్యులతో...

సంగీతంలోనూ మహీరమ రాణిస్తోంది. ప్రస్తుతం కర్ణాటక సంగీతంలో ఫోర్త్ గ్రేడ్లో శిక్షణ తీసుకుంటోంది. హస్తకళలు, చిత్రలేఖనం, ఫొటోగ్రఫీ, గ్రాఫిక్ డిజైన్లోనూ విశేష ప్రతిభ కనబరుస్తోంది. ఫ్రెంచి కూడా నేర్చుకుంటోంది.

హైదరాబాద్లో 9వ తరగతి చదువుతున్న చల్లా మహిరమ 'రూబీ బ్లూస్ట్రీమ్ అండ్ ద స్కీమ్ ఆఫ్ టైమ్' పేరుతో మరో పుస్తకానికి శ్రీకారం చుట్టింది.

అందరూ చదివేలా...

నేను రాసిన ఫాంటసీ నవల 'రూబీ బ్లూ స్ట్రీమ్ అండ్ ద బాండ్ ఆఫ్ ఫైర్' పిల్లలే కాదు అన్ని వయసుల వారూ చదివేలా రాశాను. ఫాంటసీ సబ్జెక్ట్పై ఆసక్తి ఉన్నవారికి బాగా నచ్చుతుందని ఆశిస్తున్నాను. ప్రకృతితో ముడిపడి ఉన్న అంశాల ఆధారంగా నవల రాశాను. భూమి, నీరు, గాలి, అగ్ని...వీటితో మనిషి జీవితం ఎలా ముడిపడి ఉంటుందనే విషయం చుట్టూ నవల సాగుతుంది.

- చల్లా మహిరమ

యువర్స్

● ఫ్యూచర్ టెన్స్



రోబో అడ్వైజర్స్

'ఇన్వెస్ట్మెంట్ గురించి నాకు బొత్తిగా తెలియదు' అనే మాట యూత్ నోట వినిపించేది. ఇప్పుడు అలా కాదు. 'ఏఐ ఉంది కదా...చేస్తున్నాను' అంటున్నారు.

ఇప్పుడు వారికి సుపరిచితమైన పదాలు...రోబో అడ్వైజర్స్, చాట్బాట్స్, ఎనాలటిక్స్ ఇంజిన్స్. మిలీనియల్స్, జెన్ జెడ్ యూత్ టెక్-ఫస్ట్ మైండ్సెట్తో ఇన్వెస్టింగ్ వరల్డ్లోకి వస్తున్నారు. జెన్ జెడ్లో 41 శాతం మంది ఇన్వెస్ట్మెంట్స్ మ్యానేజ్లో ఏఐ అసిస్టెంట్ను ఉపయోగిస్తున్నారు. వరల్డ్ ఎకనామిక్స్ ఫోరం సర్వే ప్రకారం ఫైనాన్షియల్ నిర్ణయాలకు సంబంధించి ఏఐ చాట్బాట్ సహాయం తీసుకుంటున్నవారి సంఖ్య యువతలో పెరుగుతోంది. అయితే ఇన్వెస్ట్ విషయంలో ఏఐ సహాయం తీసుకోవడంలో అనుకూలతలతో పాటు ప్రతికూలతలు కూడా ఉన్నాయి. వాటిని దృష్టిలో పెట్టుకొని జాగ్రత్త పడితే సమస్య ఉండదు.

● టెక్ టాక్

వాట్సప్ స్టేటస్ మరింత ఆకర్షణీయంగా...



'**వాట్సప్ స్టేటస్**' అనేది హైలీ పర్సనల్ స్పేస్గా పరిగణించబడుతుంది. యూజర్లు తమ కీమూమెంట్స్ను షేర్ చేసుకునే 'స్టేటస్'ని మరింత ఆకర్షనీయంగా తీర్చిదిద్దడానికి కొన్ని క్రియేటివ్ ఫీచర్స్ను తీసుకువచ్చింది పాపులర్ ఇన్స్టంట్ మెసేజింగ్ యాప్ వాట్సప్. లేఔట్స్, మ్యూజిక్, ఫొటో స్టిక్కర్స్, 'యాడ్ యువర్స్' ప్రాంప్ట్... మొదలైన ఫీచర్లు స్టేటస్కు మరింత డెప్త్, క్రియేటివిటీ తీసుకురావడానికి ఉపయోగపడతాయి.

'మ్యూజిక్ పోస్ట్స్' ఒక పాట చుట్టూ తిరిగే స్టేటస్ను క్రియేట్ చేసుకునే అవకాశం ఇస్తుంది. 'ఫోటోస్టిక్కర్'తో ఏ ఫోటోనైనా స్టిక్కర్గా మార్చి స్టేటస్కి యాడ్ చేసుకోవచ్చు. అప్డేట్ యూనిక్గా కనిపించడానికి రీసైజ్, రీషేప్ చేసుకోవచ్చు. నచ్చినట్లు పోజిషన్ చేసుకోవచ్చు.

షార్ట్స్కు గూగుల్ లెన్స్



గత కొన్ని నెలలుగా యూట్యూబ్ తన వెర్టికల్ వీడియో ప్లాట్ఫామ్ 'యూట్యూబ్ షార్ట్స్'కు చాలా ఫీచర్లను తీసుకువచ్చింది. తాజా విషయానికి వస్తే...'గూగుల్ లెన్స్'ను షార్ట్స్కు తీసుకువస్తున్నట్లు ప్రకటించింది. దీనివల్ల 'షార్ట్స్'లో మనం చూసిన దాన్ని గూగుల్ లెన్స్తో సెర్చ్ చేయవచ్చు.

షార్ట్స్లో కనిపించే టెక్స్ను ట్రాన్స్లేట్ చేయవచ్చు.

ఆబ్జెక్స్, ప్లేసుల గురించి సెర్చ్ చేసి మరింత సమాచారం తెలుసుకోవచ్చు.

ఈ ఫీచర్ని మొబైల్ యాప్కు మాత్రమే పరిమితం చేశారు.

గూగుల్ లెన్స్ను షార్ట్స్లో ఉపయోగించడానికి...

● యూట్యూబ్ ఓపెన్ చేసి బాటమ్ బార్లో 'షార్ట్స్ సెక్షన్'ను టాప్ చేయాలి ● స్క్రీన్పై టాప్ చేయడం ద్వారా షార్ట్స్ని పాజ్ చేయాలి ● టాప్ మెనూ నుంచి లెన్స్ను సెలెక్ట్ చేసుకోవాలి.

స్టైలస్ పెన్



కలర్ : వైట్
బ్రాండ్ : డైజో
ఫర్ : టచ్ స్క్రీన్ డివైజెస్
● డ్రాయింగ్, రైటింగ్, నేవిగేటింగ్
మెటీరియల్: అల్యూమినియం
బరువు: 10 గ్రా.

అవును... ఇది నిజమే!



- ఇరవైనాలుగు ఏళ్ల వయసులో రోమ్ సామ్రాజ్య పాలకుడైన కలిగ్యులా తన గుర్రానికి సెనెటర్ హోదా ఇచ్చాడు.
- అబ్రహం లింకన్ టాప్ హ్యాట్ ఫేమస్. ఫ్యాషన్ యాక్సెసరీగా మాత్రమే కాదు... వేరే రకంగా కూడా టాప్ హ్యాట్ను వినియోగించేవారట లింకన్.. ముఖ్యమైన నోట్స్, పేపర్లను టాప్ హ్యాట్లో స్టోర్ చేసేవారట.
- ఇంగ్లీష్ ఆల్ఫాబెట్లో చివరగా చేర్చిన అక్షరం... జె
- బ్లాక్బర్డ్ వయోలిన్ గురించి ఎప్పుడైనా విన్నారా? దీని ప్రత్యేకత ఏమిటంటే... ఈ వాయిద్య పరికరాన్ని కలప నుంచి కాకుండా రాయితో తయారుచేస్తారు.
- 'ది మ్యాట్రిక్స్' సినిమాలోని 'గ్రీన్ కోడ్'కు మూలం... జపనీస్ సుషి కుక్ బుక్.
- ప్రపంచంలోనే అతి పెద్ద టీ-షర్ట్ను ప్లాస్టిండియా ఫౌండేషన్ తయారుచేసింది. రీసైకిల్ చేసిన 2,100,000 ప్లాస్టిక్ బాటిల్స్తో దీన్ని తయారుచేశారు. ఈ టీ-షర్ట్ పొడవు 96.86 మీటర్లు.
- 'ది ఆర్ట్ ఆఫ్ లివింగ్ లాంగ్' పుస్తకం 1558లో విడుదలైంది. ఇప్పటికీ ప్రింట్లో ఉంది. ఈ పుస్తకం రాసిన లూయిజీ కార్నరో వంద సంవత్సరాలు బతికాడు.



డాట్ ది 'ఐ'స్ అండ్ క్రాస్ ది 'టీ'స్

ఏదైనా పని విషయంలో ఎలాంటి పొరపాట్లు దొర్లకుండా జాగ్రత్త పడినప్పుడు వాడే మాట... డాట్ ది 'ఐ' స్ అండ్ క్రాస్ ది 'టీ' స్

ఉదా: ఐ హ్యావ్ నియర్లీ ఫినిష్డ్ ది రిపోర్ట్, ఐ జస్ట్ హ్యావ్ టు గో వోవర్ ఇట్ వన్స్ మోర్ టు డాట్ ది 'ఐ' స్ అండ్ క్రాస్ ది 'టీ' స్

నెక్స్ టు నథింగ్

దాదాపుగా ఏమీ లేదు, చాలా తక్కువ....అని చెప్పే సందర్భంలో వాడే మాట...నెక్స్ట్ టు నథింగ్

ఉదా: మెనీ పీపుల్ ఇన్ పూర్ కంట్రీస్ ఎర్న్ వెరీ లిటిల్ మనీ అండ్ హ్యావ్ టు లివ్ ఆన్ నెక్స్ట్ టు నథింగ్

● గేమింగ్

కాంతి ఖడ్గం



సర్వైవల్ మల్టీప్లేయర్ గేమ్... డ్యూన్: అవైకెనింగ్ గేమ్ ప్రారంభం నుంచి ప్లేయర్ తన ప్లేబుల్ అవతార్ను క్రియేట్ చేయవచ్చు. అప్పీయరెన్స్ను కస్టమైజ్ చేసుకోవచ్చు. బ్యాక్గ్రౌండ్ సెలెక్ట్ చేసుకోవచ్చు. మెంటర్ను ఎంపిక చేసుకోవచ్చు. గేమ్ స్టయిల్ విషయానికి వస్తే...పగలు ఒక ప్రమాదం, రాత్రి ఒక ప్రమాదం అన్నట్లుగా ఉంటుంది. షెల్టర్ నిర్మించుకోవడానికి అవసరమైన వనరులను ప్లేయర్ సేకరించాల్సి ఉంటుంది.

పోరాటం చేయడానికి అవసరమైన కొత్త విద్యలను నేర్చుకునే, కొత్త ఆయుధాలను ఉపయోగించే, అండర్గ్రౌండ్ ల్యాబ్స్ను ఎక్స్ప్లోర్ చేసే అవకాశం ప్లేయర్కు ఉంటుంది.

సర్వైవ్, ప్రొటెక్ట్, ఎక్స్పాండ్, కంట్రోల్... అనే నాలుగు భాగాలుగా గేమ్ ఉంటుంది. 'స్టార్టింగ్ ఏరియా' పూర్తి చేసిన తరవాత 'హో వర్ల్యాండ్'తో ప్లేయర్స్ యాక్సెస్ అవుతారు. ఇక్కడి నుంచి 'ఆర్నీతోప్టర్' అనే ఎయిర్ క్రాఫ్ట్లో ప్రయాణం చేయవచ్చు.

ఇంజిన్: అన్రియల్ ఇంజిన్ 5
జానర్: సర్వైవల్
మోడ్: మల్టీప్లేయర్
ప్లాట్ఫామ్స్: మైక్రోసాఫ్ట్ విండోస్, ప్లేస్టేషన్ 5, ఎక్స్బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్.

సాక్షి సినిమా

సంక్రాంతి బరిలో...



● రవితేజ

సంక్రాంతి బాక్సాఫీస్ బరిలో నిలిచారు రవితేజ. ఆయన హీరోగా కిశోర్ తిరుమల దర్శకత్వంలో ఓ కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ మూవీ తెరకెక్కనుంది. ఎస్ఎల్వీ సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ సినిమా ముహూర్తపు వేడుకతో గురువారం ప్రారంభమైంది. ఈ నెల 16న రెగ్యులర్ షూటింగ్ని హైదరాబాద్లో ప్రారంభిస్తామని, రవితేజ కెరీర్లోని ఈ 76వ సినిమాను వచ్చే సంక్రాంతి పండగ సందర్భంగా విడుదల చేస్తామని మేకర్స్ తెలిపారు. అలాగే ఫ్లయిట్లో రవితేజ స్టైలిష్గా కూర్చుని, ఒక చేతిలో 'సీ ఇట్ సే ఇన్ స్పానిష్' పుస్తకం పట్టుకున్న పోస్టర్ని విడుదల చేశారు. ''రవితేజగారి సిగ్నేచర్ స్టైల్, ఎనర్జీ ఈ సినిమాలోనూ కనిపిస్తాయి. అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునే కథతో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: భీమ్స్ సిసిరోలియో.

ఇక షురూ



● వెంకీ అట్లూరి, సూర్య, సూర్యదేవర నాగవంశీ

తమిళనాడులోని పళని దేవాలయానికి హీరో సూర్య అండ్ టీమ్ వెళ్లారు. సూర్య హీరోగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో ఓ ద్విభాషా (తెలుగు, తమిళం) చిత్రం రూపొందనున్న సంగతి తెలిసిందే. మమితా బైజు హీరోయిన్గా నటించనున్న ఈ చిత్రంలో రవీనా టాండన్, రాధికా శరత్కుమార్ ఇతర కీలక పాత్రల్లో నటించనున్నారు. ఈ నెల 9న ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ షురూ కానుంది. ఈ సందర్భంగా పళని దేవాలయంలో మురుగన్ని దర్శించుకుని, పూజలు నిర్వహించి, ''ఓ మేజర్ స్టెప్ వేసేందుకు సన్నద్ధమౌతున్నాం. దేవుడి ఆశీర్వాదం కోసం పళని దేవాలయానికి వచ్చాం'' అని యూనిట్ 'ఎక్స్' వేదికగా పేర్కొంది. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించనున్న ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాశ్కుమార్.

ఆమిర్ సూపర్ హీరో



● లోకేశ్ కనగరాజ్, ఆమిర్ ఖాన్

సిల్వర్ స్క్రీన్పై ఆమిర్ ఖాన్ను సూపర్ హీరోని చేయనున్నారు దర్శకుడు లోకేశ్ కనగరాజ్. ఆమిర్ ఖాన్ హీరోగా లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో ఓ సినిమా రానుంది. ఆమిర్ ఖాన్ హీరోగా నటించిన తాజా చిత్రం 'సితారే జమీన్ పర్' ఈ నెల 20న విడుదల కానుంది. ఈ సందర్భంగా ముంబైలో జరిగిన ఈ సినిమా ప్రమోషన్స్లో భాగంగా దర్శకుడు లోకేశ్ కనగరాజ్తో తాను ఓ సినిమా చేయబోతున్నానని, ఈ సినిమా సూపర్ హీరో జానర్లో ఉంటుందని, 2026 సెకండ్ హాఫ్లో ఈ చిత్రం సెట్స్పైకి వెళ్తుందని ఆమిర్ ఖాన్ వెల్లడించారు. అలాగే గతంలో తాను నటించిన 'పీకే' సినిమా ప్రీక్వెల్ లేదా సీక్వెల్ ఆలోచనలు ప్రస్తుతానికి లేవని, అయితే దర్శకుడు రాజకుమార్ హిరానీతో కలిసి తాను దాదాసాహెబ్ ఫాల్కే బయోపిక్ కోసం వర్క్ చేస్తున్నట్లుగా ఆమిర్ ఖాన్ ఈ ప్రమోషన్స్లో భాగంగానే తెలిపారని బాలీవుడ్ టాక్. ఈ సంగతి ఇలా ఉంచితే... లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో రజనీకాంత్ హీరోగా నటించిన 'కూలీ' సినిమాలో ఆమిర్ ఖాన్ ఓ కీలక పాత్రలో నటించిన సంగతి తెలిసిందే. నాగార్జున, శ్రుతీహాసన్, ఉపేంద్ర, సత్యరాజ్, షౌబిన్ షాహిర్ ఇతర ప్రధాన పాత్రల్లో నటించిన 'కూలీ' ఆగస్టు 14న విడుదల కానుంది.

ఆ పాట సర్ప్రైజ్ చేస్తుంది - బెల్లంకొండ సురేష్



● భీమ్స్, జయంత్ సి. పరాన్జీ, బెల్లంకొండ సురేష్, చంద్రబోస్

'**లక్ష్మీ నరసింహా**' చిత్రాన్ని 21 ఏళ్ల తర్వాత రీ రిలీజ్ చేస్తున్నానంటే... బాలకృష్ణ అభిమానులకు ఏదో ఒక స్పెషల్ సర్ప్రైజ్ ఇవ్వాలనుకున్నాను. గతంలో ఈ చిత్రం కోసం ఒక పాట చిత్రీకరించాం కానీ, సినిమాలో లేదు. 'మందేసినోడు..' పాటని రీ రిలీజ్లో యాడ్ చేశాం. ఈ పాట నందమూరి అభిమానులను, ప్రేక్షకులను సర్ప్రైజ్ చేస్తుంది'' అని బెల్లంకొండ సురేష్ అన్నారు. బాలకృష్ణ, ఆసిన్ జోడీగా జయంత్ సి. పరాన్జీ దర్శకత్వం వహించిన చిత్రం 'లక్ష్మీ నరసింహా'. బెల్లంకొండ సురేష్ నిర్మించిన ఈ చిత్రం 2004 జనవరి 14న విడుదలై, హిట్ అందుకుంది. ఈ చిత్రాన్ని 4కె వెర్షన్లో ఈ నెల 8న రీ రిలీజ్ చేస్తున్నారు. ఈ వెర్షన్లో 'మందేసినోడు..' అంటూ సాగే పాటని యాడ్ చేశారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించిన ఈ పాటకి చంద్రబోస్ లిరిక్స్ అందించగా, స్వరాగ్ కీర్తన్ పాడారు. హైదరాబాద్లో నిర్వహించిన సమావేశంలో బెల్లంకొండ సురేష్ మాట్లాడుతూ– ''మంచి కథ ఉంటే మళ్లీ సినిమా చేద్దామని జయంత్ సి. పరాన్జీతో చెప్పాను. రీ రిలీజ్కు ఇంత అద్భుతమైన సాంగ్ ఇచ్చిన భీమ్స్, చంద్రబోస్ గార్లకు ధన్యవాదాలు'' అన్నారు. జయంత్ సి. పరాన్జీ మాట్లాడుతూ– ''రీ రిలీజ్లో మా 'లక్ష్మీ నరసింహా'ని చూసి ఎంజాయ్ చేయండి'' అని తెలిపారు. ''నా 31 ఏళ్ల సినీ సాహిత్య ప్రయాణంలో అతి విచిత్రమైన విన్యాసం చేసిన పాట 'మందేసినోడు...' అన్నారు చంద్రబోస్. ''ఈ పాట మీ అందరికీ నచ్చుతుందని భావిస్తున్నాను'' అన్నారు భీమ్స్ సిసిరోలియో. స్వరాగ్ కీర్తన్, మౌనిక మాట్లాడారు.

ప్రకృతికి రుణపడి ఉంటాను



● నభా నటేశ్


''పర్యావరణాన్ని అనుభూతి చెందడం మాత్రమే మనకున్న హక్కు. ఈ అందమైన అనుభూతిని ఇచ్చిన ప్రకృతికి రుణపడి ఉంటాను'' అంటున్నారు హీరోయిన్ నభా నటేశ్. గురువారం (జూన్ 5) ప్రపంచ పర్యావరణ దినోత్సవం. ఈ సందర్భంగా చెట్టును కౌగిలించుకున్న ఫొటోని ఇన్స్టాగ్రామ్ వేదికగా షేర్ చేసి, భావోద్వేగమైన పోస్ట్ చేశారామె. ''ఈ రోజు ఒక చెట్టును కౌగిలించుకున్నాను... ఆ చెట్టు కూడా నన్ను తిరిగి కౌగిలించుకుందనే భావన కలిగింది. ఎంతో అందమైన ఈ ప్రపంచాన్ని చూసేందుకు వచ్చిన అతిథులం మనం. ఇక్కడ ప్రకృతి మనకెన్నో గొప్ప అనుభవాలు ఇస్తోంది. ఈ ప్రకృతిని, పర్యావరణాన్ని అనుభూతి చెందడం మాత్రమే మనకున్న హక్కు. ఈ సంతోషాలు ఇచ్చిన నేచర్కి రుణపడి ఉంటాను'' అని పేర్కొన్నారామె. ఇక సినిమాల విషయానికొస్తే... నిఖిల్ హీరోగా నటిస్తున్న 'స్వయంభు' చిత్రంతో పాటు 'నాగబంధం' అనే సినిమాలో నటిస్తున్నారు నభా నటేశ్.

ఓటీటీ — ఇది చూడొచ్చు

టూర్ బాగా జరిగిందా..?

ఓటీటీలో 'ఇది చూడొచ్చు' అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో తమిళ చిత్రం 'టూరిస్ట్ ఫ్యామిలీ' ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.

మన ఇరుగు పొరుగు ఎవరున్నారో, ఏం చేస్తున్నారో అని తెలుసుకునే అవకాశం, తీరిక లేని బిజీ రోజుల్లో గడుపుతున్నాం. మన పొరుగింట్లో దొంగ దూరినా లేదా దొర వచ్చినా మనకు తెలిసే సమయానికి తెల్లారిపోతుంది. కానీ అదే ఇరుగు పొరుగు వారి కోసం ఓ కాలనీ వాళ్ళు ఏం చేశారన్నదే ఈ 'టూరిస్ట్ ఫ్యామిలీ' సినిమా. జియో హాట్ స్టార్ వేదికగా స్ట్రీమ్ అవుతున్న ఈ సినిమాకు ప్రముఖుల ప్రశంసలతో పాటు ప్రేక్షకుల ఆదరణ కూడా బాగా దక్కింది. మరీ ముఖ్యంగా మన ప్రపంచ స్థాయి దర్శక జక్కన్న రాజమౌళి ఈ సినిమాని ప్రశంసించడం విశేషం. అంతలా ఏముందీ సినిమాలో ఓసారి చూద్దాం. శ్రీలంక దేశం నుండి ధర్మాన దాస్ కుటుంబం అక్రమంగా సముద్ర మార్గాన భారత్లోని తమిళనాడు తీర ప్రాంతానికి చేరుకుంటుంది. ధర్మాన దాస్ సతీమణి వాసంతి. వాళ్ళకిద్దరు పిల్లలు నితూషన్, ముల్లి. శ్రీలంకలో సంక్షోభం వల్ల భారత్లో సంపాదించడానికి వాసంతి సోదరుడు ప్రకాశ్ సహాయంతో కుటుంబం అంతా రామేశ్వరానికి వస్తారు. అదే ఊర్లో ఉన్న కేశవనగర్ కాలనీలో ఓ ఇంట్లోకి అద్దెకి చేరతారు. ఆ కాలనీ చాలా విచిత్రమైనది. ఎవ్వరి మార్గం వాళ్ళది అన్నట్టుగా ఉంటారు. ధర్మాన దాస్ తమ శ్రీలంక ఉనికి ఇతరులకు తెలియకుండా జాగ్రత్త పడుతుంటాడు. ఈ లోపల అదే ఊరిలోని ఓ చెత్త కుప్పలో భారీ బాంబు పేలుడు సంభవిస్తుంది. అంతకుముందే ధర్మాన దాస్ ఆ చెత్త తొట్టిలో తాము తిన్న పదార్థాల కవర్ వేస్తాడు. అది కాస్తా సీసీ టీవీలో రికార్డు అవుతుంది. దాంతో పోలీసులు ధర్మాన దాస్ కుటుంబం కోసం గాలిస్తుంటారు. ఓ పక్క తమ శ్రీలంక ఐడెంటీటీ ఇతరులకు తెలియనివ్వకుండా, మరో పక్క ఈ పోలీస్ కేసును ధర్మాన దాస్ కుటుంబం ఎలా ఎదుర్కొంటుందో 'టూరిస్ట్ ఫ్యామిలీ' సినిమాలోనే చూడాలి. ఈ సినిమా ఓ ఫ్యామిలీ ఓరియంటెడ్ కామెడీ థ్రిల్లర్ అని చెప్పవచ్చు. ఈ సినిమాకి మూల కథ రాసుకుని అభిషన్ జీవింత్ దర్శకత్వం వహించారు. ప్రముఖ నటుడు శశికుమార్ హీరో పాత్రలో నటించగా, ప్రముఖ నటి సిమ్రాన్ హీరోయిన్గా నటించి అలరించారు. ముఖ్యంగా ధర్మాన దాస్ చిన్న కొడుకు ముల్లి పెట్టే గిలిగింతలు మామూలుగా ఉండవు. సినిమా మంచి ఎంటర్టైనర్. హాట్ స్టార్లో తెలుగులోనూ లభ్యమవుతోంది. ఇంకెందుకు ఆలస్యం... ఈ 'టూరిస్ట్ ఫ్యామిలీ'తో ఈ వారం టూర్కి వెళ్ళండి.



- హరికృష్ణ ఇంటూరు

స్టాక్ మార్కెట్లు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	444	81,442
నిఫ్టీ ▲	131	24,751

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	19,456	▽	23
డోజోన్స్	42,489	▲	54
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,811	▲	10
డాక్స్	24,324	▲	48
షాంఘై	3,384	▲	8
నికాయ్	37,554	▽	193

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	83.96	87.64
£	బ్రిటన్ పౌండ్	114.09	119.01
€	యూరో	95.90	100.42
¥	జపాన్ యెన్ (100)	48.61	70.63
AUS	ఆస్ట్రేలియా డాలర్	53.51	58.35
S$	సింగపూర్ డాలర్	64.36	69.05
SAR	సౌదీ రియాల్	21.99	23.49
UAE D	యూఏఈ దిర్హామ్	22.47	24.25
¥	చైనా యువాన్	11.08	12.90

సెన్సెక్స్ 444 పాయింట్లు ప్లస్

- రెండో రోజూ మార్కెట్లు అప్
- 81,442 వద్ద ముగింపు
- ఇంట్రాడేలో 913 పాయింట్లు జూమ్
- 131 పాయింట్ల లాభంతో 24,751కు నిఫ్టీ



ముంబై: ఆర్‌బీఐ వడ్డీ రేట్ల కోతపై ఆశలు ఇన్వెస్టర్లకు జోష్‌నిచ్చాయి. దీంతో వరుసగా రెండో రోజు దేశీ స్టాక్ మార్కెట్లు బలపడ్డాయి. సెన్సెక్స్ 444 పాయింట్లు ఎగసి 81,442 వద్ద నిలిచింది. నిఫ్టీ 131 పాయింట్లు పెరిగి 24,751 వద్ద ముగిసింది. ఇన్వెస్టర్లు కొనుగోళ్లకే అధికంగా మొగ్గు చూపడంతో మిడ్‌సెషన్‌కల్లా మార్కెట్లు భారీగా లాభపడ్డాయి. సెన్సెక్స్ 913 పాయింట్లు జంప్‌చేసి 81,911ను దాటగా.. నిఫ్టీ 24,900 వద్ద ఇంట్రాడే గరిష్టానికి చేరింది. బుధవారం సైతం సెన్సెక్స్ 261 పాయింట్లు, నిఫ్టీ 78 పాయింట్లు లాభపడిన సంగతి తెలిసిందే.

రియల్టీ, ఫార్మా జోరు

ఎన్‌ఎస్‌ఈలో రియల్టీ, ఫార్మా, మెటల్, ఐటీ 1.7–0.5 శాతం మధ్య ఎగశాయి. పీఎస్‌యూ బ్యాంక్స్ 0.6 శాతం డీలా పడింది. నిఫ్టీ దిగ్గజాలలో ఎటర్నల్, ట్రెంట్, డాక్టర్ రెడ్డీస్, పవర్‌గ్రిడ్, ఐసీఐసీఐ, శ్రీరామ్ ఫైనాన్స్, ఆర్‌ఐఎల్, అల్ట్రాటెక్, అదానీ పోర్ట్స్, సిప్లా, సన్ ఫార్మా 4.5–1 శాతం మధ్య పుంజుకున్నాయి. అయితే ఇండస్‌ఇండ్, టాటా కన్జూమర్, యాక్సిస్, బజాజ్ ఫిన్, ఫైనాన్స్, హీరో మోటో 1.4–0.6 శాతం మధ్య నీరసించాయి.

చిన్న షేర్లు ఓకే

బీఎస్ఈలో మిడ్, స్మాల్‌క్యాప్ ఇండెక్సులు 0.7–0.4 శాతం చొప్పున బలపడ్డాయి. ట్రేడైన షేర్లలో 2,206 లాభపడితే.. 1,782 నష్టపోయాయి. కాగా.. నగదు విభాగంలో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐలు) నామమాత్రంగా రూ. 208 కోట్ల విలువైన స్టాక్స్ విక్రయించారు. అయితే దేశీ ఫండ్స్(డీఐఐలు) రూ. 2,382 కోట్లు ఇన్వెస్ట్ చేశాయి. బుధవారం ఎఫ్‌పీఐలు రూ. 1,076 కోట్లు, డీఐఐలు రూ. 2,567 కోట్ల చొప్పున ఇన్వెస్ట్ చేసిన విషయం విదితమే.

వెండి వెలుగులు

- కేజీ ధర రూ. 1,04,100
- సరికొత్త రికార్డు



న్యూఢిల్లీ: దేశీయంగా వెండి గురువారం సరికొత్త గరిష్ట స్థాయికి చేరింది. ఆలిండియా సరాఫా అసోసియేషన్ ప్రకారం వరుసగా నాలుగో రోజు పరుగును కొనసాగిస్తూ న్యూఢిల్లీ బులియన్ మార్కెట్లో వెండి కేజీ ధర మరో రూ. 2,000 పెరిగి రూ. 1,04,100 (పన్నులు కలిపి) పలికింది. చివరిసారిగా మార్చి 19న వెండి రేటు ఆల్ టైమ్ గరిష్టమైన రూ. 1,03,500 స్థాయిని తాకింది. పటిష్టమైన ఫండమెంటల్స్, పరిశ్రమల నుంచి డిమాండ్ ద్రవ్యోల్బణానికి హెడ్జింగ్ సాధనంగా ఉపయోగిస్తుండటం, అంతర్జాతీయంగా సరఫరా నెమ్మదించడం తదితర అంశాల కారణంగా దేశీ మార్కెట్లో వెండి రేటు సరికొత్త ఆల్ టైమ్ గరిష్టాన్ని తాకినట్లు హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ సీనియర్ అనలిస్ట్ (కమోడిటీస్) సౌమిల్ గాంధీ తెలిపారు. అటు మల్టీ కమోడిటీ ఎక్స్చేంజ్‌లో సిల్వర్ ఫ్యూచర్స్ జూలై కాంట్రాక్టు ధర ఒక దశలో సుమారు రూ. 3,833 పెరిగి రూ. 1,05,213 వద్ద ట్రేడయ్యింది.

పసిడి పరుగు..

డాలరు బలహీనత, అమెరికా రుణభారంపై ఆందోళనలు, అనిశ్చితిలో సురక్షితమైన సాధనంగా పసిడికి పేరుండటం వంటి అంశాల కారణంగా బంగారం ధర కూడా పరుగు తీస్తోంది. 99.9 శాతం స్వచ్ఛత గల పుత్తడి రేటు 10 గ్రాములకు రూ. 430 పెరిగి రూ. 99,690 వద్ద (పన్నులు కలిపి) ముగిసింది. 99.5 శాతం స్వచ్ఛత గల బంగారం రూ. 400 పెరిగి రూ. 99,100 వద్ద క్లోజయ్యింది. అంతర్జాతీయంగా పసిడి ధర ఔన్సుకు (31.1 గ్రాములు) 3,395 డాలర్ల పైకి చేరగా, దేశీయంగా ఎంసీఎక్స్‌లో రూ. 98,450 వద్ద ట్రేడయినట్లు ఎల్‌కేపీ సెక్యూరిటీస్ వీపీ రీసెర్చ్ అనలిస్ట్ జతిన్ త్రివేది తెలిపారు.

దీపావళి నాటికి

దీపావళి నాటికి వెండి ధర రూ. 1,14,000 – రూ. 1,20,000 స్థాయికి చేరే అవకాశం ఉందని మెహతా ఈక్విటీస్ వైస్ ప్రెసిడెంట్ రాహుల్ కలాంత్రి చెప్పారు. అయితే, అంతర్జాతీయంగా అనిశ్చితుల కారణంగా ఈలోపు తీవ్ర హెచ్చుతగ్గులకు లోనుకావచ్చని పేర్కొన్నారు. మరోవైపు, కొత్తగా భౌగోళిక రాజకీయ పరిణామాలేమైనా తలెత్తితే మరింత అనిశ్చితికి ఆజ్యం పోసినట్లవుతుందని, దీంతో ఇన్వెస్టర్లు మళ్లీ బంగారంవైపు మొగ్గు చూపవచ్చని అబాన్స్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సీఈవో చింతన్ మెహతా చెప్పారు.

బీమాలోకి సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

ఫ్యూచర్ జనరాలిలో 25.18 % వాటా



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ సంస్థ సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తాజాగా ఫ్యూచర్ జనరాలి ఇండియా లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్(ఎఫ్‌జీఐఎల్ఐసీఎల్)లో 25.18 శాతం వాటా కొనుగోలు చేసింది. దివాలా చట్ట చర్యలలో భాగంగా రూ. 57 కోట్ల నగదుకు వాటాను సొంతం చేసుకుంది. ఫ్యూచర్ జనరాలిలో 65,43,80,439 షేర్లను చేజిక్కించుకోవడం ద్వారా బీమా బిజినెస్‌లోకి ప్రవేశించినట్లు సెంట్రల్ బ్యాంక్ పేర్కొంది. అటు ఫ్యూచర్ జనరాలీ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ (ఎఫ్‌జీఐఐసీఎల్)లో రూ. 451 కోట్లతో 24.91 శాతం వాటాను కొనుగోలు చేసినట్లు సెంట్రల్ బ్యాంక్ వెల్లడించింది. ఎఫ్‌జీఐఎల్ఐసీఎల్ సంస్థ సేవింగ్స్ ఇన్సూరెన్స్, యులిప్, టర్మ్ ఇన్సూరెన్స్ ప్లాన్లు, హెల్త్ ఇన్సూరెన్స్ మొదలైన పాలసీలు అందిస్తోంది.

ఫ్లిప్‌కార్ట్‌కి ఎన్‌బీఎఫ్‌సీ లైసెన్స్



న్యూఢిల్లీ: ఈ-కామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్‌కి రిజర్వ్ బ్యాంక్ నుంచి నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ) లైసెన్సు లభించింది. ఈ ఏడాది మార్చిలో ఆర్‌బీఐ దీన్ని మంజూరు చేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఫ్లిప్‌కార్ట్ దీన్ని ధ్రువీకరించనప్పటికీ, ఇతర వివరాలను వెల్లడించలేదు. ఎన్‌బీఎఫ్‌సీ లైసెన్సు లభించడంతో ఇకపై కస్టమర్లకు ఫ్లిప్‌కార్ట్ నేరుగా రుణాలు అందించేందుకు వీలు లభిస్తుంది. ఫ్లిప్‌కార్ట్‌లో అమెరికన్ రిటైల్ దిగ్గజం వాల్‌మార్ట్‌కి ప్రస్తుతం 80 శాతం వాటాలు ఉన్నాయి. త్వరలో ఐపీవోకి వచ్చే యోచనలో ఉన్న ఫ్లిప్‌కార్ట్ తమ హోల్డింగ్ కంపెనీ ప్రధాన కార్యాలయాన్ని సింగపూర్ నుంచి భారత్‌కు మార్చే యోచనలో ఉన్నట్లు వెల్లడించింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

6-6-2025	
విశాఖ	535-00
చిత్తూరు	613-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	515-00
విజయవాడ	535-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	525-00
వరంగల్	527-00
రిటైల్ ధర	5.85

మరో పావుశాతం కోత?

వడ్డీ రేట్లపై ఆర్‌బీఐ నిర్ణయం నేడు

ముంబై: కీలక పాలసీ రేట్లపై ద్వైమాసిక ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్వహిస్తున్న రిజర్వ్ బ్యాంక్ మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) నేడు (శుక్రవారం) నిర్ణయాన్ని ప్రకటించనుంది. జూన్ 6 ఉదయం 10 గం.లకు ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా దీనిపై ప్రకటన చేస్తారని రిజర్వ్ బ్యాంక్ తెలిపింది. బుధవారం ప్రారంభమైన మూడు రోజుల సమీక్ష శుక్రవారం ముగుస్తుంది. ఆర్‌బీఐ నుంచి ముగ్గురు, ప్రభుత్వం నియమించిన మరో ముగ్గురు మొత్తం ఆరుగురు ఎంపీసీలో సభ్యులుగా ఉన్నారు. ఆర్‌బీఐ ఈ ఏడాది ఇప్పటికే ఫిబ్రవరి, ఏప్రిల్‌లో పావు శాతం చొప్పున రెండు విడతలుగా మొత్తం అర శాతం మేర కీలక పాలసీ రేటును (రెపో) తగ్గించింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్‌ల వల్ల అనిశ్చితి నెలకొన్న నేపథ్యంలో తాజాగా మూడో విడతలో మరో పావు శాతం తగ్గించవచ్చనే అంచనాలు నెలకొన్నాయి. ఆర్‌బీఐ పాలసీ రేటును తగ్గించడంతో చాలా మటుకు బ్యాంకులు కూడా రెపో రేటు ఆధారిత రుణ రేట్లను, మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ ఆధారిత రేటును ఇప్పటికే కొంత తగ్గించాయి. రెపో రేటు తగ్గితే బ్యాంకులు కూడా రుణాలపై వడ్డీ రేటు తగ్గిస్తాయి. దీంతో రిటైల్, కార్పొరేట్ రుణ గ్రహీతలకు నెలవారీ వాయిదాల (ఈఎంఐ) భారం తగ్గుతుంది.



రియల్టర్ల ఆశలు..

హౌసింగ్‌కి డిమాండ్ పెంచే దిశగా ఆర్‌బీఐ రెపో రేటును కనీసం మరో పావు శాతమైనా తగ్గించవచ్చని రియల్టర్ల సమాఖ్యలు క్రెడాయ్, నారెడ్కో ఆశిస్తున్నాయి. గత మూడు నెలలుగా హౌసింగ్ డిమాండ్ నెమ్మదించిన నేపథ్యంలో రేట్లు తగ్గిస్తే అమ్మకాలు మెరుగయ్యేందుకు తోడ్పడుతుందని క్రెడాయ్ నేషనల్ ప్రెసిడెంట్ శేఖర్ పటేల్ తెలిపారు. ఆర్థిక వృద్ధికి, పెద్ద ఎత్తున ఉపాధి కల్పనకు కూడా సహాయకరంగా ఉంటుందని నారెడ్కో ప్రెసిడెంట్ జి. హరిబాబు చెప్పారు.

భారత్‌లో ఓపెన్‌ఏఐ అకాడమీ



న్యూఢిల్లీ: చాట్‌జీపీటీ మాతృసంస్థ ఓపెన్‌ఏఐ, కేంద్ర ఐటీ శాఖలో భాగమైన ఇండియాఏఐ మిషన్ కలిసి భారత్‌లో ఓపెన్‌ఏఐ అకాడమీని ప్రారంభించాయి. ఇందుకు అవగాహన ఒప్పందాన్ని (ఎంవోయూ) కుదుర్చుకున్నాయి. దేశీయంగా వేగంగా వృద్ధి చెందుతున్న డెవలపర్ల కమ్యూనిటీ, డిజిటల్ మౌలిక సదుపాయాలు, స్టార్టప్‌లు.. ఆవిష్కర్తల నెట్‌వర్క్‌కు ఏఐపరంగా కావాల్సిన విద్యావనరులు, సాధనాలు దీనితో అందుబాటులోకి వస్తాయని ఓపెన్‌ఏఐ తెలిపింది. విద్య, టెక్నాలజీ అందరికీ అందుబాటులో ఉండాలనే ఉమ్మడి లక్ష్య సాధన దిశగా ఇది కీలక ముందడుగని కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. ఈ అకాడమీలో డిజిటల్, ఇన్-పర్సన్ లెర్నింగ్ విధానంలో ఇంగ్లీష్, హిందీలో కంటెంట్ అందుబాటులో ఉంటుంది. త్వరలో మరిన్ని ప్రాంతీయ భాషలను కూడా జోడించనున్నారు. విద్యార్థులు, డెవలపర్లు, విద్యావేత్తలు, సివిల్ సర్వెంట్లు, చిన్న స్థాయి వ్యాపారవర్గాలు మొదలైన వారందరికీ ఏఐ నైపుణ్యాల్లో శిక్షణనిచ్చేందుకు ఇది ఉపయోగపడనుంది. ఇండియా ఏఐ మిషన్ ఆమోదించిన 50 ఫెలోస్/స్టార్టప్‌లకు 1,00,000 డాలర్ల వరకు విలువ చేసే ఏపీఐ క్రెడిట్స్ లభిస్తాయి.

సాక్షి స్పోర్ట్స్



భారత ఆర్చరీ జట్లకు నిరాశ

అంటాల్యా (తుర్కియే): ప్రపంచకప్ ఆర్చరీ స్టేజ్-3 టోర్నమెంట్‌లో టీమ్ విభాగాల్లో భారత జట్లకు నిరాశ ఎదురైంది. కాంపౌండ్, రికర్వ్ విభాగాల్లో భారత బృందాలు పతకాలు గెల్చుకోవడంలో విఫలమయ్యాయి. మహిళల కాంపౌండ్ కాంస్య పతక మ్యాచ్‌లో వెన్నం జ్యోతి సురేఖ (ఆంధ్రప్రదేశ్), తనిపర్తి చికిత (తెలంగాణ), మధుర (మహారాష్ట్ర)లతో కూడిన భారత జట్టు 238–239తో అలెక్సిస్ రూయిజ్, ఒలీవియా డీన్, అబిగెయిల్‌లతో కూడిన అమెరికా జట్టు చేతిలో ఓడిపోయింది. బొమ్మదేవర ధీరజ్, అతాను దాస్, పార్థ్‌లతో కూడిన భారత పురుషుల రికర్వ్ జట్టు కూడా కాంస్య పతక మ్యాచ్‌లో ఓడిపోయింది. భారత బృందం 1–5తో ఫ్రాన్స్ జట్టు చేతిలో ఓటమి చవిచూసింది. అంకిత, దీపిక, సిమ్రన్‌జీత్‌లతో కూడిన భారత మహిళల రికర్వ్ జట్టు క్వార్టర్ ఫైనల్లో 1–5తో అమెరికా జట్టు చేతిలో ఓడిపోయింది.

ఆర్‌సీబీ ప్రతినిధుల్ని అరెస్ట్ చేయండి

- డీజీపీని ఆదేశించిన కర్ణాటక సీఎం సిద్ధరామయ్య
- కర్ణాటక క్రికెట్ సంఘం, ఈవెంట్ మేనేజ్‌మెంట్‌ల మెడకు ఉచ్చు
- జ్యుడీషియల్ విచారణకు ఆదేశం
- నివేదిక కోరిన కర్ణాటక హైకోర్టు
- తొక్కిసలాటపై సచిన్, కపిల్‌దేవ్ దిగ్భ్రాంతి



మీడియా సమావేశంలో కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్



తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిన 14 ఏళ్ల దివ్యాంశి పార్థివ దేహం వద్ద బంధువుల రోదన

సుదీర్ఘ నిరీక్షణకు తెరదించిన ఐపీఎల్ ట్రోఫీ విజయ సంబరాలు బెంగళూరులో 11 మంది కుటుంబాలను విషాదంలో ముంచాయి. దీంతో టైటిల్ గెలిచిన ఆనందం రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) శిబిరంలో ఆవిరైంది. ఈ దుర్ఘటనను తీవ్రంగా పరిగణించిన కర్ణాటక సీఎం సిద్దారామయ్య ఆర్‌సీబీ ప్రతినిధుల్ని అరెస్టు చేయాలని రాష్ట్ర డీజీపీని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన బెంగళూరు కమిషనర్ దయానంద్ సహా ఐదుగురు పోలీసు అధికారుల్ని సైతం సర్కారు సస్పెండ్ చేసింది. పలువురు దిగ్గజ క్రికెటర్లు పెను విషాదంపై విచారం వెలిబుచ్చారు. బెంగళూరు పోలీసులు ఫ్రాంచైజీ సహా కర్ణాటక రాష్ట్ర క్రికెట్ సంఘంపై కేసు నమోదు చేసింది. కర్ణాటక హైకోర్టు తక్షణ నివేదిక పంపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.

బెంగళూరు: చిన్నస్వామి స్టేడియంలో తొక్కిసలాట దుర్ఘటనపై కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం కన్నెర్రజేసింది. ఏకంగా 11 మంది మృత్యువాత పడిన ఈ విషాద ఘటనను తీవ్రంగా పరిగణించిన సీఎం సిద్దరామయ్య దుర్ఘటనకు బాధ్యులైన వారిలో ఎవరినీ విడిచిపెట్టొద్దని రాష్ట్ర డీజీపీని ఆదేశించారు. రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) ప్రతినిధుల్ని వెంటనే అరెస్టు చేయాలని, ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థ డీఎన్‌ఏ, కర్ణాటక క్రికెట్ సంఘం (కేఎస్‌సీఏ) ఉన్నతాధికారుల్ని సైతం అదుపులోకి తీసుకోవాలని ఆ రాష్ట్ర సీఎం ఆదేశించారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన బెంగళూరు నగర్ పోలీస్ కమిషనర్ దయానంద్ సహా ఐదుగురు అధికారుల్ని సస్పెండ్ చేస్తున్నట్లు రాష్ట్రప్రభుత్వం వెల్లడించింది. జ్యుడీషియల్ విచారణ కోసం హైకోర్టు రిటైర్డ్ జస్టిస్ మైకేల్ డికున్హా నేతృత్వంలో ఏకసభ్య కమిషన్ ఏర్పాటు చేసింది. కేసు దర్యాప్తును సీఐడీకి బదిలీ చేస్తున్నట్లు ప్రకటించింది. 18 ఏళ్ల తర్వాత ఐపీఎల్‌లో తొలిసారి టైటిల్ గెలవడంతో బుధవారం బెంగళూరులో విజయోత్సవ సంబరాలు విషాదంగా ముగిశాయి. చిన్నస్వామి స్టేడియం ప్రేక్షకుల సామర్థ్యానికి పదిరెట్లకు మించి పోటెత్తిన అభిమాన సందోహాన్ని పోలీసులు నియంత్రించలేకపోవడంతో తొక్కిసలాట జరిగింది. ఈ దుర్ఘటనకు ప్రధాన కారణమైన ఆర్‌సీబీ ఫ్రాంచైజీ యాజమాన్యం, కేఎస్‌సీఏ, డీఎన్‌ఏపై బెంగళూరు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు నమోదు చేసిన ఎఫ్‌ఐఆర్‌లో ప్రధాన నిందితులు ఏ1గా ఆర్‌సీబీపై కేసులు మోపారు. ఏ2గా డీఎన్‌ఏ, ఏ3గా కేఎస్‌సీఏపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశామని బెంగళూరు పోలీసులు తెలిపారు. కుబ్బన్ పార్క్ పోలీస్ స్టేషన్‌లో భారతీయ న్యాయ సంహితలోని 105, 115, 118, 190, 132, 125, 142, 121 సెక్షన్ల కింద పలు నేరారోపణలతో కేసులు నమోదు చేశారు. అయితే విషాదఘటన అనంతర విచారణకు పూర్తిగా సహకరిస్తామని ఆర్‌సీబీ యాజమాన్యం ప్రకటించింది. పోలీసు దర్యాప్తునకు, రాష్ట్ర ప్రభుత్వం జ్యుడీషియల్ విచారణకు సహకారం అందజేస్తామని ఆర్‌సీబీ తెలిపింది.

ప్రస్తుత పరిస్థితిపై...

తొక్కిసలాట ఘటనపై కర్ణాటక హైకోర్టు స్పందించింది. తాత్కాలిక చీఫ్ జస్టిస్ కామేశ్వర్ రావు, జస్టిస్ సీఎమ్ జోషిలతో కూడిన డివిజన్ బెంచ్ ప్రజా ప్రయోజనార్థం కేసును సుమోటోగా స్వీకరించింది. ప్రస్తుత పరిస్థితిపై పూర్తిస్థాయి నివేదిక పంపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. హృదయ విదారక దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారు, గాయపడిన వారు, చికిత్స పొందుతున్న వారి వివరాలు సహా ప్రభుత్వం, పోలీసులు తక్షణం చేపట్టిన చర్యలు తదితర వివరాలతో కూడిన సంపూర్ణ నివేదిక ఇవ్వాల్సిందిగా కర్ణాటక సర్కారును డివిజన్ బెంచ్ ఆదేశించింది.





తొక్కిసలాట అనంతరం చిన్నస్వామి స్టేడియం ఆవరణలోని దృశ్యాలు

ఆర్‌సీబీ పరిహారం

ఇది వరకే రాష్ట్ర ప్రభుత్వం మృతుల కుటుంబాలకు రూ. 10 లక్షల చొప్పున పరిహారం ప్రకటించింది. కేఎస్‌సీఏ కూడా రూ. 5 లక్షలు పరిహారం ఇస్తామంది. తాజాగా బెంగళూరు ఫ్రాంచైజీ యాజమాన్యం ఆర్‌సీబీ కూడా ఒక్కో మృతుడి కుటుంబానికి రూ. 10 లక్షలు పరిహారంగా అందజేస్తామని తెలిపింది.

దిగ్గజాల దిగ్భ్రాంతి

సంబరాల కంటే ప్రాణాలే ముఖ్యమని దిగ్గజ క్రికెటర్ కపిల్ దేవ్ అన్నారు. 'ఈ ఘటన నన్ను తీవ్రంగా బాధించింది. ఇకనైనా మనం పాఠాలు నేర్వాలి. మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తగా వ్యవహరించాలి. పొరపాట్లు జరగడం సహజమై ఉండొచ్చు... కానీ ఆ పొరపాట్లకు ప్రాణాలే మూల్యంగా చెల్లించుకోవడం అత్యంత విచారకరం. భవిష్యత్తులో ఏ జట్టయినా సరే టైటిల్ సాధిస్తే హుందాగా నడుచుకోవాలి. మితిమీరిన సంబరాలు, వేడుకల కంటే కూడా ప్రాణాలే విలువైనవని గుర్తుంచుకోవాలి' అని కపిల్ విచారం వెలిబుచ్చారు. సామాజిక సైట్ 'ఎక్స్'లో సచిన్ టెండూల్కర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశాడు. తొక్కిసలాట నన్ను నిర్ఘాంతపరిచిందని, బాధిత కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నానని పోస్ట్ చేశాడు. గతంలో ఆర్‌సీబీకి ప్రాతినిధ్యం వహించిన దక్షిణాఫ్రికా మాజీ క్రికెటర్ డివిలియర్స్ విషాదకర ఘటనపై విచారం వెలిబుచ్చాడు. బెంగళూరుకు చెందిన మాజీ భారత కెప్టెన్ అనిల్ కుంబ్లే క్రికెట్‌కు ఇదొక దుర్దినం అని అన్నారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపిన కుంబ్లే క్షతగాత్రులు వేగంగా కోలుకోవాలని అన్నారు. భారత హెడ్ కోచ్ గంభీర్ తాను ఇలాంటి రోడ్ షో విజయోత్సవాలకు వ్యతిరేకమని అన్నారు. ప్రతి ఒక్కరు బాధ్యతగా ఉండాలని సూచించారు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో



బుమ్రా ఆడే మూడు టెస్టులేవి?

స్పష్టత ఇవ్వని కోచ్ గంభీర్ • ఇంగ్లండ్ పర్యటనకు టీమిండియా

ముంబై: భారత స్పీడ్‌స్టర్ జస్‌ప్రీత్ బుమ్రా స్థానాన్ని భర్తీ చేయడం క్లిష్టమైనప్పటికీ బౌలింగ్ దళంలో నైపుణ్యమున్న బౌలర్లు అందుబాటులో ఉన్నారని టీమిండియా హెడ్‌కోచ్ గౌతమ్ గంభీర్ అన్నాడు. ఇంగ్లండ్ పర్యటనకు బయలుదేరేముందు కొత్త కెప్టెన్ శుబ్‌మన్ గిల్‌తో కలిసి అతను మీడియా సమావేశంలో పాల్గొన్నాడు. ఈ సందర్భంగా మొత్తం ఐదు టెస్టుల్లో బుమ్రా ఆడబోయే మూడు టెస్టులు ఏవనే విషయాన్ని కోచ్ వెల్లడించలేదు. 'ఐదు టెస్టుల్లో బుమ్రా ఏ ఏ టెస్టులు ఆడతాడనే నిర్ణయానికి ఇంకా రాలేదు. కాబట్టి ఆడే మూడు మ్యాచ్‌లు ఏవో ఇప్పుడే స్పష్టత ఇవ్వలేను. జట్టులో అతనొక అసాధారణ బౌలర్. అతని స్థానాన్ని భర్తీ చేయడం అంత సులభం కాదు. ఈ విషయాన్ని ఇంతకుముందే చాంపియన్స్ ట్రోఫీ సమయంలోనే చెప్పాను. అయితే ఈ సదవకాశాన్ని నైపుణ్యమున్న బౌలర్లు అందిపుచ్చుకోవాలి. ప్రస్తుతం జట్టులో ప్రతిభావంతులైన పేసర్లకు కొదవలేదు' అని అన్నాడు. రెగ్యులర్ కెప్టెన్ రోహిత్ శర్మతో పాటు కోహ్లి టెస్టులకు గుడ్‌బై చెప్పడంతో కొత్తగా సారథ్యం చేపట్టిన శుబ్‌మన్ గిల్ కూడా బౌలింగ్ అటాక్‌కు వచ్చిన ఇబ్బందేమీ లేదన్నాడు. బుమ్రా పేస్ భారం తగ్గించే బౌలర్లు చాలా మంది ఉన్నారని చెప్పాడు. ఒకవేళ ఈ వెటరన్ బౌలర్ ఆడితే అది జట్టుకు మరింత బలమవుతుందని అన్నాడు. టెస్టు సిరీస్ మొదలయ్యాక ఏ మ్యాచ్‌లకు అతను అందుబాటులో ఉంటాడో తెలుసుకున్నాకే అతను ఆడే మూడు మ్యాచ్‌లపై నిర్ణయం తీసుకుంటామని గిల్ చెప్పాడు. శుక్రవారం తెల్లారేలోపే భారత జట్టు ఇంగ్లండ్‌కు బయలుదేరుతుంది. పూర్తిస్థాయి పర్యటనలో శుబ్‌మన్ గిల్ సారథ్యంలోని టీమిండియా ఐదు టెస్టుల ద్వైపాక్షిక సిరీస్‌లో పోటీ పడుతుంది. ఈ నెల 20 నుంచి లీడ్స్‌లో ఇరు జట్ల మధ్య తొలి టెస్టుతో సిరీస్ మొదలవుతుంది. దీనికంటే ముందు భారత జట్టు... 'ఎ' జట్టుతో నాలుగు రోజుల వార్మప్ మ్యాచ్ ఆడుతుంది. ఇంగ్లండ్‌లో ఉన్న భారత్ 'ఎ' జట్టు ఇంగ్లండ్ లయన్స్‌తో అనధికారిక టెస్టులు ఆడుతోంది.

'అండర్సన్-టెండూల్కర్' ట్రోఫీ

భారత్, ఇంగ్లండ్ టెస్టు సిరీస్‌కు నామకరణం

న్యూఢిల్లీ: భారత్, ఇంగ్లండ్ మధ్య జరిగే టెస్టు సిరీస్‌కు 'అండర్సన్-టెండూల్కర్' ట్రోఫీగా నామకరణం చేశారు. ఆటకు వన్నె తెచ్చిన ఆటగాళ్ల పేర్లను సిరీస్‌లకు పెట్టడం పరిపాటి కాగా... ఇకపై టీమిండియా, ఇంగ్లండ్ మధ్య జరిగే సిరీస్‌ను ఈ పేరుతోనే కొనసాగించాలని బీసీసీఐ, ఈసీబీ సమష్టిగా నిర్ణయించాయి. ఈ నెల 20 నుంచి భారత్, ఇంగ్లండ్ మధ్య ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ ప్రారంభం కానుండగా... దీంతోనే 2025–27 ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) చక్రం మొదలవుతుంది. తొలి టెస్టు ప్రారంభానికి ముందు ఈ ఇద్దరు దిగ్గజాలు ట్రోఫీని ఆవిష్కరించనున్నట్లు సమాచారం. క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ టీమిండియా తరఫున 200 టెస్టు మ్యాచ్‌లు ఆడి 15,921 పరుగులతో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. మరోవైపు టెస్టు క్రికెట్ చరిత్రలో అత్యధిక వికెట్లు (704) తీసిన పేస్ బౌలర్ అండర్సన్ 188 మ్యాచ్‌ల్లో ఇంగ్లండ్‌కు ప్రాతినిధ్యం వహించాడు. ప్రస్తుతం భారత్, ఇంగ్లండ్ మధ్య ఇంగ్లండ్‌లో జరిగే సిరీస్‌ను పటౌడీ ట్రోఫీగా, భారత్‌లో జరిగే సిరీస్‌ను ఆంటోనీ డి మెల్లో ట్రోఫీగా అభివర్ణిస్తున్నారు. ఇక మీద ఇంటా బయట ఎక్కడ సిరీస్ జరిగినా దాన్ని 'అండర్సన్-టెండూల్కర్' ట్రోఫీగానే పిలవనున్నారు. భారత్, ఆస్ట్రేలియా మధ్య సిరీస్‌లను ఇదే మాదిరిగా 'బోర్డర్-గావస్కర్ ట్రోఫీ'గా అభివర్ణిస్తున్న విషయం తెలిసిందే.

కేన్సర్‌ను అరికట్టే ఔషధాహారం!

సాక్షి, సాగుబడి: భవిష్యత్తులో కేన్సర్ చికిత్సలో భాగంగా వైద్యులు కొన్ని రకాల బియ్యం లేదా బియ్యం తవుడుతో చేసే ఆహారాన్ని సూచించవచ్చు. అవి తింటే కేన్సర్ రాకపోవచ్చు, వచ్చినా తగ్గిపోవచ్చు. అంటే చాలా తక్కువ ఖర్చుతోనే కేన్సర్‌ను అరికట్టేయవచ్చు. ఆశ్చర్యంగా అనిపిస్తున్న దీన్ని సుసాధ్యం చేస్తోంది ఫిలిప్పీన్స్‌లోని అంతర్జాతీయ వరి పరిశోధనా సంస్థ (ఇరి). 3 రకాల ఊదా, ఎరుపు రంగు వరి బియ్యంపై పొర(తవుడు)లో కేన్సర్లను అరికట్టే ఔషధ పదార్థాన్ని వెలికితీసి, ఔషధాహారాన్ని విజయవంతంగా రూపొందించారు అక్కడి శాస్త్రవేత్తలు. కొలొరెక్టల్ కేన్సర్ (పెద్దపేగు+గుదద్వారం కేన్సర్), రొమ్ము కేన్సర్లను అరికట్టడానికి ఈ ఫుడ్ సప్లిమెంట్ దోహదపడుతుంది. కేన్సర్ కణాలపై దీని పనితీరును 'ఇరి' ప్రయోగశాలలో పరీక్షించి అద్భుత ఫలితాలు సాధించారు. ఈ ప్రతిష్టాత్మక పరిశోధనకు సారథ్యం వహిస్తున్న 'ఇరి' ప్రధాన శాస్త్రవేత్త, తెలుగువారైన డాక్టర్ నెసె శ్రీనివాసులు ఈ విశేషాలను టెలిఫోన్ ఇంటర్వ్యూలో 'సాక్షి'కి వెల్లడించారు.

ప్రపంచవ్యాప్తంగా ప్రజలకు పెనుముప్పుగా పరిణమించిన కేన్సర్ మహమ్మారికి ముకుతాడు వేసే అద్భుత 'ఔషధాహారం' అందుబాటులోకి రానుంది. పురాతన వరి వంగడాల్లో కేన్సర్లను అరికట్టే అద్భుత ఔషధ గుణాలున్నట్లు ఫిలిప్పీన్స్‌లోని అంతర్జాతీయ వరి పరిశోధనా సంస్థ (ఇరి) శాస్త్రవేత్తలు తాజా పరిశోధనల్లో కనుగొన్నారు. ఈ పరిశోధనలో కీలక పాత్ర పోషించింది **ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ నెసె శ్రీనివాసులు.** ప్రస్తుతం ఈయన ఇరిలో కంజ్యూమర్ డ్రివెన్ గ్రెయిన్ క్వాలిటీ – న్యూట్రిషన్ సెంటర్ అధిపతిగా ఉన్నారు. ఈయన తల్లిది అనంతపురం. ఈయన పెరిగింది కర్ణాటకలో.



3 రకాల పురాతన వరి రకాలతో..

ప్రపంచవ్యాప్తంగా 1,32,000 పురాతన వరి వంగడాలున్నాయి. వీటిలో చాలా వరకు తెల్లబియ్యం రకాలే. రకరకాల రంగుల బియ్యం రకాలు 800. వీటిలో పోషకాలపై జరిపిన పరిశోధనల్లో 6 రకాల్లో యాంటీఆక్సిడెంట్లు, యాంటీ కేన్సర్ ఔషధ గుణాలు పుష్కలంగా ఉన్నట్లు 'ఇరి' గుర్తించింది. ప్రస్తుత పరిశోధనలో 3 రకాలను శాస్త్రవేత్తలు వాడారు. ఫిలిప్పీన్స్‌కు చెందిన ఎరుపు, ఊదా కలసిన రంగు గల 'బాలాటినో' రకం బియ్యం, 'కింటుమాన్' అనే ఎర్ర బియ్యంతో పాటు ఇండోనేసియాకు చెందిన ఎరుపు, ఊదా కలసిన రంగుండే కేతన్ హితం' అనే పురాతన రకాలను వాడారు. ఈ బియ్యపు తవుడులోని ఔషధ విలువలున్న పదార్థాన్ని ఉపయోగించి కేన్సర్‌ను అరికట్టే ఫుడ్ సప్లిమెంట్‌ను తయారు చేశారు. ఇది పొడి లేదా ద్రవ రూపంలో ప్రజలకు అందుబాటులోకి తెచ్చే అవకాశం ఉంది.



కేతన్ హితం | కింటుమాన్ | బాలాటినో

ఫిలిప్పీన్స్‌లోని అంతర్జాతీయ వరి పరిశోధనా సంస్థ ఆవిష్కరణ

- 3 వరి రకాల్లో యాంటీ కేన్సర్ ఔషధ గుణాల గుర్తింపు
- ఈ బియ్యం తవుడుతో చేసే ఆహారమే ఔషధం
- 'కేన్సర్ నిరోధక సాంబమసూరి' రూపకల్పనకు పరిశోధనలు
- భవిష్యత్తులో తక్కువ ఖర్చుతోనే కేన్సర్‌కు చికిత్స

'సాక్షి'తో 'ఇరి' పరిశోధకులు డా. నెసె శ్రీనివాసులు

ఒక్క గ్రాము చాలు!

300 గ్రాముల బియ్యం నుంచి తీసిన తవుడుతో 1 కిలో ఫుడ్ సప్లిమెంట్‌ను ఉత్పత్తి చేయవచ్చు. కేన్సర్ నిరోధక లక్షణాన్ని మనిషి దేహంలో కలిగించడానికి కనీసం 1 గ్రాము సరిపోతుందని డా.శ్రీనివాసులు తెలిపారు. కేన్సర్ రోగుల కణాలపై ప్రయోగశాలలో ఈ ఔషధాహారంతో నిర్వహించిన పరీక్షల్లో అద్భుత ఫలితాలు వచ్చాయి. ఈ రెండు రకాల కేన్సర్ రోగులకు ఇస్తున్న కీమోథెరపీ ఔషధం 'డోక్సోరుబిసిన్'తో సరిసమానమైన ఫలితాలను.. ఈ ఫుడ్ సప్లిమెంట్ ఇస్తున్నట్లు ఆయన చెప్పారు. త్వరలో దీన్ని ఎలుకలపైన, ఆ తర్వాత కేన్సర్ రోగులపైన ప్రయోగించబోతున్నామని వెల్లడించారు.



సాంబమసూరిలోకి ఈ జన్యువులు

ఈ 3 రకాల పురాతన వరి వంగడాల్లోని కేన్సర్ నిరోధక ఔషధ గుణాలకు కారణమైన జన్యువులు ఏవో గుర్తించేందుకు 'ఇరి'లో పరిశోధన కొనసాగుతోంది. 'ఈ పరిశోధన పూర్తయ్యాక అధిక దిగుబడినిచ్చే మన సాంబమసూరి వరి వంగడంలోకి ఈ ఔషధ గుణాలున్న జన్యువులను జన్యు సవరణ ప్రక్రియ ద్వారా జోడిస్తాం. ఆ సరికొత్త సాంబమసూరి ముడి బియ్యాన్ని అన్నంగా వండుకొని తినొచ్చు. ఫుడ్ సప్లిమెంట్ తింటే వంద శాతం ఫలితం ఉంటుంది. వండిన అన్నం తింటే.. అందులోని కేన్సర్ నిరోధక ఔషధ గుణం 70% వరకు వంటపడుతుంది. కేన్సర్ కణాలు క్రమంగా కోలుకొని సాధారణ స్థితికి వస్తాయి. ఆరోగ్యంగా ఉన్న కణాలకు ఎలాంటి హానీ జరగదని కూడా మా ప్రయోగశాలలో రూఢీ అయ్యింది. ఇది స్వల్ప ఖర్చుతో కేన్సర్‌ను అరికట్టే మార్గంగా ప్రపంచం ముందుకు వస్తోంది' అని డా. శ్రీనివాసులు వివరించారు.

క్లుప్తంగా...

మొక్కల పెంపకానికి అందరూ నడుం బిగించాలి

- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పిలుపు



సాక్షి, న్యూఢిల్లీ : కాలుష్య కారకాలను తగ్గించుకుంటూనే చెట్ల పెంపకానికి అందరూ నడుం బిగించాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో గురువారం కిషన్‌రెడ్డి మొక్కలు నాటారు. ఖమ్మం జిల్లాలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకొని, ఈ ఏడాది పదోతరగతి ఫలితాల్లో టాపర్లుగా నిలిచిన పలువురు విద్యార్థులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పర్యావరణాన్ని కాపాడుతూ క్షేత్రస్థాయిలో ఎంతోమంది పుడమితల్లికి సేవ చేస్తున్నారని, వారందరి నుంచి మనమంతా స్ఫూర్తి పొందాలని చెప్పారు.

తల్లి పేరుతో ఒక మొక్క నాటాలి : బండి సంజయ్



వాతావరణ మార్పులపై పోరాటానికి, భవిష్యత్ తరాల పరిరక్షణకు మొక్కలు నాటడమే శరణ్యమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. అందులో భాగంగా భారతీయ పౌరులందరూ తమ తల్లి పేరుతో ఒక్కో మొక్కను నాటి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని కోరారు. బండి కూడా తన అధికార నివాసంలో మొక్కలు నాటారు.

లక్ష్యానికి మించి..

రికార్డు స్థాయిలో యాసంగి ధాన్యం కొనుగోళ్లు

- 70.13 లక్షల టన్నులకుగాను 71.39 లక్షల టన్నుల ధాన్యం సేకరించిన రాష్ట్ర ప్రభుత్వం
- ఇంకా కొనుగోలు కేంద్రాల్లో లక్షకుపైగా టన్నుల ధాన్యం
- కొనుగోలు చేసిన ధాన్యంలో 22.20 లక్షల టన్నుల మేర సన్నాలు
- 12.08 లక్షల మంది రైతుల నుంచి రూ. 16,547 కోట్ల విలువైన ధాన్యం సేకరణ
- ఇప్పటివరకు రైతుల ఖాతాల్లో రూ. 14,740 కోట్లు జమ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో యాసంగి సీజన్‌లో రాష్ట్ర ప్రభుత్వం రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు చేసింది. పంట దిగుబడి పెరిగిన నేపథ్యంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా లక్ష్యానికి మించి పౌరసరఫరాల సంస్థ ధాన్యం కొన్నది. పెరిగిన వరి పంట విస్తీర్ణం నేపథ్యంలో యాసంగిలో 70.13 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా గురువారం నాటికి ఏకంగా 71.39 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించారు. మరో 3–4 కొనుగోలు కేంద్రాల్లో లక్షకుపైగా మెట్రిక్ టన్నుల ధాన్యం కాంటా కావడానికి సిద్ధంగా ఉంది. ఈ లెక్కన కొనుగోళ్ల ప్రక్రియ ముగిసేలోగా మరో 2 లక్షల మెట్రిక్ టన్నుల వరకు వచ్చే అవకాశం ఉందని పౌరసరఫరాల సంస్థ తెలిపింది. గతేడాది యాసంగి సీజన్‌తో పోలిస్తే ఈ సీజన్‌లో సుమారు 25 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యాన్ని అధికంగా సేకరించే అవకాశం ఉంది.

సన్నధాన్యం 22.20 ఎల్ఎంటీ

రాష్ట్రంలో ఇప్పటివరకు కొనుగోలు చేసిన 71.39 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యంలో సన్నరకం ధాన్యం 22.20 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే. సన్న ధాన్యానికి క్వింటాల్‌కు రూ. 500 చొప్పున ప్రోత్సాహక బోనస్ ఇస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంతో గత వానాకాలం సీజన్ నుంచే సన్నాల సాగు పెరిగింది. ఎన్నడూ లేనివిధంగా యాసంగిలో భారీ ఎత్తున సన్నాల సాగు జరిగింది. అయితే నిజామాబాద్, నల్లగొండ, కామారెడ్డి, సూర్యాపేట, పెద్దపల్లి, సిద్దిపేట, జగిత్యాల తదితర జిల్లాల్లో పండించిన సన్నాలను ప్రైవేటు వ్యాపారులు, మిల్లర్లు ప్రభుత్వం ఇచ్చే బోనస్ ధరను కూడా ఇచ్చి పెద్ద ఎత్తున కొనడంతో పౌరసరఫరాల శాఖ ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు సన్న వడ్లు రాలేదు. కనీసం 30 లక్షల మెట్రిక్ టన్నుల వరకు సన్న ధాన్యం సేకరించే అవకాశం ఉందని అధికారులు అంచనా వేయగా ఈ సీజన్ పూర్తయ్యేలోగా 23 లక్షల మెట్రిక్ టన్నుల వరకు వచ్చే అవకాశం ఉంది.

12.08 లక్షల రైతుల నుంచి..

రాష్ట్రంలో కొనుగోలు చేసిన 71.39 లక్షల ధాన్యాన్ని 12.09 రైతుల నుంచి సేకరించారు. ఇందులో దొడ్డు రకం ధాన్యం 49.20 మెట్రిక్ టన్నులను 8.42 లక్షల మంది రైతుల నుంచి సేకరించారు. 22.20 లక్షల మెట్రిక్ టన్నుల సన్న రకం ధాన్యాన్ని 3.66 లక్షల మంది రైతుల నుంచి కొన్నారు. ఈ మొత్తం ధాన్యం విలువ రూ. 16,547 కోట్లు కాగా, ఇప్పటివరకు రూ. 14,740 కోట్లను ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేసింది. మరో 1,807 కోట్లు రైతులకు చెల్లించాల్సి ఉంది.

నిజామాబాద్ ఫస్ట్.. ఆదిలాబాద్ లాస్ట్

యాసంగి ధాన్యం సేకరణలో ఎప్పటిలాగే నిజామాబాద్ మొదటి స్థానంలో నిలిచింది. ఈ జిల్లా నుంచి రూ. 1,870 కోట్ల విలువైన 8.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని పౌరసరఫరాల శాఖ సేకరించింది. 5.96 లక్షల మెట్రిక్ టన్నులతో రెండో స్థానంలో నల్లగొండ జిల్లా నిలవగా 4.61 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యంతో జగిత్యాల మూడో స్థానంలో ఉంది. అతితక్కువగా ఆదిలాబాద్ జిల్లాలో 144 మంది రైతుల నుంచి 645 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే సేకరించారు. సాగునీరు లేకపోవడంతోపాటు కూరగాయలు, ఇతర ఉద్యానవన పంటల సాగు ఆదిలాబాద్‌లో ఎక్కువ వల్ల వరి పండించే రైతులు తక్కువ.

యాసంగి ధాన్యం సేకరణ వివరాలు...

కొనుగోలు కేంద్రాల ఏర్పాటు	: 8,378
కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యం	: 72.45 లక్షల మెట్రిక్ టన్నులు
మొత్తం కొనుగోలు చేసిన ధాన్యం	: 71.39 ఎల్ఎంటీ
ఇందులో దొడ్డు రకం	: 49.19 ఎల్ఎంటీ
సన్నరకం ధాన్యం	: 22.20 ఎల్ఎంటీ
ధాన్యం విక్రయించిన రైతులు	: 12,08,845
దొడ్డు రకం	: 8,42,353
సన్న రకం	: 3,66,491
కొనుగోలు చేసిన ధాన్యం విలువ	: రూ. 16,546.68 కోట్లు
రైతులకు చెల్లించిన మొత్తం	: రూ. 14,739.69 కోట్లు
మిల్లులకు చేరిన ధాన్యం	: 70.62 ఎల్ఎంటీ
గోడౌన్‌లలో నిల్వ చేసిన ధాన్యం	: 0.48 ఎల్ఎంటీ
కొనుగోలు కేంద్రాల నుంచి తరలించాల్సిన ధాన్యం	: 0.29 ఎల్ఎంటీ
కాంటాకు సిద్ధంగా ఉన్న ధాన్యం	: 1.06 ఎల్ఎంటీ



బోనస్.. మైనస్



ఈ ఫొటోలోని రైతు పేరు కట్కూరి జయపాల్‌రెడ్డి. హనుమకొండ జిల్లా కమలాపూర్‌కు చెందిన ఆయన ఏడెకరాల్లో సన్న, దొడ్డు రకం వరి సాగు చేశాడు. రెండున్నర ఎకరాల్లో 57 క్వింటాళ్ల వడ్లు రాగా కొనుగోలు కేంద్రంలో నెల క్రితం విక్రయించాడు. ఆన్‌లైన్ ప్రొక్యూ రిమెంట్ మేనేజ్‌మెంట్ సిస్టం (ఓపీఎంఎస్) ద్వారా డబ్బులు ఖాతాలో పడ్డాయి. అయితే ప్రభుత్వం సన్న వడ్లకు ఇస్తామన్న క్వింటాకు రూ. 500 బోనస్ మాత్రం ఇప్పటివరకు పడలేదు. వానాకాలం పనులు మొదలవడంతో ప్రభుత్వం తన బోనస్ డబ్బు రూ. 28,500 ఇస్తే పంట పెట్టుబడులకు పనికొస్తాయని జయపాల్‌రెడ్డి అంటున్నాడు.

- యాసంగి రైతుల ఖాతాల్లోకి చేరని బోనస్
- 3.66 లక్షల మందికి రూ. 1,110.19 కోట్లు పెండింగ్
- బోనస్ కోసం అన్నదాతల ఎదురుచూపులు

సాక్షి ప్రతినిధి, వరంగల్: రాష్ట్రవ్యాప్తంగా సన్నరకం ధాన్యం విక్రయించిన రైతులకు ఇంకా బోనస్ పైకం చేరలేదు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే ప్రభుత్వం మద్దతు ధరతోపాటు అదనంగా క్వింటాకు రూ. 500 బోనస్ సొమ్మును రైతుల ఖాతాల్లో జమ చేయాల్సి ఉంది. దీనిపై అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటించారు. కానీ నెలన్నరగా యాసంగి ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్నా రాష్ట్రవ్యాప్తంగా ఏ ఒక్క రైతుకూ ప్రభుత్వం సన్నాల బోనస్ ఇవ్వలేదు. ఎప్పుడిస్తారో కూడా స్పష్టత లేకపోవడంతో రైతులు ఎదురు చూస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 3,66,491 మంది రైతుల నుంచి 22.20 లక్షల మెట్రిక్ టన్నుల సన్నరకం ధాన్యం సేకరించిన ప్రభుత్వం బోనస్ కింద రూ. 1110.19 కోట్లు చెల్లించాల్సి ఉంది. సన్నరకం ధాన్యం విక్రయించిన రైతుల వివరాలు ఎప్పటికప్పుడు పంపిస్తున్నామని, ప్రభుత్వం నుంచి డబ్బులు విడుదల కాగానే రైతుల ఖాతాల్లో పడేలా ఏర్పాట్లు చేశామని ఉమ్మడి వరంగల్‌కు చెందిన ఓ జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి 'సాక్షి'కి తెలిపారు.





బోనస్ డబ్బులు పడలేదు..

నాకు నాలుగు ఎకరాల పొలం ఉంది. ఎకరంన్నరలో సన్న వడ్లు, మూడు ఎకరాల్లో దొడ్డు ధాన్యం సాగు చేశా. సన్నాల దిగుబడి 24 క్వింటాళ్లు వచ్చింది. తినేందుకు 12 క్వింటాళ్లు నిల్వ చేసుకున్నాం. వానాకాలం పెట్టుబడి కోసం మిగిలిన 12 క్వింటాళ్ల సన్నధాన్యాన్ని 20 రోజుల క్రితం ఐకేపీ సెంటర్‌లో విక్రయించా. రూ. 500 చొప్పున బోనస్ పడలేదు. ఈ పైసలు వస్తే పెట్టుబడికి ఎవరినీ అడగకుండా ఉంటది.

– నీల సంపత్, అబ్దుల్‌నాగారం, తరిగొప్పుల మండలం, జనగామ జిల్లా

'ప్రకృతి పరిరక్షణకు కట్టుబడ్డాం'



సాక్షి, హైదరాబాద్: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా.. ప్రకృతి పరిరక్షణపై అవగాహన పెంచుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రకృతిని అర్థం చేసుకోవడం, దాని నియమాలు, పరిమితులను గౌరవించడం మనందరి బాధ్యతని ఆయన పేర్కొన్నారు. వ్యక్తిగతంగా, సమూహంగా, ప్రభుత్వ స్థాయిలో జీవన విధానంలో స్థిరత్వం కల్పించే దిశగా ముందడుగు వేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం తరఫున ప్రకృతి పరిరక్షణకు పూర్తిస్థాయిలో కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. దీనిలో భాగంగా సంరక్షణ, పునరుజ్జీవనం, పునర్వినియోగం, పునరావృతం వంటి చర్యలను క్రమబద్ధంగా అమలు చేస్తున్నామని వివరించారు. తెలంగాణను భూమిపై అత్యంత హరిత రాష్ట్రంగా, శుద్ధమైన వాతావరణంతో మెరిసే ప్రాంతంగా తీర్చిదిద్దడంలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములవ్వాలని.. 'ఎక్స్'వేదికగా సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

పర్యావరణ పరిరక్షణతోనే మానవాళి మనుగడ

వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్



సాక్షి, అమరావతి: పర్యావరణ పరిరక్షణతోనే మానవాళి మనుగడ ఇమిడి ఉందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఓ సందేశం పోస్ట్ చేశారు. 'ఈ భూ మండలాన్ని ప్లాస్టిక్ భూతం కమ్మేస్తోంది. ప్లాస్టిక్‌ను నిరోధించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవాలంటూ ప్రపంచ పర్యావరణ దినోత్సవం రోజున ఐక్య రాజ్య సమితి ఇచ్చిన సందేశం అత్యంత ప్రధానం. పర్యావరణ పరిరక్షణతోనే మానవాళి మనుగడ ఇమిడి ఉందనేది అక్షర సత్యం. దీనికి మనమంతా బద్ధులై ఉండాలని ఆశిస్తున్నా' అని ఆ పోస్ట్‌లో పేర్కొన్నారు.



రైతు వేషధారణలో బ్యాంకు వద్ద రైతులతో ముచ్చటిస్తున్న పోలీసు అధికారి (మధ్యలో ఉన్న వ్యక్తి)


వేషం మార్చి.. మోసం గుట్టు విప్పి..

- రైతులను మోసం చేస్తున్న దళారులపై పోలీసుల నిఘా
- రైతుల వేషంలో బ్యాంకుల వద్దకు వెళ్లి వివరాల సేకరణ
- ఆదిలాబాద్ జిల్లాలో పోలీసుల ఆపరేషన్

సాక్షి, ఆదిలాబాద్: బ్యాంకుల్లో పంటరుణాలు ఇప్పించేందుకు కమీషన్ వసూలు చేస్తున్న దళారుల దందాను ఆదిలాబాద్ జిల్లా పోలీసులు తెలివిగా బట్టబయలు చేశారు. కమీషన్ దందాపై ఫిర్యాదులు రావటంతో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు పలు బ్యాంకుల వద్దకు పోలీస్ ఉన్నతాధికారులే రైతుల వేషంలో వెళ్లి ఆరా తీశారు. రుణాల కోసం వచ్చిన రైతులతో మాట కలిపి దళారుల దోపిడీ గురించి వివరాలు సేకరించారు.

రుణాన్ని బట్టి కమీషన్: వ్యవసాయ సీజన్‌లో ఏటా రైతులకు బ్యాంకులు పంట రుణం ఇస్తుంటాయి. తర్వాతి పంట సీజన్‌లో పాత అప్పునకు సంబంధించి వడ్డీతో సహా చెల్లిస్తే కొత్త రుణాన్ని కొంత పెంచి ఇస్తాయి. ఇక్కడే దళారులు రంగప్రవేశం చేశారు. రైతులు తీసుకున్న రుణాలను వారే వడ్డీతో సహా బ్యాంకులో చెల్లించి, తిరిగి రైతులకు అధిక రుణం వచ్చేలా చేస్తున్నారు. ఆ వచ్చే రుణం నుంచి తాము కట్టిన రుణం మొత్తంతోపాటు అదనంగా రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు కమీషన్ తీసుకుంటున్నారు. ఈ అంశంపై ఫిర్యాదులు రావటంతో పోలీసులు బుధవారం రైతుల వేషంలో బ్యాంకుల వద్దకు వెళ్లి సమాచారం సేకరించారు. గుడిహత్నూర్, ఉట్నూర్, నార్నూర్, బేల, భీంపూర్, మావల, ఇంద్రవెల్లి మండలాల్లో ఇలాంటి దళారులు 34 మందిపై ఆయా పోలీసుస్టేషన్లలో బీఎన్ఎస్ సెక్షన్ 318 కింద చీటింగ్ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

దొరికిన ఉద్యోగం చేసుకోవడమే!



నేటి యువతకు లభించని మెరుగైన ఉద్యోగావకాశాలు

- ఇప్పటికీ వ్యవసాయం వైపే అధిక గ్రామీణ యువత
- 29 ఏళ్ల వయస్కుల్లో 78% మంది చేస్తున్నవి నాణ్యతలేని ఉద్యోగాలే
- చదువు నుంచి ఉపాధి వైపు ఆలస్యం అవుతున్న అడుగులు
- ఉద్యోగాల్లో కొనసాగుతున్న లింగ వివక్ష

యంగ్ లైవ్స్ సర్వే రౌండ్–7 నివేదికలో వెల్లడి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ యువతలో విద్యపట్ల ఆసక్తి పెరుగుతున్నప్పటికీ నాణ్యమైన ఉద్యోగాలు సమస్యగా మారాయి. హైదరాబాద్ వంటి నగరాల్లోని పేరొందిన కళాశాలల్లో చదివినప్పటికీ కొందరికే నాణ్యమైన, పైస్థాయి ఉద్యోగాలు లభిస్తున్నాయి. క్యాంపస్ కొలువుల పేరుతో చిన్న, పెద్ద కంపెనీలు ఇచ్చే అరకొర వేతనాలకే రాష్ట్రంలో యువతరం ఉద్యోగాలు చేస్తున్నట్లు తాజా సర్వేలో తేలింది. యువత జీవితాలు, ఉపాధి, కుటుంబ జీవనంపై యంగ్ లైవ్స్ సర్వే రౌండ్–7 (2023–24) నివేదిక ముఖ్యమైన అంశాలను వెలుగులోకి తెచ్చింది. తెలంగాణలో 2023 ఆగస్టు నుంచి 2024 జనవరి మధ్య 22 ఏళ్ల వయస్కులు, 29 ఏళ్ల వయస్కుల విద్య, ఉపాధి, కుటుంబ జీవనంలోని మార్పులను నివేదిక విశ్లేషించింది. ఈ నివేదిక ప్రకారం తెలంగాణలో బాల్య వివాహాల్లో తగ్గుదల కనిపించినప్పటికీ ఉపాధి నాణ్యత, లింగ అసమానతలు, చెల్లింపుల్లేని గృహపనుల భారం మహిళలను ఎక్కువగా ప్రభావితం చేస్తున్నాయి. ఈ సవాళ్లను అధిగమించి సమాన ఉపాధి అవకాశాలు, మెరుగైన విద్య, సామాజిక భద్రత కల్పన ద్వారా లింగ సమానత్వం, మంచి ఉద్యోగాల లక్ష్యాలను సాధించడంపై యువత దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని నివేదిక సూచిస్తోంది.

విద్య నుంచి ఉపాధి వైపు..

ఈ సర్వే ప్రకారం 22 ఏళ్ల వయస్కుల్లో విద్య నుంచి ఉపాధి వైపు పరివర్తన ఆలస్యంగా జరుగుతున్నట్లు తేలింది. 2023లో 53% మంది 22 ఏళ్ల వారు పూర్తి సమయం పనిచేస్తుండగా 2016లో అదే వయసు వారు 62% మంది పనిచేశారు. అదేవిధంగా 20% మంది 22 ఏళ్ల వారు విద్య, ఉపాధి కలిపి చేస్తుండగా 29 ఏళ్ల వారిలో ఇది 12% మాత్రమే. ఈ ఆలస్యం విద్యపై పెరిగిన శ్రద్ధను సూచిస్తోంది. అయితే ఉపాధి అవకాశాల్లో సవాళ్లు పెరిగినట్లు సర్వేలో తేలింది.

నాణ్యత లేని ఉద్యోగాలు, లింగ వివక్ష

29 ఏళ్ల వయసు వారిలో 78% మంది నాణ్యతలేని ఉద్యోగాల్లో పనిచేస్తున్నారు. అంటే రాతపూర్వక ఒప్పందం లేని, ఎక్కువ గంటలు పని చేయాల్సిన ఉద్యోగాలు అన్నమాట. అలాగే ఉద్యోగాల్లో పురుషులు (96%) మహిళలు (60%) మధ్య లింగ వ్యత్యాసం స్పష్టంగా కనిపించింది. 22 ఏళ్ల వయసు వారిలో 10% మంది మాత్రమే రాతపూర్వక ఒప్పందాలు ఉన్న ఉద్యోగాలు చేస్తున్నారు. కానీ 40% మంది 48 గంటల కంటే ఎక్కువ పనిచేస్తున్నట్లు తేలింది. 22 ఏళ్ల పురుషులు సగటున 2.7 గంటలు ఎక్కువ పనిచేస్తుండగా మహిళలు 4.3 గంటలు ఎక్కువగా చెల్లింపులేని గృహ పనులకు సమయం కేటాయిస్తున్నారు. అలాగే 22 ఏళ్ల వయస్కులకు వ్యవసాయేతర రంగాల్లో ఉపాధి ఎక్కువగా లభిస్తున్నట్లు తేలింది. 2016 నాటికి 22 ఏళ్ల వయసులో ఉన్న వారు గ్రామీణ ప్రాంతాల్లోని 98 శాతం వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ ఉపాధి రంగాలవైపే దృష్టిసారించినట్లు సర్వే పేర్కొంది. అదే 2023లో 22 ఏళ్ల వయసువారు వ్యవసాయం, అనుబంధ రంగాలలో 64 శాతం మందే ఉన్నట్లు తేలింది.

బాల్య వివాహాలు తగ్గుదల: 2023లో 22 ఏళ్ల మహిళల్లో 16% మంది 18 ఏళ్ల లోపు వివాహం చేసుకోగా 2016లో ఇది 32 శాతంగా ఉండేది. 19 ఏళ్లలోపు తల్లులైన వారు 2023లో 22 ఉండగా 2016లో అది 29 శాతం ఉంది. అయితే తల్లి విద్యాస్థాయి తక్కువగా ఉన్నవారు, ఆర్థికంగా వెనుకబడిన వారిలో బాల్య వివాహాలు, మాతృత్వం ఎక్కువగా ఉన్నట్లు నివేదిక పేర్కొంది.

సెల్ బుక్ చేస్తే సబ్బులొచ్చాయ్



నల్లబెల్లి: ఆన్‌లైన్‌లో మోటొరోలా జీ85 5జీ మొబైల్ బుక్ చేసిన ఒక వ్యక్తికి రెండు త్రిబుల్ ఎక్స్ సబ్బులు వచ్చాయి. వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం బుచ్చిరెడ్డి పల్లిలో ఆలస్యంగా గురువారం వెలుగు చూసిన ఈ సంఘటనపై బాధితుడి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బానోత్ రాజేందర్ ఆన్‌లైన్‌లో మోటొరోలా జీ85 5జీ మొబైల్ ఫోన్ కోసం బుక్ చేశాడు. మంగళవారం డెలివరీ ఇవ్వాల్సి ఉండగా.. రెండు రోజులు ఆలస్యంగా వచ్చింది. రాజేందర్ అందుబాటులో లేకపోవడంతో ఆయన తండ్రి నర్సింహ డెలివరీ బాయ్‌కి రూ.16,068 చెల్లించి పార్శిల్ తీసుకున్నారు. పార్శిల్ తెరిచి చూస్తే.. త్రిబుల్ ఎక్స్ సబ్బులు కనిపించడంతో కంగుతినడం నర్సింహ వంతైంది. మోసం జరిగిందని వెంటనే డెలివరీ బాయ్‌కి చెప్పగా.. ఐటమ్ రిటర్న్ చేయమని సూచించి వెళ్లిపోయాడు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.



లింగంపేట మండలం రాంపూర్‌లో కుస్తీ పట్లు పడుతున్న బాలికలు



లింగంపేట మండలం రాంపూర్‌లో తలపడుతున్న మల్లయోధులు

కుస్తీ మే సవాల్!

- కుస్తీ పోటీలకు పెరుగుతున్న ఆదరణ
- పండుగల సందర్భంగా పలు గ్రామాల్లో నిర్వహణ
- పొరుగు రాష్ట్రాల నుంచి వస్తున్న మల్లయోధులు
- తిలకించేందుకు తరలి వస్తున్న జనం

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: చుట్టూ కేరింతలు కొడుతూ ఉత్సాహ పరిచే జనం.. ఎదురుగా ఉడుంపట్టు పట్టి పడగొట్టడానికి సిద్ధంగా ప్రత్యర్థి.. ఎత్తుకు పైఎత్తులు వేస్తూ గట్టి పట్టు పడితేనే వరించే విజయం.. ఆ గెలుపు ఇచ్చే కిక్కే వేరు.. నిర్వాహకులు అందజేసే బహుమతి కన్నా.. ఆ కిక్కు కోసమే మల్లయోధులు పోటీలకు తరలి వస్తుంటారు. పలువురు సరిహద్దులు దాటి వచ్చి తలపడతారు.

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో..

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో కుస్తీ పోటీలకు ఆదరణ పెరుగుతోంది. జుక్కల్, బాన్సువాడ, బోధన్, ఎల్లారెడ్డి నియోజకవర్గాలలోని పలు ప్రాంతాల్లో పండుగల సందర్భంగా కుస్తీ పోటీలు నిర్వహించడం ఆనవాయితీగా మారింది. ఉగాది, శివరాత్రి, హోలీ, శ్రీరామనవమి, హనుమాన్ జయంతి, దసరా, దీపావళి తదితర పండుగల సందర్భంగా కుస్తీ పోటీలు నిర్వహిస్తారు. ఆయా ప్రాంతాల్లోని గ్రామ దేవతల ఉత్సవాలైన అల్లమ ప్రభు జాతర, భేతాళ జయంతి, మత్తడి పోచమ్మ ఉత్సవాలు, ప్రభుస్వామి ఉత్సవాలు, పెద్దమ్మ, దుర్గమ్మ ఉత్సవాలలో కుస్తీ పోటీలు జరుగుతాయి. పోటీలకు ఇరు జిల్లాలకు చెందిన వారే కాకుండా.. పొరుగునున్న కర్ణాటక, మహారాష్ట్రల నుంచి కూడా మల్లయోధులు వస్తుంటారు. పోటీలకు వేలాది మంది హాజరై ఈలలు కొడుతూ ఉత్సాహపరుస్తుంటారు. విజేతలను అభినందిస్తూ ఊరేగిస్తారు. నిజాంసాగర్, పిట్లం, బిచ్కుంద, బాన్సువాడ, బీర్కూర్, నస్రుల్లాబాద్, కోటగిరి, చందూర్, బోధన్, వర్ని, జుక్కల్, ఎడపల్లి, పెద్దకొడప్‌గల్, ఎల్లారెడ్డి, లింగంపేట, గాంధారి తదితర మండలాల్లోని పలు గ్రామాల్లో కుస్తీ పోటీలు నిర్వహిస్తుంటారు. ఈ మధ్య కాలంలో పోటీల్లో ఆడపిల్లలు కూడా పాల్గొంటుండటం విశేషం. కొన్నిసార్లు ఆడపిల్లలు మగవారిని ఓడించి విజేతలుగా నిలుస్తున్నారు.

దశాబ్దాలుగా నిర్వహణ..

ఉమ్మడి జిల్లాలోని పలు గ్రామాల్లో తరతరాలుగా కుస్తీ పోటీలు జరుగుతున్నాయి. కొన్నిచోట్ల తాతలు, తర్వాతి కాలంలో తండ్రులు, ఇప్పుడు వారి కొడుకులు.. పోటీల్లో పాల్గొంటూ వారసత్వాన్ని కొనసాగిస్తుండటం విశేషం. తమది మల్లయోధుల కుటుంబం అంటూ గొప్పగా చెప్పుకొనేవారు చాలామంది ఉన్నారు. కామారెడ్డి జిల్లాలోని తిమ్మాపూర్, అడవి లింగాల, మత్తమాల, రుద్రారం, తిమ్మారెడ్డి, అల్మాజీపూర్, భిక్కనూరు, నస్రుల్లాబాద్, బొమ్మన్‌దేవ్‌పల్లి, సంగం, దుర్కి, నాచుపల్లి, మైలారం , మిర్జాపూర్, దామరంచ, కిష్టాపూర్, బీర్కూర్, దేశాయిపేట, నెమ్లి, లింగంపేట, బోనాల్, లింగంపల్లి కుర్దు, ముంబోజీపేట, జల్దిపల్లి, మెంగారం, బాణాపూర్, భవానీపేట, ఐలాపూర్, ఎక్కపల్లి, సజ్జన్‌పల్లి, కోర్పోల్, గౌరారం, గాంధారి, జుక్కల్, పోచారం, నిజామాబాద్ జిల్లాలోని పెగడాపల్లి, కందకుర్తి, సాలూర, బోధన్ పట్టణం, ఎరాజ్‌పల్లి, హందాపూర్, కల్దుర్కి, హున్సా, సాలంపాడ్, కుమ్మన్‌పల్లి, తాణాకలాన్, మంగళ్‌పాడ్, జాన్కంపేట్, జన్నెపల్లి, రెంజల్, కల్యాపూర్, దూపల్లి, కందకుర్తి, బోర్గాం, సాటాపూర్, కోటగిరి, అంబం, చిక్కడ్‌పల్లి, గోవూర్, చందూర్ తదితర గ్రామాల్లో పండుగల సందర్భంగా కుస్తీ పోటీలు నిర్వహిస్తున్నారు.

కొత్త తరం కూడా..

కొన్ని గ్రామాల్లో కొత్తతరం కూడా కుస్తీ పోటీలకు సిద్ధమవుతోంది. అప్పట్లో తమ తాతలు, తండ్రులు కుస్తీ పోటీల్లో పాల్గొనేవారని, వారి వారసత్వంగా తాము కూడా సై అంటూ చాలాచోట్ల కొత్త తరం పోటీల్లో పాల్గొంటోంది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో జరిగే కుస్తీ పోటీల్లో కొత్త తరం పాల్గొని సత్తా చాటుతోంది. పోటీలపై గ్రామీణ ప్రాంతాల్లో ఏటేటా ఆసక్తి పెరుగుతోంది.



లింగంపేట మండలం రాంపూర్‌లో తలపడుతున్న మల్లయోధులు



పిట్లం మండల కేంద్రంలో తలపడుతున్న మల్లయోధులు, పోటీలను వీక్షిస్తున్న జనం

డ్రైపోర్టు వస్తే గేమ్ ఛేంజరే..

- రైతులు ఎగుమతిదారులుగా మారాలంటే నిజామాబాద్‌లో ఏర్పాటు చేయాల్సిందే
- డ్రైపోర్టు ఏర్పాటు చేస్తే ఇక్కడి నుంచే నేరుగా అంతర్జాతీయ ఎగుమతులు
- నేరుగా పసుపు, మొక్కజొన్న, ఎర్రజొన్న, సోయా, బియ్యం, మామిడి, పత్తి, కూరగాయల ఎగుమతికి అవకాశం
- మరోవైపు రాష్ట్రంలో భారీగా పెరుగుతున్న రైతు ఉత్పత్తిదారుల సంఘాల సంఖ్య
- 'ఇన్‌ల్యాండ్ కంటైనర్ డిపో' ఏర్పాటుకు సిద్ధంగా కంటైనర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: భూపరివేష్టిత రాష్ట్రమైన తెలంగాణ చుట్టూ ఉన్న రాష్ట్రాల్లో తీరప్రాంతం ఉంది. వ్యవసాయంలో ముందంజలో ఉన్న ఉత్తర తెలంగాణలోని నిజామాబాద్, జగిత్యాల, నిర్మల్, కామారెడ్డి, సిరిసిల్ల, మెదక్, ఆదిలాబాద్ జిల్లాలు, సమీప కర్ణాటకలోని బీదర్, మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాల్లో పసుపు, సోయా, మొక్కజొన్న, ఎర్రజొన్న, మామిడి, ధాన్యం, పత్తి, కూరగాయల ఉత్పత్తులు భారీగా ఉంటున్నాయి. వీటికి అదనపు విలువ జోడించి అంతర్జాతీయ ఎగుమతులు సైతం చేసే లక్ష్యంతో రైతు ఉత్పత్తిదారుల సంఘాలు భారీగా ఏర్పాటవుతున్నాయి. తాజాగా నిజామాబాద్ జిల్లాలో పసుపు బోర్డు ఏర్పాటైంది. దీంతో పసుపు సాగు విస్తీర్ణం మరింత పెరగనుంది. అయితే రైతుల నుంచి వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్న ట్రేడర్లు ముంబై, చెన్నై, విశాఖ ద్వారా ఎగుమతులు చేయాల్సి వస్తోంది. వీరంతా కేవలం రోడ్డు మార్గంపైనే ఆధారపడుతుండడంతో భారీ వ్యయం అవుతోంది. రైల్వేకు అనుసంధానంగా డ్రైపోర్టు ఏర్పాటు చేయాలని నిజామాబాద్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ వారు పదేళ్లుగా డిమాండ్ చేస్తున్నారు. ఇక్కడ డ్రైపోర్టు ఏర్పాటు చేస్తే రైతు ఉత్పత్తిదారుల సంఘాల ద్వారా రైతులే వ్యవసాయ ఉత్పత్తులకు అదనపు విలువ జోడించి ఎగుమతిదారులుగా మారేందుకు సిద్ధంగా ఉన్నారు.

- భారతదేశ తూర్పు, పశ్చిమ తీరానికి మధ్యలో భౌగోళికంగా కీలకమైన ప్రాంతంలో ఉన్న నిజామాబాద్ జిల్లా.. మరోవైపు ఉత్తర భారతానికి, దక్షిణ భారతానికి గేట్‌వేలాగా ఉంది. ఈ నేపథ్యంలో నిజామాబాద్ చాంబర్ ఆఫ్ కామర్స్ డిమాండ్ మేరకు జిల్లాలోని డిచ్‌పల్లి వద్ద 'ఇన్‌ల్యాండ్ కంటైనర్ డిపో' (కంటైనర్ ఫ్రైట్ స్టేషన్) ఏర్పాటు చేసేందుకు రైల్వే శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్న కంటైనర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా మూడున్నరేళ్ల క్రితమే గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాష్ట్రప్రభుత్వం స్థలం కేటాయించకపోవడంతో పట్టాలెక్కలేదు. నిజామాబాద్ చాంబర్ ఆఫ్ కామర్స్ 2015 సంవత్సరం నుంచి డ్రైపోర్టు కోసం డిమాండ్ చేస్తోంది. ఈ క్రమంలో 'ఫెడరేషన్ ఆఫ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ' సంస్థ జిల్లాలో సర్వే చేసింది. తరువాత 'ఎగుమతి దిగుమతిదారుల సమాఖ్య' సంస్థ మరోసారి రీసర్వే చేసింది. నిజామాబాద్ ప్రాంతం 'హై స్ట్రాటజికల్ అండ్ జియోగ్రాఫికల్ లొకేషన్'లో ఉందని కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖకు నివేదిక ఇచ్చారు. 'ఆజాదీ కా అమృత్' మహోత్సవాల్లో భాగంగా చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో వివిధ ఉన్నతాధికారులను కలిశారు. దీంతో కంటైనర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జీఆర్ శేషగిరిరావు 2022 సెప్టెంబర్‌లో 28న నిజామాబాద్‌కు వచ్చి కంటైనర్ ఫ్రైట్ స్టేషన్ ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు. ఇది ఏర్పాటైతే డ్రైపోర్టుకు మార్గం సుగమం అవుతుంది.
- ఇన్‌ల్యాండ్ కంటెయినర్ డిపో ఏర్పాటు చేస్తే దేశవిదేశాల ట్రేడర్లతో నేరుగా ఎగుమతి, దిగుమతి వ్యాపారం చేసేందుకు వీలుంటుంది. గిడ్డంగులు కూడా ఏర్పాటవుతాయి. కూరగాయలకు ఇక్కడ ధర లేని సమయంలో రోడ్లపై పారబోయాల్సిన పరిస్థితి తప్పుతుంది. నేరుగా అంతర్జాతీయ ఎగుమతులకు అవకాశం కలిగితే.. ఇక్కడి వ్యాపారులతో పాటు రైతులకు మరింత మేలు కలుగుతుంది. విత్తనాల అవసరం ఎక్కువగా ఉన్న దేశాలకు నేరుగా ఎగుమతులు చేసే అవకాశం ఉంది. కోల్డ్ స్టోరేజ్ లాంటి ఫ్రీజర్ కంటైనర్లు అందుబాటులోకి వస్తాయి. ఒక్కొక్క డిపో నుంచి 28 టన్నుల సామర్థ్యం కలిగిన 90 కంటైనర్లు అందుబాటులో ఉంటాయి. మరోవైపు ఇతర గూడ్స్ రైళ్లకు సైతం కంటైనర్లను జోడించే సౌలభ్యం ఉంది. కాగా రాష్ట్ర ప్రభుత్వం భూమి కేటాయింపు లేదా లీజుకిస్తే వెంటనే పనులను ప్రారంభిస్తామని కంటైనర్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గతంలోనే తెలపడం గమనార్హం.

ఉపాధి అవకాశాలు మెండు



నల్ల దినేష్‌రెడ్డి,
మాజీ అధ్యక్షుడు,
చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ, నిజామాబాద్

భౌగోళికంగా ఉత్తర, దక్షిణ భారతానికి గేట్‌వేగా ఉన్న నిజామాబాద్ ప్రాంతంలో కంటైనర్ ఫ్రైట్ స్టేషన్ ఏర్పాటు చేస్తే వ్యవసాయ అనుబంధ, ఫుడ్ ప్రాసెసింగ్, అనుబంధ పరిశ్రమలు ఈ ప్రాంతానికి భారీగా తరలివస్తాయి. దీంతో ఇక్కడ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. వలసలు తగ్గుతాయి. రవాణా చార్జీలు సైతం తగ్గుతాయి. కంటైనర్ డిపో వస్తే ఈ ప్రాంతంలో ఎకానమీ రూ.వెయ్యి కోట్లకు పెరుగుతుంది. తరువాత కేంద్రం డ్రైపోర్టు సైతం ఇచ్చేందుకు అవకాశాలు పెరుగుతాయి. ఇక్కడి వ్యాపారులు, రైతులు అంతర్జాతీయ ఎగుమతుల విషయంలో పోటీపడే అవకాశాలు కలుగుతాయి. రోడ్డు రవాణాతో పోలిస్తే రైల్వే ద్వారా రవాణా చార్జీలు భారీగా తగ్గుతాయి. నేరుగా షిప్‌యార్డులకు ఉత్పత్తులు తీసుకెళ్లే అవకాశం ఉండడంతో మరింత చౌకగా అంతర్జాతీయంగా ఇక్కడి నుంచి ఎగుమతులు చేసుకోవచ్చు.

తక్షణమే భూమి కేటాయించాలి

డిచ్‌పల్లి వద్ద డ్రైపోర్టు ఏర్పాటు చేసేందుకు రాష్ట్రప్రభుత్వం తక్షణమే భూమి కేటాయించాలి. తాజాగా నిజామాబాద్ జిల్లాలో పసుపు బోర్డు ఏర్పాటు చేసిన నేపథ్యంలో పసుపు సాగు విస్తీర్ణం పెరగనుంది. డ్రైపోర్టు ఏర్పాటు చేస్తే వ్యవసాయంలో ప్రథమంగా ఉన్న నిజామాబాద్ చుట్టుపక్కల జిల్లాల నుంచి వచ్చే పంట ఉత్పత్తులకు అదనపు విలువ జోడించి నేరుగా అంతర్జాతీయ ఎగుమతులు చేసేందుకు రైతులకు పుష్కలమైన అవకాశాలు దక్కుతాయి. డ్రైపోర్టు వస్తే ఉత్తర తెలంగాణకే గేమ్ ఛేంజర్ అవుతుంది.



పాట్కూరి తిరుపతిరెడ్డి,
చైర్మన్,
జేఎంకేపీఎం పసుపు రైతుల ఉత్పత్తిదారుల సంఘం

ఎల్‌ఆర్‌ఎస్ ఇప్పట్లో తేలేనా?

క్ర.సం.	జిల్లా పేరు	వచ్చిన దరఖాస్తులు	సమాచారం ఇచ్చినవి	ఫీజు చెల్లించినవి	కొత్త దరఖాస్తులు	క్లియర్ అయినవి	వచ్చిన ఆదాయం
1	ఆదిలాబాద్	28,655	23,678	5,693	687	3,134	10.82
2	కరీంనగర్	68,563	48,141	13,759	571	6,739	56.62
3	ఖమ్మం	1,0,0453	80,540	26,475	1,792	7,867	100.54
4	మహబూబ్‌నగర్	98,147	75,395	19,980	3,225	8,523	44.48
5	మెదక్	21,615	19,919	6,848	169	3,543	16.92
6	నల్లగొండ	1,35,906	1,12,361	18,864	1,692	6,306	55.03
7	నిజామాబాద్	79,131	66,166	17,437	1,508	11,302	56.18
8	రంగారెడ్డి	3,20,482	2,32,492	83,228	4,136	16,399	297.44
9	వరంగల్ రూరల్	10,691	7,637	2,211	225	682	5.95
10	నిర్మల్	44,970	39,008	7,506	635	3,173	15.61
11	జగిత్యాల	38,995	32,320	6,039	219	2,280	17.87
12	పెద్దపల్లి	25,683	19,304	6,594	190	3,272	26.14
13	రాజన్న సిరిసిల్ల	43,150	36,667	8,629	326	3,994	19.52
14	మంచిర్యాల	55,697	31,107	10,708	1,294	4,202	28.08
15	కామారెడ్డి	34,578	30,508	8,468	277	5,585	17.30
16	వరంగల్ అర్బన్	1,135,96	82,831	34,621	1,755	7,730	143.75
17	జయశంకర్‌భూపాలపల్లి	8,372	6,546	2,130	181	768	5.54
18	మహబూబాబాద్	35,625	29,873	9,213	663	3,443	20.74
19	జనగాం	61,472	53,992	13,724	621	3,192	25.55
20	భద్రాద్రి కొత్తగూడెం	15,185	11,501	4,101	218	1,368	18.53
21	సంగారెడ్డి	90,939	65,489	23,107	1,986	6,641	100.37
22	సిద్దిపేట	1,01,285	91,181	17,325	1,278	11,233	31.98
23	వనపర్తి	69,740	63,554	11,644	1,648	5,245	14.77
24	నాగర్ కర్నూల్	68,146	57,029	12,185	1,830	5,000	21.93
25	గద్వాల్	47,063	25,749	6,249	1,611	3,795	9.04
26	సూర్యాపేట	79,852	73,170	15,124	1,144	6,774	44.60
27	యాదాద్రి	1,46,037	1,39,755	38,923	2,034	7,388	74.96
28	వికారాబాద్	37,313	33,061	6312	1,093	2,072	20.51
29	ఆసిఫాబాద్	7,733	7,118	1,461	43	374	3.61
30	మేడ్చల్	1,65,657	1,15,612	50,786	1,904	11,053	270.55
31	ములుగు	5,020	4,716	1,373	407	929	2.88
32	నారాయణపేట	34,800	23,608	6,741	1,026	4,008	13.65
33	జీహెచ్ఎంసీ	1,07,998	64,028	14,876	871	1,181	191.92
34	హెచ్ఎండీఏ	2,64,558	2,07,530	64,669	8,996	8,240	210.25
	మొత్తం	25,67,107	20,11,586	5,77,003	46,255	1,77,435	1,993.6



గురువారం సికింద్రాబాద్‌లోని పళని పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన పాసింగ్ అవుట్ పరేడ్‌లో 2024 బ్యాచ్ అగ్నివీర్‌లు

‘కోరింగ’లో అరుదైన విష సర్పం

కాటేస్తే ప్రాణానికే ప్రమాదం

పసరిక పాము అనుకుంటే పొరపాటే

భవిష్యత్తులో అంతరించిపోయే జాతిగా నిర్ధారణ

పరిరక్షణకు నడుం బిగించిన వన్యప్రాణి విభాగం



కాకినాడ సమీపాన ఉన్న, దేశంలోనే మూడో అతి పెద్ద అభయారణ్యం కోరింగలో అరుదైన స్పాట్‌–టెయిల్డ్‌ పిట్‌ వైపర్‌ జాతి పామును అధికారులు గుర్తించారు. 40 ఏళ్ల క్రితం వరకు జనావాసాల్లో విరివిగా కనిపించిన ఈ పాము క్రమంగా కనుమరుగవుతోంది. సమీప భవిష్యత్‌లో పూర్తిగా అంతరించే జాతుల్లో చేరింది. వన్యప్రాణి సంరక్షణ చట్టం 1978 ప్రకారం ఈ పాము నాలుగో షెడ్యూల్‌లో ఉంది. ఈ పాము సంరక్షణకు వన్యప్రాణి సంరక్షణా విభాగం నడుంకట్టింది. దీనిని నాలుగో షెడ్యూల్‌ నుంచి ఒకటో షెడ్యూల్‌లోకి 2022లో మార్చింది. ఈ మార్పు ద్వారా ఈ జాతి పామును అత్యంత జాగ్రత్తతో సంరక్షించాలనే సందేశాన్నిచ్చింది.

- సాక్షి ప్రతినిధి, కాకినాడ

పొడజాతికి చెందినదే.. పగలంతా నిద్రావస్థే

పొడ పాము సంతతికి చెందిన ఈ పాము పచ్చరంగులో ఉంటుంది. శరీరంపై ఎరుపు రంగు మచ్చలూ ఉంటాయి. పచ్చని చెట్లపై సంచరిస్తుంది. పసరిక పాములా ఉంటుంది. ఈ జాతిలో రెండు రకాలు బాంబోపిట్‌ వైపర్, స్పాట్‌ టైల్డ్‌ పిట్‌వైపర్‌ ఉన్నాయి. బాంబో పిట్‌ వైపర్‌ సాధారణంగా అటవీ ప్రాంతం రంపచోడవరం ఏజెన్సీలోని మారేడుమిల్లి, వై.రామవరం, అడ్డతీగల తదితర ప్రాంతాల్లో ఉంటుంది. స్పాట్‌ టైల్డ్‌ పిట్‌ వైపర్‌ జాతి పాములు చిత్తడి నేలల్లో (మాంగ్రూవ్స్‌) మాత్రమే మనగలుగుతాయి. ఈ పాము అత్యంత విషపూరితమైనది. మనిషిని కాటేస్తే రక్తంలో బ్లడ్‌ క్లాట్స్‌ ఏర్పడతాయి. బ్రెయిన్‌ డెడ్‌ కావడం, హార్ట్‌ అటాక్, కోమాలోకి వెళ్లడంతో చనిపోయే ప్రమాదం ఉంది. ఈ పాము పగలంతా నిద్రావస్థలో ఉండి రాత్రుళ్లు మాత్రమే సంచరిస్తుంది. దీనివల్ల మనుషులకు ప్రమాదం వాటిల్లిన కేసులు ఇంతవరకు ఈ ప్రాంతంలో నమోదు కాలేదు. ఈ జాతి పాములు ఎక్కువగా దక్షిణ ఆసియా, మయన్మార్‌లలో కనిపిస్తుంటాయి. ఈ పాముకు ఉప జాతులేమీ ఇంతవరకూ గుర్తించ లేదు. ఈ పాము కోరంగి అభయారణ్యంలో గుర్తించడంతో సంరక్షణకు అధికారులు చర్యలు చేపట్టారు.

పర్యాటకులకు జాగ్రత్తలు చెబుతున్నాం



మడ అడవులకు వచ్చే పర్యాటకులకు ముందు జాగ్రత్తలు చెబుతున్నాం. చెట్లు ఎక్కవద్దు, లోపలకు వెళ్లవద్దంటూ హెచ్చరిస్తున్నాం. ఒకవేళ ఈ పాము కాటు వేస్తే వెంటనే వైద్య సహాయం పొందాలి. ఈ పాము కరవగానే విరుగుడుకు ఇంజక్షన్‌ చేయించాలి. ఈ ఇంజక్షన్‌ కోరంగి అభయారణ్యం సమీపాన తాళ్లరేవు పీహెచ్‌సీ లేదా కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆస్పత్రిలో ఉంటుంది. కాలు మీద కాటేస్తే ఎక్కువగా నడవకూడదు. కట్టుకట్టకుండా ఆస్పత్రికి తరలించాలి. ఈ విషయాలపై ముందుగా అవగాహన కల్పిస్తున్నాం.

– ఎస్‌ఎస్‌ఆర్‌ వరప్రసాద్,
అటవీ రేంజర్, వన్యప్రాణి విభాగం,
కోరంగి అభయారణ్యం, కాకినాడ

క్లుప్తంగా...

సమస్యలు పరిష్కరించండి

పంచాయతీరాజ్‌ ఈఎన్‌సీకి డిప్లొమా ఇంజినీర్ల సంఘం వినతి

సాక్షి, అమరావతి: సమస్యలను పరిష్కరించాలంటూ డిప్లొమా ఇంజనీర్ల సంఘం ప్రతినిధులు ఆ శాఖ ఇంజనీర్‌ ఇన్‌ చీఫ్‌కు గురువారం వినతిపత్రం సమర్పించారు. 2011 సంవత్సరంలో అసిస్టెంట్‌ ఇంజినీర్లను గెజిటెడ్‌గా గుర్తించినప్పటికీ సర్వీస్‌ రూల్స్‌లో మార్పులు చేయలేదని, వెంటనే మార్పులు చేయాలని కోరారు. ఇటీవల బదిలీల కౌన్సెలింగ్‌లో డిప్లొమా ఇంజినీర్ల పట్ల పక్షపాత ధోరణితో వ్యవహరించారని, దీన్ని సరిచేయాలని కోరారు. ఉపాధి హామీ పథకం విభాగంలో పనిచేస్తున్న అసిస్టెంట్‌ ఇంజినీర్లకు రవాణా భత్యం రూ.3,000 ఇవ్వాలని కోరారు.

ఏపీఎస్‌ఎస్‌డీసీ చైర్మన్‌ శేషారావు పదవీ స్వీకారం

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్‌ఎస్‌డీసీ) చైర్మన్‌గా బూరుగుపల్లి శేషారావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వర్ణాంధ్ర–2047 విజన్‌కు అనుగుణంగా ప్రభుత్వం, పరిశ్రమ, విద్యా రంగాలు సమన్వయంతో పని చేస్తాయన్నారు. శేషారావును పలువురు మంత్రులు అభినందించారు.

ఆలపాటి బాధ్యతల స్వీకరణ

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): సి.రాఘవాచారి ఆంధ్రప్రదేశ్‌ మీడియా అకాడమీ చైర్మన్‌గా ఆలపాటి సురేష్‌కుమార్‌ గురువారం బాధ్యతలు స్వీకరించారు. విజయవాడని మీడియా అకాడమీ కార్యాలయంలో ఆయన బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ జర్నలిజం స్థాయిని పెంచేలా మీడియా అకాడమీ కార్యక్రమాలు రూపొందిస్తానని చెప్పారు. గ్రామీణ విలేకరుల్లో నైపుణ్యాలు పెంపొందించేందుకు శిక్షణా తరగతులను నిర్వహిస్తామన్నారు. జర్నలిస్ట్‌ సంఘాల నాయకులు ఆలపాటిని సత్కరించారు.

అంగన్‌వాడీ టీచర్లకు ఇండక్షన్‌ స్టవ్‌ల పంపిణీ

ప్రారంభించిన మంత్రి గుమ్మడి సంధ్యారాణి

సాక్షి, అమరావతి: అంగన్‌వాడీ కేంద్రాలకు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ.. ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్‌ లిమిటెడ్‌ (ఈఈఎస్‌ఎల్‌) సమకూర్చిన ఇండక్షన్‌ స్టవ్‌లను రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి గురువారం విజయవాడలో పంపిణీ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 55,607 అంగన్‌వాడీ సెంటర్లకు గాను మొదటి దశలో 11,400 సెంటర్లకు ఇండక్షన్‌ స్టవ్‌లను పంపిణీ చేస్తామన్నారు. ఈ స్టవ్‌లు కాలుష్య రహితమే కాకుండా పిల్లలకు వీటి వల్ల ఎలాంటి ప్రమాదాలు సంభవించవన్నారు. మినీ అంగన్‌వాడీ సెంటర్లను మెయిన్‌ అంగన్‌వాడీ సెంటర్లుగా మార్చనున్నట్లు తెలిపారు. ఒక్కో సెంటర్‌లో ప్రస్తుతం ఉన్న టీచర్‌తోపాటు అదనంగా ఆయా టీచర్‌ని నియమించబోతున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో భాగంగా 25 మంది గర్భిణులకు సామూహిక సీమంతాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి సూర్యకుమారి, ఈఈఎస్‌ఎల్‌ సీఈఓ విశాల్‌ కపూర్, బీఈఈ దక్షిణాది రాష్ట్రాల సలహాదారు ఎ.చంద్రశేఖర్‌ రెడ్డి పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన రాజశేఖర్‌

తాడేపల్లి రూరల్‌: హ్యూమన్‌ రీసోర్స్‌ డెవలప్‌మెంట్‌ కమిటీ చైర్మన్‌గా కుప్పం రాజశేఖర్‌ గురువారం బాధ్యతలు స్వీకరించారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని ఏపీడబ్ల్యూఈడీసీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన రాజశేఖర్‌కు రాష్ట్ర మంత్రి సవిత జ్ఞాపికను అందజేశారు.



‘ఈవీ’లకు ఫుల్‌ పవర్‌

విద్యుత్‌ వాహనాలకు రూ.2,000 కోట్లతో పీఎం ఈ–డ్రైవ్‌ పథకం

దేశవ్యాప్తంగా 72,000 చార్జింగ్‌ స్టేషన్లు పెట్టనున్న కేంద్రం

హైవేలు, నగరాలు, టోల్‌ ప్లాజాలు, ప్రజా రవాణా ప్రాంతాల్లో ఏర్పాటు

విద్యుత్‌ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించాలనే లక్ష్యంతో ప్రపంచ దేశాలు చేసుకున్న ఒప్పందంలో భాగంగా కేంద్రం పీఎం ఈ–డ్రైవ్‌ పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకం ద్వారా రూ.2,000 కోట్లతో దేశ వ్యాప్తంగా 72 వేల ఎలక్ట్రిక్‌ వెహికల్‌ (ఈవీ) చార్జింగ్‌ స్టేషన్లను నెలకొల్పనున్నట్లు వెల్లడించింది. ప్రపంచంలో అత్యధిక కాలుష్యం గల దేశాల్లో భారత్‌ 3వ స్థానంలో ఉంది. ఈ నేపథ్యంలో 2030కి సంప్రదాయ వాహనాల స్థానంలో 30% ఈవీ కార్లు, 80 %ఈవీ టూ వీలర్లు, 70% ఈవీ కమర్షియల్‌ వెహికిల్స్‌ ప్రవేశపెట్టాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. మొత్తంగా 8 కోట్ల విద్యుత్‌ వాహనాలు వచ్చే ఐదేళ్లలో రోడ్లమీద నడవాలని నిర్దేశించుకుంది. తద్వారా 2030కి 1 గిగా టన్‌ కర్బన ఉద్గారాలు తగ్గుతాయని అంచనా. అయితే ఈ లక్ష్యాన్ని చేరుకోవాలంటే మాత్రం ఈవీల వినియోగం పెరగాలి. అందుకోసం చార్జింగ్‌ స్టేషన్ల ఏర్పాటు వేగవంతం కావాల్సిన అవసరం ఉంది.

సాక్షి, అమరావతి

ఆలోచించి కొంటున్నారు..

2024–25లో దేశ వ్యాప్తంగా 20 లక్షల విద్యుత్‌ వాహనాలను వాహనదారులు కొనుగోలు చేశారు. గత ఆర్థిక సంవత్సరంలో అమ్ముడైన ఈ విద్యుత్‌ వాహనాల్లో సగం (60%)పైగా ఈవీ ద్విచక్ర వాహనాలే ఉన్నాయి. అంటే 12 లక్షలు ఈవీ మోటార్‌ సైకిళ్ల విక్రయాలు జరిగాయి. 2023తో పోల్చితే ఈవీ విక్రయాల వృద్ధి 24%గా ఉంది. దాదాపు లక్ష విద్యుత్‌ కార్లను వినియోగదారులు గతేడాది కొనుగోలు చేశారు. ఎలక్ట్రిక్‌ బస్సుల విక్రయాలు మాత్రం 3% తగ్గాయి. విద్యుత్‌ వాహనాలను కొనుగోలు చేయాలనే ఆసక్తి ఉన్నప్పటికీ వాటికి చార్జింగ్‌ పెట్టడమనేది ప్రధాన సమస్యగా మారడంతో ఎక్కువ మంది సంశయిస్తున్నారు. కొనాలా వద్దా అని ఒకటికి పదిసార్లు ఆలోచించాకే నిర్ణయం తీసుకుంటున్నారు. ఆ సమస్యను అధిగమించాలంటే కేంద్రం చార్జింగ్‌ స్టేషన్లను అందుబాటులోకి తీసుకురావాలి.

ప్రపంచ స్థాయికి చేరలేదు

ప్రపంచ దేశాలతో పోల్చితే భారత్‌లో ఇంకా ఆ స్థాయిలో ఈవీల వినియోగం పెరగలేదు. దీనికి ప్రధాన కారణం ఎక్కడికక్కడ చార్జింగ్‌ స్టేషన్లు లేకపోవడం. దేశంలో ప్రస్తుతం 12,146 విద్యుత్‌ చార్జింగ్‌ స్టేషన్లు ఉన్నాయని కేంద్ర విద్యుత్‌ మంత్రిత్వ శాఖ చెబుతోంది. 2030కి దేశ వ్యాప్తంగా 39 లక్షల ఈవీ చార్జింగ్‌ స్టేషన్లు అవసరం. భారత్‌లో ప్రతి 135 ఈవీలకు ఒక పబ్లిక్‌ చార్జర్‌ మాత్రమే ఏర్పాటైంది. ఇండియా ఎలక్ట్రిక్‌ వాహనం చార్జింగ్‌ మార్కెట్‌ గడిచిన ఐదేళ్లలో రూ.30 వేల కోట్లకుపైగా పెట్టుబడులను ఆకర్షించింది. అయినప్పటికీ, మౌలిక సదుపాయాల సమస్యలను ఎదుర్కొంటోంది. ప్రభుత్వ, ప్రైవేటు పెట్టుబడులను, ప్రోత్సాహకాలను పెంచడం, ప్రపంచ ఉత్తమ పద్ధతులను అవలంబించడం ద్వారా ఈ సమస్యను అధిగమించవచ్చని గుర్తించిన కేంద్రం ఈవీ చార్జింగ్‌ స్టేషన్ల ఏర్పాటుకు రూ.2,000 కోట్లు కేటాయించింది.

బాటలు వేసిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం

ఏపీలో ప్రస్తుతం 1,23,396 విద్యుత్‌ వాహనాలున్నాయి. 2030 నాటికి వీటి సంఖ్య 7,82,660కు చేరుతుందని అంచనా. ఈ నేపథ్యంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యుత్‌ వాహనాలు, చార్జింగ్‌ స్టేషన్ల విధి విధానాలను ప్రత్యేక పాలసీగా రూపొందించింది. రాష్ట్ర వ్యాప్తంగా నగరాలు, పట్టణాల్లో ప్రతి 3 కిలోమీటర్లకు ఒకటి, జాతీయ రహదారుల్లో 25 కిలోమీటర్లకు ఒకటి చొప్పున విద్యుత్‌ చార్జింగ్‌ కేంద్రాలను నెలకొల్పాలని సంకల్పించింది. అందుకు అవసరమైన 4,000 స్థలాలు అప్పట్లోనే గుర్తించింది. విజయవాడ, అమరావతి, విశాఖ, తిరుపతిలను మోడల్‌ ఎలక్ట్రిక్‌ మొబిలిటీ నగరాలుగా గుర్తించింది. పబ్లిక్‌ చార్జింగ్‌ స్టేషన్ల(పీసీఎస్‌)ను ప్రైవేటు వ్యక్తులు ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. దీనికి ఎటువంటి లైసెన్స్‌ తీసుకోనవసరం లేదని చెప్పింది. ఇప్పుడు కేంద్రం అదే బాటలో నడుస్తోంది. దేశ వ్యాప్తంగా 50 జాతీయ రహదారుల వెంబడి, టోల్‌ ప్లాజాలు,విమానాశ్రయాలు, రైల్వే స్టేషన్లు, బస్టాండ్‌లు వంటి ప్రజా రవాణా ఉండే ప్రాంతాల్లో చార్జింగ్‌ స్టేషన్లు పెట్టనుంది. నగరాలు, పట్టణాల్లోనే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లోనూ వాటిని అందుబాటులోకి తీసుకురావాలని అనుకుంటోంది.

అల్ల నేరేడుకు ఊజి దెబ్బ

- కాయలు పక్వానికి రాకుండానే కుళ్లిపోతున్న వైనం
- రైతులను వెంటాడుతున్న గుబులు
- సస్యరక్షణ పెట్టుబడులు కూడా రావంటున్న రైతులు



రాయచోటి : అల్ల నేరేడు శక్తినందించి ఆరోగ్యానికి మేలు చేయడమే కాదు కొన్ని రకాల రోగాలను నియంత్రించే శక్తి నేరేడు సొంతం. ఒక్క పండే కాదు ఆకులు, బెరడు కూడా శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. అక్సాలిక్‌ టానిక్‌ ఆమ్లం, విటమిన్లు, క్రోమియం వంటివి నేరేడులో పుష్కలం. అలాంటి అల్ల నేరేడుకు తెగుళ్ల రూపంలో ఊజి పురుగులు వెంటాడుతున్నాయి. నిగనిగలాడే నేరేడు పండును సంతృప్తిగా తిందామన్న వారికి పురుగుల రూపంలో భయపెడుతోంది. నేరేడు పండ్లపై ఈ పురుగులు దాడి చేస్తుండటంతో కాయలు పక్వానికి చేరి మాగకుండానే కుళ్లిపోతున్నాయి. ఫలితంగా సాగు, సర్యరక్షణకు పెట్టిన ఖర్చులు కూడా వస్తాయో లేదో అన్న భయం పట్టుకుంది. కొద్దికొద్దిగా దిగుబడి వచ్చినా ప్రస్తుతం నేరేడు పండ్లకు మార్కెట్‌లో మంచి డిమాండ్‌ ఉంది. కిలో పండ్లు రూ.250లు నుంచి రూ.300లు పైనే అమ్ముతుండటంతో నేరేడు తోటలను సాగు చేసిన రైతులు ఆనందపడుతున్న వేల ఊజీ పురుగుల దాడి వారిని కలవరపాటుకు గురి చేస్తోంది. పండ్ల తోటల సాగులో భాగంగా మామిడి, జామ, సపోటా తదితర పండ్ల మొక్కలతోపాటు మార్కెట్‌లో మంచి డిమాండ్‌ ఉన్న నేరేడు పండ్లతోటల పెంపకానికి రైతులు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. చిత్తూరు జిల్లాతోపాటు అన్నమయ్య జిల్లాలో కూడా అధికంగా సాగులో ఉన్న నేరేడు పండ్లను ఇతర రాష్ట్రాలకు, దేశాలకు ఎగుమతి చేస్తుంటారు.

ఫలితమివ్వని మందుల పిచికారీ..

అల్లనేరేడుకు సోకుతున్న తెగుళ్లు, పురుగుల నివారణకు రకరకాల మందులు పిచికారి చేసినా ఫలితం లేదని రైతులు వాపోతున్నారు. గుత్తులు గుత్తులుగా కాయలు కాసి మాగకుండానే మగ్గిపోతుండటాన్ని చూసి రైతులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఇప్పటికే మామిడి పంటకు ధరలు లేక కుంగిపోతున్న రైతులు అల్లనేరేడు పంటపై ఊజీ పురుగుల దాడి చూసి వాటి సాగుకు, సంరక్షణకు పెట్టిన డబ్బులు కూడా వచ్చే అవకాశాలు లేవని మథనపడుతున్నారు.

నోషనల్‌ ఇంక్రిమెంట్లు ఇవ్వాలి

- బదిలీలకు అనుమతితో పాటు సమస్యలూ పరిష్కరించాలని వినతి
- గ్రామ, వార్డు సచివాలయాల ఫెడరేషన్‌ డిమాండ్‌

సాక్షి, అమరావతి : గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు డేట్‌ ఆఫ్‌ జాయినింగ్‌ నుంచి నోషనల్‌ ఇంక్రిమెంట్లు మంజూరుచేయాలని గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయీస్‌ ఫెడరేషన్‌ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.డి. జానీపాషా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల అంకమ్మరావు డిమాండ్‌ చేశారు. ఈ మేరకు గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలపై సచివాలయాల శాఖ డైరెక్టర్‌ ఎం. శివప్రసాద్‌ను గురువారం కలిసి తొమ్మిది డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందించారు. అవేంటంటే..

- ప్రస్తుతమున్న రికార్డ్‌ అసిస్టెంట్‌ కేడర్‌ను జూనియర్‌ అసిస్టెంట్‌ కేడర్‌కు అప్‌గ్రేడ్‌చేయాలి..
- తొమ్మిది నెలలు ఆలస్యంగా ప్రొబేషన్‌ డిక్లేర్‌ చేసిన తేదీ కాకుండా ప్రొబేషన్‌ డిక్లరేషన్‌ డేట్‌ను రెండేళ్ల సర్వీస్‌ పూర్తిచేసిన రోజుకు మార్చుచేయాలి.. ఆలస్యమైన తొమ్మిది నెలల కాలానికి ఎరియర్స్‌ చెల్లించాలి..
- అన్ని జిల్లాల్లోని సచివాలయ ఉద్యోగుల సీనియారిటీ జాబితాలు మెరిట్‌ కం రోస్టర్‌ విధానంలో ప్రదర్శించాలి..
- ఉద్యోగుల పదోన్నతుల పేస్కేల్స్‌లో అసమానతలు తొలగించాలి..
- సచివాలయ ఉద్యోగులను అవకాశమున్నమేరకు, అర్హత ప్రకారం ఇతర ప్రభుత్వ శాఖల్లో విలీనం చేయాలి..
- సచివాలయ ఉద్యోగులకు తక్షణం బదిలీ అవకాశం కల్పించాలి. సాధారణ బదిలీలతో పాటు అంతర్‌జిల్లా బదిలీలూ చేపట్టాలి.
- సబ్సిడీతో ఇళ్ల స్థలాలు కేటాయించాలి..
- ఉద్యోగులకు గ్రూప్‌ మెడికల్‌ అండ్‌ హెల్త్‌ ఇన్సూరెన్స్‌ ఇవ్వాలి.
- మున్సిపాలిటీలుగా మారిన గ్రామాల్లోని సచివాలయ ఉద్యోగుల్లో మున్సిపల్‌ ఆప్షన్‌ ఎంచుకున్న వారికి బదిలీల్లో మినహాయింపు లేదా మున్సిపాలిటీలకు బదిలీలకు అవకాశం కల్పించాలి.

ఇలాగైతే.. మాకు చావే గతి

- సీఎం చంద్రబాబుకు ఆర్టీసీ ఎస్సీ, ఎస్టీ అద్దె బస్సుల యజమానుల సంఘం లేఖ
- తమ బస్సుల ద్వారా ఆర్టీసీకి ఆదాయం వస్తున్నా రాయితీలు ఎందుకివ్వట్లేదని నిలదీత
- వైఎస్సార్‌ బడుగు వికాసం కింద 300కు పైగా అద్దె బస్సులు కొనుగోలు చేసిన ఎస్సీ, ఎస్టీలు
- ఎస్సీలకు రూ.600 కోట్లు, ఎస్టీలకు రూ.150 కోట్లు బకాయి



సాక్షి, అమరావతి: ‘ఏడాదిగా మంత్రులు, అధికారుల చుట్టూ తిరుగుతున్నాం. ప్రభుత్వం దగ్గర డబ్బుల్లేవని.. మాకు చెల్లించాల్సిన ప్రోత్సాహకాలు ఇప్పుడు ఇవ్వలేమని చెబుతున్నారు. పరిస్థితి ఇలాగే ఉంటే మా దగ్గర ఉన్న బస్సులు తగులబెట్టి ఆత్మహత్య చేసుకోవడం తప్ప మాకు వేరే గత్యంతర లేదు’ అని వాపోతున్నారు ఆర్టీసీకి అద్దె బస్సులు నడుపుతున్న ఎస్సీ, ఎస్టీ అద్దె బస్సుల యజమానులు. ప్రభుత్వం నుంచి ఎదురవుతున్న ఇబ్బందులు, తాము పడుతున్న కష్టాలను ఏకరువు పెడుతూ సీఎం చంద్రబాబుకు లేఖ రాశారు.

ఏడాదిలో ఒక్క రూపాయైనా ఇవ్వలేదు

ఎస్సీ, ఎస్టీలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో వైఎస్‌ జగన్‌ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ‘వైఎస్సార్‌ బడుగు వికాసం’ పథకం కింద వీరంతా బస్సులు కొనుగోలు చేసి ఏపీఎస్‌ ఆర్టీసీకి అద్దె బస్సులుగా నడుపుతున్నారు. 300 మందికిపైగా ఎస్సీ, ఎస్టీ యువత గత ప్రభుత్వ ప్రోత్సాహంతో బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుని బస్సులు కొనుగోలు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత వీరికి ఇవ్వాల్సిన ప్రోత్సాహకాలు నిలిపివేసింది. ఈ పథకం కింద లబ్ధి పొందిన ఎస్సీలకు సుమారు రూ.500 కోట్లు, ఎస్టీలకు రూ.150 కోట్లు పారిశ్రామిక ప్రోత్సాహకాలను విడుదల చేయకుండా కూటమి సర్కారు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోంది. కేవలం వైఎస్సార్‌ బడుగు వికాసం పథకం కింద లబ్ధి పొందారన్న ఏకైక కారణంతో బకాయిలు ఇవ్వకుండా వేధిస్తున్నారంటూ వీరంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంత్రులు లోకేశ్, టీజీ వెంకటేష్‌తోపాటు పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్‌. యువరాజ్, డైరెక్టర్, ఏపీఐఐసీ ఎండీ అభిషిక్త్‌ కిషోర్‌లను అనేకసార్లు కలిసి తమ కష్టాలు మొరపెట్టుకున్నా ప్రోత్సాహకాలు ఇవ్వడం లేదని వాపోయారు. కనీసం రుణాల చెల్లింపునకు సంబంధించి బ్యాంకులతోనైనా మాట్లాడండి అని కోరుతున్నా ఉపయోగం లేకుండా పోతోందంటున్నారు. ఏడాది కావస్తున్నా బకాయిలతో పాటు ఈ ఏడాది ప్రోత్సాహకాల్లో ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒక్కొక్క అద్దె బస్సు నుంచి ప్రభుత్వానికి అన్ని ఖర్చులు పోనూ ప్రతినెలా రూ. 3 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు ఆదాయం వస్తోందని బస్సు యజమానులు చెబుతున్నారు. ప్రతినెలా 300 అద్దె బస్సుల ద్వారా రాష్ట్ర ఖజానాకు రూ.9 కోట్లకుపైగా ఆదాయాన్ని బడుగు పారిశ్రామికవేత్తలు సమకూరుస్తున్నా ప్రభుత్వం తమపై కనికరం చూపించడం లేదని వాపోతున్నారు. ఈ నెల 27న అంతర్జాతీయ ఎంఎస్‌ఎంఈ డే లోగా పారిశ్రామిక ప్రోత్సాహకాలను విడుదల చేయాలని.. లేకపోతే ఆందోళన తీవ్రతరం చేసి సీఎం ఇంటిని ముట్టడించడానికి కూడా వెనుకాడబోమంటూ ఎస్సీ, ఎస్టీ అద్దె బస్సుల యజమానులు ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నారు.

డబ్బులు లేనప్పుడు హామీ ఎందుకిచ్చారు?



చదువుకున్నా ఉద్యోగాలు లేని సమయంలో గత ప్రభుత్వ ప్రోత్సాహంతో ఎంటర్‌ప్రెన్యూర్‌గా తయారవుదామన్న ఆశతో వైఎస్సార్‌ బడుగు వికాసం పథకం కింద బస్సు కొనుగోలు చేసి నెల్లూరు–పామూరు మధ్య తిప్పుతున్నాను. ఈ పథకం కింద ఇస్తామన్న రాయితీలు ఇవ్వకపోవడంతో నాలాగే అనేకమంది ఎస్సీ, ఎస్టీ యువకులు బ్యాంకు ఈఎంఐలు కట్టలేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులను కలిస్తే ప్రభుత్వం దగ్గర డబ్బులు లేవు.. రాయితీలు ఇప్పుడు ఇవ్వలేం అంటున్నారు. డబ్బులు లేనప్పుడు ప్రోత్సాహకాలు ఇస్తామని హామీ ఇందుకు ఇచ్చారు.

– హరి, నెల్లూరు–పామూరు
అద్దె బస్సు ఓనర్‌

మా గోడు వినేవారేరి?



బడుగుల గోడు వినిపించుకునే అధికారులే కనిపించడం లేదు. ఫుడ్‌ ప్రాసెసింగ్, ఐటీ వంటి పెద్ద కంపెనీలకు రాయితీలు ఇవ్వడానికి వస్తున్న డబ్బులు మా ఎస్సీ, ఎస్టీలకు చెందిన చిన్న కంపెనీలకు వచ్చేసరికి ఎందుకు ఉండటం లేదు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు లేఖ రాశాం. మానవ వనరులు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌ను కలిసి విజ్ఞప్తి చేశాం. అధికారులనైతే లెక్కలేనన్నిసార్లు కలిశాం. అయినా ఉపయోగం లేదు. బ్యాంకు వాళ్లు పెడుతున్న ఇబ్బందులతో మేం బస్సులు నడపలేకపోతున్నాం. తక్షణం ప్రోత్సాహకాలు ఇప్పించండి. లేకపోతే మాకు ఆత్మహత్యలే శరణ్యం.

– రాపాక మహేష్, అధ్యక్షుడు, ఎస్సీ, ఎస్టీ
హైర్‌ బస్‌ ఓనర్స్‌ అసోసియేషన్‌

11న చలో మంగళగిరి

ఏపీ కౌలు రైతుల సంఘం

కృష్ణలంక (విజయవాడ తూర్పు): అన్నదాత సుఖీభవ ప్రతి కౌలు రైతుకు ఇవ్వాలని, భూ యజమాని సంతకం తొలగించి కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరుతూ ఈ నెల 11న నిర్వహిస్తున్న చలో మంగళగిరి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏపీ కౌలు రైతుల సంఘం ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు పిలుపునిచ్చారు. విజయవాడలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కూటమి పాలన ఏడాది పూర్తయినప్పటికీ కౌలు చట్టం మార్చలేదని, కౌలు కార్డులు ఇంకా పూర్తిగా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా కౌలు చట్టాన్ని మార్చి భూ యజమాని సంతకాన్ని తొలగించి గ్రామసభల ఆధారంగా గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. పెట్టుబడి పెట్టి నష్టపోతున్న కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలు ఇవ్వాలని డిమాండ్‌ చేశారు.

తెలుగు పరిశ్రమలో హారర్ ట్రెండ్ నడుస్తోందా? అనేలా ప్రస్తుతం ఆ జానర్ సినిమాలు ఎక్కువగా రూపొందుతున్నాయి. జనరల్‌గా స్టార్ హీరోలు ఈ జానర్ చిత్రాల్లో కనిపించడం తక్కువ. అయితే ప్రభాస్ లాంటి పాన్ ఇండియా స్టార్ కూడా ఈ తరహా సినిమాలో నటించడం ఓ విశేషం. ఇక... హారర్ జానర్‌లో రానున్న సినిమాల గురించి తెలుసుకుందాం.

హారర్ ర్ర్ర్ర్ర్ భయం భయం



● వరుణ్ తేజ్



● ప్రభాస్



● కామాక్షి, 'అల్లరి' నరేశ్



● ఆది సాయికుమార్



● సాయి శ్రీనివాస్, అనుపమ



● 'సత్యం' రాజేశ్



● వరలక్ష్మీ శరత్ కుమార్



● అయ్యప్ప పి.శర్మ



● గణేశ్

భయపెట్టే రాజాసాబ్

వరుస పాన్ ఇండియన్ చిత్రాలతో యమా జోరుగా దూసుకెళుతున్నారు హీరో ప్రభాస్. తన కెరీర్‌లో ఇప్పటివరకూ లవర్ బాయ్‌గా, యాక్షన్ హీరోగా నటించారాయన. అంతేకాదు... పలు సినిమాల్లో తనదైన శైలిలో భావోద్వేగాలు, వినోదం పంచిన ఆయన తొలిసారి 'రాజా సాబ్' చిత్రంతో ప్రేక్షకులను భయపెట్టేందుకు సిద్ధం అవుతున్నారు. ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'రాజా సాబ్'. ఈ సినిమాలో నిధీ అగర్వాల్, మాళవికా మోహనన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వ ప్రసాద్ నిర్మిస్తున్నారు. రొమాంటిక్ హారర్ జానర్‌లో రూపొందుతున్న ఈ సినిమాలో ప్రభాస్ ద్విపాత్రాభినయం చేస్తున్నారు. ప్రభాస్ ఇప్పటిదాకా చేయని హారర్ జానర్ కావడంతో ఈ సినిమాపై ఇటు ఇండస్ట్రీలో అటు ప్రేక్షకుల్లో క్యూరియాసిటీ నెలకొంది. 'రాజా సాబ్' సినిమాతో ప్రేక్షకులకు ఎవర్ గ్రీన్ సినిమాటిక్ ఎక్స్‌పీరియన్ ఇవ్వబోతున్నారు మారుతి. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ తుది దశలో ఉంది. ఈ నెల 16న 'రాజా సాబ్' టీజర్ విడుదల కానుంది. తెలుగుతో పాటు తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో రూపొందుతోన్న ఈ సినిమా ఇప్పటికే విడుదల పలుమార్లు వాయిదా పడింది. తాజాగా ప్రపంచవ్యాప్తంగా డిసెంబర్ 5న ఈ చిత్రాన్ని రిలీజ్ చేయనున్నట్లు ఇటీవల ప్రకటించారు మేకర్స్.

హారర్ కనకరాజు

హీరో వరుణ్ తేజ్ తొలిసారి ప్రేక్షకులను భయపెట్టేందుకు సిద్ధం అవుతున్నారు. ఆయన కథానాయకుడిగా రూపొందుతోన్న తాజా చిత్రం 'వీటీ 15' (వర్కింగ్ టైటిల్). మేర్లపాక గాంధీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో రితికా నాయక్ కథానాయికగా నటిస్తున్నారు. యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థలు నిర్మిస్తున్నాయి. ఇండో-కొరియన్ హారర్ కామెడీగా ఈ సినిమా రూపొందుతోంది. రాయలసీమ నేపథ్యంలో సాగే ఈ హారర్ కామెడీ చిత్రంలో మొదటి సారి ఆడియన్స్‌ని భయపెట్టనున్నారు వరుణ్ తేజ్. ఈ చిత్రం తొలి షెడ్యూల్‌ను హైదరాబాద్, ద్వితీయ షెడ్యూల్‌ను అనంతపురంలో జరిపారు మేకర్స్. అనంతపురం పరిసరాల్లోని గ్రామీణ ప్రాంతాల్లో వరుణ్ తేజ్, రితికా నాయక్‌పై పల్లెటూరి నేపథ్యంలో చిత్రీకరించిన సన్నివేశాలు సినిమాలో హైలైట్‌గా నిలుస్తాయట. హారర్ నేపథ్యంలో రూపొందుతోన్న ఈ చిత్రంలో తనదైన శైలిలో వినోదాన్ని జోడించారట మేర్లపాక గాంధీ. హైదరాబాద్‌లో వేసిన ఓ ప్రత్యేకమైన సెట్‌లో వరుణ్ తేజ్ పాల్గొనగా ఓ స్పెషల్ సాంగ్‌ను చిత్రీకరించారట. ఈ సాంగ్‌లో ఆయన సరసన దక్షా నగార్కర్ స్టెప్స్ వేశారని టాక్. తర్వాతి షెడ్యూల్ కొరియాలో ప్రారంభం కానుంది. ఈ చిత్రానికి 'కొరియన్ కనకరాజు' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నారట మేకర్స్.

రైల్వే కాలనీలో దెయ్యం

ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించే 'అల్లరి' నరేశ్ ఈ మధ్య సీరియస్ కథలు ఎంచుకుంటున్నారు. తాజాగా ఆడియన్స్‌ని భయపెట్టేందుకు సిద్ధం అవుతున్నారు. ఆయన హీరోగా నటిస్తున్న చిత్రం '12 ఏ రైల్వే కాలనీ'. 'మా ఊరి పొలిమేర, మా ఊరి పొలిమేర 2' వంటి చిత్రాలకు దర్శకత్వం వహించిన అనిల్ విశ్వనాథ్ '12 ఏ రైల్వే కాలనీ' చిత్రానికి కథ, స్క్రీన్ ప్లే, మాటలు అందించడంతో పాటు షో రన్నర్‌గా వ్యవహరిస్తున్నారు. నాని కాసరగడ్డ దర్శకత్వం వహిస్తున్నారు. కామాక్షి భాస్కర్ల, సాయికుమార్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. పవన్ కుమార్ సమర్పణలో శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ పతాకంపై శ్రీనివాసా చిట్టూరి నిర్మిస్తున్నారు. హారర్ నేపథ్యంలో రూపొందుతోన్న ఈ చిత్రం టీజర్ ఇటీవల విడుదలైంది. 'ఈ ఆత్మలు కొంతమందికే ఎందుకు కనిపిస్తాయి రా.. అందరికీ ఎందుకు కనిపించవు' అనే డైలాగ్స్‌తో మొదలైన ఈ టీజర్ ఉత్కంఠగా సాగింది. 'ప్రాణాలతో బయటకు పోవుడు అవసరం లేదన్న...!' అంటూ టీజర్ చివర్లో నరేశ్ చెప్పే డైలాగులు ఆకట్టుకునేలా ఉన్నాయి. టీజర్‌ని బట్టి చూస్తే దెయ్యాలు, ఆత్మలు కనిపించే వ్యక్తి పాత్రలో నరేశ్ కనిపించనున్నారని తెలుస్తోంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ జరుపుకుంటోంది.

కిష్కింధపురిలో...

బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'కిష్కింధపురి'. 'రాక్షసుడు' వంటి చిత్రం తర్వాత హీరో శ్రీనివాస్, హీరోయిన్ అనుపమా పరమేశ్వరన్ జోడీగా నటిస్తున్న రెండో చిత్రం ఇది. 'చావు కబురు చల్లగా' ఫేమ్ డైరెక్టర్ కౌశిక్ పెగల్లపాటి ఈ సినిమాకి దర్శకత్వం వహిస్తున్నారు. అర్చన సమర్పణలో షైన్ స్క్రీన్ బ్యానర్‌పై సాహు గారపాటి నిర్మిస్తున్నారు. ఈ సినిమా పూర్తి స్థాయి హారర్ నేపథ్యంలో ఉంటుందట. ఇటీవల విడుదల చేసిన ఈ చిత్రం ఫస్ట్ లుక్ పోస్టర్‌కి మంచి స్పందన వచ్చింది. ఈ సినిమా చిత్రీకరణ దాదాపు పూర్తి దశకు చేరుకుందని టాక్. 'భైరవం' ప్రమోషన్స్‌లో ఉన్న సాయి శ్రీనివాస్ ఆ తర్వాత 'కిష్కింధపురి' చిత్రీకరణలో జాయిన్ కానున్నారట. వీలైనంత త్వరగా చిత్రీకరణ పూర్తి చేసి జూలై లేదా ఆగస్టు నెలలో ఈ సినిమాని విడుదల చేయనున్నారట మేకర్స్.

ఏ మిస్టిక్ వరల్డ్

ఆది సాయికుమార్ హీరోగా నటించిన తాజా చిత్రం 'శంబాల'. 'ఏ మిస్టిక్ వరల్డ్' అనేది ఉపశీర్షిక. యుగంధర్ ముని దర్శకత్వం వహించారు. తమిళ, మలయాళ భాషల్లో తనకంటూ మంచి గుర్తింపు తెచ్చుకున్న నటి స్వాసిక ఈ సినిమా ద్వారా తెలుగు ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. షైనింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై రాజశేఖర్ అన్నభీమోజు, మహీధర్ రెడ్డి నిర్మించారు. సూపర్ నేచురల్ హారర్ థ్రిల్లర్‌గా రూపొందుతోన్న ఈ సినిమాలో భౌగోళిక శాస్త్రవేత్త పాత్రలో ఆది కనిపించనున్నారు. ఇండియన్ సిల్వర్ స్క్రీన్‌పై ఇదివరకెన్నడూ టచ్ చేయని పాయింట్‌తో, కాల్పనిక ప్రపంచంలో జరిగే అద్భుతమైన ఘట్టాలతో ప్రేక్షకులన్ని సరికొత్త ఆధ్యాత్మిక ప్రపంచంలోకి తీసుకెళ్లేలా ఈ సినిమా ఉంటుందని చిత్ర యూనిట్ ప్రకటించింది. భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో వీఎఫ్ఎక్స్ ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయట. అదే విధంగా ఈ చిత్రంలోని భారీ యాక్షన్ ఎపిసోడ్స్ ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని అందిస్తాయని చిత్రబృందం పేర్కొన్న సంగతి తెలిసిందే. ఈ సినిమా త్వరలో విడుదల కానుంది.

పొలిమేరలో ట్విస్టులు

'సత్యం' రాజేశ్ ప్రధాన పాత్రలో హారర్, చేతబడి నేపథ్యంలో రూపొందిన 'మా ఊరి పొలిమేర' (2021), 'మా ఊరి పొలిమేర 2' (2023) సినిమాలు హిట్‌గా నిలిచాయి. దీంతో 'పొలిమేర 3'కి శ్రీకారం చుట్టారు మేకర్స్. తొలి, ద్వితీయ భాగాలకి దర్శకత్వం వహించిన అనిల్ విశ్వనాథ్ మూడో భాగాన్ని కూడా తెరకెక్కిస్తున్నారు. 'సత్యం' రాజేశ్, బాలాదిత్య, కామాక్షి భాస్కర్ల, గెటప్ శ్రీను, రవి వర్మ, రాకేందు మౌళి, 'చిత్రం' శ్రీను, సాహిత్య దాసరి ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. వంశీ నందిపాటి ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై భోగేంద్ర గుప్తాతో కలిసి వంశీ నందిపాటి ఈ సినిమా రూపొందిస్తున్నారు. తొలి, మలి భాగాల్లానే హారర్, చేతబడి అంశాలతో పాటు ప్రస్తుతం సమాజంలోని ఓ బర్నింగ్ ఇష్యూని టచ్ చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. పైగా తొలి రెండు భాగాలతో పోలిస్తే 'పొలిమేర 3'లో ప్రేక్షకులకు ఊహకందని ట్విస్టులు ఉంటాయని 'సత్యం' రాజేశ్ ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. ఆ మధ్య విడుదలైన 'పొలిమేర 3' వీడియో గ్లింప్స్‌కి మంచి స్పందన వచ్చింది. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది.

చైన్ రియాక్షన్ ఆఫ్ కర్మ

వైవిధ్యమైన పాత్రలతో ప్రేక్షకులను అలరిస్తున్న నటి వరలక్ష్మీ శరత్ కుమార్ లీడ్ రోల్‌లో నటిస్తున్న తాజా చిత్రం 'పోలీస్ కంప్లైయింట్'. సంజీవ్ మేగోటి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో నవీన్ చంద్ర, కృష్ణ సాయి, రాగిణి ద్వివేది, రవి శంకర్, ఆదిత్య ఓం, శ్రీనివాస్ రెడ్డి, సప్తగిరి వంటి వారు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఎమ్ ఎస్‌కే ప్రమిదశ్రీ ఫిలిమ్స్, శ్రీ విష్ణు గ్లోబల్ మీడియా బ్యానర్లపై సింగపూర్ బాల కృష్ణ, మల్లెల ప్రభాకర్ నిర్మిస్తున్నారు. హారర్ నేపథ్యంలో రూపొందుతోన్న ఈ చిత్రం షూటింగ్ శరవేగంగా జరుపుకుంటోంది. "చైన్ రియాక్షన్ ఆఫ్ కర్మ' అనే కాన్సెప్ట్ ఆధారంగా ఈ సినిమా రూపొందుతోంది. మనం చేసే ప్రతి చర్యకి ఫలితంగా అదే తిరిగి మనకు వస్తుందనే కాన్సెప్ట్‌తో హారర్ థ్రిల్లర్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమాని సరికొత్తగా చూపించే ప్రయత్నం చేస్తున్నాం. హారర్ చిత్రాల్లో మా సినిమా విభిన్నంగా ఉంటుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఇదిలా ఉంటే... ఈ సినిమాలో సూపర్ స్టార్ కృష్ణగారి మీద స్పెషల్ సాంగ్ చిత్రీకరించారు మేకర్స్. "ఆ పాట సినిమాకే మెయిన్ హైలెట్‌గా నిలవడంతో పాటు అందరికీ గుర్తుండిపోయేలా ఉంటుంది'' అని మేకర్స్ ప్రకటించారు.

మదర్ సెంటిమెంట్... హారర్

సుమన్ బాబు ముఖ్య పాత్ర పోషించి, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'ఎర్రచీర- ది బిగినింగ్'. కారుణ్య చౌదరి హీరోయిన్‌గా నటించగా, రాజేంద్రప్రసాద్ మనవరాలు బేబీ సాయి తేజస్విని, అయ్యప్ప పి.శర్మ కీలక పాత్రలు పోషించారు. బేబి డమరి సమర్పణలో శ్రీ పద్మాలయ ఎంటర్‌టైన్మెంట్స్-శ్రీ సుమన్ వెంకటాద్రి ప్రొడక్షన్స్‌పై నిర్మించిన ఈ సినిమా హారర్, మదర్ సెంటిమెంట్, యాక్షన్ అంశాలతో రూపొందింది. "ఈ కథలో మదర్ సెంటిమెంట్ ఆకట్టుకునేలా ఉంటుంది. క్లైమాక్స్ ఎపిసోడ్, ఎక్కువ మంది అఘోరాలతో శివుడిని చూపిస్తూ షూట్ చేసిన సీక్వెన్స్ బాగా వచ్చాయి. 45 నిముషాల పాటు ఉండే గ్రాఫిక్స్ చాలా హైలైట్‌గా నిలుస్తాయి. ప్రేక్షకులకు ఈ చిత్రం అద్భుతమైన అనుభవాన్ని అందిస్తుంది. హారర్ నేపథ్యంలో వచ్చిన చిత్రాలను ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరిస్తారు. మా 'ఎర్రచీర' కూడా ప్రేక్షకులను అలరిస్తుందనే నమ్మకం ఉంది'' అంటూ చిత్రయూనిట్ పేర్కొంది. తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో ఈ సినిమా విడుదల కానుంది.

పీరియాడిక్ డ్రామా

కన్నడ నటుడు గణేశ్ హీరోగా నటిస్తున్న సినిమా 'పినాక'. ఈ సినిమాతో కొరియోగ్రాఫర్ బి. ధనంజయ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వ ప్రసాద్, కృతీ ప్రసాద్ నిర్మిస్తున్నారు. హారర్ నేపథ్యంలో రూపొందుతోన్న ఈ చిత్రం టీజర్‌ని విడుదల చేశారు మేకర్స్. ఈ చిత్రంలో క్షుద్ర, రుద్ర పాత్రల్లో కనిపించనున్నారు గణేశ్. ఈ చిత్రం ప్రేక్షకులకు మరిచిపోలేని సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ని అందిస్తుందని మేకర్స్ ప్రకటించారు. ఈ సినిమా తెలుగులోనూ విడుదల కానుంది.

- దేరంగుల జగన్ మోహన్



● చిరంజీవి

చలో డెహ్రాడూన్

డెహ్రాడూన్ వెళ్తున్నారట చిరంజీవి అండ్ టీమ్. చిరంజీవి హీరోగా అనిల్ రావూడి దర్శకత్వంలో ఓ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ మూవీ తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో నయనతార హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ సినిమాలోని మరో హీరోయిన్ పాత్రలో కేథరిన్, ఓ కీలకమైన అతిథి పాత్రలో వెంకటేశ్ నటిస్తారనే ప్రచారం సాగుతోంది. ఇటీవల హైదరాబాద్‌లో ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభమైంది. చిరంజీవితో పాటు ఈ సినిమాలోని ఇతర ప్రధాన తారాగణం పాల్గొనగా, కీలక సన్నివేశాలను చిత్రీకరించారు. కాగా ఈ సినిమా నెక్ట్స్ షెడ్యూల్ డెహ్రాడూన్, ముస్సోరి లొకేషన్స్‌లో జరుగుతుందని, అక్కడ ఓ పాటతో పాటు కొన్ని కీలక సన్నివేశాల చిత్రీకరణ ఉంటుందని ఫిల్మ్‌నగర్ సమాచారం. ఈ షెడ్యూల్ దాదాపు రెండు వారాలు సాగుతుందట. సాహు గారపాటి, సుష్మితా కొణిదెల నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది సంక్రాంతి సందర్భంగా విడుదల కానుంది. ఈ సినిమాకు భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు.











● సమంత

ఇక్కడ ఏమీ లేదు!

హీరోయిన్ సమంత క్రేజ్ గురించి ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. చేతిలో సినిమాలు ఉన్నా లేకున్నా సోషల్ మీడియాలో మాత్రం ఆమె ఎప్పుడూ ఫుల్ యాక్టివ్‌గా ఉంటారు. ఎప్పటికప్పుడు తన వ్యక్తిగతం లేదా సినిమాలు, వర్కౌట్స్, ఆరోగ్య సూత్రాలు... ఇలా ఏదో ఒక విషయాన్ని షేర్ చేస్తూ తన అభిమానులతో టచ్‌లో ఉంటారు. ప్రస్తుతం ఆమె అబుదాబీలో ఉన్నారు. అక్కడ హ్యాపీగా... జాలీగా ఎంజాయ్ చేస్తున్న ఫొటోలను సోషల్ మీడియా వేదికగా పోస్ట్ చేశారు సమంత. "ఇక్కడ ఏమీ లేదు... సౌండ్ లేదు... హడావిడి లేదు... చక్కని స్పేస్ ఉంది'' అంటూ వెకేషన్‌లో భాగంగా అబుదాబీలో సంతోషంగా ఉన్న అక్కడి ఫొటోలను ఆమె షేర్ చేయగా, వైరల్‌గా మారాయి. దుబాయ్‌లో జరిగిన ఓ జ్యువెలరీ బ్రాండ్ ఈవెంట్‌లో పాల్గొన్న సమంత అనంతరం అక్కడి అందాలను చూస్తూ సందడి చేస్తున్నారు. ఇక సమంత కెరీర్ విషయానికొస్తే... విజయ్ దేవరకొండ హీరోగా నటించిన 'ఖుషి' (2023) సినిమా తర్వాత మరో తెలుగు చిత్రంలో నటించలేదు సమంత. అయితే తన సొంత బ్యానర్ ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్‌పై ఆమె నిర్మించిన తొలి చిత్రం 'శుభం' మే 9న విడుదలైంది. ఈ చిత్రంలో అతిథి పాత్రలో మెరిశారు. ప్రస్తుతం 'రక్త్ బ్రహ్మాండ్ ది బ్లడీ కింగ్‌డమ్' అనే వెబ్ సిరీస్‌తో పాటు 'మా ఇంటి బంగారం' అనే సినిమా చేస్తున్నారు సమంత.

వినోదం ఆరంభం



● అదితీరావ్, పంకజ్

వినోద ప్రధానంగా రూపొందుతున్న కొత్త సినిమాకు హీరోయిన్ అదితీ రావ్ హైదరీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. పంకజ్ త్రిపాఠి, అదితీ రావ్‌హైదరీ లీడ్ యాక్టర్స్‌గా హిందీలో 'పరివారిక్ మనోరంజన్' అనే చిత్రం తెరకెక్కుతోంది. వరుణ్. వి. శర్మ ఈ సినిమాకు దర్శకుడు. వినోద్ భానుషాలి, హిమాన్షు మెహ్రా నిర్మిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ గురువారం లక్నోలో ప్రారంభమైంది. పంకజ్, అదితీ పాల్గొనగా, కీలక సన్నివేశాల చిత్రీకరణ జరుగుతోంది. "ఈ సినిమా స్క్రిప్ట్ వింటున్నంత సేపు నవ్వుతూనే ఉన్నాను. ఇలాంటి తరహా కొత్త కథలో నటిస్తుండటం ఇదే తొలిసారి. కథలో సందర్భానుసారం వచ్చే కామెడీ, టర్న్ అండ్ ట్విస్ట్స్ నన్ను ఈ సినిమా చేసేందుకు ఒప్పుకునేలా చేశాయి. ఇక ఈ జానర్‌లో పంకజ్ సార్ మాస్టర్. ఆయన లాంటి వ్యక్తులతో కలిసి నటించడం నాకు కచ్చితంగా ఓ మంచి లెర్నింగ్ ఎక్స్‌పీరియన్స్'' అని చెప్పుకొచ్చారు అదితీరావ్ హైదరీ. ఈ సినిమాకు దర్శక-నిర్మాత అలీ అబ్బాస్ జాఫర్ ఓ క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తుండం విశేషం. ఈ 'పరివారిక్ మనోరంజన్' సినిమాను 2026 వేసవిలో విడుదల చేయాలనుకుంటున్నారట మేకర్స్.

టాప్ సీడ్‌పై రష్మిక విజయం



సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) డబ్ల్యూ75 మహిళల టోర్నీలో హైదరాబాద్ క్రీడాకారిణి భమిడిపాటి శ్రీవల్లి రష్మిక సంచలనం సృష్టించింది. అమెరికాలోని సౌత్ కరోలినా రాష్ట్రంలోని సమ్టర్ పట్టణంలో ఈ టోర్నీ జరుగుతోంది. గురువారం జరిగిన సింగిల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌లో ప్రపంచ 335వ ర్యాంకర్ రష్మిక 3–6, 6–3, 6–3తో టాప్ సీడ్, ప్రపంచ 212వ ర్యాంకర్ హనా చాంగ్ (అమెరికా)ను బోల్తా కొట్టించింది. 2 గంటల 31 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రష్మిక ఒక ఏస్ కొట్టి, నాలుగు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తన సర్వీస్‌ను ఐదుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను ఆరుసార్లు బ్రేక్ చేసింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో అమెరికాకే చెందిన జూలియా ఫ్లిగ్నెర్‌తో రష్మిక తలపడుతుంది. డబుల్స్‌లో రష్మిక (భారత్)–కేథరీన్ సెబోవ్ (కెనడా) జోడీ క్వార్టర్ ఫైనల్ చేరుకుంది. తొలి రౌండ్‌లో రష్మిక–కేథరీన్ ద్వయం 7–6 (8/6), 6–4తో అయానా అక్లి–డలేనా హెవిట్ (అమెరికా) జోడీపై గెలిచింది.

ఇంగ్లండ్ టెస్టు జట్టులో ఓవర్టన్ పునరాగమనం

లండన్: భారత జట్టుతో ఈనెల 20 నుంచి లీడ్స్‌లో జరిగే తొలి టెస్టులో పాల్గొనే ఇంగ్లండ్ జట్టును ప్రకటించారు. 14 మంది సభ్యులతో కూడిన ఇంగ్లండ్ జట్టుకు బెన్ స్టోక్స్ నాయకత్వం వహిస్తాడు. ఆల్‌రౌండర్ జేమీ ఓవర్టన్ మూడేళ్ల విరామం తర్వాత ఇంగ్లండ్ టెస్టు జట్టులోకి వచ్చాడు. 2022లో లీడ్స్ మైదానంలోనే న్యూజిలాండ్‌తో జరిగిన టెస్టు ద్వారా ఓవర్టన్ అరంగేట్రం చేశాడు. ఆ మ్యాచ్‌లో ఓవర్టన్ 97 పరుగులు చేయడంతోపాటు రెండు వికెట్లు తీశాడు. ఆ తర్వాత ఓవర్టన్‌కు మళ్లీ టెస్టులు ఆడే అవకాశం లభించలేదు. మంగళవారం ముగిసిన ఐపీఎల్ టోర్నీలో ఓవర్టన్ చెన్నై సూపర్ కింగ్స్ జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. మే 29న వెస్టిండీస్‌తో జరిగిన తొలి వన్డే సందర్భంగా ఓవర్టన్ చేతి వేలికి గాయమైంది. అయితే భారత్‌తో టెస్టుకల్లా ఓవర్టన్ కోలుకుంటాడని ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు విశ్వాసంతో ఉంది.



ఇంగ్లండ్ టెస్టు జట్టు: బెన్ స్టోక్స్ (కెప్టెన్), షోయబ్ బషీర్, జేకబ్ బెథెల్, హ్యారీ బ్రూక్, బ్రైడన్ కార్స్, స్యామ్ కుక్, జాక్ క్రాలీ, బెన్ డకెట్, జేమీ ఓవర్టన్, ఓలీ పోప్, జో రూట్, జేమీ స్మిత్ (వికెట్ కీపర్), జోష్ టంగ్, క్రిస్ వోక్స్.

కేఎల్ రాహుల్‌పై అందరి దృష్టి

నేటి నుంచి రెండో అనధికారిక టెస్టు

ఇంగ్లండ్ లయన్స్‌తో తలపడనున్న భారత్ ‘ఎ’



నార్తంప్టన్: ఇంగ్లండ్‌తో ప్రతిష్టాత్మక టెస్టు సిరీస్‌కు ముందు... ఇంగ్లండ్ లయన్స్‌తో భారత ‘ఎ’ జట్టు రెండో అనధికారిక టెస్టు మ్యాచ్‌కు రంగం సిద్ధమైంది. భారత జట్టుకు ఎంపికైన ఆటగాళ్లకు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్న ఈ నాలుగు రోజుల మ్యాచ్ మంచి ప్రాక్టీస్ కానుండగా... సీనియర్ బ్యాటర్ కేఎల్ రాహుల్‌పై అందరి దృష్టి నిలవనుంది. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి టెస్టు ఫార్మాట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన అనంతరం జట్టులో అందరి కంటే అనుభవజ్ఞుడైన రాహుల్‌పై బాధ్యత పెరగగా... ఈ మ్యాచ్‌లో అతడు ఎలాంటి ప్రదర్శన కనబరుస్తాడో చూడాలి. టీమిండియా టెస్టు కెప్టెన్‌గా కొత్తగా ఎంపికైన శుబ్‌మన్ గిల్, యువ ఓపెనర్ సాయి సుదర్శన్ ఇంకా ఇంగ్లండ్‌కు చేరుకోకపోవడంతో ఆ ఇద్దరూ ఈ మ్యాచ్‌లో పాల్గొనడంలేదు. ఇంగ్లండ్‌తో సిరీస్ కోసం ఈరోజు లండన్ బయలుదేరనున్న మిగిలిన ఆటగాళ్లు ప్రాక్టీస్ అనంతరం ఇంటర్ స్క్వాడ్ మ్యాచ్ ఆడనున్నారు. తొలి అనధికారిక మ్యాచ్‌లో కరుణ్ నాయర్ డబుల్ సెంచరీతో కదం తొక్కగా... సర్ఫరాజ్ ఖాన్, ధ్రువ్ జురెల్, యశస్వి జైస్వాల్, అభిమన్యు ఈశ్వరన్, నితీశ్ కుమార్ రెడ్డి అర్ధశతకాలు సాధించారు. ఈ నెల 20 నుంచి భారత్, ఇంగ్లండ్ మధ్య తొలి టెస్టు జరగనుండగా... ప్రాక్టీస్ మ్యాచ్‌ల ప్రదర్శన ఆధారంగా తుది జట్టు ఎంపిక జరగనుంది. భారత టెస్టు జట్టులో చోటు దక్కించుకున్న ఆరుగురు ఆటగాళ్లు ఇంగ్లండ్ లయన్స్‌తో తొలి అనధికారిక టెస్టులో పాల్గొనగా... పేసర్ ఆకాశ్ దీప్ ఈ మ్యాచ్ బరిలోకి దిగే అవకాశం ఉంది. ఆస్ట్రేలియా పర్యటనలో అటు బంతితో ఇటు బ్యాట్‌తో ఆకట్టుకున్న ఆంధ్ర ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి ఈ ఏడాది ఐపీఎల్‌లో పెద్దగా ఆకట్టుకోలేకపోయాడు. తొలి ప్రాక్టీస్ మ్యాచ్‌లో ధనాధన్ షాట్‌లతో హాఫ్‌సెంచరీ చేసిన నితీశ్... బంతితోనూ సత్తాచాటాలని భావిస్తున్నాడు. తుది జట్టులో చోటు కోసం మరో పేస్ ఆల్‌రౌండర్ శార్దుల్ ఠాకూర్‌తో నితీశ్ పోటీపడాల్సి ఉంటుంది. ఈ మ్యాచ్‌కు కూడా బ్యాటింగ్ పిచ్ అందుబాటులో ఉంది. ఇంగ్లండ్ టెస్టు జట్టులో సభ్యులైన క్రిస్ వోక్స్, జోష్ టంగ్ లయన్స్ తరఫున రాణించాలని చూస్తున్నారు.

ఈసారి కొత్త ‘ఫ్రెంచ్’ క్వీన్



సబలెంకా

గత మూడేళ్లుగా పారిస్‌లోని ఎర్రమట్టి కోర్టులపై తన ఆధిపత్యం చాటుకున్న పోలాండ్ టెన్నిస్ స్టార్ ఇగా స్వియాటెక్ ఈసారి రిక్తహస్తాలతో వెనుదిరగనుంది. వరుసగా నాలుగో ఏడాది ఫ్రెంచ్ ఓపెన్ మహిళల సింగిల్స్ టైటిల్ నెగ్గాలని భావించిన స్వియాటెక్‌ను బెలారస్ స్టార్, ప్రపంచ నంబర్‌వన్ అరీనా సబలెంకా బోల్తా కొట్టించింది. మరోవైపు అమెరికా స్టార్ కోకో గాఫ్ కూడా తన జోరును కొనసాగిస్తూ టైటిల్ పోరుకు అర్హత సాధించింది. ‘వైల్డ్ కార్డు’తో బరిలోకి దిగిన ప్రపంచ 361వ ర్యాంకర్, ఫ్రాన్స్ రైజింగ్ స్టార్ లూయి బొయిసన్ ప్రస్థానం సెమీఫైనల్‌కు పరిమితమైంది. సబలెంకా ఫ్రెంచ్ ఓపెన్‌లో తొలిసారి ఫైనల్‌కు చేరడం... 2022లో తుది పోరుకు చేరి రన్నరప్ ట్రోఫీతో సరిపెట్టుకున్న కోకో గాఫ్ కూడా అంతిమ సమరానికి అర్హత పొందిన నేపథ్యంలో... ఈసారి ఫ్రెంచ్ ఓపెన్ మహిళల సింగిల్స్‌లో కొత్త చాంపియన్ అవతరించడం ఖరారైంది. శనివారం జరిగే ఫైనల్లో సబలెంకా, కోకో గాఫ్ అమీతుమీ తేల్చుకుంటారు.



స్వియాటెక్

- ఫైనల్లో సబలెంకా, కోకో గాఫ్
- సెమీస్‌లో డిఫెండింగ్ చాంపియన్ స్వియాటెక్‌పై బెలారస్ స్టార్ విజయం
- ‘వైల్డ్ కార్డు’ బొయిసన్ జోరుకు అమెరికా స్టార్ బ్రేక్

పారిస్: ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్‌లో పోలాండ్ స్టార్, ప్రపంచ మాజీ నంబర్‌వన్ ఇగా స్వియాటెక్ 1457 రోజుల తర్వాత తొలి పరాజయాన్ని చవిచూసింది. 9–6–2021న చివరిసారి ఈ టోర్నీలో ఓడిపోయిన ఆమె వరుసగా 2022, 2023, 2024లలో ఫ్రెంచ్ ఓపెన్ చాంపియన్‌గా నిలిచింది. ఈసారీ స్వియాటెక్ గెలిచి ఉంటే ఓపెన్ శకంలో (1968 నుంచి) ఫ్రెంచ్ ఓపెన్ మహిళల సింగిల్స్ టైటిల్‌ను వరుసగా నాలుగేళ్లు నెగ్గిన తొలి క్రీడాకారిణిగా కొత్త చరిత్ర సృష్టించేది. తన అసమాన పోరాటంతో చరిత్ర పుటల్లో స్వియాటెక్‌కు స్థానం దక్కకుండా బెలారస్ స్టార్, ప్రపంచ నంబర్‌వన్ సబలెంకా చేసింది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి సెమీఫైనల్లో టాప్ సీడ్ సబలెంకా 7–6 (7/1), 4–6, 6–0తో స్వియాటెక్‌ను ఓడించి తొలిసారి తన కెరీర్‌లో ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. 2 గంటల 19 నిమిషాలపాటు జరిగిన సెమీఫైనల్లో సబలెంకాకు తొలి రెండు సెట్‌లలో గట్టిపోటీ ఎదురైంది. తొలి సెట్‌ను టైబ్రేక్‌లో నెగ్గిన సబలెంకా రెండో సెట్‌ను చేజార్చుకుంది. నిర్ణాయక మూడో సెట్‌లో సబలెంకా చెలరేగిపోయింది. మూడుసార్లు స్వియాటెక్ సర్వీస్‌ను బ్రేక్ చేయడంతోపాటు తన సర్వీస్‌ను మూడుసార్లు నిలబెట్టుకొని విజయాన్ని ఖరారు చేసుకుంది. సబలెంకా దెబ్బకు మూడో సెట్‌లో స్వియాటెక్ ఒక్క గేమ్ కూడా నెగ్గలేకపోయింది. స్వియాటెక్‌తో 13వసారి తలపడ్డ సబలెంకా ఐదోసారి విజయాన్ని అందుకుంది. మ్యాచ్ మొత్తంలో మూడు ఏస్‌లు సంధించిన బెలారస్ స్టార్ రెండు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. ఆరుసార్లు తన సర్వీస్‌ను కోల్పోయి ప్రత్యర్థి సర్వీస్‌ను ఎనిమిదిసార్లు బ్రేక్ చేసింది. 29 విన్నర్స్ కొట్టిన సబలెంకా 25 అనవసర తప్పిదాలు చేసింది. నెట్ వద్దకు ఎనిమిదిసార్లు దూసుకొచ్చి నాలుగుసార్లు పాయింట్లు గెలిచింది. మరోవైపు స్వియాటెక్ ఒక ఏస్‌తో సరిపెట్టుకొని, నాలుగు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. 29 విన్నర్స్ కొట్టిన ఆమె ఏకంగా 42 అనవసర తప్పిదాలతో మూల్యం చెల్లించుకుంది.

సెమీస్‌లో జొకోవిచ్

పురుషుల సింగిల్స్ విభాగంలో సెర్బియా దిగ్గజం నొవాక్ జొకోవిచ్ సెమీఫైనల్లోకి దూసుకెళ్లాడు. మూడో సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ)తో జరిగిన క్వార్టర్ ఫైనల్లో జొకోవిచ్ 4–6, 6–3, 6–2, 6–4తో గెలుపొంది ఈ టోర్నీలో 13వసారి సెమీఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకున్నాడు.



కోకో గాఫ్

రెండో సెమీఫైనల్లో 2022 రన్నరప్, ప్రపంచ రెండో ర్యాంకర్ కోకో గాఫ్ (అమెరికా) 6-1, 6-2తో లూయి బొయిసన్ (ఫ్రాన్స్)ను చిత్తుగా ఓడించింది. 69 నిమిషాల్లోనే ముగిసిన ఈ పోరులో కోకో గాఫ్ తన సర్వీస్‌ను ఒకసారి కోల్పోయి ప్రత్యర్థి సర్వీస్‌ను ఆరుసార్లు బ్రేక్ చేసింది. 12 విన్నర్స్ కొట్టి, 15 అనవసర తప్పిదాలు చేసింది. నెట్ వద్దకు 13 సార్లు దూసుకొచ్చి 8 సార్లు పాయింట్లు నెగ్గింది. మరోవైపు ప్రిక్వార్టర్ ఫైనల్లో మూడో సీడ్ జెస్సికా పెగూలా (అమెరికా), క్వార్టర్ ఫైనల్లో ఆరోసీడ్ మిరా ఆంద్రీవా (రష్యా)లను ఓడించిన బొయిసన్ సెమీఫైనల్లో ఒత్తిడికి లోనై తడబడింది. కేవలం ఎనిమిది విన్నర్స్ కొట్టిన ఆమె 33 అనవసర తప్పిదాలు చేసింది. ఈ టోర్నీకి ముందు 361వ ర్యాంక్‌లో ఉన్న బొయిసన్ తాజా ప్రదర్శనతో సోమవారం విడుదలయ్యే ర్యాంకింగ్స్‌లో 68వ స్థానానికి చేరుకోనుంది.



బొయిసన్

క్వార్టర్ ఫైనల్లో సాత్విక్–చిరాగ్ జోడీ

- పోరాడి ఓడిన పీవీ సింధు
- గాయత్రి–ట్రెసా ద్వయం అవుట్
- ఇండోనేసియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ



జకార్తా: భారత స్టార్ డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి ఇండోనేసియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–1000 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లగా... పీవీ సింధు పరాజయంతో ఇంటిబాట పట్టింది. గురువారం జరిగిన పురుషుల డబుల్స్ ప్రిక్వార్టర్స్‌లో సాత్విక్–చిరాగ్ జంట 16–21, 21–18, 22–20తో రస్మస్ జార్–ఫ్రెడెరిక్ సొగార్డ్ (డెన్మార్క్) జంటపై విజయం సాధించింది. 68 నిమిషాల పాటు సాగిన పోరులో భారత జోడీ తొలి గేమ్ కోల్పోయిన అనంతరం తిరిగి పుంజుకొని వరుస గేమ్‌ల్లో ప్రపంచ 16వ ర్యాంక్ జంటపై గెలుపొందింది. మిగిలిన విభాగాల్లో పోటీపడిన భారత షట్లర్లంతా ఓటమి పాలవడంతో ఈ టోర్నమెంట్‌లో సాత్విక్–చిరాగ్ మాత్రమే పోటీలో నిలిచారు. గత వారం సింగపూర్ ఓపెన్‌లో సెమీస్‌కు చేరిన ఈ జంట... క్వార్టర్స్‌లో శుక్రవారం ఏడో ర్యాంక్ జోడీ మాన్ వై చాంగ్–కై వున్ టీ (మలేసియా) తలపడనుంది.



సింధు

సింధు ఈసారి కూడా...

గత మ్యాచ్‌లో ప్రపంచ మాజీ చాంపియన్ నొజోమి ఒకుహారా (జపాన్)పై చక్కటి విజయంతో ఆశలు రేపిన పీవీ సింధు... అదే జోరు కొనసాగించడంలో విఫలమైంది. మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో సింధు 22–20, 10–21, 18–21తో ప్రపంచ ఎనిమిదో ర్యాంకర్ పోర్న్‌పవీ చోచువోంగ్ (థాయ్‌లాండ్) చేతిలో పోరాడి ఓడింది. 78 నిమిషాల పాటు సాగిన పోరులో తొలి గేమ్ గెలిచిన అనంతరం మిగిలిన రెండు గేమ్‌ల్లో ఓటమి పాలైంది. ‘ఈ మ్యాచ్‌ను విజయంతో ముగించాల్సింది. ఓవరాల్‌గా నా ప్రదర్శన బాగానే ఉంది. ఈ టోర్నీ నుంచి ఎంతో నేర్చుకున్నా. పొరబాట్లు సరిదిద్దుకొని తర్వాతి టోర్నీలో మరింత మెరుగైన ప్రదర్శన చేసేందుకు ప్రయత్నిస్తా’ అని సింధు పేర్కొంది. మిక్స్‌డ్ డబుల్స్ ప్రిక్వార్టర్స్‌లో సతీశ్ కుమార్ కరుణాకరన్–ఆద్య వరియత్ ద్వయం 7–21, 12–21తో ఆరో సీడ్ దెచాపోల్–సుపిసారా (థాయ్‌లాండ్) జోడీ చేతిలో ఓడింది. 25 నిమిషాల్లో ముగిసిన పోరులో భారత జంట థాయ్‌లాండ్ ద్వయం జోరు ముందు నిలవలేకపోయింది. మహిళల డబుల్స్‌లో పుల్లెల గాయత్రి–ట్రెసా జాలీ జంట 13–21, 22–24తో యుకీ ఫుకుషిమా–మయు మత్సుమోటో (జపాన్) ద్వయం చేతిలో ఓడింది.

26 ఏళ్ల తర్వాత...

- జర్మనీ జట్టుపై గెలిచిన పోర్చుగల్
- నేషన్స్ లీగ్ ఫైనల్లో రొనాల్డో జట్టు

మ్యూనిక్: ఒకటి కాదు... రెండు కాదు... మూడు కాదు... ఏకంగా 26 ఏళ్ల నిరీక్షణకు పోర్చుగల్ ఫుట్‌బాల్ జట్టు తెరదించింది. ప్రపంచ మాజీ చాంపియన్ జర్మనీ జట్టుపై 26 ఏళ్ల తర్వాత పోర్చుగల్ జట్టు మళ్లీ విజయం రుచి చూసింది. యూనియన్ ఆఫ్ యూరోపియన్ ఫుట్‌బాల్ అసోసియేషన్స్ (యూఈఎఫ్ఏ) నేషన్స్ లీగ్ టోర్నీలో భాగంగా గురువారం జరిగిన సెమీఫైనల్లో క్రిస్టియానో రొనాల్డో సారథ్యంలోని పోర్చుగల్ 2–1 గోల్స్ తేడాతో జర్మనీని ఓడించి ఫైనల్లోకి దూసుకెళ్లింది. పోర్చుగల్ తరఫున ఫ్రాన్సిస్కో కాన్సికావో (63వ నిమిషంలో), రొనాల్డో (68వ నిమిషంలో) ఒక్కో గోల్ చేయగా... జర్మనీ జట్టుకు విట్జ్ (48వ నిమిషంలో) ఏకైక గోల్ అందించాడు. పోర్చుగల్ తరఫున 220వ మ్యాచ్ ఆడిన రొనాల్డో 137వ గోల్‌ను సాధించాడు. అంతర్జాతీయ స్థాయిలో ఇప్పటి వరకు జర్మనీ, పోర్చుగల్ జట్లు ముఖాముఖిగా 20 సార్లు తలపడ్డాయి. 11 మ్యాచ్‌ల్లో జర్మనీ గెలుపొందగా... 4 మ్యాచ్‌ల్లో పోర్చుగల్ నెగ్గింది. ఐదు మ్యాచ్‌లు ‘డ్రా’గా ముగిశాయి. యూరోపియన్ చాంపియన్‌షిప్‌లో భాగంగా చివరిసారి 2000లో జర్మనీ జట్టుపై పోర్చుగల్ నెగ్గింది. ఆ తర్వాత జర్మనీతో జరిగిన ఐదు మ్యాచ్‌ల్లోనూ పోర్చుగల్‌కు పరాజయమే ఎదురైంది.



రొనాల్డో



సౌదీ అరేబియాలోని పవిత్ర మక్కాలో వార్షిక హజ్ యాత్ర కొనసాగుతోంది. ఇందులో భాగంగా ముస్లిం యాత్రికులు గురువారం అరాఫత్ మైదానంలో మౌంటెయిన్ ఆఫ్ మెర్సీ అని పిలిచే రాతి కొండపైకి చేరుకున్నప్పటి దృశ్యమిది.



అసోం రాష్ట్రం గువాహటి నగరంలో వరద తీవ్రతకు అద్దంపట్టే దృశ్యమిది. నగరంలోని అనిల్‌నగర్ ప్రాంతంలోకి చేరిన నడుము లోతు వరద

అసోంలో తగ్గని వరద తీవ్రత

గువాహటి: అసోంలో వరదల తీవ్రత గురువారం కూడా కొనసాగింది. మొత్తం ఏడు లక్షలమంది వరదలతో ప్రభావితులు కాగా, 21 జిల్లాల పరిధిలోని ప్రధాన నదుల్లో నీటి మట్టం అంతకంతకూ పెరుగుతోంది. వరదలు, కొండచరియలు విరిగి పడిన ఘటనల్లో మృతుల సంఖ్య 19కి చేరింది. బ్రహ్మపుత్ర సహా మొత్తం తొమ్మిది ప్రధాన నదులు ప్రమాద స్థాయిని దాటి ప్రవహిస్తున్నాయి. బరాక్, ఉపనదులు చచార్ జిల్లాలో ఉగ్రరూపాన్ని చూపుతున్నాయి. శ్రీభూమి జిల్లాలో అత్యధికంగా 339 గ్రామాల్లోని 2.60 లక్షల మందిపై వరద ప్రభావం పడింది. రాష్ట్రంలో వరదలతో మొత్తం 15 వేల హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయి. కజిరంగా నేషనల్ పార్క్ జలదిగ్బంధంలో చిక్కుకుంది. ఇలా ఉండగా, సిక్కింలోని చటెన్‌లో వరదల్లో చిక్కుకున్న 63 మంది హెలికాప్టర్ల ద్వారా సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వీరిలో ఎక్కువ మంది పర్యాటకులే కావడం గమనార్హం. చెటెన్‌లో చిక్కుకున్న మరో 64 మందిని బయటకు తీసుకువచ్చేందుకు ఆర్మీ, స్థానిక యంత్రాంగం ప్రయత్నాలు సాగిస్తున్నాయి. వాతావరణం అనుకూలించకపోవడంతో ఆలస్యమవుతోందని అధికారులు అంటున్నారు.

కొలువైన రాజారామ్ దర్బార్

అయోధ్య ప్రధానాలయం తొలి అంతస్తులో రాజదర్బార్ విగ్రహాలకు ప్రాణప్రతిష్ఠాపన

- పలు ఉపాలయాల్లో కన్నులపండువగా జరిగిన విగ్రహాల ప్రాణప్రతిష్ఠ
- యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ తొలి పూజలు
- శేషావతార్, శివుడు, గణపతి, హనుమాన్, సూర్య, భగవతి, అన్నపూర్ణ ఆలయాల్లో విగ్రహాల ప్రతిష్ఠాపన

అయోధ్య: ఆధ్యాత్మిక నగరి అయోధ్య మరోసారి ప్రాణప్రతిష్ఠ క్రతువులతో పండుగ శోభను సంతరించుకుంది. భవ్య రామమందిరంగా ఖ్యాతికెక్కిన బాలరామాలయంలో తొలి అంతస్తులో నూతనంగా ఏర్పాటుచేసిన 'రాజదర్బార్'కు వందలాది మంది పండితులు వేదమంత్రోచ్చారణల నడుమ ప్రాణ ప్రతిష్ఠచేశారు. లక్ష్మణ, హనుమ సమేత సీతా రాములు రాజసింహాసనంపై ఆసీనులైనట్లు చెక్కిన మహాద్భుతమైన విగ్రహాల ప్రాణప్రతిష్ఠాపనోత్సవ క్రతువును పండితులు గురువారం దిగ్విజయంగా జరిపించారు. కృష్ణశిలతో చెక్కిన రామ్‌లల్లా విగ్రహప్రతిష్ఠాపన కార్యక్రమంలో గత ఏడాది జనవరి 22న ప్రధాని మోదీ చేతులమీదుగా జరగ్గా గురువారం నాటి కార్యక్రమం ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సమక్షంలో జరిగింది. గోరఖ్‌పూర్‌లోని గోరఖ్‌నాథ్ మఠం ప్రధానార్చకుని హోదాలో ఆయన ఈ కార్యక్రమంలో పాల్గొన్నట్లు తెలుస్తోంది. హిందూ సాంప్రదాయాల ప్రకారం అత్యంత శుభప్రదంగా భావించే 'అభిజిత్' ముహూర్తంలోనే గురువారం ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించారు.

యజ్ఞమండపంలో పూజలతో మొదలు..

ఉదయం 6.30 గంటలకు యజ్ఞ మండపంలో ప్రత్యేక పూజలతో ప్రాణప్రతిష్ఠాపనోత్సవానికి నాంది పలికారు. 9 గంటలకు హోమం మొదలుపెట్టారు. ఏకధాటిగా గంటలపాటు హోమం చేశారు. తొలుత బాల రామాలయం మొదటి అంతస్థులో రామదర్బార్ విగ్రహాలను ఏర్పాటుచేశారు. సీతారాములు సింహాసనం ఆసీనులై ఉండగా వారికి ఇరువైపులా నిల్చున్న భరత, శతఘ్నులు తన్మయత్వంతో చూస్తున్నట్లు, హనుమ చేతులు జోడించి నమస్కరిస్తున్నట్లు, లక్ష్మణుడు మోకరిల్లి ఆరాధిస్తున్నట్లు విగ్రహాలను కొలువుతీర్చారు. కిరీటం, స్వర్ణాభరణాలతోపాటు మత్స్యాకృతిలో కర్ణాభరణాలతో మందహాసంతో ఆశీర్వదిస్తున్నట్లు రాజులా రాముని విగ్రహాన్ని చెక్కారు. ఈ విగ్రహాల ప్రాణప్రతిష్ఠ క్రతువులో సీఎం యోగి స్వయంగా పాల్గొని తొలి పూజలుచేశారు. అన్ని ఉపఆలయాల్లోనూ పూజలు అదే సమయానికి ఆరంభించారు. శేషావతార్, శివుడు, గణపతి, హనుమాన్, సూర్య, భగవతి, అన్నపూర్ణ ఆలయాల్లో విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమం కొనసాగింది. మొత్తంగా నాలుగు ప్రధాన ఘట్టాల్లో సీఎం యోగి పాల్గొన్నారు. అన్ని ఉప ఆలయాల్లో ఒకే ముహూర్తానికి కార్యక్రమం జరిగేలా ఖచ్చితమైన సమయపాలన పాటించారు. అన్ని ఉపాలయాల్లో కెమెరాలు, పెద్ద తెరలను ఏర్పాటుచేసి ప్రధాన పండితులు యావత్ కార్యక్రమం ఏకధాటిగా కొనసాగేలా పర్యవేక్షించారు. ప్రధాన ఆలయ తొలి అంతస్తులో శ్రీరామదర్బార్, మందిర కాంప్లెక్స్ ఇతర ప్రాంతాల్లో ముఖ్యంగా ఈశాన్య దిశలో శివాలయం, ఆగ్నేయ దిశలో గణపతి ఆలయం, దక్షిణ దిశలో హనుమాన్ దేవాలయం, నైరుతి దిశలో సూర్యదేవాలయం, వాయవ్య దిశలో భగవతి దేవీ ఆలయం, ఉత్తర దిశలో అన్నపూర్ణదేవీ ఆలయాలను ప్రారంభించారు.



అయోధ్య రామాలయం మొదటి అంతస్తులో గురువారం ప్రతిష్ఠించిన సీతారామ విగ్రహాలకు పూజలు చేస్తున్న అర్చకులు

దేశవ్యాప్తంగా విచ్చేసిన రుత్వికులు

"వేద సంప్రదాయాలను పాటిస్తూ కార్యక్రమాన్ని సవ్యంగా పూర్తిచేశాం. దేశవ్యాప్తంగా ప్రముఖులైన రుత్వికులు విచ్చేసి ఈ కార్యక్రమాన్ని జరిపించారు. గంగా దసరా జరుపుకుంటున్న రోజే ఉపాలయాల ప్రాణప్రతిష్ఠ జరగడం కొత్త ఆరంభానికి సంకేతం. శతాబ్దాల పోరాటం, ప్రయాసలు, విశ్వాసాలు ఇలా ఫలవంతమవుతున్నాయి" అని శ్రీరామజన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ ట్రస్టీ అనిల్ మిశ్రా అన్నారు. "రామదర్బార్ ప్రాణప్రతిష్ఠతో మరో చరిత్రాత్మకమైన ఘటనకు అయోధ్య సాక్షీభూతంగా నిలిచింది. రామదర్బార్ ఇకపై భక్తుల హృదయాల్లో భక్తిభావనను, ఆనందాన్ని మరింత పెంచుతుంది. ప్రజల ఆనందం, ఆరోగ్యం, శ్రేయస్సును కాంక్షిస్తూ రాముడి ఆశీస్సులు సదా దేశ ప్రజలపై ఉంటాయి" అని ప్రధాని మోదీ గురువారం 'ఎక్స్'లో ఒక పోస్ట్‌చేశారు. "శ్రీరామదర్బార్‌సహా ఎనిమిది ఆలయాల ఆరంభోత్సవంలో తొలి పూజలుచేసే భాగ్యం దక్కడం నిజంగా నా అదృష్టం. ఈ కార్యక్రమం ఏక్‌భారత్-శ్రేష్ఠ్ భారత్‌కు ప్రతీక. రామచంద్ర స్వామి విజయానికి గుర్తు" అని కార్యక్రమం తర్వాత సీఎం యోగి తన సామాజికమాధ్యమ 'ఎక్స్' ఖాతాలో ఒక పోస్ట్‌చేశారు. "ప్రాణప్రతిష్ఠాపన పూర్తయింది. రామరాజ్యానికి మరో ముందడుగు పడింది" అని బీజేపీ వ్యాఖ్యానించింది. "గంగా దసరా రోజు ఏదైనా కార్యం ఆరంభిస్తే మహాద్భుతమైన ఫలితాలనిస్తుంది. అందుకే రామాలయ ట్రస్ట్ ఈ రోజునే కార్యక్రమానికి ఎంపికచేసింది" అని అయోధ్యలోని జ్యోతిష్యుడు పండిట్ కల్కిరామ్ చెప్పారు.

పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు

ఒకేసారి పలు ఉపఆలయాల ప్రారంభోత్సవాన్ని కళ్లారా తిలకించేందుకు పెద్ద సంఖ్యల భక్తులు తరలివచ్చారు. ప్రాణప్రతిష్ఠ సమయంలో భక్తులు ఆనందతాండవం చేశారు. భక్తుల జైశ్రీరామ్ నినాదాలు, కీర్తనలు, పాటలు, నృత్యాలతో ఆ ప్రాంతమంతా సందడిగా మారింది. భక్తజనసందోహంతో అయోధ్య పరిసరాలన్నీ ఒక్కసారిగా పండగ కళను సంతరించుకున్నాయి. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ వంటి ఘటనల తర్వాత అయోధ్యలో జరుగుతున్న అత్యంత కీలకమైన కార్యక్రమం కావడంతో పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లుచేశారు. అయోధ్యకు వచ్చే వాహనాలను తనిఖీలు చేశారు. అయితే నూతన ఆలయాల్లోకి భక్తులను ఇంకా అనుమతించలేదు. భక్తుల సందర్శనలపై శనివారం తుది నిర్ణయం తీసుకునే వీలుంది. వీఐపీలకు సైతం అనుమతి లేదని జిల్లా మేజిస్ట్రేట్ నిఖిల్ తుకారామ్ పాండే చెప్పారు. తొలుత ప్రధానాలయం తొలి అంతస్తులోని రాజదర్బార్‌లోకి మాత్రమే భక్తులను అనుమతించే అవకాశం ఉంది.

కొన్నాళ్లు కొట్టుకోనీ!

- చిన్నపిల్లల్లా కీచులాడుతున్నారు
- రష్యా-ఉక్రెయిన్‌పై ట్రంప్ ఆగ్రహం

వాషింగ్టన్/కీవ్: రష్యా, ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపే విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేతులెత్తేశారు. రెండు దేశాలనూ ఇంకొన్నాళ్లు కొట్టుకోనివ్వడమే మేలని వ్యాఖ్యానించారు. గురువారం వైట్‌హౌస్‌లో జర్మనీ చాన్స్‌లర్ ఫ్రెడ్రిక్ మెర్జ్‌తో భేటీ సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అవి మరీ చిన్నపిల్లల మాదిరిగా కీచులాడుకుంటున్నాయంటూ ఆక్షేపించారు. "కొన్నిసార్లు ఓపికున్నంత సేపు కొట్టాకోనివ్వడమే మేలు. తర్వాత ఇద్దరినీ చెరోవైపు లాగేయాలి. నిన్న రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో ఫోన్లో మాట్లాడినప్పుడు కూడా ఇదే మాట చెప్పా" అని ట్రంప్ అన్నారు. అయితే, "నా మాట వినకపోతే చాలా కఠినంగా వ్యవహరిస్తా. యుద్ధానికి తెర దించకపోతే రెండు దేశాలపైనా ఆంక్షలు విధిస్తా" అంటూ మరోసారి కుండబద్దలు కొట్టారు.

రష్యా డ్రోన్ దాడుల్లో ఐదుగురు మృతి

బుధవారం రాత్రి ఉత్తర ఉక్రెయిన్‌లోని ప్రిలుకీ నగరంపై రష్యా డ్రోన్ దాడిలో ఐదుగురు మరణించారు. "స్థానిక ఫైర్ చీఫ్ ఒలెక్సాండర్ లెబిడ్ ఇంటిపై డ్రోన్ దాడులు జరిగాయి. ఆయన భార్య, కుమార్తె, ఏడాది వయసున్న మనవడు చనిపోయారు" అని అధ్యక్షుడు జెలెన్‌స్కీ చెప్పారు. చిన్నారి తల్లి కీవ్‌లో పోలీసు అధికారి. అక్కడ రష్యా దాడులు పెరగడంతో బాబును తల్లిదండ్రుల దగ్గర వదిలేందుకు వచ్చి తనతోపాటుగా బలైంది. పుతిన్‌తో ట్రంప్ ఫోన్ సంభాషణ జరిగిన కొద్ది గంటల్లోపే ప్రిలుకీపై దాడి జరగడం గమనార్హం. ఆదివారం తమ వైమానిక స్థావరాలపై జరిపిన దాడులకు గట్టి ప్రతీకారం తీర్చుకుంటామని పుతిన్ తనతో అన్నట్లు అనంతరం ట్రంప్ చెప్పారు. ఈ యుద్ధాన్ని ఆపేందుకు ట్రంప్ ప్రయత్నాలు సాగిస్తుండటం తెల్సిందే.

న్యూజిలాండ్ పార్లమెంట్‌లో

హాకా నిరసన

ముగ్గురు మావొరి పార్టీ ఎంపీల సస్పెన్షన్

వెల్లింగ్టన్: ప్రతిపాదిత చట్టాన్ని నిరసిస్తూ మావొరి హాకా ప్రదర్శించిన ముగ్గురు మావొరి సభ్యులను న్యూజిలాండ్ పార్లమెంట్ సస్పెండ్ చేసింది. హనా-రౌహిటి క్లార్క్‌పై ఏడు రోజుల నిషేధం, డెబ్బీ ఎన్‌గరెవా ప్యాకర్, రావిరి వైటిటిలకు 21 రోజుల చొప్పున నిషేధానికి సంబంధించిన ప్రతిపాదనపై పార్లమెంట్ గురువారం ఆమోద ముద్ర వేసింది. ఇంత సుదీర్ఘ కాలం ఎంపీలపై నిషేధం విధించడం న్యూజిలాండ్ పార్లమెంట్ చరిత్రలో ఇదే మొదటిసారి. వీరంతా న్యూజిలాండ్ మూలవాసులు మావోరీలకు చెందిన పార్టీ టె పటి మావోరికి చెందిన సభ్యులు. మూలవాసుల హక్కులకు భంగకరమంటూ ప్రభుత్వం ప్రతిపాదించిన బిల్లుపై గతేడాది నవంబర్‌లో చర్చ సమయంలో పార్లమెంట్‌లో వీరు హాకాతో నిరసన తెలిపారు.

జపాన్‌లో జననాలు 6.86 లక్షలే

2024లో రికార్డుస్థాయిలో పడిపోయిన జననాల సంఖ్య

- 2023 కంటే 5.7 శాతం తక్కువ నమోదు

టోక్యో: జపాన్‌లో జనాభా గణనీయంగా తగ్గిపోతోంది. గత ఏడాది జననాల సంఖ్య రికార్డుస్థాయిలో పడిపోయింది. దేశంలో 2024లో కేవలం 6,86,061 మంది శిశువులు జన్మించినట్లు ఆరోగ్య శాఖ బుధవారం ప్రకటించింది. ఒక సంవత్సరంలో ఇంత తక్కువగా జననాలు నమోదు కావడం ఇదే మొదటిసారి. 2023 కంటే ఇది 5.7 శాతం తక్కువ కావడం గమనార్హం. దేశంలో గత 16 ఏళ్లుగా వరుసగా జననాల సంఖ్య పడిపోతోంది. ఇక్కడ 1899 నుంచి శిశువుల జననాలను రికార్డు చేయడం మొదలైంది. 7 లక్షల కంటే తక్కువ మంది శిశువులు జన్మించడం 2024లోనే తొలిసారి. దేశంలో 1949లో రికార్డు స్థాయిలో 27 లక్షల మంది జన్మించారు. ఇప్పుడు ఆ సంఖ్య దాదాపు 7 లక్షలకు పడిపోయింది. కొత్త జననాలు పెరగకపోవడం, వృద్ధుల సంఖ్య భారీగా పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. దీనివల్ల భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు తప్పవని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఆర్థిక వ్యవస్థతోపాటు దేశ భద్రతకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని చెబుతున్నారు. జనాభా తగ్గడం అనేది 'నిశ్శబ్ద అత్యవసర పరిస్థితి' అని జపాన్ ప్రధానమంత్రి షిగేరు ఇషిబా అభివర్ణించారు. జననాల సంఖ్య పెంచేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. నూతన దంపతులకు ప్రోత్సాహకాలు ఇస్తామన్నారు. జపాన్‌లో ఒక మహిళ తన జీవితకాలంలో బిడ్డలను కనే సగటు రేటు 2023లో 1.2గా ఉండగా, 2024లో 1.1గా నమోదైంది. జపాన్ జనాభా ప్రస్తుతం 12.4 కోట్లు. 2070 నాటికి 8.7 కోట్లకు తగ్గిపోతుందని అంచనా. మొత్తం జనాభాలో 40 శాతం మంది 65 ఏళ్లు దాటినవారే ఉంటారని నిపుణులు చెబుతున్నారు.

వేలానికి అరుదైన గాంధీ చిత్రపటం

లండన్: జాతిపిత మహాత్మాగాంధీకి సంబంధించిన అరుదైన చిత్రపటం వేలానికి రాబోతోంది. యూకేలోని లండన్‌లో వచ్చే నెల 7వ తేదీన బాన్‌హామస్ కేంద్రంలో వేలం వేయబోతున్నారు. దీనికి రూ.58 లక్షల నుంచి రూ.81 లక్షల వరకు ధర పలకవచ్చని అంచనా వేస్తున్నారు. 1931లో బ్రిటిష్ కళాకారుడు క్లార్ లైటన్.. మహాత్మా గాంధీని స్వయంగా చూస్తూ ఈ చిత్రాన్ని రూపొందించారు. ఇది గాంధీజీ కూర్చున్న భంగిమలో ఉంది. గాంధీకి సంబంధించి కూర్చున్న భంగిమలో ఉన్న ఏకైక ఆయిల్ పెయింటింగ్ ఇదొక్కటేనని వేలం కేంద్ర నిర్వాకులు వెల్లడించారు.

దక్షిణాదికి అన్యాయం జరగకుండా పునర్విభజన

న్యూఢిల్లీ: నియోజకవర్గాల పునర్విభజన విషయంలో దక్షిణాది రాష్ట్రాల ఆందోళన, డిమాండ్లను కచ్చితంగా పరిగణనలోకి తీసుకుంటామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఇప్పటికే పలుమార్లు స్పష్టం చేసినట్లు హోంశాఖ అధికారి ప్రతినిధి గురువారం వెల్లడించారు. దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగకుండా పునర్విభజన ప్రక్రియ చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ విషయంలో దక్షిణాది రాష్ట్రాలతో ప్రభుత్వం సరైన సమయంలో సంప్రదింపులు జరుపుతుందన్నారు.

చైనా అధినేత జిన్‌పింగ్‌కు డొనాల్డ్ ట్రంప్ ఫోన్

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గురువారం చైనా అధినేత షీ జిన్‌పింగ్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఈ విషయాన్ని చైనా విదేశాంగ శాఖ ధ్రువీకరించింది. అమెరికా ప్రభుత్వం మాత్రం స్పందించలేదు. అమెరికా-చైనా మధ్య వాణిజ్య యుద్ధం ముదురుతున్న తరుణంలో ట్రంప్, జిన్‌పింగ్ మాట్లాడుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే, వారు ఏం చర్చించుకున్నారో తెలియరాలేదు. టారిఫ్‌లపై చర్చలను ముందుకు తీసుకెళ్లాలని వారు నిర్ణయించుకున్నట్లు సమాచారం. టారిఫ్‌లపై జిన్‌పింగ్‌తో ఒప్పందానికి రావడం అంత సులభం కాదని ట్రంప్ బుధవారం ఎక్స్‌లో పోస్టు చేశారు. ఆ మరుసటి రోజే జిన్‌పింగ్‌తో ట్రంప్ మాట్లాడడం గమనార్హం.

3,000 కొత్త కార్లు సముద్రంపాలు!

మంటల్లో చిక్కుకున్న భారీ సరకు రవాణా నౌక

- లైఫ్‌బోట్ సాయంతో సురక్షితంగా బయటపడిన 22 మంది సిబ్బంది

యాంకరేజ్: ఏకంగా 3,000 కొత్త కార్లతో చైనా నుంచి మెక్సికోకు బయల్దేరిన భారీ సరుకు రవాణా నౌకలో అగ్నిప్రమాదం సంభవించింది. అగ్నికీలలు మరింతగా విస్తరిస్తుండటతో నౌకను సిబ్బంది నడిసంద్రంలో వదిలేయాల్సి వచ్చింది. లైఫ్‌బోట్ సాయంతో 22 మంది సిబ్బందిని రక్షించగలిగారు. లండన్ కేంద్రంగా పనిచేసే జోడియాక్ మేరిటైమ్ సంస్థ ఈ 'ది మార్నింగ్ మిడాస్'నౌకను నిర్వహిస్తోంది. పసిఫిక్ మహాసముద్రంలో అమెరికాలోని అలాస్కా రాష్ట్ర పరిధిలోని అడాక్ దీవి సమీపంలో ఈ అగ్ని ప్రమాద ఘటన జరిగింది. ప్రమాదం జరిగినప్పుడు సమీపంలో ప్రయాణిస్తున్న కోస్కో హెలాస్ సరకు రవాణానౌకలోని సిబ్బంది అప్రమత్తమై మిడాస్ నౌకలోని 22 మంది సిబ్బందిని రక్షించారు. ఘటన జరిగినప్పుడు నౌకలో 800 కొత్త విద్యుత్ కార్లు సహా 3,000 కార్లు ఉన్నాయి. అగ్నికీలలను ఎలా అదుపులోకి తేవాలనే దానిపై జోడియాక్ సంస్థతో సంప్రతింపులు జరుపుతున్నామని అమెరికా తీర గస్తీ 17వ జిల్లా కమాండర్ రియర్ అడ్మిరల్ మెగాన్ డీన్ చెప్పారు. చైనాలో తయారైన ఈకార్లతో మే 26వ తేదీన నౌక బయల్దేరింది. మెక్సికోలోని లజారో కార్డెనాస్ నౌకాశ్రయానికి ఇది చేరుకోవాల్సి ఉండగా మార్గమధ్యంలో ఇలా అగ్నిప్రమాదంలో చిక్కుకుంది. ఈ నౌకను 2006లో చైనాకు చెందిన నౌకా తయారీ సంస్థ తయారుచేసింది. ఈ నౌక బరువు ఏకంగా 46,800 టన్నులు.



మార్నింగ్ మిడాస్ నౌక నుంచి వెలువడుతున్న దట్టమైన పొగలు

అదానీ, చైనాలకు 'నరేందర్-సరెండర్'

ప్రధాని మోదీపై కాంగ్రెస్ వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై కాంగ్రెస్ విమర్శల దాడిని పెంచింది. పారిశ్రామికవేత్త అదానీతోపాటు చైనాకు సైతం నరేందర్- సరెండర్ అంటూ వ్యాఖ్యానించింది. షోలే సినిమాలో జై-వీరూల జోడీని అదానీ, మోదీల ద్వయం మించిపోయిందని కాంగ్రెస్ నేత అజొయ్ కుమార్ ఎద్దేవా చేశారు. గురువారం ఆయన కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఎన్నో సంవత్సరాల ప్రాక్టీస్ తర్వాత ప్రధాని మోదీ అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు లొంగిపోవడమనే ప్రక్రియ పూర్తయింది. నరేంద్ర మోదీ ఎక్కడికెళ్లిన, అదానీ కోరిన విధంగా ఒక కాంట్రాక్ట్ మాత్రం గ్యారెంటీ. భారత ప్రధాని దౌత్య సంబంధాలు అంతర్జాతీయంగా పోర్టులు, ఎయిర్‌పోర్టులు, విద్యుత్, బొగ్గు గనులు, ఆయుధాలు వంటి రంగాల్లో పారిశ్రామిక వేత్త అదానీకి అనుకూలంగా ఉంటాయి'అని పేర్కొంటూ ఆయన కొన్ని ఉదాహరణలను ప్రస్తావించారు. మోదీ చైనాకు సైతం మోకరిల్లారన్న అజొయ్ కుమార్.. 2020లో భారత భూభాగాన్ని ఆక్రమించినా కూడా ఆ దేశానికి క్లీన్‌చిట్ ఇచ్చిన 'నరేందర్- సరెండర్'దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ఆరావళి గ్రీన్‌వాల్ ప్రాజెక్టు ప్రారంభం

న్యూఢిల్లీ: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని 'ఏక్ పేడ్ మా కే నామ్' కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. దేశ రాజధాని ఢిల్లీలోని భగవాన్ మహావీర్ వనస్థలి పార్కులో గురువారం మొక్క నాటారు. ఢిల్లీ నుంచి గుజరాత్‌లోని ఆరావళి పర్వతాల వరకు 700 కిలోమీటర్ల మేర అడవుల పెంపకం కోసం ఉద్దేశించిన 'ఆరావళి గ్రీన్‌వాల్ ప్రాజెక్టు'ను ప్రారంభించారు. మన భూగోళంపై ఆరావళి పర్వతాలు అత్యంత ప్రాచీనమైనవని 'ఎక్స్'లో పోస్టు చేశారు. గుజరాత్, రాజస్తాన్, హరియాణా, ఢిల్లీలో ఈ పర్వతాలు విస్తరించి ఉన్నాయని తెలిపారు. కాలుష్యం, వాతావరణ మార్పుల వల్ల ఇక్కడ అడవులు క్రమంగా అంతరించిపోతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. అందుకే అడవుల పునరుజ్జీవన పథకంపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి పెట్టిందని వెల్లడించారు. ఈ ఉద్యమంలో ప్రజలంతా పాల్గొనాలని, విరివిగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా యువత చొరవ తీసుకోవాలని కోరారు. ఆరావళి గ్రీన్‌వాల్ ప్రాజెక్టుతో పర్యావరణం మెరుగుపడుతుందని ప్రధాని మోదీ ఆశాభావం వ్యక్తంచేశారు.

బ్యాలెట్‌తోనే పార్టీకి మంచి రోజులు: మాయావతి

లక్నో: ఎన్నికల్లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు(ఈవీఎంలు) బదులు బ్యాలెట్ విధానాన్ని తీసుకువస్తే తమ పార్టీకి మంచి రోజులొస్తాయని బహుజన్ సమాజ్ పార్టీ(బీఎస్పీ) చీఫ్ మాయావతి చెప్పారు. ఈవీఎంలను ట్యాంపరింగ్ చేసి బీఎస్పీ అభ్యర్థులను గెలవకుండా చేస్తున్నారని ఆరోపించారు. లక్నోలో గురువారం ఆమె మీడియాతో మాట్లాడారు. ఇకపై జరిగే అన్ని ఎన్నికలకు బ్యాలెట్‌నే వాడాలని ఆమె పునరుద్ఘాటించారు. 'అధికారంలో, ప్రతిపక్షంలోనూ ఉన్న కులతత్వ భావజాలం కలిగిన పార్టీలు దళిత, ఇతర అణగారిన వర్గాలకు చెందిన కొంతమంది అవకాశవాద స్వార్థపరులైన వ్యక్తులతో తెరవెనుక రాజకీయాలు చేస్తున్నాయి. ఇలా అవతరించే వివిధ సంస్థలు, పార్టీలు మాకు మద్దతిచ్చే వర్గాలను తప్పుదారి పట్టిస్తున్నాయి. ముఖ్యంగా ఉత్తరప్రదేశ్‌లో బీఎస్పీ బలంగా ఉన్న ప్రాంతాల్లో ఇలాంటి కుట్రలతో ఓట్లను చీల్చాయి'అని మాయావతి వివరించారు. జాతీయ రాజకీయాల్లో బీఎస్పీ పాత్రను పరిమితం చేసేందుకు ప్రతిపక్ష రాజకీయ పార్టీలు అనేక ఎత్తుగడలను పాటిస్తున్నాయన్నారు. ఇందులో ఈవీఎంల ద్వారా ఫలితాలను తారుమారు చేయడం కూడా ఒకటని ఆమె పేర్కొన్నారు. బ్యాలెట్ పేపర్ల విధానాన్ని అమల్లోకి తెస్తే బీఎస్పీ పోగొట్టుకున్న రాజకీయ ప్రాబల్యాన్ని తిరిగి పొందుతుందని మాయావతి ఆశాభావం వ్యక్తం చేశారు.

మాజీ అధ్యక్షుడు యూన్‌పై ప్రత్యేక దర్యాప్తు

దక్షిణ కొరియా పార్లమెంట్ ఆమోదం

సియోల్: గతేడాది డిసెంబర్‌లో మాజీ అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ విధించిన అత్యవసర పరిస్థితితోపాటు ఆయన భార్యపై వచ్చిన అవినీతి ఆరోపణలపై విచారణ జరిపేందుకు దక్షిణ కొరియా నూతన ప్రభుత్వం చర్యలను వేగవంతం చేసింది. ఇందుకు ఉద్దేశించిన బిల్లుకు గురువారం పార్లమెంట్ 195–3 ఓట్ల తేడాతో ఆమోదం తెలిపింది. డెమొక్రాటిక్ పార్టీకి చెందిన నూతన అధ్యక్షుడు లీ జే మ్యుంగ్ సంతకంతో చట్టరూపం దాల్చనుంది. మ్యుంగ్ ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపునకు పాల్పడుతోందని ఆరోపిస్తూ ఓటింగ్‌లో ప్రతిపక్ష పీపుల్ పవర్ పార్టీ సభ్యులు పాల్గొనలేదు. అత్యవసర పరిస్థితిని విధించిన యూన్ డిసెంబర్‌లో అభిశంసనకు గురయ్యారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో పదవిని కోల్పోయారు. దేశంలో తిరుగుబాటును ప్రేరేపించిన ఆరోపణలపై యూన్‌పై విచారణ జరుపుతామని అధ్యక్షుడు లీ ప్రకటించారు. ఈ ఆరోపణలే రుజువైతే గరిష్ఠంగా మరణ శిక్ష పడే అవకాశముంది. యూన్ భార్య కిమ్ కియోన్ హీపై పలు అవినీతి ఆరోపణలున్నాయి. యూనిఫికేషన్ చర్చి నుంచి ఖరీదైన కానుకలను అందుకుని, వ్యాపారానికి అనుకూలంగా వ్యవహరించారని, స్టాక్ మార్కెట్‌లో అవకతవకలను పాల్పడ్డారని ఆరోపణలున్నాయి.

పుతిన్, ట్రంప్ ఫోన్ సంభాషణల్లో 'సిందూర్'

మాస్కో: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ల మధ్య జరిగిన ఫోన్ సంభాషణల్లో భారత్-పాక్‌లో మధ్య ఇటీవల చోటుచేసుకున్న ఘర్షణల విషయం సైతం ప్రస్తావనకు వచ్చింది. పశ్చిమాసియా పరిణామాలతోపాటు ట్రంప్ జోక్యంతో నిలిచిపోయిన భారత్-పాక్‌ల మధ్య సాయుధ ఉద్రిక్తతల గురించి బుధవారం చర్చించారని రష్యా అధ్యక్ష భవనం క్రెమ్లిన్ అధికార ప్రతినిధి యూరీ ఉషకోవ్ తెలిపారు. ఉక్రెయిన్ సంక్షోభం గురించి ప్రధానంగా మాట్లాడుకున్నారన్నారు. వివరాలను మాత్రం ఆయన వెల్లడించలేదు. తన వల్లే భారత్, పాక్‌ల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరినట్లు ట్రంప్ పదేపదే చెప్పుకుంటుండగా భారత్ అలాంటిదేమీ లేదని ఖండిస్తున్న విషయం తెల్సిందే.

వాన్స్‌తో సమగ్ర చర్చలు జరిపాం: థరూర్

వాషింగ్టన్: భారత పార్లమెంటేరియన్ల బృందం గురువారం అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్‌ను కలిసిందని ఎంపీ శశిథరూర్ తెలిపారు. ఉగ్రవాదంపై భారత్ చేస్తున్న పోరాటంతోపాటు సాంకేతిక రంగంలో ఇరుదేశాలు సహకరించుకునేందుకు గల అవకాశాలు తదితర అంశాలపై వాన్స్‌తో కూలంకషంగా చర్చించామన్నారు. 'వాషింగ్టన్ డీసీలో మా ప్రతినిధి బృందంతో ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ జరిపిన సమావేశం అద్భుతం'అంటూ శశిథరూర్ ఎక్స్‌లో పేర్కొన్నారు. ఈ బృందం అంతకుముందు గుయానా, పనామా, కొలంబియా, బ్రెజిల్ దేశాలకు వెళ్లి, పహల్గాం ఉగ్ర దాడి, అనంతరం ఆపరేషన్ సిందూర్ గురించి అక్కడి నేతలకు వివరించింది.

ఇత్తెహాద్ అనే ఉర్దూ పత్రికను ఎవరు స్థాపించారు?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
తెలంగాణ చరిత్ర

తెలంగాణ వైతాళికులు

కొమర్రాజు వెంకట లక్ష్మణరావు

తెలుగు భాష సాంస్కృతిక, సారస్వత పునరుజ్జీవనానికి కొమర్రాజు వెంకట లక్ష్మణరావు విశేష కృషి చేశారు. తెలుగులో చరిత్ర, పరిశోధనలు, వైజ్ఞానిక గ్రంథాలు లేని కొరతను తీర్చడానికి ఆయన మహోద్యమం నడిపారు. తెలుగు చరిత్ర పరిశోధనా పితామహుడిగా పేరొందిన కొమర్రాజు 1877లో కృష్ణాజిల్లా, నందిగామ తాలూకా పెనుగంచిప్రోలులో జన్మించారు. తండ్రి వెంకటప్పయ్య, తల్లి గంగమ్మ. ఇతడి పూర్వీకులు సాహిత్యాభిమానులు. వీరు మునగాల సంస్థానంలో దివాన్‌గా పనిచేశారు.

కొమర్రాజు లక్ష్మణరావు నాగపూర్‌లో విద్యాభ్యాసం చేశారు. కలకత్తా విశ్వవిద్యాలయం నుంచి ఎంఏ పట్టా పొందారు. నాగపూర్‌లో చదివిన రోజుల్లో ఆయన మరాఠీ నేర్చుకున్నారు. తిలక్, అగార్కర్, గోఖలే, రనడే లాంటి జాతీయ నాయకుల ప్రభావం కొమర్రాజుపై పడింది. 'కేసరి' అనే మరాఠీ పత్రికలో ఆయన వ్యాసాలు రాసేవారు. 'మోరోపంత్' అనే మహారాష్ట్ర కవి రచించిన మహాభారత కర్ణపర్వానికి పరిష్కర్త (ఎడిటర్)గా కొమర్రాజు పనిచేశారు. 1898లో 'జనానా' అనే తెలుగు పత్రికలో వ్యాసాలు ప్రచురించారు. 1900లో మునగాల సంస్థానంలో రాజా నాయని వెంకట రంగారావు వద్ద దివాన్‌గా చేరారు. స్వదేశీ ఉద్యమానికి తోడ్పాటు అందించేలా మునగాల రాజును ప్రోత్సహించారు. బెంగాలీ, గుజరాతీ, ప్రాకృతం, సంస్కృతంతోపాటు దక్షిణాది భాషల్లోనూ లక్ష్మణరావుకు ప్రావీణ్యం ఉంది.

భాషా సేవ: గ్రంథాలయోద్యమం తెలంగాణలో తెలుగు జాతిని జాగృతం చేసింది. గ్రంథాలయోద్యమంలో భాగంగా రావిచెట్టు రంగారావు, మునగాల రాజా నాయని వెంకట రంగారావు, ఆదిపూడి సోమనాథరావు లాంటి ప్రముఖుల ప్రోత్సాహంతో కొమర్రాజు లక్ష్మణరావు 1901లో హైదరాబాద్‌లో శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయాన్ని స్థాపించారు. 1904లో హనుమకొండలో శ్రీ రాజరాజ నరేంద్ర భాషానిలయం, 1905లో సికింద్రాబాద్‌లో ఆంధ్రసంవర్ధినీ గ్రంథాలయాన్ని నెలకొల్పారు. 1906లో హైదరాబాద్‌లో 'విజ్ఞాన చంద్రికా గ్రంథ మండలి' ముద్రణాలయాన్ని స్థాపించారు. నాయని వెంకట రంగారావు, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, అయ్యదేవర కాళేశ్వరరావుతో కలిసి కొమర్రాజు ఈ మండలిని స్థాపించారు. ఈ మండలి ఆంధ్రా–తెలంగాణ ప్రాంత ప్రజల మధ్య సాంస్కృతిక వారధిగా పనిచేసింది. సంఘ సంస్కరణ, జాతీయోద్యమం వ్యాప్తి లక్ష్యాలుగా ఈ సంస్థ పనిచేసింది. అందుకే ఈ ముద్రణాలయంలో ప్రపంచ మహాపురుషుల జీవిత చరిత్రలను ప్రచురించారు. 1906–11 మధ్య కాలంలో విజ్ఞాన చంద్రికా గ్రంథమండలి సుమారు 30 గ్రంథాలను ప్రచురించింది.

- 12వ శతాబ్దంలో మల్లికార్జున శివాచార్యుడు రచించిన 'శివతత్వసారం' శతకానికి లక్ష్మణరావు పీఠిక రాశారు. విష్ణుకుండినుల మూడో రాజైన మాధవ వర్మ శాసనాన్ని 1923లో కలకత్తా జర్నల్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ ఆఫ్ లెటర్స్‌లో ప్రచురించారు.
- తెలుగు భాషకు విశేషంగా సేవలందించిన కొమర్రాజు లక్ష్మణరావు 46 ఏళ్లకే మరణించారు.

అరిగె రామస్వామి

సమాజంలో ఏళ్ల తరబడి పీడనకు గురి అవుతోన్న నిమ్నజాతుల సముద్ధరణకు నిరంతరం కృషి చేసిన దీనజనోద్ధారకుడు అరిగె రామస్వామి. ఈయన సంఘ సంస్కర్త, దేశభక్తుడు. నిజాం నిరంకుశ పాలనలో వెనుకబడిన వర్గాల ప్రజల పరిస్థితి అత్యంత దుర్భరంగా ఉండేది. అంటరానివారిపై ఉన్నత వర్గాలు, ప్రభుత్వోద్యోగులు, దేశ్‌ముఖ్‌ల దౌర్జన్యాలతో తెలంగాణ గ్రామీణ వ్యవస్థ అల్లాడిపోయింది. అరిగె రామస్వామి, భాగ్యరెడ్డి వర్మ, బి.ఎస్. వెంకట్రావు తదితరులు హైదరాబాద్ రాజ్యంలో ప్రముఖ హరిజన నాయకులుగా పేరొందారు. అరిగె రామస్వామి ఆధ్యాత్మిక చింతనాపరుడు, గాంధేయవాది. ఈయన మాడపాటి హనుమంతరావు, సురవరం ప్రతాపరెడ్డి, కొండా వెంకట రంగారెడ్డి లాంటి కాంగ్రెసు నాయకులతో కలిసి పనిచేశారు. నిజాం రాష్ట్రాంధ్ర మహాసభ నాయకుడిగా తెలంగాణ ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చారు.

అరిగె రామస్వామి 1895లో సికింద్రాబాద్‌లోని నిరుపేద హరిజన కుటుంబంలో జన్మించారు. పెద్దగా చదువుకోలేదు. రైల్వే తనిఖీ కార్యాలయంలో ఆఫీస్ బాయ్‌గా జీవితాన్ని ప్రారంభించారు. కొంతకాలం రైల్వేలో టిక్కెట్ కలెక్టర్‌గా పనిచేశారు. 1912లో సికింద్రాబాద్‌లోని కుమ్మరి గూడలో సునీత బాలసమాజాన్ని స్థాపించారు.

ఈ సమాజం ముఖ్యోద్దేశాలు

మద్యం తాగే దురలవాటును మాన్పించడం, నిరక్షరాస్యతా నిర్మూలన, మాల, మాదిగ, మాల దాసరి మొదలైన హరిజన ఉపతెగలను సమైక్యం చేయడం లక్ష్యాలుగా ఈ సంస్థ పనిచేసింది. మూఢాచారాలు, మూఢ విశ్వాసాలను పోగొట్టడం, సాంఘిక న్యాయ సాధన, జంతు బలుల నిషేధం కోసం ఈ సంస్థ పనిచేసింది. హరిజనులు, వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం ఈ సంస్థ కృషి చేసింది. దళిత వర్గాల అభ్యున్నతి కోసం జాతీయోన్నత సభ, ఆదిహిందూ మహాసభ, ఆదిహిందూ సోషల్ సర్వీస్ లీగ్ లాంటి సంస్థలు హైదరాబాద్‌లో ఏర్పడ్డాయి.




ఈ సంస్థల కార్య కర్తలైన భాగ్యరెడ్డి వర్మ, ఆర్.లక్ష్మయ్య, ఎం.ఎల్. ఆదయ్య, సి.ఎస్.యతిరాజులు మొదలైన వారితో అరిగె రామస్వామి అనేక సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. 1930లో రామస్వామి రైల్వే ఉద్యోగానికి రాజీనామా చేసి పూర్తి సమయాన్ని సంఘసేవకే కేటాయించారు. తన ఆధ్యాత్మిక గురువైన భూమానందస్వామి పేరు మీద గురుమండలి స్థాపించి పేదలకు ఉచితంగా సామూహిక వివాహాలు జరిపించారు. నిజాం ప్రభుత్వం హైదరా బాద్ మున్సిపల్ కార్పొరేషన్ సభ్యుడిగా దళితుడికి అవకాశం ఇవ్వాలని భావించింది. ఈ పదవిలో నియమితుడైన తొలి హరిజనుడు ఈయనే.

- 1933లో మహాత్మాగాంధీ హైదరాబాద్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా నగరంలో ఏర్పాటైన ఆహ్వాన సంఘంలో రామస్వామి సభ్యుడు. హైదరాబాద్ సంస్థానంలో హరిజనోద్ధరణకు పూర్తి సమయాన్ని వెచ్చించాలని అరిగె రామస్వామికి గాంధీ సలహా ఇచ్చారు.
- హైదరాబాద్‌లో తోళ్లపరిశ్రమ కార్ఖానా స్థాపన కోసం రామస్వామి కృషిచేశారు.
- తెలంగాణ గ్రంథాలయోద్యమానికి విశేష సేవలందించారు.
- నిజాం రాష్ట్రాంధ్ర మహాసభలో ఏకైక హరిజన సభ్యుడు రామస్వామి. అస్పృశ్యతా నివారణ, వెట్టిచాకిరీ నిర్మూలన, హరిజన సమస్యల పరిష్కారానికి ఆయన కృషి చేశారు. 1935లో మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగిన దళిత జాతుల మహాసభకు అరిగె రామస్వామి అధ్యక్షత వహించారు.
- 'అరుంధతీ మహాసభ' ద్వారా అనాథలు, హరిజన కుటుంబాలను ఆదుకున్నారు. ఈ సభ ద్వారా వారికి ఉద్యోగాలు, జీవన భృతి కల్పించేందుకు కృషి చేశారు.
- రామస్వామి నిజాం రాష్ట్రాంధ్ర మహాసభ కార్యవర్గ సభ్యులుగా, అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సభ్యులుగా, నిజాం రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ సభ్యులుగా పనిచేశారు.
- 1950–52లో ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ కమిటీ సంయుక్త కార్యదర్శిగా పనిచేశారు. సికింద్రాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, హైదరాబాద్ జిల్లా బోర్డు సభ్యులుగా సేవ చేశారు.
- పోలీసు చర్య అనంతరం కేంద్ర ప్రభుత్వం రామస్వామిని పార్లమెంట్ సభ్యుడిగా నామినేట్ చేసింది. 1952లో జరిగిన సాధారణ ఎన్నికల్లో వికారాబాద్ ద్విసభ్య నియోజకవర్గం నుంచి చెన్నారెడ్డితోపాటు హైదరాబాద్ రాష్ట్ర శాసన సభకు రామస్వామి ఎన్నికయ్యారు.
- 1954–56 మధ్య బూర్గుల మంత్రివర్గంలో ఉపముఖ్యమంత్రిగా పనిచేశారు. ఆంధ్రప్రదేశ్ ఏర్పడ్డాక కాసు బ్రహ్మానందరెడ్డి మంత్రివర్గంలో పనిచేశారు.
- తిరుమల–తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యుడిగా నియమితులయ్యారు.
- దళితుల అభ్యున్నతి కోసం కృషి చేసిన రామస్వామి 1973 జనవరి 26న మరణించారు.

షోయబుల్లాఖాన్

షోయబుల్లాఖాన్ 1920 అక్టోబర్ 12న జన్మించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి పట్టభద్రుడై పత్రికా రచయితగా జీవితం ప్రారంభించారు. మొదట తేజ్ వారపత్రికలో చేరి నిజాం నిరంకుశ పాలనను, ఇత్తెహాదుల్ ముసల్మీన్ మత సంస్థ విధి విధానాలను, దాని అధిపతి సయ్యద్ ఖాసీం రజ్వీని ఘాటుగా విమర్శించారు. ఫలితంగా తేజ్ పత్రికను నిజాం ప్రభుత్వం నిషేధించింది. తర్వాత మందుముల నరసింగరావు నిర్వహించిన రయ్యత్ ఉర్దూ పత్రికలో షోయబుల్లాఖాన్ చేరారు. నిజాం ప్రభుత్వ దమననీతిని, పాక్షపాత వైఖరిని విమర్శించినందుకు ఈ పత్రిక కూడా నిషేధానికి గురైంది. దీంతో షోయబుల్లాఖాన్ స్వయంగా ఇమ్రోజ్ అనే ఉర్దూ పత్రికను స్థాపించారు. పత్రిక స్థాపనలో షోయెబ్‌కు బూర్గుల రామకృష్ణారావు సాయం చేశారు. నిజాం రాష్ట్రంలో నానాటికి దిగజారుతున్న పరిస్థితులను చూసి సహించలేక హైదరాబాద్‌కు చెందిన కొంతమంది మేధావులు నిజాం ప్రభుత్వానికి లేఖ రాశారు. ఆ లేఖలో శాంతిభద్రతల పరిస్థితిని కళ్లకు కట్టినట్లుగా వివరించారు. రజాకార్ల దళాన్ని రద్దుచేయాలని, లాయక్ అలీని ప్రధానమంత్రి పదవి నుంచి తొలగించాలని, హైదరాబాద్ సంస్థానాన్ని భారత యూనియన్‌లో విలీనం చేయాలని ఆ లేఖలో కోరారు. ఈ మేధావుల సలహాలను నిజాం ఖాతరు చేయలేదు. వీరిలో ఏడుగురు ప్రముఖ ముస్లిం నాయకులున్నారు. వారు.. మంజూర్ జంగ్, బాకర్ అలీ మీర్జా, ఫరీద్ మీర్జా, ముల్లా అబ్దుల్ బాసిత్, మహమ్మద్ మీర్జా, హుసేన్ అబ్దుల్ మునీం, మహ్మద్ హుస్సేన్ జాఫిరి. వీరు రాసిన లేఖను షోయబుల్లాఖాన్ 'ఇమ్రోజ్' పత్రికలో యథాతథంగా ప్రచురించారు. దీంతో పత్రిక సంపాదకుడైన షోయబుల్లాఖాన్ చేతులు నరికివేయాలని ఖాసీం రజ్వీ రజాకార్లను ఆదేశించాడు. 1948 ఆగస్టు 21న అర్ధరాత్రి సమయంలో 'ఇమ్రోజ్' కార్యాలయం నుంచి ఇంటికి వెళ్తున్న షోయబుల్లాఖాన్‌పై రజాకార్లు ఆయుధాలతో దాడి చేసి అతడి చేతులు, తలను నరికి హత మార్చారు. షోయబుల్లాఖాన్ బలిదానం హైదరాబాద్ సంస్థాన స్వాతంత్ర్య సమరంలో ఒక మైలురాయి.


మాదిరి ప్రశ్నలు

1. 1906లో 'విజ్ఞాన చంద్రికామండలి' ముద్రణాలయాన్ని ఎవరు ప్రారంభించారు?
   1) కొమర్రాజు వెంకట లక్ష్మణరావు
   2) సురవరం ప్రతాపరెడ్డి
   3) రఘుపతి వెంకటరత్నం నాయుడు
   4) ముట్నూరి కృష్ణారావు
2. 'ఆంధ్ర చారిత్రక పరిశోధన పితామహుడు' అనే బిరుదు ఎవరికి ఉంది?
   1) రాళ్లబండి సుబ్బారావు
   2) చిలుకూరి వీరభద్రరావు
   3) కొమర్రాజు వెంకట లక్ష్మణరావు
   4) ఆదిరాజు వీరభద్రరావు
3. 1904లో శ్రీ రాజరాజ నరేంద్ర భాషా నిలయాన్ని ఎక్కడ ఏర్పాటు చేశారు?
   1) సికింద్రాబాద్ 2) మెదక్
   3) వరంగల్ 4) హనుమకొండ
4. సికింద్రాబాద్‌లో ఆంధ్రసంవర్ధినీ గ్రంథాలయం ఏర్పాటైన సంవత్సరం?
   1) 1901 2) 1905
   3) 1906 4) 1900
5. 1912లో ఆంధ్ర విజ్ఞాన సర్వస్వాన్ని మూడు భాగాలుగా ప్రచురించినవారు?
   1) జయంతి రామయ్య పంతులు
   2) మల్లంపల్లి సోమశేఖర శర్మ
   3) సురవరం ప్రతాపరెడ్డి
   4) కొమర్రాజు వెంకట లక్ష్మణరావు
6. 1912లో సికింద్రాబాద్‌లో సునీత బాల సమాజం అనే సంస్థను స్థాపించినవారు?
   1) రంగారెడ్డి 2) భాగ్యరెడ్డి వర్మ
   3) అరిగె రామస్వామి
   4) బి.యస్. వెంకట్రావు
7. 1935లో మహబూబ్‌నగర్‌లో జరిగిన దళిత జాతుల మహాసభకు అధ్యక్షత వహించిందెవరు?
   1) బి.యస్. వెంకట్రావు
   2) అరిగె రామస్వామి 3) భాగ్యరెడ్డి వర్మ
   4) రావి నారాయణ రెడ్డి
8. ఇమ్రోజ్ అనే ఉర్దూ పత్రిక స్థాపకులు?
   1) మందుముల నరసింగరావు
   2) సురవరం ప్రతాపరెడ్డి
   3) షోయబుల్లాఖాన్ 4) ఖాసీం రజ్వీ
9. 'రయ్యత్' ఉర్దూ పత్రిక సంపాదకుడు?
   1) షోయబుల్లాఖాన్
   2) ఫరీదు మీర్జా
   3) మంజూర్ జంగ్
   4) మందుముల నరసింగరావు

సమాధానాలు

1) 1; 2) 3; 3) 4; 4) 2; 5) 4; 6) 3; 7) 2; 8) 3; 9) 4.

అప్రయత్నంగా మెరిసిన భావాల అక్షరాకృతి?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం
తెలుగు

ఆధునిక కవిత్వోద్యమాలు

భావ కవిత్వం

తెలుగులో భావ కవిత్వానికి ఆద్యుడు రాయప్రోలు సుబ్బారావు. తొలి తెలుగు భావ కవితా రచన రాయప్రోలు రాసిన 'లలిత'. భావ కవిత్వాన్ని వివిధ కవులు వివిధ పేర్లతో పిలిచారు.

1. రాయప్రోలు సుబ్బారావు – అభినవ కవిత
2. దేవులపల్లి కృష్ణశాస్త్రి – కాల్పనిక కవిత్వం
3. నోరి నరసింహశాస్త్రి – నవ్య కవిత్వం
4. దువ్వూరి రామిరెడ్డి – గీత కవిత్వం

- భావ కవిత్వం అనే పదాన్ని గాడిచర్ల హరిసర్వోత్తమ రావు ఆంధ్రపత్రిక సహాయ సంపాదకులుగా ఉన్నప్పుడు సృష్టించారని డాక్టర్ గిడుగు సీతాపతి 'హిస్టరీ ఆఫ్ తెలుగు లిటరేచర్' అనే గ్రంథంలో పేర్కొన్నారు.
- ఆంగ్లంలోని 'లిరికల్ పోయెట్రీ'నే తెలుగులో 'భావ కవిత్వం' అని పిలుస్తున్నారు.
- 'లిరిక్' అంటే 'గాన గుణం అమరిన రచన' అని అర్థం.
- భావ కవులు వియోగ శృంగారానికే ఎక్కువ ప్రాధాన్యమిచ్చారు.
- తెలుగులో నవ్య కవిత్వానికి కట్టమంచి రామలింగారెడ్డి 'ముసలమ్మ మరణం' నాందిగా చెప్పవచ్చు.
- భావ కవిత్వానికి నవ్య మార్గ ప్రవక్తగా కట్టమంచి రామలింగారెడ్డిని పిలుస్తారు.
- తెలుగులో నవ్య సాహిత్య యుగానికి రాయప్రోలు, గురజాడను ఆద్యులుగా చెబుతారు.
- తెలుగులో భావ కవిత్వానికి మూలం కాల్పనికవాదం. దీనికి మూల పురుషుడు రూసో.
- ఆధునిక కాల్పనికతకు న్యాయనిర్ణేత – రూసో.
- ఫ్రెంచ్ సాహిత్యంలో జనించిన 'రొమాంటిసిజమ్'ను అనుసరించిన కవులనే 'కాల్పనికవాద కవులు' అంటారు.
- రొమాంటిసిజంనే ఆంగ్ల సాహిత్యంలో లిరికల్ పోయెట్రిగా పిలుస్తారు.
- 'లిరికల్ పోయెట్రీ'ని తెలుగులో ఆత్మాశ్రయ కవిత్వం అంటారు.
- కాల్పనికోద్యమ పితామహునిగా రూసోను (1712–88) పాశ్చాత్యులు అంగీకరించారు.
- రూసో 'న్యూ హెలాయిస్' రచనలో ప్రణయతత్వాన్ని, 'సోషల్ కాంట్రాక్ట్' గ్రంథంలో మానవతావాదాన్ని ప్రతిపాదించారు.
- కాల్పనికోద్యమానికి మూలసూత్రం – ఆత్మాశ్రయ సిద్ధాంతం.
- భావకవిత్వోద్యమం మూడు (1910–40) దశాబ్దాల పాటు విలసిల్లింది.

భావ కవిత్వం - నిర్వచనాలు

1. 'కవికి తన్మయజ్యోతి మెఱుపువలె చటాలున ఒక్కసారి మెరయును. దానికి ప్రతిఫలమే ఉత్తమ కవిత లేక భావకవిత' – **వేలూరి శివరామశాస్త్రి** (1929 భారతి పత్రికలో)
2. 'కవి అవిస్పష్ట వాంఛాంకురము, ఒక అంతర్నిగూఢ తాపము ఒక చిన్న కావ్యంలో ఊదబడినచో అది భావ కవిత్వం' – విశ్వనాథ సత్యనారాయణ.
3. 'కవి హృదయంలో తటిల్లత లాగా అప్రయత్నంగా మెరసిపోయిన భావాల అక్షరాకృతి భావ కవిత' – శ్రీశ్రీ.
4. 'వస్తు, భావ రచనల్లో భావానికి ప్రాధాన్యత అగ్రతాంబూలమిచ్చిన కవిత భావకవిత్వం' – సి.నా.రె.

భావ కవిత్వం - శాఖలు

- డాక్టర్ సి.నారాయణరెడ్డి భావ కవిత్వాన్ని ఆరు శాఖలుగా విభజించారు.
- భావ కవిత్వంలోని ప్రధాన శాఖలు
  1) ప్రకృతి కవిత్వం
  2) ప్రణయ కవిత్వం
  3) సంఘ సంస్కరణ కవిత్వం
  4) దేశ భక్తి కవిత్వం
  5) స్మృతి కవిత్వం
  6) మర్మ కవిత్వం

సుప్రసిద్ధ భావకవులు - వారి రచనలు

- **రాయప్రోలు సుబ్బారావు** – లలిత, అనుమితి, తృణకంకణము, ఆంధ్రావళి, మధుకలశం, స్నేహలత, కష్టకమల, వనమాల, జడకుచ్చులు మొదలైనవి.
- **బసవరాజు అప్పారావు** – సెలయేటి గానం, ప్రేమతత్వం, బసవరాజు అప్పారావు గీతాలు.
- **పింగళి** – కాటూరి కవులు – తొలకరి, సంక్రాంతి, సౌందర నందనం.
- **కాటూరి వెంకటేశ్వరరావు** – గుడిగంటలు, పౌలస్త్య హృదయం.
- **దేవులపల్లి కృష్ణశాస్త్రి** – కృష్ణపక్షం, ప్రవాసం, ఊర్వశి, పల్లకి, సంస్కర్త మొదలైనవి.
- **దువ్వూరి రామిరెడ్డి** – పానశాల, భగ్నహృదయం, కడపటి వీడ్కోలు, స్వప్నశేషం, నలజారమ్మ అగ్ని ప్రవేశం, కృషీవలుడు, వనకుమారి, జలదాంగన మొదలైనవి.
- **నండూరి సుబ్బారావు** – యెంకి పాటలు
- **నాయని సుబ్బారావు** – సౌభద్రుని ప్రణయయాత్ర, మాతృగీతాలు, విషాదమోహనం, వేదనా వాసుదేవం, భాగ్యనగర కోకిల మొదలైనవి.
- **వేదుల సత్యనారాయణశాస్త్రి** – దీపావళి, ముక్తఝరి.
- **అబ్బూరి రామకృష్ణారావు** – మల్లికాంబ, జలాంజలి, ఊహాగానం, నదీ సుందరి, ఎర్రగన్నేరు, రసపిపాసి, కాపుపాలు, మాతృభూమి, తిక్కన మొదలైనవి.
- **అడవి బాపిరాజు** – శశికళ, గోధూళి, గంగిరెద్దు, వరద గోదావరి, చిగురుటాకులు, గడ్డిపూల పళ్ళెం, తరంగిణీ, శిల్పబాల.
- **విశ్వనాథ సత్యనారాయణ** – ఆంధ్రప్రశస్తి, ఆంధ్ర పౌరుషం, వరలక్ష్మి త్రిశతి, శశిదూతం, కిన్నెరసాని, కోకిలమ్మ పెళ్ళి, గిరికుమారుని ప్రేమగీతాలు, భ్రష్టయోగి.

అభ్యుదయ కవిత్వం

సామాజిక సిద్ధాంత బలాన్ని సమన్వయించుకొని వెల్లువెత్తిన తొలి ఆధునిక కవిత్వోద్యమం అభ్యుదయ కవిత్వం. ఇది ఆంధ్రదేశంలో 1940 నుంచి 1960 చివరి వరకు ఉధృతంగా సాగింది. అభ్యుదయం అనే పదానికి మంగళం, శుభం అనే నైఘంటికార్థాలున్నాయి. ఆంగ్లంలోని 'ప్రోగ్రెస్' అనే పదానికి సమానార్థకంగా తెలుగులో 'అభ్యుదయం' అనే పదాన్ని వాడుతున్నారు. ప్రస్తుతం ఈ పదానికి 'పురోగమనం, ప్రగతి శీలం, చైతన్యం' అనే స్థూలార్థాలను గ్రహిస్తున్నాం. తెలుగు సాహిత్యంలో సామాజిక చైతన్యం శ్రామిక జన పక్షపాతం, వాస్తవికత, పీడితజన పక్షం, సమసమాజ నిర్మాణం మొదలైన అంశాలను ప్రవేశపెట్టింది అభ్యుదయ కవిత్వమే.

- సంస్కృతి పరిరక్షణ కోసం1935లో'పారిస్'లో అంతర్జాతీయ రచయితల సదస్సు జరిగింది.
- 1935లో డిసెంబర్‌లో అలహాబాద్‌లో 'ఇండియన్ ప్రోగ్రెసివ్ రైటర్స్ అసోసియేషన్'ను ఏర్పాటు చేశారు.
- 1936 ఫిబ్రవరిలో లండన్ నుంచి వెలువడే 'ది డెయిలీ ట్రిబ్యూన్' పత్రికలో భారత అభ్యుదయ రచయితల ప్రణాళికను ప్రకటించారు.
- 1936 ఏప్రిల్ 9, 10 తేదీల్లో లక్నోలో 'మున్షీ ప్రేమ్ చంద్' అధ్యక్షతన అఖిల భారత అభ్యుదయ రచయితల ప్రథమ మహాసభ నిర్వహించారు.
- 1932లో ఆడెన్ తదితర కవులు ఆంగ్లంలో 'న్యూ సిగ్నేచర్స్' అనే కవితా సంకలనాన్ని వెలువరించారు.
- 1850 దశకంలో వెలువడిన కారల్ మార్క్స్ రచనలు ప్రపంచ వ్యాప్తంగా కవులు, కళాకారుల్లో కొత్త ఆలోచనలు రేకెత్తించాయి.
- తెలుగునాట అభ్యుదయ సాహిత్యోద్యమానికి మార్క్సిజమే పునాది. 1943లో అభ్యుదయ రచయితల సంఘాన్ని ఏర్పరిచారు.
- 1943లో తెనాలిలో జరిగిన తొలి అభ్యుదయ రచయితల మహాసభలకు తాపీ ధర్మారావు అధ్యక్షత వహించారు.
- 1955లో బెజవాడలో శ్రీశ్రీ అధ్యక్షతన 5వ మహాసభలు జరిగాయి.
- చిట్టచివరి సమైక్య అభ్యుదయ రచయితల సభలను 1974లో చాగంటి సోమయాజులు అధ్యక్షతన ఒంగోలులో నిర్వహించారు.

అభ్యుదయ కవిత్వం - నిర్వచనాలు

1. 'ఊహాలోకాల్లో విహరిస్తున్న ఆధునిక కవిత్వాన్ని భూమార్గం పట్టించిందీ, సామాన్య మానవున్ని సాహిత్యానికి మకుటధారిని చేసిందీ అభ్యుదయ కవిత్వం'.
2. 'ధనిక సమాజం మారాలనుకోవడమే అభ్యుదయం' – దేవులపల్లి కృష్ణశాస్త్రి.
3. 'చైతన్యమే పర్యవసానంగా కలది అభ్యుదయ సాహిత్యం' – వేల్చేరు నారాయణరావు.

అభ్యుదయ కవిత్వం – లక్షణాలు

1. అంతర్జాతీయ దృక్పథంలో మానవాభ్యుదయాన్ని కాంక్షించడం.
2. ఆర్థిక అసమానతలు తొలగించి సామ్యవాద సమాజాన్ని నెలకొల్పడం.
3. పెట్టుబడిదారీ వ్యవస్థను కూలదోయడం.
4. వర్ణ, వర్గ రహిత సమ సమాజ స్థాపన.
5. శ్రమ దోపిడీ లేని సమాజం.
6. దేశ పారిశ్రామికీకరణం.
7. నవసమాజ నిర్మాణం.

తెలుగులో అభ్యుదయ కవిత్వ ప్రస్థానం

- తెలుగునాట అభ్యుదయ సాహిత్య మూలవిరాట్ – శ్రీశ్రీ అని సి. నారాయణరెడ్డి పేర్కొన్నారు.
- శ్రీశ్రీ 1934 ఏప్రిల్ 12న మహాప్రస్థానం గేయాన్ని రాశారు. ఇది ముద్దుకృష్ణ 'జ్వాల' పత్రికలో మొదటగా ప్రచురితమైంది.
- తెలుగులో వెలువడిన తొలి అభ్యుదయ కవితా సంకలనం 'నయాగరా'. 1944లో దీన్ని బెల్లంకొండ రామదాసు, కుందుర్తి ఆంజనేయులు, ఏల్చూరి సుబ్రమణ్యం కలసి రచించారు.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. ఆధునిక కవిత్వంలో రాయప్రోలు సుబ్బారావు మొదటగా లేవనెత్తిన ప్రణయ సిద్ధాంతం?
   1) కులపాలికా ప్రణయం
   2) కరుణ విప్రలంభం
   3) అమలిన శృంగారం
   4) విప్రలంభ శృంగారం
2. 'కవి అవిస్పష్ట వాంఛాంకురం, ఒక అంతర్నిగూఢ తాపం ఒక చిన్న కావ్యంలో ఊదబడితే' అది?
   1) విప్లవ కవిత్వం
   2) అభ్యుదయ కవిత్వం
   3) ఆధ్యాత్మిక కవిత్వం 4) భావ కవిత్వం
3. 'వేదాంతాలు జీవితాన్నీ, ప్రకృతినీ అవగాహన చేసుకున్నారు; మేం లోకాన్ని, జీవితాన్ని, ప్రకృతినీ కూడా మారుస్తాం' అనే శ్రీరంగం నారాయణ బాబు మాటలు దేని కి ప్రాతినిధ్యం వహిస్తాయి?
   1) దిగంబర కవిత 2) అభ్యుదయ కవిత
   3) భావ కవిత 4) విప్లవ కవిత
4. అభ్యుదయ కవిత్వ ప్రధాన లక్షణం?
   1) వర్గ సామరస్యం 2) వర్గ సంఘర్షణ
   3) ప్రణయ బోధన 4) దేశభక్తి ప్రబోధం

సమాధానాలు

1) 3; 2) 4; 3) 2; 4) 2.

ప్రసిద్ధ కవులు అభ్యుదయ రచనలు

- **శ్రీరంగం శ్రీనివాసరావు (శ్రీశ్రీ):** మహాప్రస్థానం, ఖడ్గ సృష్టి
- **ఆరుద్ర:** త్వమేవాహం, సినీవాలి, గాయాలు – గేయాలు
- **ఆవంత్స సోమసుందర్:** వజ్రాయుధం (తెలంగాణ సాయుధ పోరాటం)
- **కాళోజీ నారాయణరావు:** నా గొడవ (అభ్యుదయ కవితా సంపుటాలు)
- **దాశరథి కృష్ణమాచార్యులు:** అగ్నిధార, రుద్రవీణ, పునర్నవం, ఆలోచనాలోచనలు, తిమిరంతో సమరం, మహాంధ్రోదయం.
- **రెంటాల గోపాలకృష్ణ:** సర్పయాగం, సంఘర్షణ
- **అనిసెట్టి సుబ్బారావు:** అగ్నివీణ కె.వి. రమణారెడ్డి: అడవి, భువనఘోష, అంగారవల్లరి
- **సి. నారాయణరెడ్డి:** మంటలు – మానవుడు, అక్షర గవాక్షం, విశ్వంభర, ప్రపంచ పదులు, నాగార్జున సాగరం, సినారె గజళ్ళు.
- **పురిపండా అప్పలస్వామి:** పులిపంజా, అనలపతాకం, సంధ్యావందనం, స్వర్గానికి – నరకానికి.
- **పఠాభి:** ఫిడేలు రాగాల డజన్, పఠాభి పంచాంగం (1964)
- **శిష్టా ఉమామహేశ్వరరావు:** నవమిచిలుక, విష్ణుధనువు
- **శ్రీరంగం నారాయణబాబు:** మౌనశంఖం, రుధిరజ్యోతి

విద్య, ఉద్యోగ సమాచారం

వీవోసీ పోర్ట్ అథారిటీ, తమిళనాడులో వివిధ ఉద్యోగాలు

తమిళనాడులోని వీవో చిదంబరనర్ పోర్ట్ అథారిటీ(వీవోసీపీఏ).. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 02.
» **పోస్టుల వివరాలు:** సీనియర్ డిప్యూటీ చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్-01, డిప్యూటీ చీఫ్ మెడికల్ ఆఫీసర్(స్పెషలిస్ట్)-01.
» **అర్హత:** పోస్టును అనుసరించి ఎంబీబీఎస్ ఉత్తీర్ణులవ్వాలి. చార్టెడ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియాలో సభ్యునిగా ఉండాలి. పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 42 ఏళ్లు ఉండాలి. ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్ల సడలింపు ఉంటుంది.
» **వేతనం:** నెలకు సీనియర్ డిప్యూటీ చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్‌కు రూ.80,000 నుంచి రూ.2,20,000, డిప్యూటీ చీఫ్ మెడికల్ ఆఫీసర్(స్పెషలిస్ట్)కు రూ.60,000 నుంచి రూ.1,80,000.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును కార్యదర్శి, వీవో చిదంబరనార్ పోర్ట్ అథారిటీ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్ భవనం, హార్బర్ ఎస్టేట్, ట్యూటికోరిన్-628 004 చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 21.06.2025.
» **వెబ్‌సైట్:** https://vocport.gov.in/

ఐవోపీబీలో ఎల్‌డీసీ పోస్టులు

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిజిక్స్ భువనేశ్వర్ (ఐవోపీబీ)లో లోయర్ డివిజన్ క్లర్క్(ఎల్‌డీసీ) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 02.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఏదైనా గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 20.06.2025 నాటికి 18 నుంచి 28 ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.19,900 నుంచి రూ.63,200.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, స్కిల్ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 20.06.2025.
» **వెబ్‌సైట్:** https://www.iopb.res.in/

పంచదార మిల్లులు అధికంగా ఉన్న రాష్ట్రం?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

జాగ్రఫీ

భారతదేశంలో పారిశ్రామిక రంగం

భారతదేశంలో భారీ పరిశ్రమల స్థాపన 19వ శతాబ్దం రెండో అర్ధ భాగం నుంచి ప్రారంభమైంది. అదే సమయంలో దేశంలో రైల్వేల నిర్మాణాన్ని చేపట్టడం, బ్రిటిష్ పెట్టుబడిదారులు భారతదేశంలో పెట్టుబడులు పెట్టడానికి సుముఖత వ్యక్తం చేయడం, కోల్‌కతా, మద్రాసు, ముంబై ప్రెసిడెన్సీల్లో యూనివర్సిటీల స్థాపన తదితరాలు దీనికి దోహదం చేశాయి.

ముడి పదార్థాల స్వభావం ఆధారంగా పరిశ్రమలను 3 రకాలుగా వర్గీకరించవచ్చు. అవి:

1) వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు
2) అటవీ ఆధారిత పరిశ్రమలు
3) ఖనిజ ఆధారిత పరిశ్రమలు

> ఆధునిక యుగంలో దేశ ప్రగతి, ఆర్థికాభివృద్ధి పరిశ్రమలపైనే ఆధారపడి ఉందని చెప్పవచ్చు. పారిశ్రామికాభివృద్ధి అనేది పరిశ్రమల స్థాపనకు కావాల్సిన అనువైన స్థలాల ఎంపిక, ముడి పదార్థాల లభ్యత, మార్కెట్ సౌకర్యాలు, పెట్టుబడుల లభ్యత, నాణ్యమైన, తక్కువ వేతనాలతో లభ్యమయ్యే కార్మికులు, రవాణా సౌకర్యాలు, విద్యుత్ లభ్యత లాంటి అంశాలపై ఆధారపడి ఉంటుంది.

వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు

ఎ) వస్త్ర (జౌళి) పరిశ్రమ

జౌళి అనేది విస్తృతమైన పదం. ఇందులో నూలు వస్త్ర పరిశ్రమ, జనపనార, ఉన్ని, పట్టు, సింథటిక్ వస్త్ర పరిశ్రమలు వస్తాయి.

నూలు వస్త్ర పరిశ్రమ: దేశంలో నూలు వస్త్ర పరిశ్రమ అతి పురాతనమైన, అతిపెద్ద వ్యవస్థీకృత పరిశ్రమ. ఇది ఎక్కువ మంది శ్రామికులకు ఉపాధి కల్పిస్తోంది. ఇందులో 45 మిలియన్ల శ్రామికులు పని చేస్తున్నారు. దేశంలో మొదటిసారిగా నూలు మిల్లును 1818లో కోల్‌కతా సమీపంలోని 'ఫోర్ట్‌గ్లాస్టర్'లో ఏర్పాటు చేశారు. మొట్టమొదటి అధునాతన నూలు వస్త్ర పరిశ్రమను 1854లో పార్శీ పెట్టుబడిదారుల సహాయంతో ముంబైలో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ప్రపంచంలో నూలు వస్త్రాల ఉత్పత్తిలో చైనా, అమెరికా, భారత్ వరుసగా మొదటి 3 స్థానాల్లో ఉన్నాయి. ప్రస్తుతం దేశంలో నూలు వస్త్రాల ఉత్పత్తికి ముంబై ప్రధాన కేంద్రంగా ఉంది. అందువల్ల ముంబైని 'మాంచెస్టర్ ఆఫ్ ఇండియా'గా పిలుస్తారు. అహ్మదాబాద్, కోయంబత్తూర్ తర్వాతి స్థానంలో ఉన్నాయి.

ముంబై నూలు వస్త్రాల ఉత్పత్తికి ప్రధాన కేంద్రంగా అభివృద్ధి చెందడానికి దోహదపడిన అంశాలు:

- పత్తి పండే నల్లరేగడి భూములు ముంబై పరిసరాల్లో అధికంగా ఉండటం.
- తేమతో కూడిన వాతావరణం.
- తక్కువ వేతనాలతో కార్మికులు లభ్యమవడం.
- నిరంతర విద్యుత్ సరఫరా.
- పెట్టుబడులు లభించడం.
- రోడ్డు, రైల్వే మార్గాల ద్వారా ముంబై దేశంలోని ఇతర నగరాలతో బాగా అనుసంధానించి ఉండటం.
- ఓడరేవు సౌకర్యాలు ఉండటం.

దేశంలో నూలు వస్త్రాల ఉత్పత్తి ఎక్కువగా మరమగ్గాల ద్వారా జరుగుతోంది. తర్వాత స్థానాల్లో చేనేత, మిల్ సెక్టార్‌లు ఉన్నాయి. దేశంలో మరమగ్గాలు ఎక్కువ సంఖ్యలో మహారాష్ట్రలో ఉండగా, తర్వాత స్థానంలో తమిళనాడు ఉంది. గుజరాత్‌లో మిల్ సెక్టార్‌లో నూలు వస్త్రాల ఉత్పత్తి ఎక్కువగా ఉంది.

జనుము వస్త్ర పరిశ్రమ: దేశంలో మొదటి జనుము వస్త్ర పరిశ్రమను 1855లో కోల్‌కతా సమీపంలోని శ్రీరాంపూర్ వద్ద ఉన్న 'రిష్రా' అనే ప్రదేశంలో ఏర్పాటు చేశారు. దేశంలో జనుము వస్త్ర పరిశ్రమ ప్రధానంగా పశ్చిమ బెంగాల్‌లోని 'హుగ్లీ' నదీపరీవాహక ప్రాంతంలో కేంద్రీకృతమై ఉంది.

దేశంలో జనుపనార మిల్లులు ఎక్కువగా ఉన్న రాష్ట్రాలు వరుసగా పశ్చిమబెంగాల్. ఆంధ్రప్రదేశ్ (విజయనగరం జిల్లా), బిహార్, ఉత్తర ప్రదేశ్. ప్రపంచంలో జనుము వస్త్రాల ఉత్పత్తిలో భారత్ మొదటి స్థానంలో ఉంది. ఎగుమతుల్లో బంగ్లాదేశ్ తర్వాత రెండో స్థానంలో ఉంది.

హుగ్లీ బేసిన్‌లో జనుపనార మిల్లులు కేంద్రీకృతం కావడానికి కారణాలు:

- ఈస్ట్ ఇండియా కంపెనీ ద్వారా బ్రిటిష్ వర్తకులు ముందే కోల్‌కతా రావడం.
- హుగ్లీ పరీవాహకంలో జనుము పంటకు అనువైన నేలలు, వ్యవసాయ సంబంధిత శీతోష్ణస్థితి, రుతువులు అనుకూలంగా ఉండటం.
- జనుపనారను శుద్ధి చేయడానికి కావాల్సినంత నీటి లభ్యత ఉండటం.
- హుగ్లీ జలమార్గం ద్వారా జనుము ఉత్పత్తి ప్రాంతాలను మిల్లులతో కలిపే సౌకర్యం ఉండటం.
- తేమతో కూడిన వాతావరణం.
- ఎగుమతులకు కోల్‌కతా రేవు అనుకూలంగా ఉండటం.
- కార్మికులు చౌకగా లభ్యమవడం.
- రాణీగంజ్, ఝరియా బొగ్గు గనుల నుంచి బొగ్గు; దామోదర వ్యాలీ కార్పొరేషన్ నుంచి విద్యుత్తు చౌకగా అందుబాటులో ఉండటం.

జనుము సంబంధిత ముఖ్యమైన ఉత్పత్తులు: గోనె సంచులు, కన్వాస్, ప్యాక్‌షీట్లు, జూట్ వెబ్బింగ్, గోనెగుడ్డ, తాళ్లు, రంగులు, తివాచీలు, టార్పాలీన్లు మొదలైనవి. జనుప నార, దాని ఉత్పత్తుల ద్వారా పెద్ద మొత్తంలో విదేశీ మారక ద్రవ్యం లభ్యమవుతోంది. అందువల్ల దీన్ని 'గోల్డెన్ ఫైబర్ ఆఫ్ ఇండియా'గా పేర్కొంటారు.

ఉన్ని వస్త్ర పరిశ్రమ: దేశంలో మొదటి ఉన్ని వస్త్ర పరిశ్రమను 1876లో 'కాన్పూర్'లో ఏర్పాటు చేశారు. దీనికి కారణం ఇది బ్రిటిష్ ఇండియన్ ఆర్మీ ప్రధాన స్థావరంగా ఉండేది. ప్రస్తుతం ఉన్ని వస్త్రాల ఉత్పత్తిలో ప్రథమ స్థానంలో ఉన్న రాష్ట్రం పంజాబ్. గురుదాస్‌పూర్, లూధియానా, అమృత్‌సర్ ప్రాంతాల్లో ఉన్ని వస్త్రాలను అధికంగా ఉత్పత్తి చేస్తున్నారు. ఉన్ని ఉత్పత్తిలో ప్రథమ స్థానం



లో ఉన్న రాష్ట్రం రాజస్థాన్. హిమాచల్ ప్రదేశ్‌లోని గద్దీలు, ఉత్తరాఖండ్‌లోని గుజ్జార్లు, జమ్ము-కశ్మీర్‌లోని బేకర్స్ వాల్స్ పెంచే గొర్రెలకు చెందిన ఉన్ని.. ఉత్పత్తి కేంద్రాలకు అధికంగా సరఫరా అవుతోంది. కానీ, దేశంలో ఉన్ని వస్త్ర పరిశ్రమ అనుకున్న స్థాయిలో అభివృద్ధి చెందలేదు. దీనికి కారణాలు..

1. దేశంలో శీతాకాల నిడివి తక్కువగా ఉండటం.
2. దేశంలో ఉత్పత్తి అయ్యే ఉన్నికి నాణ్యత తక్కువ ఉంది. అందువల్ల అంతర్జాతీయ మార్కెట్‌లో భారతీయ ఉన్ని వస్త్రాలకు గిరాకీ తక్కువగా ఉంది.

పట్టు వస్త్ర పరిశ్రమ: దేశంలో మొదటిసారిగా పట్టు వస్త్ర పరిశ్రమను 1932లో పశ్చిమ బెంగాల్‌లోని 'హౌరా' వద్ద స్థాపించారు.

పట్టు వస్త్రాల ఉత్పత్తిలో చైనా ప్రథమ స్థానంలో ఉంది. భారత్ రెండో స్థానంలో ఉంది. భారతదేశంలో మాత్రమే 4 రకాల పట్టును (మల్బరీ, టస్సార్, ఎరి, ముగ) ఉత్పత్తి చేస్తున్నారు. దేశంలో పట్టు వస్త్రాల ఉత్పత్తిలో ప్రథమ స్థానంలో ఉన్న రాష్ట్రం కర్ణాటక. పశ్చిమ బెంగాల్ రెండో స్థానంలో ఉంది.

సింథటిక్ పరిశ్రమ: 'పాలిమెరైజేషన్' ప్రక్రియ ద్వారా వృక్షాల సెల్యులోజ్ నుంచి సింథటిక్ దారాలను తీస్తారు. వాటి నుంచి సింథటిక్ వస్త్రాలను తయారు చేస్తారు. రేయాన్, నైలాన్, పాలిఎస్టర్, టెర్రీకాటన్ మొదలైనవి సింథటిక్ వస్త్రాలు. ప్రపంచంలో ఈ వస్త్రాల ఉత్పత్తిలో యూఎస్ఏ ప్రథమ స్థానంలో ఉంది. భారత్‌లో మహారాష్ట్ర మొదటి స్థానంలో ఉంది.

సింథటిక్ వస్త్రాల ఉత్పత్తి కేంద్రాలు:

1. రేయాన్ యూనిట్లు: కేరళలో 'రేయానో పురం', తెలంగాణలోని కాగజ్‌నగర్.
2. నైలాన్ యూనిట్లు: రాజస్థాన్‌లోని కోట, మహారాష్ట్రలోని పింప్రీ, ముంబై.
3. పాలిఎస్టర్ యూనిట్లు: ముంబై, థానే, అహ్మదాబాద్.

బి) పంచదార పరిశ్రమ

దేశంలో రెండో అతిపెద్ద వ్యవసాయ ఆధారిత పరిశ్రమ ఇది. సుమారు 4 లక్షల మందికి ఉపాధి కల్పిస్తోంది. దేశంలో మొదటిసారిగా పంచదార పరిశ్రమను 1840లో డచ్‌వారు బిహార్‌లో స్థాపించారు. పంచదార, దాని ఉప ఉత్పాదితాలైన బెల్లం, ఖండసారిలను కలుపుకుంటే భారతదేశం పంచదార పరిశ్రమలో ప్రపంచంలోనే ప్రథమస్థానంలో ఉంది.

చక్కెర పరిశ్రమకు ప్రత్యేకంగా ఇంధనం అవసరం లేదు. ఈ పరిశ్రమలో తయారయ్యే ఉప ఉత్పాదితమైన బగస్సీని ఇంధనంగా ఉపయోగించుకోవచ్చు. ఈ బగస్సీని ఉపయోగించి తణుకులోని ఆంధ్రా సుగర్స్‌లో రాకెట్లలో ఉపయోగించే ఇంధనాన్ని తయారు చేస్తున్నారు. మొలాసిస్‌ను ఉపయోగించి చాక్లెట్లను తయారు చేస్తున్నారు. దేశంలో పంచదార మిల్లులు ఎక్కువగా ఉత్తర ప్రదేశ్‌లో (81) ఉన్నాయి. మహారాష్ట్ర (68), కర్ణాటక (32), తమిళనాడు (22) తర్వాతి స్థానంలో ఉన్నాయి. ప్రస్తుతం దేశంలో పంచదార ఉత్పత్తిలో ప్రథమ స్థానంలో ఉన్న రాష్ట్రం మహారాష్ట్ర. తర్వాత స్థానంలో ఉత్తరప్రదేశ్ ఉంది. పంచదార ఉత్పాదకత దక్షిణ భారత రాష్ట్రాల్లోనే ఎక్కువగా ఉంది. దీనికి కారణాలు..

1. చెరకు ఉష్ణమండల పంట. దక్షిణ భారత రాష్ట్రాల్లో దానికి తగిన శీతోష్ణస్థితులు ఉన్నందువల్ల ఇక్కడ ఉత్పాదకత ఎక్కువగా ఉంది.
2. దక్షిణ భారత రాష్ట్రాల్లో పండే చెరకులో సుక్రోజ్ శాతం ఎక్కువగా ఉంటుంది.
3. దక్షిణాదిలో చెరకు క్రషింగ్ సీజన్ (అక్టోబర్ - జూన్) ఎక్కువగా ఉంది. ఇది ఉత్తరాది రాష్ట్రాల్లో నవంబర్ నుంచి ఫిబ్రవరి వరకు మాత్రమే ఉంది.

అటవీ ఆధారిత పరిశ్రమలు

కాగితం పరిశ్రమ: దేశంలో మొదటి కాగితం పరిశ్రమను 1832లో కోల్‌కతా సమీపంలో 'షెరంపూర్'లో ఏర్పాటు చేశారు. మొదటి అధునాతన కాగితపు పరిశ్రమ (రాయల్ బెంగాల్ పేపర్ మిల్)ను 'బాలిగంజ్'లో 1870లో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం కాగితం ఉత్పత్తిలో ప్రథమ స్థానంలో ఉన్న రాష్ట్రం మహారాష్ట్ర.

కాగితం తయారీలో ఉపయోగించే ముడి పదార్థాలు:
కొయ్యగుజ్జు, సబాయ్, సలాయ్, వెదురు, ఎలిఫెంట్ లాంటి గడ్డిజాతులు, రాగులు, వృథా కాగితం. కర్ణాటకలోని బెళగొళలో కాగితపు పరిశ్రమలో బగస్సీ (చెరకు పిప్పి)ని ఉపయోగించి కాగితాన్ని తయారు చేస్తున్నారు.

కాగితపు ఉత్పాదితాల తయారీ కేంద్రాలు:

1. మధ్యప్రదేశ్‌లోని దేవాస్, హోసంగాబాద్ యూనిట్లలో కరెన్సీ పేపర్‌ను తయారు చేస్తున్నారు.
2. 1981లో మొదటిసారిగా న్యూస్‌ప్రింట్ కాగితాన్ని ఉత్పత్తి చేసే యూనిట్‌ను మధ్యప్రదేశ్‌లోని నేపానగర్‌లో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం దేశంలో న్యూస్ ప్రింట్ తయారీ యూనిట్లు 26 ఉన్నాయి.

The name Touhou is coined by..



BANK EXAMS

ENGLISH

1. God helps those_______help themselves.
1) Whom 2) which
3) them 4) who
2. His character is different _______ yours.
1) With 2) for
3) from 4) at
3. The old mother advised her sons to live together in peace. (Change into Direct speech)
1) The old mother said, "her sons live together in peace."
2) "Live together in peace", said the old mother.
3) The old mother said, "My dear sons, live together in peace."
4) The old mother said, "live together in peace sons."
4. Work hard _______ you should fail.
1) unless 2) as if
3) although 4) lest
5. I am obliged to you _______ your kindness.
1) for 2) upon 3) of 4) with
6. They robbed him _______ his money.
1) with 2) from
3) for 4) of
7. I gave her a rupee. (Change into Passive)
1) A rupee was given to her by me.
2) She gave a rupee to me.
3) She was gave a rupee to her.
4) I was given a rupee.
8. Let the doors be shut. (Change into Active)
1) Somebody be shut the doors.
2) He will shut the doors.
3) He may shut the doors.
4) Shut the doors.
9. Please try_______. (Use an appropriate word to fill the blank)
1) to help 2) in helping
3) helping 4) for help
10. Which sentence is correct?
1) He has gone to Mumbai last Monday.
2) They go to school by foot.
3) Neither Aruna nor Amita are present.
4) The sweets were distributed between the children.
11. She seldom makes a mistake. The sentence which is similar in meaning is_______
1) She rarely makes a mistake.
2) She regularly makes a mistake.
3) She often makes a mistake.
4) She was doing mistakes on and off.
12. _______ cotton of Egypt is superior to that of _______ India.
1) the, the 2) the, a
3) a, the 4) the, no article
13. Health is better than _______ wealth.
1) a 2) an 3) the
4) no article
14. Raghu loves music. (Use an appropriate question tag)
1) Is he? 2) Isn't raju?
3) doesn't he? 4) Haven't he?
15. They will come with you to the restaurant _______?
1) will they 2) does they
3) won't they 4) doesn't they
16. Her short hair accentuated her. The underlined word means
1) emphasized 2) heightened
3) shortened 4) minimized
17. He has ants in pants, means
1) he is happy
2) he is sad
3) he is excited
4) he is disappointed
18. Which of the sentence is correct?
1) "Raju went to a movie", Ramani said.
2) Ramani said "raju gone to a movie?"
3) "raju going to movie" Ramani said
4) Ramani said, "Raju see a movie?"
19. Identify the sentence with correct use of punctuation
1) Alexander the conqueror of the world began to weep.
2) Alexander, the conqueror of the world, began to weep.
3) alexander the conqueror of the world began to weep
4) Alexander the conqueror, of the world began to weep
20. The noise drove him mad. The structure of the sentence is
1) S + V + object + complement
2) S + V + O1 + O2
3) S + V + IO
4) S + V + O
21. Identify the silent letters in 'fight'
1) f, t 2) f, h, g
3) h, g 4) g, i, t
22. 'Dear' can be used in _______
1) formal letters
2) semi formal letters
3) personal letters
4) all the above
23. Subject line is not mandatory in _______
1) formal letters
2) letters of complaint
3) personal letters
4) letter to the editor
24. His performance was abysmal. The opposite of the underlined word is _______
1) terrible 2) sad
3) tremendous 4) appreciable
25. The agitating workers have decided to_______their strike.
1) call in 2) call on
3) call upon 4) call off
26. The college's geology department has a large rock collection. The parts of speech of the underlined word is _______
1) adjective 2) verb
3) noun 4) pronoun
27. I want to go now. The parts of speech of the underlined word is-_______
1) pronoun 2) preposition
3) conjunction 4) adverb
28. We need a house to live in. (Change into complex sentence)
1) We need a house where we can live in.
2) We need a house can live in.
3) We need a house where we can live on.
4) We need a house and we can live.
29. Investigation is a word with _______ syllables.
1) Two 2) Three
3) Four 4) Five
30. /d3 / sound is present in
1) jam 2) again
3) glass 4) mega
31. /al/ sound is present in
1) bay 2) eye 3) Bat 4) Bond
32. The jigsaw puzzle kept the children frenzied. The underlined word means
1) hyperactive 2) dull
3) Surprised 4) Comedy

Passage

About a hundred and thirty years ago, people at Waikanae, north of Wellington, saw great numbers of strange birds. They were little green birds with a white ring of feathers around their eyes. Scientists soon found out that these birds had come all the way across the Tasman Sea by very strong winds. The Maoris called the new bird "tauhou", word for "stranger". Today they are also known as wax-eyes, white-eyes, or silver-eyes. Because they can eat all sorts of food, and because they can live in many different kinds of places, wax-eyes have increased in numbers. They are now found all over New Zealand – along the coasts, round the islands, in scrub, in tussock country, in the bush, on farms and in city gardens. There are probably more wax-eyes in New Zealand than any other kind of bird. Usually, you see them in groups, hopping very quickly through bushes and trees. They make a high twittering noise most of the time as they work along, eating insects, nectar and berries. Their noise may help them to recognize each other and to keep the group together.

33. Which birds are more in number in New Zealand?
1) Tauhou 2) green eyes
3) garden birds 4) strange birds
34. The name Touhou is coined by
1) Newzealand
2) scientists
3) people
4) Maoris
35. How did the birds travel?
1) Across the gardens
2) Through the bushes
3) Eating nectar
4) By strong winds
36. They keep together in group through_______
1) Noise 2) trees
3) farms 4) bushes
37. The antonym of recognize is
1) familiar 2) identify
3) classify 4) forget
38. Mind your own business.
1) a statement 2) request
3) interrogation 4) order
39. Identify the correct spelt word from the following
1) parsel 2) parsil
3) perceal 4) parcel
40. The police arrived. The crowd dispersed. The sentence which is similar in meaning is
1) The police dispersed the crowd.
2) The crowd dispersed the police.
3) The police having arrived, the crowd dispersed.
4) Upon arrival the crowd dispersed.

Key

1) 4;	2) 3;	3) 3;	4) 4;
5) 1;	6) 4;	7) 1;	8) 4;
9) 1;	10) 3;	11) 1;	12) 4;
13) 4;	14) 3;	15) 3;	16) 1;
17) 3;	18) 1;	19) 2;	20) 1;
21) 3;	22) 4;	23) 3;	24) 1;
25) 4;	26) 1;	27) 4;	28) 1;
29) 4;	30) 1;	31) 2;	32) 1;
33) 1;	34) 4;	35) 4;	36) 1;
37) 4;	38) 4;	39) 4;	40) 3.

విద్య, ఉద్యోగ సమాచారం

బీఈసీఐఎల్, న్యూఢిల్లీలో వివిధ ఉద్యోగాలు

న్యూఢిల్లీలోని బ్రాడ్‌కాస్ట్ ఇంజనీరింగ్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్ (బీఈసీఐఎల్) ఒప్పంద ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 03
- **పోస్టుల వివరాలు:** యంగ్ ప్రొఫెషనల్-ఇంటర్నేషనల్ ట్రేడ్-01, యంగ్ ప్రొఫెషనల్ -ఫైర్స్ అండ్ ఈవెంట్స్-01, రిసెప్షనిస్ట్ కమ్ ఆఫీస్ అసిస్టెంట్-01.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు కంప్యూటర్ స్కిల్స్, ఉద్యోగానుభవం ఉండాలి.
- **వయసు:** యంగ్ ప్రొఫెషనల్స్ పోస్టుకు 25 నుంచి 40 ఏళ్ల మధ్య ఉండాలి. రిసెప్షనిస్ట్ కమ్ ఆఫీస్ అసిస్టెంట్‌కు 30 ఏళ్లు మించకూడదు.
- **వేతనం:** నెలకు యంగ్ ప్రొఫెషనల్-ఇంటర్నేషల్ ట్రేడ్‌కు రూ.42,595 నుంచి రూ.52,595, యంగ్ ప్రొఫెషనల్-ఫైర్స్ అండ్ ఈవెంట్స్‌కు రూ.28,959 నుంచి రూ.38,959, రిసెప్షనిస్ట్ కమ్ ఆఫీస్ అసిస్టెంట్‌కు రూ.25,322.
- **ఎంపిక విధానం:** షార్ట్‌లిస్టింగ్, స్కిల్ టెస్ట్/ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును బ్రాడ్‌కాస్ట్ ఇంజనీరింగ్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్(బీఈసీఐఎల్), బీఈసీ ఐఎల్ భవన్, సెక్టార్-62, నోయిడా (ఉత్తరప్రదేశ్) చిరునామకు స్పీడ్ పోస్ట్/రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా పంపించాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 06.06.2025.
- **వెబ్‌సైట్:** https://www.becil.com

బీఐఆర్ఏసీలో అసోసియేట్ కన్సల్టెంట్ పోస్టులు

ఢిల్లీలోని బయోటెక్నాలజీ ఇండస్ట్రీ రీసెర్చ్ అసిస్టెన్స్ కౌన్సిల్(బీఐఆర్ఏసీ).. ఒప్పంద ప్రాతిపదికన అసోసియేట్ కన్సల్టెంట్ (టెక్నికల్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 03. -వేతనం: నెలకు రూ.75,000.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. -వయసు: 10.06.2025 నాటికి 45 ఏళ్లు ఉండాలి.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా
- **దరఖాస్తులకు చివరితేది:** 10.06.2025.
- **వెబ్‌సైట్:** https://birac.nic.in